
శుక్రవారం 26-7-2024



సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 125

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ముర్ము టీచర్

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కాసేపు టీచర్‌గా మారారు. ప్రెసిడెంట్ ఎస్టేట్‌లోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ కేంద్రీయ విద్యాలయంలో 9వ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

6లో

మాది సంకల్ప బలం

కాంగ్రెస్ సర్కారుకు అలవికాని హామీలంటూ లేవు ● 2024-25 బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం భట్టి



గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టేముందు బడ్జెట్ పత్రాలతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ఆరంభంలోనే కొన్ని చేసి చూపాం.. త్వరలో మిగతావీ చేసి చూపిస్తాం

చిత్తశుద్ధి, సమర్థత, నిజాయతీ పునాదులుగా ముందుకు..

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదకర స్థాయికి చేరింది
- గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దుతూ ముందుకు సాగుతున్నామని వెల్లడి
- కాంగ్రెస్ సర్కారు తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం


రూ.2,91,159 కోట్లతో బడ్జెట్

గంటా 45 నిమిషాల పాటు సుదీర్ఘంగా ప్రసంగం

"గత ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలు, వైఫల్యాలను గుర్తించిన ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకుని కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగించారు. మేం ఎన్నికల్లో ఏదో విధంగా గెలవాలనే ఉద్దేశంతో హామీలివ్వలేదు. ప్రజల గుండె చప్పుళ్లకు స్పందించి హామీలను ప్రజల ముందుంచాం. అవి అలవికానివంటూ ప్రతిపక్షాలు పదేపదే విమర్శిస్తున్నాయి. కానీ సంకల్పబలం, చిత్తశుద్ధి, సమర్థత, నిజాయతీలే పునాదులుగా నిర్మితమైన మా ప్రభుత్వానికి అలవికాని హామీలంటూ లేవని తొలి అడుగుతోనే నిరూపించాం.

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బడ్జెట్ కథనాలు 2,7,8,9,10, పేజీల్లో..





అంకెల గారడీ..

రాష్ట్ర బడ్జెట్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం 8లో

- రుణమాఫీకి భారీ కోత
- ఆరోగ్యానికి తగ్గిన 'శ్రీ'
- పన్నులపైనే గంపెడాశలు
- పల్లెకు తగ్గిన ప్రాధాన్యం

లోపలి పేజీల్లో..

తలసరి అప్పు రూ.1.76 లక్షలు

- 2014-15లో రూ.20,251 మాత్రమే
- 2023-24లో రాష్ట్ర వృద్ధి రేటు 11.9%
- తలసరి ఆదాయం రూ.3,47,299
- సామాజిక-ఆర్థిక సర్వే వెల్లడి

7లో

6 గ్యారంటీలకు 'కోత'!

- పింఛన్ల పెంపు, యువ వికాసం, మహిళలకు నెలకు రూ.2,500 ఊసే లేదు
- ఇందిరమ్మ ఇళ్లకు రూ.20 వేల కోట్లకు గాను రూ.7 వేల కోట్లే..

7లో

సలాం.. గ్రేటర్

- బడ్జెట్ కేటాయింపుల్లో గ్రేటర్‌కు పెద్దపీట
- మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులకు మొత్తం రూ.10 వేల కోట్లు
- జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, వాటర్ బోర్డు, హైడ్రా తదితర సంస్థలకు భారీగా కేటాయింపులు

11లో



పారిస్ పిలుస్తోంది

నేటి నుంచి ఒలింపిక్స్ 2024

206 దేశాల నుంచి 10,500 మంది అథ్లెట్లు

32 క్రీడాంశాలు.. 329 మెడల్ ఈవెంట్లు

భారత్ నుంచి బరిలో 117 మంది

నేటి రాత్రి 11 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం

క్రీడాకారుల కలల వేదిక ఒలింపిక్స్ సమయం వచ్చేసింది... ప్రపంచవ్యాప్తంగా ఆటగాళ్లంతా అసాధారణ ప్రదర్శనతో పతకాలపై గురి పెట్టే క్రీడా సంబరానికి నేటితో తెర లేవనుంది... అథ్లెట్లను ఆయా దేశపు హీరోలుగా మార్చి శిఖరాన నిలిపే పక్షం రోజుల క్రీడా పండుగకు అంతా సిద్ధమైంది... ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో 33వ ఒలింపిక్ క్రీడలు శుక్రవారం మొదలు కానున్నాయి. ఆగస్టు 11 వరకు సాగే ఈ మెగా ఈవెంట్‌లో 206 దేశాలకు చెందిన 10,500 మంది అథ్లెట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పారిస్ నగరంలో ఒలింపిక్స్ క్రీడలను నిర్వహించడం ఇది మూడోసారి కాగా, సరిగ్గా వందేళ్ల తర్వాత ఈ ఫ్యాషన్ సిటీ ఇప్పుడు మళ్లీ విశ్వ క్రీడలకు ఆతిథ్యం ఇస్తోంది. 32 క్రీడాంశాల్లో మొత్తం 329 మెడల్ ఈవెంట్ల కోసం ఆటగాళ్లు తమ సర్వం ఒడ్డేందుకు బరిలోకి దిగుతున్నారు. గత ఒలింపిక్స్‌లో 7 పతకాలతో తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసిన భారత బృందం ఈసారి అంతకంటే మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని పట్టుదలగా ఉంది. 117 మందితో కూడిన మన సైన్యం 16 క్రీడాంశాల్లో పోటీ పడుతోంది. గత మూడేళ్లలో వేర్వేరు టోర్నీల్లో మన ఆటగాళ్లు సాధించిన విజయాలు ఒలింపిక్స్‌లో మరింత మెరుగైన ప్రదర్శనపై ఆశలు రేపుతున్నాయి.

17లో

రైతుకు వెన్నుపోటు.. పథకాలకు తూట్లు



ప్రజల ఆశల మీద నీళ్లు చల్లిన బడ్జెట్

మేం రెండు పంటలకు రైతుబంధు ఇస్తే.. కాంగ్రెస్ ఎగ్గొడతామని చెబుతోంది

- గొర్రెల పథకాన్ని మూసేశారు.. దళితబంధు ప్రస్తావనే లేదు
- రాష్ట్ర బడ్జెట్‌పై అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేసీఆర్ ఫైర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు విమర్శించారు. బడ్జెట్‌లో ఏ ఒక్క వర్గానికి కూడా స్పష్టమైన హామీ లేదని, రైతులను పొగుడుతున్నట్టుగా పొగుడుతూనే ఈ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం ఇచ్చినట్టు కాకుండా రైతుబంధు, రైతుభరోసా వంటి పథకాల్లో అనేక ఆంక్షలు పెట్టబోతున్నట్టుగా చెప్పి రైతులను మోసం చేశారని, ఇది రైతు శత్రువు ప్రభుత్వం అని ఆయన

మిగతా 2వ పేజీలో ▶

ఏదైనా ఉంటే నాతో తేల్చుకోండి



కోపం ఉంటే నాపై చూపండి


చంద్రబాబు అరాచక పాలనను ఎన్డీటీవీ ఇంటర్వ్యూలో నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

- నాపై ఉన్న కోపాన్ని అమాయకులపై ఎందుకు చూపిస్తారు?
- వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సామాన్యులపై కక్ష సాధింపు ఎందుకు?
- ఇది మానవత్వం అనిపించుకుంటుందా?
- ఈ అరాచకాన్ని తెలియ జెప్పాలని అన్ని పార్టీలనూ ధర్నాకు ఆహ్వానించాం.. దారుణకాండ ఫొటోలు, వీడియోలు చూసి మాకు మద్దతు ఇవ్వాలని కోరాం
- ఎన్నికలప్పుడు అరచేతిలో వైకుంఠం చూపిస్తూ అబద్ధాలు చెప్పారు.. ఇప్పుడు ఆ హామీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే అరాచకం

19లో

గుండెపోటుకు బై.. బై..

వందేళ్లు హాయ్‌హాయ్!



హార్ట్ ఎటాక్‌లను దూరం చేసే సరికొత్త మందు భారత మార్కెట్లోకి..


- ఇంజెక్షన్ రూపంలో అందుబాటులోకి ఇన్‌క్లిసిరాన్
- ఎల్‌డీఎల్ స్థాయిలను గణనీయంగా తగ్గిస్తుందంటున్న వైద్యులు
- స్టాటిన్స్‌కన్నా ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుందని వెల్లడి
- ఇప్పటికే అమెరికాలో విరివిగా వాడకం

20లో

నీట్-యూజీ రివైజ్డ్ ఫలితాలను విడుదల చేయలేదు: కేంద్రం

6లో

తెలంగాణ బడ్జెట్ 2024



భట్టి బడ్జెట్ విందు



అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సహా మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రజాభవన్‌లో గురువారం రాత్రి విందు ఇచ్చారు. ఈ విందుకు సీఎంతో సహా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్‌అలీ, వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యేలు, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. రాత్రి 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఈ విందు కొనసాగింది. - సాక్షి, హైదరాబాద్



మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం ఉదయం శాసనమండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా బడ్జెట్ ప్రసంగాన్ని చదువుతూ 2024–25 వార్షిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ శాఖల వారీగా చేపట్టిన కేటాయింపులతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు చేసిన కేటాయింపులను వివరించారు.



విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు పెంచాల్సింది

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

సాక్షి, హైదరాబాద్: విద్య, వైద్యరంగాలకు ఈ ఏడాది బడ్జెట్‌లో మరిన్ని కేటాయింపులు పెంచాల్సిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అభిప్రాయపడ్డారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు జాబ్‌కేలండర్‌ను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గురువారం ఓ ప్రకటనలో ఆయన కోరారు. రాష్ట్రానికి రూ.6.71లక్షల కోట్ల అప్పు ఉన్నా రూ.2.91 లక్షల కోట్లతో బడ్జెట్‌ను తయారు చేయడం సానుకూలమైన విషయమని వెల్లడించారు. గతేడాది డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ఇందిరమ్మ ఇళ్లను నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన హామీ మేరకు పూర్తి చేస్తుందనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసంఘటిత రంగానికి చెందిన వారిని ఆదుకోవడానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.



విద్య, వైద్యానికి గత కేటాయింపులే

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

సాక్షి, హైదరాబాద్: విద్య, వైద్యానికి చేసిన కేటాయింపులు గతంలాగే ఉన్నాయని, రాష్ట్రంలో అక్షరాస్యత 66% దాటడంలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షరత మిషన్ లాంటి పథకాలను తొలగించడం, ప్రభుత్వ పాఠశాలలకు భవనాలు, ఇతర సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రైవేటు విద్యాలయాలకు మొగ్గుచూపుతున్నారని తెలిపారు. వైద్య రంగానికి కేటాయించిన నిధులు కూడా బస్తీ దవాఖానాలకు, గ్రామ దవాఖానాలకు, ప్రభుత్వ ఆస్పత్రులకు సరిపోవని పేర్కొన్నారు. రాష్ట్రంలో లక్షలమంది ఇళ్లు లేక దశాబ్దాల తరబడి ఇబ్బందులకు గురవుతున్నారని, అర్హతగల ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేసి ఇళ్ల నిర్మాణానికి కనీసం రూ.10లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇవాల్టి కార్టూన్





గురువారం శాసనసభలో బడ్జెట్ పత్రాలను పరిశీలిస్తున్న కేసీఆర్. చిత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పద్మారావు, గంగుల, సబిత, హరీశ్‌రావు



గురువారం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న, ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క. చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ తదితరులు

మాది సంకల్ప బలం

కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవికాని హామీలంటూ లేవు

2024-25 బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కాంగ్రెస్ సర్కారు తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం

రూ.2,91,159 కోట్లతో బడ్జెట్.. గంటా 45 నిమిషాల పాటు సుదీర్ఘంగా ప్రసంగం

సాక్షి, హైదరాబాద్: ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తామిచ్చిన హామీలను అమలు చేసి చూపాలన్న పట్టుదలతో ఉన్నామని.. ఆ దిశగానే రాష్ట్ర బడ్జెట్‌కు రూపకల్పన చేశామని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కాంగ్రెస్ మాట ఇస్తే శిలాశాసనమని రుణమాఫీ అమలుతో మరొక్కసారి రుజువైందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, అర్హులకు రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చే ఇందిరమ్మ ఇళ్ల పథకం, అర్హులకు ఉచితంగా నెలకు 200 యూనిట్ల విద్యుత్ సరఫరా వంటి హామీలను ప్రభుత్వం ఏర్పడిన కొన్నిరోజుల్లోనే అమల్లోకి తెచ్చామని చెప్పారు. త్వరలోనే మిగతావీ చేసి చూపిస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌ను భట్టి విక్రమార్క గురువారం ఉదయం శాసనసభలో ప్రవేశపెట్టారు. మొత్తం రూ.2,91,159 కోట్ల అంచనాతో ఈ బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ, గత ప్రభుత్వ తీరును విమర్శిస్తూ, శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులను వివరిస్తూ సుదీర్ఘంగా గంటా 45 నిమిషాల పాటు ప్రసంగించారు. భట్టి బడ్జెట్ ప్రసంగం వివరాలు ఆయన మాటల్లోనే..

''నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ మహాకవి దాశరథి వర్ణించిన తెలంగాణ రాష్ట్రాన్ని సాకారం చేసిన సోనియాగాంధీ ఆశీస్సులతో కాంగ్రెస్ ప్రభుత్వ తొలి పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నందుకు సంతోషిస్తున్నాను. పదేళ్ల అస్తవ్యస్త పాలనకు విజ్ఞతతో చరమగీతం పాడిన తెలంగాణ ప్రజానీకానికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు.

వామనావతారంలా పెరిగిన అప్పులు..

తెలంగాణ ఏర్పాటైన తర్వాత దశాబ్దకాలంలో రాష్ట్ర పురోభివృద్ధి ఆశించిన మేరకు జరగలేదు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తామని వట్టి ఉత్తర కుమార ప్రగల్భాలు పలికిన గత ప్రభుత్వ పాలకులు.. అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమయ్యారు. ప్రజల సంక్షేమం సన్నగిల్లింది, అభివృద్ధి అడుగంటింది, రాష్ట్రం అప్పుల పాలైంది. రాష్ట్ర ఆవిర్భావ సమయానికి ఉన్న రూ.75,577 కోట్ల అప్పు.. 2023 డిసెంబర్ నాటికి వామనావతారంలా పెరిగి పెరిగి రూ.6,71,757 కోట్లకు చేరింది. సాగునీటి ప్రాజెక్టులు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతున్నాయి. నీళ్లను ఏ కాలువల ద్వారా పారించాలన్న ధ్యేయంతో కాకుండా.. అవినీతి సొమ్మును ఏ కాలువల ద్వారా ప్రవహింపచేయాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం పనిచేసింది. ఓ వైపు అప్పులు, మరో వైపు పేరుకుపోయిన బిల్లులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాద స్థాయికి చేరుకుంది. ఇప్పుడు మా ప్రభుత్వం తగిన దిద్దుబాటు చర్యలను చేపట్టడంతోపాటు మరింత మేలైన ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలనే కృత నిశ్చయంతో ఉంది. తలకు మించిన రుణభారం ఉన్నప్పటికీ దుబారా ఖర్చులు కట్టడి చేసి, ఆర్థిక క్రమశిక్షణతో పాలన ప్రారంభించాం. ఈ సంవత్సరం మార్చి నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు క్రమం తప్పకుండా ప్రతి నెలా ఒకటో తారీఖున జీతాలు/పెన్షన్లు చెల్లించేలా చర్యలు తీసుకున్నాం.

అప్పులు తీరుస్తూ.. సంక్షేమం పాటిస్తూ..

రాష్ట్రానికి డిసెంబర్ నాటికి రూ.6,71,757 కోట్లు అప్పులు ఉన్నట్టు తేలింది. మా ప్రభుత్వం వచ్చాక రూ.35,118 కోట్ల రుణాలు తీసుకోగా.. గత ప్రభుత్వం తాలూకు రూ.42,892 కోట్ల రుణాలు, వడ్డీలు చెల్లించాం. ఇది మా చిత్తశుద్ధికి నిదర్శనం. ఇదే సమయంలో సంక్షేమాన్ని విస్మరించలేదు. డిసెంబర్ నుంచి ఇప్పటివరకు రూ.34,579 కోట్లను వివిధ పథకాలపై ఖర్చు చేశాం. మూలధన వ్యయానికి అదనంగా రూ.19,456 కోట్లు ఖర్చు చేశాం. గత దశాబ్దకాలంలో ఉద్యోగ నియామకాలు సరిగా జరగక నిరుద్యోగ యువత కలలు కల్లలయ్యాయి. అక్రమాలు, పేపర్ లీకేజీలు, అసమర్థ పరీక్ష నిర్వహణతో యువతకు ఉద్యోగాలు అందని పరిస్థితి ఏర్పడింది. దాన్ని సరిదిద్ది నియామక ప్రక్రియలో పారదర్శకత తీసుకొచ్చే చర్యలను మా ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటికే 31,768 ఉద్యోగ నియామక పత్రాలను అందజేశాం.

జాతీయ వృద్ధిరేటుకన్నా వెనుకబడ్డాం..

2023–24లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 3.2 శాతం వృద్ధి చెందితే.. మన దేశ ఆర్థిక వ్యవస్థ 7.6 శాతం, తెలంగాణ 7.4 శాతం వృద్ధిని నమోదు చేశాయి. అంటే గత ఏడాది జాతీయ వృద్ధిరేటు కన్నా తెలంగాణ వృద్ధిరేటు తక్కువ. 2023–24లో తెలంగాణ జీఎస్‌డీపీ ప్రస్తుత ధరల ఆధారంగా లెక్కిస్తే రూ.14,63,963 కోట్లు. గత సంవత్సరంతో పోలిస్తే 11.9 శాతం వృద్ధి నమోదైంది. జాతీయ స్థాయిలో ఈ వృద్ధి రేటు 9.1 శాతం. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ వృద్ధితో పోల్చినప్పుడు ఖర్చుల కోసం రుణాలపై భారీగా ఆధారపడిందన్న విషయం స్పష్టమవుతోంది. ఇటువంటి పరిస్థితి ఆర్థిక సుస్థిరతకు ప్రమాదం కలిగించే అవకాశం ఉంది. ఆదాయాన్ని మించి రుణం నిరంతరంగా పెరుగుతూ వచ్చింది. కఠిన ఆర్థిక సంస్కరణలు తీసుకురాని పక్షంలో తెలంగాణ ఆర్థిక పరిస్థితి ప్రమాదంలో పడుతుంది.

జిల్లాల మధ్య ఆదాయ అంతరాలు..

2023–24లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,47,299. జాతీయ తలసరి ఆదాయం రూ.1,83,236తో పోల్చితే తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,64,063 ఎక్కువ. అదే సమయంలో తలసరి ఆదాయ స్థాయిల్లో జిల్లాల మధ్య తీవ్రమైన అంతరం ఉంది. ఉదాహరణకు రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.9,46,862 అయితే.. వికారాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ.1,80,241 మాత్రమే. అంటే జిల్లాల మధ్య ఆర్థికాభివృద్ధి సమాన స్థాయిలో లేదని స్పష్టమవుతోంది..'' అని భట్టి పేర్కొన్నారు. అనంతరం వివిధ శాఖలు, పథకాల వారీగా బడ్జెట్ కేటాయింపులను వెల్లడించారు.

అతి త్వరలో రూ.2లక్షల వరకు రుణమాఫీ

''గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని రైతులను అప్పుల్లోకి నెట్టిందే తప్ప నిజంగా ఎలాంటి మేలు చేయలేదు. మేం రైతులకు నిజమైన మేలు జరగాలనే ఉద్దేశంతో ఏకకాలంలో రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేయాలని నిర్ణయించి అమలు ప్రారంభించాం. జూలై 18న రూ.లక్ష వరకు రుణమున్న 11.34 లక్షల మంది రైతులకు రూ.6,035 కోట్ల రుణమాఫీ మొత్తాన్ని ఖాతాల్లో ఒకేసారి జమచేశాం. రూ.రెండు లక్షల వరకు రుణం ఉన్న మిగతా రైతులకు కూడా అతిత్వరలో రుణమాఫీ జరుగుతుంది. కాంగ్రెస్ మాట ఇస్తే శిలాశాసనమని రుణమాఫీ అమలుతో మరొక్కసారి రుజువైంది.''

మహనీయుల మాటలను ఉటంకిస్తూ..

భట్టి తన బడ్జెట్ ప్రసంగంలో పలువురు మహనీయుల మాటలను ఉటంకించారు. ''సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యం లేనిదే రాజకీయ ప్రజాస్వామ్యం సఫలం కాజాలదు. ఆ రెండూ కూడా రాజకీయ ప్రజాస్వామ్యానికి పునాది రాళ్లు. పునాది ఎంత బలంగా ఉంటే.. ప్రజాస్వామ్యం అంత పటిష్టంగా ఉంటుంది'' అన్న బీఆర్ అంబేడ్కర్ మాటలను గుర్తుచేశారు. వ్యవసాయానికి కేటాయింపులను వెల్లడిస్తున్న సమయంలో.. ''ఏ పని అయినా ఆగవచ్చు.. కానీ వ్యవసాయం ఆగదు'' అని జవహర్‌లాల్ నెహ్రూ చెప్పారని భట్టి పేర్కొన్నారు. ఇక ''ఏదైనా పని జరిగే వరకు అది అసాధ్యంగా గోచరిస్తుంది'' అని నెల్సన్ మండేలా చెప్పారని.. తాము ఇచ్చిన రుణమాఫీ హామీకి ఇది వర్తిస్తుందని భట్టి చెప్పారు. తాము రుణమాఫీ అమలుతో మండేలా మాటలను నిజం చేసి చూపామన్నారు. కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న సమయంలో ''ప్రజాస్వామ్యం అనేది బలవంతులకు, బలహీనులకు సమాన అవకాశాలు కల్పించేది'' అని మహాత్మాగాంధీ చెప్పారని గుర్తుచేశారు.

అసెంబ్లీలో షేమ్ షేమ్.. ఫాల్స్ ఫాల్స్!

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం కొనసాగుతుండగా శాసనసభలో షేమ్ షేమ్.. ఫాల్స్ ఫాల్స్.. అన్న నినాదాలు హోరెత్తాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలను భట్టి విక్రమార్క విమర్శిస్తున్నప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీ సభ్యులు 'షేమ్.. షేమ్..' అంటూ నినాదాలు చేశారు. అదే సమయంలో భట్టి చెప్తున్న మాటలు 'ఫాల్స్.. ఫాల్స్..' అంటూ బీఆర్ఎస్ సభ్యులు ప్రతిగా నినాదాలు చేశారు.

ధరణికి శాశ్వత పరిష్కారం చూపిస్తాం

బడ్జెట్ ప్రసంగంలో వివిధ ప్రభుత్వ శాఖలు, పథకాల వారీగా చేసిన నిధుల కేటాయింపులను డిప్యూటీ సీఎం భట్టి వివరించారు. పలు అంశాలకు సంబంధించిన విధానాలను, చేపట్టబోయే చర్యలనూ తెలిపారు.



- 'రైతు భరోసా' కింద అర్హులైన రైతులకు ఏటా ఎకరానికి రూ.15,000 చెల్లించాలన్నది మా సంకల్పం. అందుకే ప్రజలతో చర్చించి ఎలా చేయాలన్న దానిపై కసరత్తు చేస్తున్నాం.
- భూమిలేని రైతు కూలీల ఆర్థిక, జీవన స్థితిగతులు మెరుగుపర్చడానికి వారికి ఏటా రూ.12,000 అందించే బృహత్తర కార్యక్రమాన్ని ఈ సంవత్సరంలోనే ప్రారంభించబోతున్నాం.
- మా ప్రభుత్వం రైతుకు ఆర్థిక భద్రత కలిగించేందుకు పంట బీమా పథకాన్ని అమలు చేయడానికి ఈ సంవత్సరం నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో చేరాలని నిర్ణయించాము. ఈ పథకం క్రింద రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియం కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది.
- సన్నరకం వరి ధాన్యాల సాగును ప్రోత్సహించడానికి 33 రకాల వరిని గుర్తించి, వాటికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని నిర్ణయించాం.
- ధరణి పోర్టల్ సమస్యలు, పరిష్కారాల పురోగతిపై ఎప్పటికప్పుడు కలెక్టర్లతో సమీక్షిస్తున్నాం. ధరణి కమిటీ పూర్తి అధ్యయనం తర్వాత శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటాం.
- ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతీ నియోజకవర్గంలో కనీసం 3,500 చొప్పున మొత్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నాం. ఇంటి విస్తీర్ణం కనీసం 400 చదరపు అడుగులతో ఉంటుంది.
- ఒకే ప్రాంతంలో వేర్వేరుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకుల పాఠశాలలను 20 ఎకరాల స్థలంలో ఒకేచోట నిర్మిస్తాం. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అన్నిరకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం.

బడ్జెట్ సమగ్ర స్వరూపం (రూ.కోట్లలో)

పద్దు	2023-24 (బడ్జెట్ అంచనాలు)	2023-24 (సవరించిన అంచనాలు)	2024-25 (బడ్జెట్ అంచనాలు)
ప్రారంభ నిల్వ	336.86	34.79	- 4,886.57
కేంద్ర పన్నుల్లో వాటా	21,470.84	23,742.04	26,216.38
పన్ను ఆదాయం	1,31,028.65	1,11,798.14	1,38,181.26
పన్నేతర ఆదాయం	22,808.31	23,819.50	35,280.44
గ్రాంట్ ఇన్ ఎయిడ్	41,259.17	9,729.91	21,636.15
రెవెన్యూ ఆదాయం	2,16,566.97	1,69,089.59	2,21,242.23
బహిరంగ మార్కెట్ రుణాలు	40,615.68	49,681.00	57,112.48
కేంద్ర రుణాలు	4,102.00	1,948.34	3,900.00
ఇతర రుణాలు	1,500.00	910.22	1,000.00
నగదు డిపాజిట్ల లావాదేవీలు	4,000.00	4,500.00	4,000.00
రుణాలు-అడ్వాన్సులు	5,060.00	35.97	3,560.00
మూలధన రాబడులు	55,277.68	57,006.25	69,572.48
మొత్తం రాబడులు	2,89,672.65	2,26,095.84	2,90,814.71
రెవెన్యూ వ్యయం	2,11,685.23	1,67,384.69	2,20,944.81
మూలధన వ్యయం	37,524.70	44,252.68	33,486.50
రుణాలు-అడ్వాన్సులు	28,479.98	6,860.77	19,626.32
ప్రజారుణ చెల్లింపులు	9,341.17	9341.17	13,117.60
కేంద్ర రుణాల చెల్లింపులు	427.16	324.70	397.66
ఇతర రుణాల చెల్లింపులు	2,837.76	2852.93	3486.10
మొత్తం వ్యయం	2,90,296.00	2,31,017.99	2,91,059.00
ముగింపు నిల్వ	- 286.50	- 4,886.57	- 5130.86
రెవెన్యూ మిగులు	4,881.74	1704.89	297.42
ద్రవ్యలోటు	38,234.94	49,372.84	49,255.41
ప్రాథమిక లోటు	15,827.27	26,035.44	31,525.63

రైతుకు వెన్నుపోటు.. పథకాలకు తూట్లు

▶ మొదటి పేజీ తరువాయి

వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం పూర్తయిన అనంతరం గురువారం మధ్యాహ్నం మీడియా పాయింట్ వద్ద కేసీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి మీడియాతో మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే.. 'బడ్జెట్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన నైజాన్ని బయటపెట్టుకున్నది. గత ప్రభుత్వం రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమం, ఆర్థికాభివృద్ధిని కాంక్షించి అనేక పథకాలు ప్రవేశపెట్టింది. అదే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఒక్క పథకంపై స్పష్టత లేదు.



గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు వివేకానంద, కౌశిక్‌రెడ్డి, హరీశ్‌రావు, గంగుల కమలాకర్

గొర్రెల పథకం లేదు.. దళితబంధు లేదు

యాదవులకు ఇస్తున్న గొర్రెల పెంపకం పథకాన్ని మొత్తానికి మూసేసినట్టు అర్థమవుతుంది. ఇప్పటికే యాదవులు చెల్లించిన డిపాజిట్లు కూడా వాపస్ ఇస్తుంది ఈ ప్రభుత్వం. కొత్త విషయం ఏమీలేదు. అత్యంత బడుగువర్గాలకు మేలు చేస్తున్నట్టుగా చెబుతూనే గొంతు కోసింది. దళితవర్గాల కోసం గతంలో ప్రవేశపెట్టిన విప్లవాత్మకమైన దళితబంధు పథకం ప్రస్తావనే లేదు. ఇదీ చాలా దురదృష్టకరం. దళిత సమాజంపై ఈ ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి, ఫ్యూడల్ విధానానికి ఇంతకంటే గొప్ప నిదర్శనం అవసరం లేదు. మత్స్యకారులకు భరోసా లేదు. ఏ ఒక్కవర్గానికి కూడా ఈ బడ్జెట్‌లో భరోసా లేదు. బడ్జెట్‌లో విశేషమేమిటంటే ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క డబ్బుల గురించి చెప్పినప్పుడు ప్రతి మాటను ఒత్తిఒత్తి పలకడం తప్ప కొత్తగా ఏమీలేదు. ఏ ఒక్క కొత్త సంక్షేమ పథకం కూడా లేని పరిస్థితి వచ్చింది. మహిళల పట్ల కూడా స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉండే. కానీ దీనిని కూడా లక్ష కోట్ల రుణాలు అంటూ వీళ్లేదో ఇస్తున్నట్టు చెప్పారు. ఉన్న స్కీంను చెప్పారే తప్ప..కొత్తగా ఏమీలేదు. వెరసి ఇది పాతదే. దురదృష్టం ఏమిటంటే మేము కూడా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కనీసం ఆరు మాసాల సమయం ఇవ్వాలని అనుకున్నాం. నేను కూడా శాసనసభకు పెద్దగా రాలేదు. కానీ, ఈ రోజు బడ్జెట్ చూస్తే ఏ ఒక్క పాలసీకి ఫార్ములేషన్ జరగలేదు. రాష్ట్రానికి సంబంధించినటువంటి ఏ ఒక్క విషయంలో కూడా ఈ అర్భక ప్రభుత్వం ఇప్పటికీ పాలసీ ఫార్ములేషన్ చేసేటట్టుగా కనిపిస్తలేదు.

ఇది పూర్తిగా రైతు శత్రువు ప్రభుత్వం

వ్యవసాయం విషయంలో మాకు స్పష్టమైన అవగాహన ఉండే. ఈ రాష్ట్రంలో వ్యవసాయ స్థిరీకరణ జరగాలని, మేం రెండు పంటలకు రైతుబంధు ఇచ్చాం. వీళ్లేమో ఎగ్గొడుతామని చెబుతున్నారు. రైతులకు ఇచ్చిన డబ్బును పాడు చేసినం..చెడగొట్టినం.. దుర్వినియోగం చేసినం అనే పద్ధతిలో దురదృష్టకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. అంటే ఇది పూర్తిగా రైతు శత్రువు ప్రభుత్వం అని తెలుస్తుంది. ధాన్యం కొనుగోలు చేయలేదు. విద్యుత్, నీళ్ల సరఫరా చేయడం లేదు. ఇంకా రైతుబంధు, రైతుభరోసా ప్రస్తావనే లేదు. రైతుభరోసా ఎప్పుడు వేస్తారని మా ఎమ్మెల్యేలు అరిస్తే కనీసం సమాధానం చెప్పడం లేదు. కాబట్టి రైతులను ఈ ప్రభుత్వం వంచించింది. వృత్తి కార్మికులను వంచించింది' అని కేసీఆర్ అన్నారు.

భవిష్యత్‌లో బ్రహ్మాండంగా చీల్చి చెండాడతాం

'ఇండస్ట్రియల్ పాలసీ ఏమిటి? ఏం లేదు వట్టిదే గ్యాస్..ట్రాష్. ఇదేదో స్టోరీ టెల్లింగ్‌లాగా ఉంది తప్ప ఏం లేదు. రాష్ట్రంలో వ్యవసాయ పాలసీ ఏమిటి? పారిశ్రామిక పాలసీ ఏమిటి ? ఐటీ పాలసీ ఏమిటి? ఇంకా ఇతర అనేక పాలసీలు.. పేదవర్గాలకు సంబంధించిన పాలసీ ఏమి టి? అనే ఏ ఒక్కదానిపై కూడా స్పష్టత లేదు. చిల్లరమల్లర ప్లాట్ ఫామ్స్ స్పీచ్ లాగా ఉంది తప్ప అది బడ్జెట్ ప్రసంగంలా లేదు. రాజకీయ సభల్లో చెప్పినట్టుగా ఉంది తప్ప ఏ ఒక్క పాలసీని కూడా.. నిర్దిష్టంగా ఈ పనిని మేం ఇలా సాధిస్తాం.. మా గోల్స్, టార్గెట్స్ ఇవి అనే పద్ధతి కానీ, పద్దు కానీ లేదు. ఇది పేదల బడ్జెట్ కాదు.. రైతుల బడ్జెట్ కాదు.. ఎవరి బడ్జెటో రేపు మీకు విశ్లేషణలో తెలుస్తది. భవిష్యత్‌లో బ్రహ్మాండంగా చీల్చి చెండాడతాం'అని కేసీఆర్ తేల్చి చెప్పారు.

అన్ని రంగాల అభివృద్ధికి సమ ప్రాధాన్యం

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డి



సాక్షి, హైదరాబాద్: అన్ని రంగాల సంక్షేమానికి, అభివృద్ధికి ఈసారి బడ్జెట్‌లో సమ ప్రాధాన్యం దక్కిందని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ(శాట్) చైర్మన్ ఎస్. శివసేనారెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజల పోరాటాలతో ఏర్పడిన రాష్ట్రాన్ని పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం అప్పుల పాలు చేసి అధోగతి వైపు నడిపించిందని విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...రాష్ట్రంలో మార్పు కావాలని తీర్పు ఇచ్చిన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అవసరాలు ప్రతిబింబించే విధంగా బడ్జెట్ రూపొందించిందన్నారు. ఈ బడ్జెట్‌లో క్రీడా రంగానికి నిధులు పెంచడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా యువజన సర్వీసులు, క్రీడాశాఖను భ్రష్టు పట్టించిందని, ఇప్పుడు తెలంగాణలో క్రీడలకు మంచి రోజులు వచ్చాయని, రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి క్రీడా రంగాన్ని అభివృద్ధి చేయనుందని శివసేనారెడ్డి వెల్లడించారు.

కేసీఆర్‌ది మాటల మటన్ బిర్యానీ.. మాది పప్పు.. మజ్జిగ బడ్జెట్

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన బడ్జెట్ మాటలతో మటన్ బిర్యానీ వడ్డించేలా ఉంటే.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాత్రం పప్పు, మజ్జిగతో తృప్తిగా తినండి అని నిజం చెప్పినట్టుగా ఉందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కలది అభివృద్ధి బడ్జెట్ అయితే.. కేసీఆర్ గతంలో పెట్టినది అప్పుల బడ్జెట్ అని ఎద్దేవా చేశారు. రేవంత్, భట్టిలది ది బెస్ట్ బడ్జెట్ అంటూ కితాబిచ్చారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం గురువారం సాయంత్రం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్‌పై ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలపై జగ్గారెడ్డి తనదైన శైలిలో కౌంటర్లు ఇచ్చారు. గతంలో కేసీఆర్ పెట్టిన బడ్జెట్.. ఊరందరికీ మటన్ బిర్యానీ వండుతున్నా.. అన్న విధంగా ప్రచారం చేసేవారన్నారు. 'పొయ్యి మీద గిన్నెలు పెడతారు కానీ అందులో మటన్ ఉండదు. మటన్ బిర్యానీ ఎప్పుడొస్తుందా..అని ప్రజలు ఎదురు చూస్తుండాలి..అట్లా ప్రజలను కేసీఆర్ మోసం చేశారు' అని ఎద్దేవా చేశారు. వ్యవసాయానికి రూ. 72 వేల కోట్లు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ తమది మరోసారి రైతు ప్రభుత్వం అని నిరూపించుకుందన్నారు. ఆరు గ్యారంటీలకు సరిపడా నిధులు బడ్జెట్‌లో కేటాయించారన్నారు. గతంలో కాంగ్రెస్ వేసిన ఫ్లైఓవర్లకు కేటీఆర్ రిబ్బన్లు కట్ చేశారని ఎద్దేవా చేశారు. కాగా, రాజధాని హైదరాబాద్ నగరం దశ మార్చాలన్నది సీఎం రేవంత్ ఆలోచన అని, హైదరాబాద్‌కు బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించడం శుభపరిణామం అన్నారు. గతంలో బీఆర్‌ఎస్ హైదరాబాద్‌కు నిధులు కేటాయించలేదని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇస్తే కేసీఆర్ కుళ్లుకుంటున్నారని జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసీఆర్ వైఖరి మారాలి

ప్రభుత్వ విప్ ఐలయ్య



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బకు.. మాజీ సీఎం కేసీఆర్ మీడియా పాయింట్‌కు వచ్చి మాట్లాడాల్సిన పరిస్థితి వచ్చిందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఎద్దేవా చేశారు. కేసీఆర్ తన వైఖరి మార్చుకోకపోతే వచ్చేసారి మీడియా పాయింట్‌కు కూడా రారని పేర్కొన్నారు. ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో గురువారం మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ఊసే లేకపోతే కేసీఆర్ ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. దీంతో కేసీఆర్ లాలూచీతనం మరోసారి బయటపడిందన్నారు. కేసీఆర్‌కు దమ్ము, ధైర్యం ఉంటే బడ్జెట్‌పై అసెంబ్లీలో చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ఆయన హయాంలో అనేక స్కాంలు జరిగాయని, కేసీఆర్ అవినీతిని కక్కిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని ఐలయ్య చెప్పారు.

ప్రజలను మోసం చేసే బడ్జెట్: పాయల్ శంకర్

'యూత్ డిక్లరేషన్' ప్రస్తావనే లేదు: ధన్‌పాల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేలా బడ్జెట్ ఉందని బీజేఎల్పీ ఉపనాయకుడు పాయల్ శంకర్ విమర్శించారు. మహిళా సంఘాలకు లక్ష కోట్ల ఆర్థిక సాయం చేశామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. బ్యాంకుల నుంచి మహిళా సంఘాలు తీసుకున్న అప్పులకు రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధమేంటో సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తాతో కలిసి పాయల్ శంకర్ మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం, బడ్జెట్‌పై ప్రజల నుంచి వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు కేంద్రంపై నెపం నెట్టే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. రీజినల్ రింగ్ రోడ్‌ను (ట్రిపుల్ ఆర్) రూ.26 వేల కోట్ల వ్యయంతో నిర్మించేందుకు కేంద్రం నిధులు ఇస్తుంటే.. కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. కేంద్రం కొండంత సాయం చేస్తున్నా బడ్జెట్ సమావేశాల్లో చీమంత కూడా ప్రస్తావించలేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 56 శాతమున్న బీసీల సంక్షేమానికి బడ్జెట్‌లో కేవలం రూ.9,200 కోట్లేనా? ఇదేనా బీసీలంటే గౌరవం? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యూత్ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీల అమలుపై ప్రస్తావనే లేదని ధన్‌పాల్ సూర్యనారాయణ మండిపడ్డారు. బడ్జెట్‌లో నిరుద్యోగులకు రూ.4 వేల భృతి, ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాల కల్పనపై ప్రస్తావించలేదన్నారు. రైతులు, మహిళలు, యువత, ఎస్సీ, ఎస్టీలకు డిక్లరేషన్ల పేరుతో ఇచ్చిన హామీల అమలు కోసం నిధులు కేటాయించలేదని, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

కేసీఆర్ 108 అబద్ధాలాడాడు

వంశీకృష్ణ, అచ్చంపేట ఎమ్మెల్యే

సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక రాష్ట్రం వచ్చాక దళితుడిని సీఎంని చేస్తానని కేసీఆర్ మోసం చేశాడు. కాపలా కుక్కలాగా ఉంటానన్నాడు.. 108 అబద్ధాలాడాడు. కేసీఆర్ చేసిన నిర్వాకాలతో త్వరలో జైలుకు పోవడం ఖాయం.

ఏం చీలుస్తారు.. ఏం చెండాడుతారు?

- బడ్జెట్ మొత్తం వింటేనే కదా కేసీఆర్‌కు అర్థమయ్యేది
- హడావుడిగా వచ్చారు.. వెళ్లిపోయారు.. హడావుడిగా మాట్లాడారు
- అభినందించాల్సింది పోయి అడ్డగోలుగా గాలి మాటలు మాట్లాడితే ఎలా?
- ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క



మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏం చీల్చి, ఏం చెండాడుతాడని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. అసలు బడ్జెట్ గురించి ఆయనకు ఏం అర్థమైందని నిలదీశారు. 'హడావుడిగా అసెంబ్లీకి వచ్చారు. హడావుడిగా వెళ్లిపోయారు. వెళ్లిపోతూ హడావుడిగా మాట్లాడారు. అసలు బడ్జెట్ ప్రసంగం పూర్తిగా వినకుండానే మధ్యలోనే సభ నుంచి వెళ్లిపోయారు. ఆయన పూర్తిగా వింటేనే కదా బడ్జెట్ గురించి అర్థమయ్యేది' అని వ్యాఖ్యానించారు. భట్టి గురువారం శాసనసభలో బడ్జెట్‌ను ప్రతిపాదించిన అనంతరం అసెంబ్లీ కమిటీ హాల్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠి మాట్లాడారు. నిజంగా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలపై, బడ్జెట్‌పై కేసీఆర్‌కు ఆసక్తి ఉంటే కేంద్ర బడ్జెట్‌పై అసెంబ్లీలో చర్చించినప్పుడు ఈ హడావుడి చేయాల్సిందని ఎద్దేవా చేశారు. 'బడ్జెట్‌లో నిధులివ్వలేదంటూ అసెంబ్లీలో చర్చ పెట్టి తమ గురించి మాట్లాడారు. అసెంబ్లీకి వెళ్లి వారి గురించి మాట్లాడిరండి' అని బీజేపీ వాళ్లు చెబితే కేసీఆర్ హడావుడిగా వచ్చి వెళ్లిపోయారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు శత్రు ప్రభుత్వమని కేసీఆర్ అంటున్నారని, నభూతో నభవిష్యత్‌లాగా వ్యవసాయానికి రూ.72,659 కోట్లు కేటాయిస్తే శత్రువులవుతారా అని ప్రశ్నించారు. దేశ చరిత్రలోనే వ్యవసాయానికి ఈ కేటాయింపులు ఎవరూ చేసి ఉండరని అన్నారు. ఇలాంటి బడ్జెట్ పెట్టిన తమను అభినందించాల్సింది పోయి అడ్డగోలుగా మాట్లాడటం సరైంది కాదని భట్టి వ్యాఖ్యానించారు. ఇష్టాగోష్ఠిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రెండింటి మేలు కలయిక

ఈ ఏడాదికి ప్రతిపాదించిన రాష్ట్ర బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమాల మేలు కలయిక అని భట్టి వ్యాఖ్యానించారు. వ్యవసాయంతోపాటు నగరాభివృద్ధికి ప్రాధాన్యమిచ్చామని, హైదరాబాద్‌లో మౌలిక వసతుల కల్పనకు రూ.10 వేల కోట్లు కేటాయించడం ద్వారా రాజధానిలో అన్ని సంస్థలను ఏర్పాటు చేసేందుకు కావాల్సిన వాతావరణాన్ని కల్పించనున్నామన్నారు. అలాగని ఇతర జిల్లాలను నిర్లక్ష్యం చేయబోమని చెప్పారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా నియోజకవర్గ కేంద్రాల్లో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల పార్కు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని, వారి నిధులను గత ప్రభుత్వం లాగా దారి మళ్లించబోమని స్పష్టం చేశారు. తాము రుణమాఫీ చేస్తామని చెప్పినప్పుడు కూడా ఎద్దేవా చేశారని, కానీ రైతు రుణమాఫీ చేసి చూపించామని అన్నారు.

కోటీశ్వరులను చేస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు

శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మహిళలను లక్షాధికారులను చేస్తామని 2005లో తాము చెప్పినప్పుడు కూడా సాధ్యం కాదన్నారని చెప్పారు. కానీ రాష్ట్రంలోని లక్షలాది మంది మహిళలను లక్షాధికారులను చేశామని, ఇప్పుడు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్ సామాన్యుడి హితంగా, పేదలకు అనుకూలంగా ఉందన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడి వెళ్లినందుకు సంతోషమని శ్రీధర్‌బాబు అన్నారు.

చేపలు మృతిచెందకుండా ఏం చర్యలు తీసుకున్నారు?

నివేదిక అందజేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: పటాన్‌చెరులోని చిటుకుల్ చెరువులో భవిష్యత్‌లో చేపలు మృతిచెందకుండా తీసుకున్న చర్యలపై తదుపరి విచారణలోగా నివేదిక అందజేయాలని హైకోర్టు ఆదేశించింది. విచారణను అక్టోబర్ 24కు వాయిదా వేసింది. పటాన్‌చెరులోని చిటుకుల్ చెరువులో దాదాపు 10 టన్నుల చేపలు మృతిచెందాయని జూన్ 28న ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని హైకోర్టు సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. పారిశ్రామిక, మురుగునీటి వ్యర్థాలను నీటిలోకి విడుదల చేయడం కారణంగానే చేపలు మృతిచెందినట్లు మత్స్యకారులు, స్థానికులు భావిస్తున్నట్లు ఆ కథనం పేర్కొంది. చెరువులోని నీటిలో ఆక్సిజన్ పరిమాణం తగ్గినందునే చేపలు మృతిచెంది ఉండవచ్చని సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. '23న భారీ వర్షాల కారణంగా చెరువులోకి వరద వచ్చి చేరింది. దీంతో ఆక్సిజన్ పరిమాణం తగ్గి.. అమోనియా పెరిగింది. ఈ నీటిలో మనుగడ సాగించలేని తిలాపియా చేపలు మాత్రం మృతిచెందాయి. చేపల మృతిపై మత్స్య శాఖ అధికారులు విచారణ జరిపారు. నీటిలో ఎలాంటి పురుగు మందు అవశేషాలు లేవు. ఎలాంటి పరిశ్రమల వ్యర్థాలు కూడా కలువలేదు.. మురుగునీరు మాత్రం చేరింది'అన్నారు. 'చెరువులో కలుపు మొక్కలను తొలగించారు. మళ్లీ కొత్త చేప పిల్లలను వేసేలా చర్యలు చేపడతామన్నారు. భవిష్యత్‌లో ఇలా జరకుండా ఉండాలంటే మురికినీటి శుద్ధి కర్మాగారం (ఎస్‌టీపీ) నిర్మాణం చేపట్టాలి. దీనికి 4 నెలల వరకు సమయం పడుతుంది. ఈ పిటిషన్‌పై ఈ నెల 16న ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసింది'అని పేర్కొన్నారు. పీసీబీ కౌంటర్ వేయలేదా అని సీజే ప్రశ్నిస్తూ.. ఒకవేళ వేసినా అన్ని బాగానే ఉన్నాయని వేస్తుంది కదా అని వ్యాఖ్యానించారు.

ఆస్తిని పంచుకునే సమయంలో బంధువులు, తండ్రిలేని బిడ్డలు, నిరుపేదలు వస్తే అందులో నుంచి వారికీ కొంత ఇవ్వండి. (ఆ సందర్భాన) వారితో మృదువుగా మాట్లాడండి.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 26 జూలై 2024

పునః సమీక్ష జరగాలి!

కొద్దివారాలుగా కొనసాగుతున్న వివాదం కీలక ఘట్టానికి చేరుకుంది. దేశవ్యాప్తంగా వైద్యవిద్యా కళాశాలల్లో ప్రవేశం కోసం ఏటా జరిపే జాతీయస్థాయి పరీక్ష 'నీట్'లో అక్రమాలు జరిగాయన్న అంశంపై విచారణ చేస్తున్న దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నపత్రాల లీకైనమాట నిజమంటూనే, వ్యవస్థీకృతంగా భారీస్థాయిలో లీకులు జరగనందున పునఃపరీక్ష జరపాల్సిన అవసరం లేదని తేల్చేసింది. 'నీట్' వివాదంతో నెలన్నరగా నిద్ర లేని రాత్రులు గడుపుతున్న విద్యార్థులకూ, వారి తల్లితండ్రులకూ ఇది ఒకింత ఊరట, మరింత స్పష్టత. అభ్యర్థుల మానసిక ఒత్తిడిని దృష్టిలో ఉంచుకొని, దాదాపు 23 లక్షల మందికి పైగా హాజరైన పరీక్షను మళ్ళీ నిర్వహించాలని అనుకోకపోవడం మంచిదే. అయితే పేపర్ లీకులు, ఒకదాని బదులు మరొక ప్రశ్నపత్రం ఇవ్వడం, ఒకరి బదులు మరొకరు పరీక్షలు రాయడం, నిర్ణీత కేంద్రాల నుంచి మునుపెన్నడూ లేనంత మంది టాపర్లుగా అవతరించడం – ఇలా 'నీట్' నిర్వహణలో ఈసారి వివిధ స్థాయుల్లో జరిగిన అవకతవకలు అనేకం. వీటన్నిటితో వ్యవస్థపై ఏర్పడ్డ అపనమ్మకాన్ని తొలగించడం ఎలా అన్నది ఇప్పుడు అతి పెద్ద ప్రశ్న.

మొదట అసలు లోపాలు లేవని వాదించి, ఆనక తప్పుల్ని అంగీకరించినా కీలక చర్యలు చేపట్టడానికి కార్యనిర్వాహక వ్యవస్థ వెనకాడడం చూశాం. చివరకు న్యాయవ్యవస్థ జోక్యంతో ప్రక్షాళన అవసరమనే అంశం చర్చకు వచ్చింది. సుప్రీమ్‌కోర్ట్ ఆదేశాలతో 'జాతీయ పరీక్షా సంస్థ' (ఎన్టీఏ) 'నీట్' పరీక్షా ఫలితాలను సవరించి, గురువారం ప్రకటించాల్సి వచ్చింది. భౌతికశాస్త్రంలో ఒక ప్రశ్నకు రెండు జవాబులూ సరైనవేనంటూ విద్యార్థులకు ఈ ఏటి పరీక్షలో గ్రేస్ మార్కులు కలిపిన ఘనత 'నీట్'ది. అత్యధిక సంఖ్యలో టాపర్లు రావడానికీ అదే కారణమైంది. సదరు వివాదాస్పద ప్రశ్నకు సరైన జవాబు ఒకటేనంటూ సుప్రీమ్ జోక్యం తర్వాత ఐఐటీ – ఢిల్లీ నిపుణుల సంఘం ఖరారు చేసింది. దాంతో అయిదేసి మార్కులు కోతపడి, దాదాపు 4.2 లక్షల మంది విద్యార్థుల మార్కులు మారాయి. జూన్ 4న తొలుత ఫలితాలు ప్రకటించినప్పుడు టాప్ స్కోరర్ల సంఖ్య 61 కాగా, ఇప్పుడీ వివాదాలు, విచారణలు, మార్పుల తర్వాత అది 17కు తగ్గింది. మార్కులు, దరిమిలా ర్యాంకుల్లో మార్పులతో తాజా జాబితాను ఎన్టీఏ విడుదల చేయాల్సి వచ్చింది. పునఃపరీక్ష ఉండదని కోర్ట్ తేల్చేయడంతో, సవరించిన ర్యాంకుల్ని బట్టి ఇప్పుడిక ప్రవేశాలు జరగనున్నాయి.

ఎంబీబీఎస్ చదువు కోసం పెట్టిన ఈ దేశవ్యాప్త 'నీట్ – యూజీ' పరీక్షలు లోపభూయిష్ఠమనీ, మరీ ముఖ్యంగా స్థానిక విద్యార్థుల అవకాశాలకు హానికరమనీ రాష్ట్రాలు గగ్గోలు పెడుతున్నాయి. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమైన 'నీట్' వద్దంటూ తమిళనాడు కొన్నేళ్ళుగా పోరాడుతుంటే, పశ్చిమ బెంగాల్ సైతం బుధవారం గొంతు కలిపింది. తాజాగా కర్ణాటక అసెంబ్లీ సైతం 'నీట్' వద్దని గురువారం బిల్లును ఆమోదించింది. సొంతంగా రాష్ట్రస్థాయి మెడికల్ ఎంట్రన్ టెస్ట్ పెడతామంటూ తీర్మానించింది. అది చట్టపరంగా సాధ్యమేనా, కేంద్రం, సుప్రీమ్ కోర్ట్ ఏమంటాయన్నది పక్కన పెడితే, 'నీట్' పట్ల పెరుగుతున్న అపనమ్మకం, రాష్ట్రాల్లో అసంతృప్తికి ఇది నిదర్శనం. అసలు ఒకప్పుడు ఎక్కడికక్కడ రాష్ట్రస్థాయి ప్రవేశపరీక్షలే ఉండేవి. దేశంలో వైద్యవిద్య చదవదలచిన పిల్లలు ప్రతి రాష్ట్రంలో పరీక్షలు రాసే ఈ శ్రమ, ఖర్చును తప్పించడం కోసం జాతీయస్థాయిలో అందరికీ ఒకే పరీక్ష 'నీట్'ను ప్రవేశపెట్టారు. మంచి ఆలోచనగా మొదలైనా, ఆచరణలో అది అవకతవకలకు ఆస్కారమిస్తూ, విద్యార్థుల్ని మరింత ఒత్తిడికి గురి చేసేదిగా మారడమే విషాదం.

మళ్ళీ పరీక్ష జరపనక్కర లేదని సుప్రీమ్ ప్రకటించింది కానీ, అసలు తప్పులేమీ జరగలేదని మాత్రం అనలేదని గుర్తించాలి. ఇప్పటికైతే పాట్నా, హజారీబాగ్ – ఈ రెండుచోట్లా పేపర్ లీకైనట్టు కోర్టు నిర్ధరించింది. అలాగే, మరిన్ని వివరాలు తవ్వి తీసేందుకు సీబీఐ దర్యాప్తు కొనసాగుతుందనీ స్పష్టం చేసింది. విద్యార్థుల కౌన్సిలింగ్ వగైరా కొనసాగించవచ్చని అనుమతిస్తూనే, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు ఎదురవకుండా, పరీక్షల నిర్వహణ మరింత మెరుగ్గా ఎలా నిర్వహించాలన్న దానిపై మార్గదర్శకాలు రానున్నట్టు పేర్కొంది. అభ్యర్థుల బంగారు భవిష్యత్తు ఆధారపడిన పరీక్షలపై ఎన్టీఏలో నిర్లక్ష్యం ఎంతగా పేరుకుందో ఇటీవలి 'నీట్', యూజీసీ– నెట్ వివాదాలే నిదర్శనం. పరీక్షా కేంద్రాల ఎంపిక మొదలు కీలకమైన పనిని బిడ్డింగ్‌లో అవుట్ సోర్సింగ్‌కు అప్పగించడం దాకా లోపాలు అనేకం. అసలు ముందుగా ఎన్టీఏను ప్రక్షాళన చేయాలంటున్నది అందుకే. 'నీట్' సంగతే తీసుకున్నా పెన్ను– పేపర్ల విధానం నుంచి కంప్యూటర్ ఆధారిత ఆఫ్‌లైన్ పరీక్షకు మారాలని నిపుణుల మాట. 'జేఈఈ'లో లాగా రెండంచెల పరీక్షా విధానం ఉండాలనే సూచనా వినిపిస్తోంది. సంపూర్ణ అధ్యయనం, సమగ్ర చర్చతో తగిన చర్యలు చేపట్టడం ఇక భవిష్యత్ కార్యాచరణ కావాలి.

అసలు ఇవాళ దేశంలో అనేకచోట్ల చదువుల్లో పరీక్షా పత్రాల మొదలు పోటీపరీక్షల ప్రశ్నపత్రాల వరకు అన్నీ విపణిలో యథేచ్ఛగా లభిస్తున్న దుఃస్థితి. ఈ లీకుల జాడ్యాన్ని అరికట్టకపోతే ప్రతిభకు పట్టం అనే మాటకు అర్థం లేకుండా పోతుంది. రకరకాల పేపర్ లీకులతో తరచూ వార్తల్లో నిలుస్తున్న బిహార్ సైతం ఎట్టకేలకు లీకు వీరులను కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వ పరీక్షల (అక్రమాల నిరోధక) బిల్లును అసెంబ్లీలో బుధవారం ఆమోదించింది. అన్నిచోట్లా ఇలాంటి కఠిన చట్టాలు అవసరమే. అయితే, అమలులో చిత్తశుద్ధి, అంతకన్నా ముందు ఆ చట్టాల దాకా పరిస్థితిని రానివ్వ కుండా లీకులకు అడ్డుకట్ట వేయడం ముఖ్యం. 'నీట్' పునర్నిర్వహణకు కోర్టు ఆదేశించకున్నా, తప్పులు జరిగాయని తేటతెల్లమైంది గనక మన పరీక్షా వ్యవస్థలు, విధానాలపై పునఃసమీక్ష, ప్రక్షాళనకు దిగాలి. అదీ పారదర్శకంగా జరగాలి. 'నీట్' లీకువీరులకు కఠిన శిక్షతో అందుకు శ్రీకారం చుట్టాలి.

ఇది ప్రగతి, సంక్షేమాల బడ్జెట్!

అభిప్రాయం


కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

"సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యం లేనిదే రాజకీయ ప్రజాస్వామ్యం సఫలం కాజాలదు" అన్నారు అంబేడ్కర్ మహాశయుడు. అక్షరాలా ఈ మార్గంలోనే సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం నిజసంక్షేమాన్ని నిర్భయంగా అందించేందుకు, నిజాయితీగా ప్రజల జీవితాలను గాడిన పెట్టేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది. 'అభయ హస్తం' కింద ఎన్నికలలో ప్రకటించిన ఆరు హామీలు ఇవ్వాళ తెలంగాణ నిరుపేదల జీవితాల్లో విశేషమైన మార్పు తెస్తున్నాయి. వాటిని నెరవేర్చేలా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి. రూ. 2,91,159 కోట్ల బడ్జెట్ తెలంగాణ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసాదించేందుకు, గత దశాబ్ద కాలంగా ఇబ్బందుల్లో ఉన్న తెలంగాణ బిడ్డలకు భరోసా కల్పించేందుకు తోడ్పడుతుంది.

"వెన్నెలలు లేవు–పున్నమ కన్నె లేదు
పైడి వన్నెల నెలవంక జాడలేదు
చుక్కలే లేవు ఆకాశ శోక వీధి
ధూమధామమ్ము దుఃఖ సంగ్రామ భూమి"
– దాశరథి కృష్ణమాచార్య

అవును... దాశరథి స్థితికి దగ్గరగా... గత అరవై యేండ్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో మాత్రమే కాదు, గత ప్రభుత్వ దశాబ్ద పాలనలో కూడా తెలంగాణ అదే నిస్తేజ పరిస్థితిని అనుభవించింది. సంక్షేమం మాటను ఆశ్రితులకు సమర్పయామి మంత్రం... రూల్స్ మాటున తమ రాజకీయ యవనికకు రూట్స్‌గా నిలబడ్డ బడా బాబులకు అప్పనంగా ప్రజల ఆస్తుల సంతర్పణ చేసింది బీఆర్ఎస్ సర్కారు. ఏ బడ్జెట్ చూసినా... కేటాయింపులు, ఆపై తటపటాయింపులతో తల్లడిల్లిపోయిన తెలంగాణ ప్రజానీకానికి నిజసంక్షేమాన్ని నిర్భయంగా అందించేందుకు, నిజాయితీగా ప్రజల జీవితాలను గాడిన పెట్టేందుకు కావాల్సిన కేటాయింపులను ఈ బడ్జెట్‌లో చేశాం. అటు అసెంబ్లీలో గౌరవ ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖామాత్యులు భట్టి విక్రమార్క, ఇటు మండలిలో సోదరుడు, ఐటీ పరిశ్రమల శాఖా మాత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రవేశపెట్టిన బడ్జెట్ సంక్షేమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. ఒకవైపు సంక్షేమం, మరోవైపు పురోగామి నిర్ణయాలతో జనరంజక బడ్జెట్‌ను మిత్రులిద్దరూ ప్రవేశపెట్టారు.

నిరుద్యోగులకు అభయం

దాదాపు లక్షన్నర ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు తమ కోర్సులను పూర్తి చేసుకొని ఉద్యోగ సాధనలోకి దిగుతున్నారు. వీరికి స్కిల్స్ అందించే స్కిల్ సెంటర్స్ ఏర్పాటు చేయాలనే ఆలోచన గత ప్రభుత్వం ఎన్నడూ చేయలేదు. దానివల్ల ప్రతీ యేటా నిరుద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ, ఉద్యమాలు చేసే స్థాయికి సమస్య పెరిగింది. అందుకే, విద్యార్థుల నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు దిగ్గజ సంస్థ టాటా టెక్నాలజీస్‌తో కలిసి రూ. 2,324 కోట్లతో 65 ఐటీఐలను స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా మార్చుతున్నాం. యూనివర్సిటీల పునర్వైభవం కోసం రూ. 500 కోట్లను కేటాయించాం. నిరుద్యోగ జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తున్నాం. కృత్రిమ మేధలో నిపుణులను తయారు చేసేందుకు, హైదరాబాద్‌ను ఈ రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు సెప్టెంబర్ 5, 6 తేదీలలో 'మేకింగ్ ఏఐ ఫర్ ఎవ్రీవన్' ప్రధానాంశంగా నిర్వహించ తలపెట్టిన సమావేశం తెలంగాణ యువతకు కొత్త భవి ష్యత్తుకు మార్గం చూపిస్తుందని విశ్వసిస్తున్నాం.

తెలంగాణ ప్రజల ఆయురారోగ్యాలకు శ్రీరామరక్షగా నిలిచిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాం. ఈ పథకం కింద ఉన్న 1,672 చికిత్సలలో 1,375 చికిత్సలకు ప్రభుత్వం ఇస్తున్న ప్యాకేజీ ధరలను 20 శాతం పెంచడం తోపాటుగా 163 వ్యాధులను కొత్తగా ఈ పథకంలో చేర్చాం. ప్రతీ ఒక్కరికి ప్రత్యేక గుర్తింపు ఉండేలా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డును తీసుకువస్తున్నాం. ఇవేకాదు, ఎస్సీ సంక్షేమానికి రూ. 33,124 కోట్లు, ఎస్టీల సంక్షేమానికి రూ.17,056 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ. 9,200 కోట్లు, మైనారిటీ సంక్షేమానికి రూ. 3,003 కోట్లు కేటాయించాం.



అభయహస్తం – పేదోళ్ల నేస్తం

రహదారులు అభివృద్ధికి జీవనాడులు అంటారు. అందుకే మా ప్రభుత్వం రహదారులకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నది. ముఖ్యంగా తెలంగాణను ప్రపంచ పటంలో నిలబెట్టే రీజినల్ రింగు రోడ్డుకు ఈ బడ్జెట్‌లో రూ.1,525 కోట్లు కేటాయించాం. దాదాపు రూ. 26,502 కోట్ల ప్రాథమిక అంచనాతో నిర్మించతలపెట్టిన రీజినల్ రింగ్ రోడ్డు పూర్తయితే ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్యలో పరిశ్రమల ఏర్పాటు, వాణిజ్య సేవలు, రవాణా పార్కులు ఏర్పడి అనూహ్యమైన అభివృద్ధిని సాధించి తెలంగాణను దేశంలో నెంబర్ వన్‌గా మార్చుతాయి. రాష్ట్ర రహదారులు, భవనాల నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో రూ. 5,790 కోట్లు కేటాయించాం.

అభయ హస్తం క్రింద ఎన్నికలలో ప్రకటించిన ఆరు హామీలు ఇవ్వాళ తెలంగాణ నిరుపేదల జీవితాల్లో విశేషమైన మార్పును తెస్తున్నాయి. ముఖ్యంగా మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటి వరకు 68.60 కోట్ల మంది అక్కలు, చెల్లెండ్లు, తల్లులు తమ గమ్యాలకు చేరుకున్నారు. దీనికోసం రూ. 2,351 కోట్లను సోదరీమణులకు ఆదా చేశాం. అంతేకాదు 39,57,637 కుటుంబాల్లోని సోదరీమణులకు ఆర్థిక భారం తగ్గించేందుకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. దీనికోసం ఇప్పటికే రూ. 200 కోట్లను కేటాయించాం. బడ్జెట్‌లో మరో రూ. 723 కోట్లను కేటాయించాం. గృహజ్యోతి పథకం ద్వారా అల్పాదాయ వర్గాల ఇళ్లలో చీకట్లను పారద్రోలి వెలుగులు నింపాలనే సత్సంకల్పంతో 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్‌ను వినియోగించే కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ఇప్పటికే ఈ పథకం కింద 45,81,676 ఇళ్లకు ఉచిత విద్యుత్ వెలుగులు అందించాం. దీని కోసం బడ్జెట్‌లో రూ. 583.05 కోట్లు కేటాయించాం. నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభిస్తున్నాం. దీని కింద ప్రతీ నియోజక వర్గానికి 3,500 ఇండ్ల చొప్పున మొత్తం 4 లక్షల 50 వేల ఇండ్లను నిర్మించాలని సంకల్పించాం.

వెలుగుల తెలంగాణను నిర్మిస్తాం

ప్రతీకార రాజకీయాలకన్నా, ప్రగతి రాజకీయాలను విశ్వసిస్తాం. అందుకే, 2014 నాటికి ఉన్న రూ. 75,577 కోట్ల అప్పులను 2023 డిసెంబర్ నాటికి రూ. 6,71,757 కోట్ల రూపాయలకు చేర్చినప్పటికీ విశాల ఆలోచనలతో పొదుపు మంత్రాన్ని పఠిస్తూ, దుబారాను తగ్గిస్తూ, క్రమశిక్షణతో కూడిన పాలనకు బాటలేస్తున్నాం. ఇంత ఇబ్బందికర పరిస్థితుల్లోనూ గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలు కలిపి ఇప్పటికే రూ. 42,892 కోట్లు చెల్లించాం. సంక్షేమానికి రూ. 34,579 కోట్లు ఖర్చు చేశాం. అంబేడ్కర్ మహాశయుడు చెప్పినట్టు, "సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యం లేనిదే రాజకీయ ప్రజాస్వామ్యం సఫలం కాజాలదు. పునాది ఎంత బలంగా ఉంటే, ప్రజాస్వామ్యం అంత పటిష్టంగా ఉంటుంది." అక్షరాలా మేం ఈ మార్గాన్నే ఎంచుకున్నాం.

'అది చేసేంతవరకూ చూడటానికి ఎప్పుడూ అసాధ్యంగా కనిపిస్తుంది' అని నెల్సన్ మండేలా చెప్పినట్టు, మేం రుణమాఫీ ప్రకటించిన రోజు అందరూ సందేహించినవారే. కానీ ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే 11 లక్షల మంది లక్షలోపు రుణాలున్న రైతులకు రుణమాఫీ చేశాం. ఆగస్టు 15 లోపలే రెండు లక్షల రుణాలున్న రైతన్నలందరి రుణాలను మాఫీ చేసి ఈ దేశ స్వాతంత్ర్యం వచ్చిన రోజు నాటికి తెలంగాణ రైతన్నకు రుణ స్వాతంత్ర్యం కలిగిస్తాం. భూమిలేని రైతుకూలీలకు యేడాదికి 12 వేల ఆర్థిక సాయం అందిస్తాం. పంట బీమా చేసి రైతన్న కష్టనష్టాల్లో అండగా ఉంటాం. వరి రైతుకు ఇచ్చిన మాట ప్రకారం రూ. 500 బోనస్‌ను అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

శ్రీధర్ బాబు బడ్జెట్‌లో మహాత్మాగాంధీ మాటను ఉట్టంకించినట్టు, "మనం చేసే పనులకు, చేయగలిగే సామర్థ్యానికి ఉన్న అంతరం ప్రపంచంలోని సమస్యలన్నింటిని పరిష్కరించడానికి సరిపోతుం"దనే మాట అక్షర సత్యం. ఇవ్వాళ మేం ప్రవేశపెట్టిన రూ. 2,91,159 కోట్ల బడ్జెట్ తెలంగాణ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసాదించేందుకు, గత దశాబ్ద కాలంగా ఇబ్బందుల్లో ఉన్న తెలంగాణ బిడ్డలకు భరోసా కల్పించేందుకు తోడ్పడుతుంది.

వ్యాసకర్త రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అదే రహస్యం!



క్రమంగా తమ బరువు తగ్గినవారు వాళ్ల పద్ధతుల గురించి ఇంటి పైకప్పు లేచిపోయేలా అరిచి చెప్పరు. ఎత్తిపొడిచినట్టు ఆ 'రహస్యాన్ని' వాళ్లు చెప్పినా ఎవరూ నమ్మరు. ఎందుకంటే అందులో రహస్యం ఏమీలేదు. ఇంట్లో వండింది తినడం, వ్యాయామం, త్వరగా నిద్రపోవడం... ఇంతే!

– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

తొలి విజేత



72 ఏళ్ల క్రితం, ఈ వారంలో, ఖశాబా దాదాసాహెబ్ జాధవ్ భారత్ తరఫున వ్యక్తిగత విభాగంలో మొట్టమొదటి ఒలింపిక్ పతకాన్ని గెలుచుకున్నారు. ఫిన్‌లాండ్‌లోని హెల్సింకీలో జరిగిన 1952 ఒలింపిక్స్‌లో ఆయన ఈ ఘనత సాధించారు.

– అమిత్ పరంజపే, వ్యాఖ్యాత

ఇండియా అందం



ఒక ముస్లిం మహిళా ఎంపీ పార్లమెంటులో నిలబడి, తన నియోజక వర్గం (కైరానా, ఉత్తర ప్రదేశ్) నుంచి కశ్మీర్‌లోని హిందువుల యాత్రాస్థలి వైష్ణోదేవికి రైలు వేయమని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇదీ ఇండియాలోని అందం. ఈ ఇండియా అంటేనే మోదీ, షా భయపడతారు. వెల్ డన్ ఇక్రా హసన్!

– రోషన్ రాయ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

నూరుశాతం ప్రయత్నించండి!



నూరు శాతం కనీస మద్దతు ధరకు హామీ అనేది కాంగ్రెస్ మేనిఫెస్టోలో భాగమే కదా! అది ఆచరణీయమే అని రాహుల్ గాంధీ నమ్ముతున్నప్పుడు, ఒక పైలట్ ప్రాజెక్టుగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఆయన ఎందుకు చేయరు? అది సఫలమైతే ఆయన విజేత, లేదంటే కనీసం ప్రయత్నించినట్టు అవుతుంది.

– మోహన్ సిన్హా, విశ్లేషకుడు

వ్యతిరేక పార్టీ



తమ జీవిత కాలం డెమోక్రాట్లుగా ఉన్న వాళ్లు (అమెరికాలోని) డెమోక్రాటిక్ పార్టీ వేగంగా యూదు వ్యతిరేకంగా మారుతున్నదన్న వాస్తవాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేరు. ఇది పెరుగుతున్నదే గానీ, తగ్గడం లేదు.

– ఎలాన్ మస్క్, వ్యాపారవేత్త

అంబేడ్కర్ దారిలో అలుపెరుగక...

'ఈ ప్రపంచాన్ని జయించడానికి ప్రేమతో మొదలవ్వు. ప్రేమ త్యాగమై, యుద్ధ గీతమై, అదో గొప్ప పోరాటాన్ని విశ్వవ్యాప్తం చేస్తుంది. నిన్ను విజేతగా నిలబెడుతుంది' అంటారు 71 ఏళ్ల సాహితీ వేత్త, దళితోద్యమ నాయకుడు డా॥ కత్తి పద్మారావు. ఆయన జీవితం – సాహిత్యం – ఉద్యమాలు వేర్వేరు కావు. పరిణామ క్రమంలో ప్రవాహ సదృశ్యంగా కొన సాగుతూ వచ్చిన, గుణవాచి అయిన కాల ధర్మం! అంబేడ్కర్ దార్శనికతనూ, తాత్వికతనూ, వివేచనా నిపుణతనూ ఆకళింపు చేసుకున్న ప్రథమ శ్రేణి ఆచరణ శీలుడాయన. అంబేడ్కర్ మార్గంలో పూలే నుండి పెరియార్ మీదగా చార్వాకుడు, బుద్ధుని వరకూ... ఆ తరువాతి నవ్య సిద్ధాంతకర్తలనూ, చరిత్రకారులనూ పరిశీలించి ఆకలింపు చేసుకున్నారు. సంస్కృత పాండిత్యం వల్ల అపారమైన అధ్యయనం, పరిశీలన, రచనా శక్తి అబ్బింది. జలపాతం సదృశ్యమైన వాక్చాతుర్యం, సమయస్ఫూర్తి, ఉత్తేజ పరచటం, వాదనా పటిమలతో అత్యుత్తమ రీతిలో ప్రజలకు చేరువయ్యారు.


డా॥ కత్తి పద్మారావు

కారంచేడు, కొత్తకోట, నీరుకొండ, పిప్పర్ల బండ్ల పల్లి, చుండూరు, పదిరి కుప్పం, వేంపెంట, లక్షింపేట వంటి ఉద్యమాలలో నాయకునిగా నిలిచి, ప్రభుత్వాలతో పోరాడి, ప్రజాయుద్ధంతో విజ యాన్ని సాధించారు. కారంచేడు, చుండూరు వంటి ఉద్యమాలలో బాధితుల పక్షాన నిలబడి వారికి వందల ఎకరాల భూములు ఇప్పించి, బాధిత కుటుంబాల పిల్లలకు ప్రభుత్వ సహాయం ఏర్పాటు చేసి, ఉద్యోగాలు ఇప్పించి, చిల్లిగవ్వ కూడా ప్రభుత్వ సొమ్ములను ఆశించకుండా నిజాయితీగా, నిబద్ధతతో తమ రచనలను నమ్ముకుని, అమ్ముకుని జీవనం సాగిస్తున్న అక్షర సంపన్నులాయన. పార్లమెంటు సాక్షిగా 111 మంది ఎంపీలతో '1989 ప్రివెన్షన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టా'న్ని తీసుకు రాగలిగారు.

'బౌద్ధ దర్శనం', 'చార్వాక దర్శనం', 'దళితుల చరిత్ర,' 'బ్రాహ్మణవాద మూలాలు', 'కులం ప్రత్యామ్నాయ సంస్కృతి', 'పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ', 'భారత రాజకీయాలు – కులాధిపత్య రాజకీయం – ప్రత్యామ్నాయ వ్యక్తిత్వాలు', 'అంబేడ్కర్ చూపు' వంటి 89 రచనలను అందించారు.

ఆయన కుటుంబం అంతా కులాంతర వివాహాలు చేసుకున్నారు. స్వయంగా తన చేతుల మీదుగా కొన్ని వేల కులాంతర వివాహాలు జరిపించడం ద్వారా ఒక సామాజిక మార్పునకు మార్గదర్శిగా నిలిచారు. మొత్తంగా ఆయన రచనల సారాంశం... ఉద్యమ రూపం, ప్రశ్న, ప్రతిఘటన, ప్రగతిగా సాగుతుంది. సమకాలీన రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో కత్తి పద్మారావు పాత్ర ఎవరూ తిరస్కరింపలేనిది.

– శిఖా ఆకాష్, నూజివీడు ၊ 93815 22247
(రేపు డా॥ కత్తి పద్మారావు 71వ జన్మదినం సందర్భంగా...)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

బీసీలకు దామాషా ప్రకారం పదవులు దక్కాలి!

సందర్భం


జూలూరు గౌరీశంకర్

"అణగారిన జనం సకాలంలో పురోగమించకపోతే కులం అనే విసుర్రాయి కిందపడి నలిగిపోతారని నేను భయపడుతున్నాను. అణగారిన కులాలను బలపరచటమంటే కుల విద్వేషాలను ప్రోత్సహించినట్లు కాదు. మనుషుల్ని వారి పుట్టుకను బట్టి హీనులుగా పరిగణించే పద్ధతి మనలో అంతరించిపోయిన రోజు నా జీవితంలో సంతోషకరమైన రోజు అవుతుంది" అన్న ఛత్రపతి సాహూ మహరాజ్... బలహీనవర్గాల వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇస్తూ 1902 జులై 26న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రోజు భారత సామాజిక ఉద్యమాల చరిత్రలో బడుగులు మరిచిపోలేని రోజు. వందేళ్ళ క్రితమే సాహూ మహరాజ్ కొల్హాపూర్ సంస్థానంలో దళితులను గ్రామాల్లో పట్వారీలుగా నియమించారు. కానీ స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్ళ తర్వాత కూడా బీసీ కులాల గణన చేసి జనాభా దామాషా ప్రకారం చట్టసభల సీట్లు కేటాయించమని అడుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సమాజంలో సగానికి పైగా ఉన్న బీసీలు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాలు చేస్తున్నారంటే దేశంలో ఆధిపత్య వర్గాలు నేటికినీ పల్లెలను ఎంతగా తమ చేతుల్లో పెట్టుకుని అధికారాల్ని చలాయిస్తున్నారో అవగతమవుతుంది. కులగణన ఎన్నికల వాగ్దానంగా మిగిలిపోయిందంటే పాలకులు ఇప్పటి దాకా ఎంత నిర్లక్ష్యంగా పాలిస్తూ వస్తున్నారో తెలుస్తుంది.



బడుగులు బాగుపడకుండా ఈ దేశం బాగుపడదని తెలిసి కూడా దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. 'బీసీ సబ్ ప్లాన్'ను పెట్టాలనీ, దానికి అత్యధిక నిధులివ్వాలనీ బీసీలు పూరేగింపులు చేస్తున్నారంటే ఇంతకంటే దేశానికి దరిద్రం మరేముంటుంది! కులగణనను కాంగ్రెస్ తాత్సారం చేస్తుంటే, బీజేపీ కులగణన చేయనని చెబుతోంది. దేశంలో సగానికి పైగా ఉన్న బీసీల హక్కుల కోసం చట్టసభలు మాట్లాడకుండా దాటవేస్తూ రావటం ప్రజాస్వామ్యాన్ని హననం చేసినట్లుగానే భావించాలి. సగం దేశంగా ఉన్న బీసీ కులాల జీవన విధానం ఎట్లా ఉందో తెలుసుకోకుండా దేశాన్ని అభివృద్ధి పథంలో ఎట్లా నడిపిస్తారో మన సర్వసత్తాక ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య పాలకులే చెప్పాలి.

దేశాన్ని మొత్తం ఆవరించి ఉన్న బీసీ ఉత్పత్తి కులాలు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో కీలక స్థానాలలోకి, నాయకత్వ దశకు రాకుండా దేశం అభివృద్ధి చెందదు. ఆధిపత్య కులాల పెట్టుబడి దారుల చేతుల్లో అధికార పగ్గాలు ఉన్నంత కాలం బీసీలు దుర్భరమైన పరిస్థితుల్లోనే మగ్గిపోక తప్పదు. దేశం అన్ని రంగాల్లోకి దూసుకు పోవాలంటే దేశాన్ని ప్రభావితం చేయగల బీసీలు అన్ని రంగాల్లో శిరసెత్తుకుని నిలవాలి. ఉత్పత్తి కులాల చేతులు పడకుండా దేశం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు.

మనం చైనా దేశ జనాభాను దాటి ముందుకొచ్చాం. ఉత్పత్తి శక్తుల చేతుల్లోకి దేశ ప్రగతి రథచక్రాలు వచ్చినప్పుడే చైనా ప్రగతిని మించి ముందుకు సాగుతాం. నేటికినీ బడుగు వర్గాలకు, ఉత్పత్తి కులాలకు పాలించే లక్షణాలు లేవని మాట్లాడటం ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసినట్లే అవుతుంది. ఉత్పత్తి కులాలు ఉత్పత్తి శక్తులై పారిశ్రామికవేత్తలుగా తయారైనప్పుడే దేశం అన్ని రంగాల్లో అసలు సిసలు ప్రగతిని సాధిస్తుంది. దేశాన్నీ, రాష్ట్రాన్నీ పాలించే పాలకులు సాహూ మహరాజ్ లాగా ఆలోచించాలి. ఆధిపత్య వర్గాల నాయకులు తమ హ్రస్వదృష్టిని విడిచిపెట్టి బడుగుల భవిష్యత్తు మీద దృష్టి పెట్టాలి. తమ కులం గొప్పదని, బడుగుల కులాలు తక్కువన్న దుర్మార్గపు ఆలోచన నుంచి ఆధిపత్య కులాలు బైట పడాలి. బడుగుల బాగే దేశం బాగు అని ఆలోచించగలిగినవారే సాహూ మహారాజులు కాగలుగుతారు. సమ రాజ్యాన్ని నిర్మించగలుగుతారు. బహుజన హితం కోరి దేశం అభివృద్ధిని కాంక్షించి బడుగులకు పల్లె నుంచి పార్లమెంటు దాకా వాళ్ళ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఇవ్వాలి. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ వాళ్ళ జనాభా ఎంతో అంత శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. కుల గణన చేస్తామని తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీసీల కుల గణన చేసినాకే స్థానిక సంస్థల ఎన్నికల్లోకి పోవాలన్నది బీసీల సామూహిక డిమాండ్. తమ వాటా స్థానాలను కోల్పోయిన బీసీలు తమ హక్కుల సాధనకు వారే గొంతెత్తి గర్జించాలి.

వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు
(బలహీన వర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇస్తూ సాహు మహరాజ్ ఉత్తర్వులు జారీ చేసిన రోజు... జూలై 26)

భక్తుని వేదన

సాధారణంగా కష్టాలు ఒకదాని మీద ఒకటి వచ్చి పడుతున్నప్పుడు ప్రతికూల పరిస్థితుల్లో మనిషి నిరాశకు గురవుతాడు. తన ప్రార్థనలు, వినతులు దైవం వినిపించుకోడా ఏమిటి అనే సందేహం కలుగుతుంది. భగవంతునికి అనేక మంది భక్తులుంటారు. వాళ్ళు గొప్పగా పూజలు చేస్తుంటారు. అంతమందిలో తానేం గుర్తుంటాడు? ఇలా ఆలోచిస్తూ సాధారణంగా నిస్పృహకు లోనవుతుంటారు మానవులు.



సరిగ్గా భక్త హృదయాలను చదివినట్లుగా నరసింహ శతక కవి, 'ఓ దేవా! నా వంటి సేవకుల సమూహం నీకు కోట్ల కొలది ఉంటారు. వారి సందడిలో, వారి సేవలలో నన్ను అశ్రద్ధతో మర్చిపోవద్దు. వారి పుణ్యాతిశయం చేత చాలా మంది సేవకులు నీ వెంట పడేవారుండగా నీకు నేనే మాత్రం! నీవు మెచ్చే పనులు నేను చేయలేను. ఈ భూజనులలో నేను పనికిమాలిన వాణ్ణి. అయినా, నీ శుభమైన చూపు నాపై ప్రసరించు' అని ప్రార్థిస్తాడు.

అలాగే 'నా రెండు కన్నులతో నిన్ను చూసే భాగ్యం నాకెప్పుడు? నా మనసులో కోర్కె తీరునట్లు నీ రూపం చూపించు. పాపం చేసినవారికి కనిపించనని ప్రమాణం చేసుకున్నావా? కానీ, పాపులను పరిశుద్ధులను చేసే దేవుడివి నువ్వే అని మహాత్ములంతా నిన్ను స్తుతిస్తారు. పాపులను రక్షించి నందుకే నీకింత కీర్తి. చెడ్డవాడినైననూ నాకు కనిపించవా!' అని వేడుకుంటాడు.

ఇందులో భక్తులందరి వేదనా ఉంది. ఆర్తి ఉంది. తనను మాత్రమే దేవుడు పట్టించుకోవట్లేదేమో అనే సందేహం ఉంది. భగవంతుని కరుణ శీఘ్రంగా తనపై ప్రసరించాలని, ఆ దివ్య రూపాన్ని కళ్లారా దర్శించి తరించాలనే తపన ఉంది. తాను భగవంతుడు మెచ్చే పనులు చేయటం లేదేమో, అందుకే ఆయన దయ తనకు లభించడం లేదేమో, అలా మెప్పించే శక్తి తనకు లేదుకదా అనే నిస్సహాయత ఉంది. భగవంతుని విషయంలో భక్తుల హృదయాలలో సహజంగా కనిపించే వేదన ఇదే!

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.పంచమి ఉ.5.56 వరకు, తదుపరి షష్ఠి తె.3.29 వరకు (తెల్లవారితే శనివారం), **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.7.05 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ఉ.5.41 నుండి 7.10 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.23 వరకు, **అమృతఘడియలు:** ప.2.35 నుండి 4.05 వరకు. ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.40, **సూర్యాస్తమయం:** 6.32.

క్లుప్తంగా...

జడ్చర్ల చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

ఏకపక్ష నిర్ణయాలతో సొంత పార్టీ కౌన్సిలర్ల తిరుగుబాటు

జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి సొంత పార్టీ (బీఆర్ఎస్) కౌన్సిలర్ల చేతిలో భంగపాటుకు గురయ్యారు. చైర్‌పర్సన్, ఆమె భర్త ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కౌన్సిలర్లు తిరుగుబాటు చేశారు. దీంతో ఈమెపై గురువారం పాలకమండలి సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది. మొత్తం 27 మంది వార్డు కౌన్సిల్ సభ్యులకు గాను చైర్‌పర్సన్ లక్ష్మిని మినహాయిస్తే 26 మంది అవిశ్వాస పరీక్షకు హాజరయ్యారు. వీరంతా ఏకపక్షంగా చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా చేతులెత్తి తమ తీర్పును వెలువరించారు. వీరికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు కూడా మద్దతు తెలపడం విశేషం. చైర్‌పర్సన్, ఆమె భర్త ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామని, ఓటింగ్‌లో పాల్గొని అవిశ్వాసం నెగ్గామని కౌన్సిలర్లు చెప్పారు. త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసుకుని స్థానిక మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సూచన మేరకు తమ పార్టీ కౌన్సిలర్‌నే చైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటామన్నారు. అవిశ్వాసం నెగ్గిందని పూర్తి నివేదికను కలెక్టర్ విజయేందిర బోయికి ఎన్నికల అధికారి, ఆర్డీఓ నవీన్ తెలిపారు. తదుపరి కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్త చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు.

స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

అటవీశాఖ మంత్రి కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ వ్యవస్థలో భాగమైన వారు హుందాగా వ్యవహరించాలని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. ఆలిండియా సర్వీసుల్లో వికలాంగుల కోటాపై తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. దివ్యాంగులపై స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని ఒకప్రకటనలో తెలిపారు. ఒక ఉన్నతమైన స్థానంలో ఉండి, పర్యవసానాలను ఆలోచించకుండా మాట్లాడటం తగదన్నారు. తమ మాటల ద్వారా సమాజానికి ఎలాంటి సందేశం వెళ్తుందో దృష్టిలో పెట్టుకొని మాట్లాడాలని సురేఖ హితవు పలికారు. శారీరక సామర్థ్యం కంటే మానసిక సామర్థ్యమే ముఖ్యమని స్మితా సబర్వాల్ గుర్తించాలన్నారు. గొప్ప సంకల్ప బలంతో శారీరక దుర్బలత్వాన్ని జయించి ఈ ప్రపంచానికి స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచిన మహోన్నత వ్యక్తులెందరో ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో వివక్షకు తావులేదని, అన్ని వర్గాల హక్కులకు రక్షణ ఉంటుందని మంత్రి స్పష్టంచేశారు.

కులగణనా.. ఓటర్ల జాబితానా?

- ఎటూ తేల్చుకోలేకపోతున్న సర్కార్
- నేటి కీలక భేటీలోనైనా స్పష్టత వచ్చేనా !

సాక్షి, హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల ఖరారుకు కులగణన చేపట్టాలా..లేదా తాజా ఓటర్లజాబితా ఆధారంగా చేయాలా అనేదానిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకోలేకపోతోంది. స్థానిక రిజర్వేషన్ల ఖరారు, ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలనే దానిపై ప్రభుత్వం సత్వర నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఉన్నత స్థాయి సమావేశంలో ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీల పాలకమండళ్ల పదవీకాలం ముగిసి, గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన మొదలై ఆరునెలలు కావొస్తోంది. ఇక జిల్లా, మండల ప్రజాపరిషత్‌ల గడువు ఈ నెల 4వ తేదీతో ముగియగా, రాష్ట్రవ్యాప్తంగా 32 జెడ్పీలు, 563 మండలాల్లోని దాదాపు 6 వేల ఎంపీటీసీ, 563 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి పంచాయతీలు, జిల్లా, మండల పరిషత్‌లకు వచ్చే నిధులు ఆగిపోయాయి.



బీసీ రిజర్వేషన్లు 42 శాతం ఎలా ?

స్థానిక సంస్థల్లో బీసీలకు గరిష్టంగా 21 శాతం రిజర్వేషన్లు ఉండగా, దానిని 42 శాతానికి పెంచుతామని, ఉపకులాల వారీగా కూడా రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించింది. దీనికి ఏ పద్ధతి అనుసరించాలనే అంశంపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోలేదు. సుప్రీంకోర్టు గతంలోనే 'ట్రిపుల్ టెస్ట్'పేరిట స్థానిక సంస్థల పరిధిలో ఆయా గ్రూపుల వెనుకబాటుతనంపై బీసీకమిషన్ ద్వారా విచారణ జరపాలని, ఆయా చోట్ల (స్థానిక స్థాయిలో) ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఏఏ నిష్పత్తిలో రిజర్వేషన్లు ఇవ్వాలనే దానిని తేల్చాలని స్పష్టం చేసింది. మొత్తంగా రిజర్వేషన్లు (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కలిపి) 50 శాతానికి మించరాదని కూడా పేర్కొంది.

ఓటర్ల జాబితాతో అయితే...

రాష్ట్రవ్యాప్తంగా కులగణన నిర్వహణ అనేది చాలా ఎక్కువ సమయం పట్టే ప్రక్రియ. దీంతో కొత్త ఓటర్ల జాబితా (లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వెలువరించిన లిస్ట్) ప్రాతిపదికన పంచాయతీరాజ్ శాఖను నోడల్ ఏజెన్సీగా నియమించి..ఓటర్ల జాబితా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఓటర్ల వివరాలు సేకరించాలని బీసీ కమిషన్ భావిస్తున్నట్టు తెలిసింది. ఓటర్ల జాబితా ఆధారంగా ఖరారు చేసిన రిజర్వేషన్లకు అనుగుణంగా తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో బీసీ సంఘాలు, వివిధ కులసంఘాలు, జిల్లాల్లోని రాజకీయపార్టీలతో సమావేశాలు, బహిరంగ విచారణ, ఆ తర్వాత రాష్ట్రస్థాయిలో అన్ని రాజకీయపక్షాలతో సమావేశం నిర్వహించి ముందుకు సాగొచ్చునని బీసీ కమిషన్ వర్గాలు భావిస్తున్నట్టు తెలుస్తోంది ఓటర్ల లిస్ట్ ప్రకారమైతే పెద్దగా శ్రమ లేకుండా మూడునెలల్లో క్షేత్రస్థాయిలో ఆయా సామాజికవర్గాల జనాభా వివరాలు తేల్చవచ్చునని, సామాజిక, ఆర్థిక, కుల సర్వే అయితే సమయం ఎక్కువ పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుత బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఆధ్వర్యంలో ట్రిపుల్ టెస్ట్ మేరకు క్షేత్రస్థాయి పరిశీలనలు ఇప్పటికే పూర్తి చేసినట్టు తెలిసింది.

సిరిసిల్ల బంద్ ప్రశాంతం

ప్రభుత్వ వైఖరితోనే సంక్షోభం: చాడ వెంకట్‌రెడ్డి



రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు

సిరిసిల్ల: వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని, పవర్‌లూమ్స్‌కు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గురువారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసి నేతన్నలకు మద్దతు తెలిపారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద నాలుగో రోజు గురువారం రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. దీక్ష శిబిరాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితోనే పవర్‌లూమ్ పరిశ్రమ సంక్షోభంలో ఉందన్నారు. పవర్‌లూమ్‌కు గతంలో ఇచ్చినట్లుగా విద్యుత్ సబ్సిడీ అందించాలని, వస్త్రపరిశ్రమకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరితోనే పవర్‌లూమ్ పరిశ్రమ సంక్షోభంలో ఉందన్నారు.

నేతన్న విగ్రహం సాక్షిగా మానవహారం

సిరిసిల్ల నేతన్న విగ్రహం సాక్షిగా నేత కార్మికులు మానవహారం నిర్వహించారు. వస్త్రపరిశ్రమను ఆదుకోవాలని నినాదాలు చేశారు. కరీంనగర్–కామారెడ్డి ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సిరిసిల్ల బంద్ విజయవంతం కావడంతో 27న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జేఏసీ నాయకులు వెల్లడించారు.

3 నెలల సమయం ఉండగా.. వారంలో పిటిషన్ ఎలా వేస్తారు?

అనర్హత పిటిషన్లపై హైకోర్టులో ప్రతివాదుల వాదనలు

సాక్షి, హైదరాబాద్: పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత ఫిర్యాదుపై స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని చెబుతున్న పిటిషనర్లు.. అంతవరకు ఆగకుండా వారం పది రోజుల్లోనే పిటిషన్లు దాఖలు చేయడం చెల్లదని హైకోర్టులో ప్రతివాదులు వాదనలు వినిపించారు. స్పీకర్ విధుల్లో కోర్టులు జోక్యం చేసుకోలేవని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. కాగా, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదును స్వీకరించాలని అసెంబ్లీ కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. ఫిర్యాదు స్వీకరించినట్లు రసీదు కూడా ఇవ్వాలని స్పష్టం చేసింది. అనంతరం తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, దానం నాగేందర్‌ను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే నాగేందర్ అనర్హతపై 3 నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు జూలై 1న ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా అనుమతించలేదని, రిజిస్టర్ పోస్టులో పంపినా తీసుకోలేదని మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. ఫిర్యాదును తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం మరోసారి విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, ప్రతివాదుల తరఫున సీనియర్ న్యాయవాదులు శ్రీరఘురాం, మయూర్‌రెడ్డి వాదనలు వినిపించారు.

'గొడుగుల పాఠశాల'పై కలెక్టర్ సీరియస్

- కుశ్నపల్లి హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు
- విద్యార్థులకు ఇబ్బంది కలిగించొద్దని టీచర్లకు ఆదేశం
- పాఠశాలను సందర్శించిన మంచిర్యాల జిల్లా కలెక్టర్



కురుస్తున్న తరగతి గదులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

నెన్నెల: తరగతి గదులు కురుస్తుండటంతో విద్యార్థులు గొడుగులు పట్టుకుని పాఠాలు విన్న ఘటనపై మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సీరియస్ అయ్యారు. నెన్నెల మండలం కుశ్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారంటూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఠాకూర్ ఇందన్‌సింగ్‌ను సస్పెండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో యాదయ్య ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మరో మూడు గదులున్నా వాటిని ఉపయోగించుకోకుండా కురుస్తున్న గదిలోనే పిల్లలను గొడుగులు పట్టుకుని కూర్చోబెట్టి ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే ప్రయత్నం చేశారని అధికారులు పేర్కొన్నారు. ఫొటోలు, వీడియోలు తీయించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంలో హెచ్‌ఎం ప్రమేయం ఉందని భావించి చర్యలు తీసుకున్నారు. విచారణ పూర్తయ్యే వరకు అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్స్ వదిలి వెళ్లరాదని ఆదేశించారు.

ఆ గదిలో ఎందుకు కూర్చోబెట్టారు?

గదులు కురుస్తున్నాయని తెలిసినా విద్యార్థులను అదే గదిలో ఎందుకు కూర్చోబెడుతున్నారని ఉపాధ్యాయులను కలెక్టర్ కుమార్ దీపక్ ప్రశ్నించారు. వర్షాలు తగ్గే వరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, పొడిగా ఉన్న ఇతర గదుల్లో కూర్చోబెట్టాలని ఆదేశించారు. పాఠశాల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యను ఎందుకు పెద్దగా చేస్తున్నారని టీచర్లను మందలించారు. స్టాఫ్‌రూమ్, ల్యాబ్ రూమ్‌లతోపాటు డైనింగ్ హాల్‌లో విద్యార్థులను సర్దుబాటు చేయాలని ఆదేశించారు. వర్షాలు తగ్గాక మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం పక్కనే ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. వార్డెన్ లచ్చన్న విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఐటీడీఏ పీఓకు చెప్పి షోకాజ్ నోటీసు ఇప్పిస్తానన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ యాదయ్య పాఠశాలకు చేరుకుని సమస్యలు తెలుసుకున్నారు.

'గురు'తర బాధ్యత

- విద్యార్థులను మోస్తూ వాగు దాటించిన ఉపాధ్యాయుడు



విద్యార్థిని ఎత్తుకుని ఉధృతంగా ప్రవహిస్తున్న ఒర్రె దాటిస్తున్న ఉపాధ్యాయుడు సంతోష్

పెంచికల్‌పేట్ (సిర్పూర్): విద్యార్థులను భుజంపై ఎత్తుకుని ఉధృతంగా ప్రవహిస్తున్న ఒర్రె దాటించి వారి ప్రాణాలు కాపాడారు ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పెంచికల్‌పేట్ మండలం జైహింద్‌పూర్ గ్రామ సమీపంలోని చెరువు నిండి మత్తడి దూకింది. ప్రాథమిక పాఠశాలల సమీపంలోని ఒర్రెలోకి భారీగా వరద చేరింది. పాఠశాలలో మొత్తం 30 మంది చదువుతుండగా.. ఒర్రెకు అవతలి వైపు నుంచి నిత్యం 20 మంది వరకు పాఠశాలకు వస్తుంటారు. గురువారం పాఠశాల ముగిసిన అనంతరం ఉపాధ్యాయుడు సంతోష్ గ్రామస్తుల సాయంతో విద్యార్థులను ఎత్తుకుని ఇలా వాగు దాటించారు.

30న హైదరాబాద్‌లో సుభాష్ పాలేకర్‌తో చర్చాగోష్టి

సాక్షి, హైదరాబాద్: ప్రకృతి వ్యవసాయ వేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ సుభాష్ పాలేకర్‌తో ఈ నెల 30న హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని ఫిల్మ్‌నగర్ క్లబ్‌లో చర్చాగోష్టి నిర్వహించనున్నారు. సుభాష్ పాలేకర్ కృషి (ఎస్‌పీకే) పద్ధతిలో పర్యావరణహితమైన అల్కలైన్ ఆహారోత్పత్తులు, మార్కెటింగ్ తదితర అంశాలపై తెలుగు రాష్ట్రాల రైతులు, సామాజిక కార్యకర్తలు, సినీ ప్రముఖులు, రచయితలు, వైద్యులు, పాత్రికేయులు పాలేకర్‌తో చర్చిస్తారు. మధ్యాహ్నం 3 గంటలనుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ చర్చాగోష్టి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. చర్చాగోష్టిలో పాల్గొనేందుకు ప్రవేశం ఉచితమని, ఎస్‌పీకేపై సందేహాలకు పాలేకర్ సమాధానాలిస్తారని నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇతర వివరాలకు ఈ చర్చాగోష్టి నిర్వాహకులు వి.నరసింహారెడ్డి (98662 46111), నరేశ్ (99481 58570), విజయరామ్ (63091 11427)లను సంప్రదించవచ్చు.



టీచరమ్మగా రాష్ట్రపతి

భూతాపాన్ని ఎలా తగ్గించాలో విద్యార్థులకు వివరించిన ముర్ము

న్యూఢిల్లీ: దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము టీచర్‌గా మారారు. రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు చేపట్టి రెండేళ్లయిన సందర్భంగా గురువారం ఆమె విద్యార్థులతో ముచ్చటించారు. భూతాపం పర్యవసానాలు, తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వారికి వివరించారు. ప్రెసిడెంట్ ఎస్టేట్‌లోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కేంద్రీయ విద్యాలయలో 9వ తరగతి చదువుకునే 53 మంది విద్యార్థులతో ఆమె సంభాషించారు. మొక్కల పెంపకం, వాననీటి సంరక్షణ అవసరాన్ని తెలియజెప్పారు. ముఖాముఖి సందర్భంగా వారి ఆకాంక్షలు, లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. చదువుకుని వైద్యులు, శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఉందంటూ వారు చెప్పిన లక్ష్యాలను విని సంతోషం వ్యక్తం చేశారు. 'ప్రపంచవ్యాప్తంగా నేడు శాస్త్రవేత్తలు, పాలనాధికారులు, పాలకులు సభలు, చర్చాగోష్టులు, సమావేశాలు చేపట్టి ఓ పెద్ద సమస్యపై చర్చలు జరుపుతున్నారు. అదేమిటో మీకు తెలుసా?'అని వారినడిగారు. వాతావరణ మార్పులు, భూతాపం, పర్యావరణ కాలుష్యం..అంటూ విద్యార్థులు బదులిచ్చారు. రాష్ట్రపతి ముర్ము బదులిస్తూ..'ఇది వరకు ఏడాదిలో ఆరు రుతువులుండేవి కానీ, నేడు నాలుగే ఉన్నాయి. వీటిలో అత్యధిక కాలం కొనసాగుతూ మనల్ని ఇబ్బంది పెట్టే రుతువు ఎండాకాలం. రోజురోజుకూ ఎండలు మండిపోతుండటంతో మనుషులే కాదు, జంతువులు, మొక్కలు, పక్షులూ ఇబ్బంది పడుతున్నాయి. కరువులు కూడా ఏర్పడుతున్నాయి. భూతాపమే వీటికి కారణం'అని ఆమె వివరించారు. 'భూతాపాన్ని ఎదుర్కోవాలంటే నీటిని పొదుపుగా వాడాలి. వర్షం నీటిని సంరక్షించాలి. చెట్లను విరివిగా పెంచాలి'అని వారికి సూచించారు.

ఆ రికార్డుపై కమలా హారిస్ కన్ను

అమెరికా చరిత్రలో ఉపాధ్యక్షులుగా ఉంటూ అధ్యక్షులు అయింది నలుగురే

హారిస్ గెలిస్తే ఐదో నేత అవుతారు	అగ్రరాజ్యాధినేతగా తొలి మహిళ అవుతారు	ఆసియా మూలాలున్న నేతగా, నల్లజాతి మహిళగా పలు రికార్డులు సొంతం అవుతాయి

వారం పది రోజుల కిందటి దాకా ఏకపక్షంగా సాగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసును కమలా హారిస్ ఒక్కసారిగా ఆసక్తికరంగా మార్చేశారు. డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా అధ్యక్షుడు బైడెన్ ఉన్నంతకాలం ఆయనపై అన్ని విషయాల్లోనూ ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన రిపబ్లికన్ ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు ఇప్పుడామె ముచ్చెమటలే పట్టిస్తున్నారు! బైడెన్ తప్పుకున్నాక తాజా సర్వేలన్నింటిలోనూ హారిస్ దూసుకుపోతున్నారు. కొన్నింటిలోనైతే ట్రంప్‌ను దాటేశారు కూడా. ఇటు తల్లి నుంచి ఆసియా, అటు తండ్రి నుంచి నల్లజాతి మూలాలుండటం హారిస్‌కు భారీ అడ్వాంటేజ్‌గా మారుతున్నట్టు కనిపిస్తోంది. అమెరికాలో ప్రబల శక్తులుగా ఉన్న ఈ రెండు వర్గాల ఓట్లు ఆమెకే పడటం ఖాయమంటున్నారు. ఆగస్టు 19–21 తేదీల మధ్య జరిగే డెమొక్రాట్ల జాతీయ సదస్సులో హారిస్ అభ్యర్థిత్వానికి ఆమోదముద్ర పడటం లాంఛనమే. అదే ఊపులో ట్రంప్‌ను ఓడిస్తే 248 ఏళ్ల అమెరికా చరిత్రలో తొలి అధ్యక్షురాలిగా, ఆ ఘనత సాధించిన మొదటి ఆసియా మూలాలున్న నేతగా, నల్ల జాతి మహిళగా... ఇలా ఆ దేశ చరిత్రలోనే అరుదైన పలు రికార్డులను హారిస్ సొంతం చేసుకుంటారు. అంతేకాదు, ఉపాధ్యక్ష పదవిలో ఉంటూ అధ్యక్ష ఎన్నికల్లో నెగ్గిన ఐదో అమెరికన్‌గా కూడా నిలుస్తారు.

నేరుగా పదోన్నతి నలుగురికే..

అమెరికా చరిత్రలో ఇప్పటిదాకా 49 మంది ఉపాధ్యక్షులుగా పని చేశారు. వారిలో పదిహేను మంది ఆ తర్వాత కాలంలో అధ్యక్షులు కూడా అయ్యారు. అయితే ఉపాధ్యక్ష పదవిలో ఉంటూనే ఎన్నికల బరిలో నెగ్గి అధ్యక్షులు అయింది మాత్రం కేవలం నలుగురే. ఈ జాబితాలో తొలి స్థానంలో ఉన్నది అమెరికా రెండో అధ్యక్షుడు జాన్ ఆడమ్స్. ఆయన 1789 నుంచి1796 దాకా దేశ తొలి ఉపాధ్యక్షునిగా ఉన్నారు. 1796లో ఆ పదవిలో ఉంటూనే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. ఆయన చేతిలో ఓటమి చవిచూసిన థామస్ జెఫర్సన్ అప్పటి నియమాల ప్రకారం ఉపాధ్యక్ష పదవి చేపట్టారు. ఎందుకంటే అప్పట్లో ఉపాధ్యక్ష అభ్యర్థి అంటూ విడిగా ఉండేవారు కాదు. అధ్యక్ష రేసులో రెండో స్థానంలో నిలిచిన నేతే ఉపాధ్యక్షుడు అయ్యేవారు. తర్వాత నాలుగేళ్లకు జెఫర్సన్ ఉపాధ్యక్ష పదవిలో ఉంటూనే అధ్యక్ష ఎన్నికల్లో గెలిచారు. ఆయన ఓడించింది ఎవరినో తెలుసా? నాటి అధ్యక్షుడు ఆడమ్స్‌నే! ఒక్కోపార్టీ నుంచి ఆ రెండు పదవులకూ విడిగా అభ్యర్థులు నిలబడటం పందొమ్మిదో శతాబ్దం తొలినాళ్లలో మొదలైంది.



- సాక్షి, నేషనల్ డెస్క్

150 ఏళ్ల విరామం తర్వాత జార్జ్‌బుష్

1836లో ఉపాధ్యక్షుడు మార్టిన్ వాన్ బురెన్ అధ్యక్ష ఎన్నికల్లో గెలిచారు. ఆ తర్వాత మళ్లీ ఉపాధ్యక్షుడు నేరుగా అధ్యక్షుడు కావడానికి ఏకంగా 150 ఏళ్లు పట్టింది! 1988లో నాటి ఉపాధ్యక్షుడు జార్జ్ హెచ్.డబ్ల్యు. బుష్ అధ్యక్షుడు అయ్యారు. చివరగా ఆ ఘనత సాధించిన నేత ఆయనే. ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ కూడా గతంలో బరాక్ ఒబామా హయాంలో ఉపాధ్యక్షునిగా చేశారు! కానీ 2016లో ఒబామా తర్వాత డెమొక్రాట్ల తరఫున బైడెన్‌కు కాకుండా హిల్లరీ క్లింటన్‌కు అధ్యక్ష అభ్యర్థిత్వం దక్కింది. అయితే ఆమె ట్రంప్ చేతిలో ఓటమి చవిచూశారు. 2020లో ట్రంప్‌ను హోరాహోరీ పోరులో బైడెన్ ఓడించడం, అధ్యక్షుడు కావడం తెలిసిందే. 1988 తర్వాత తొలిసారిగా ఉపాధ్యక్ష పదవిలో ఉంటూ నేరుగా ప్రెసిడెంట్ అయిన తొలి నేతగా రికార్డు సొంతం చేసుకునే దిశగా కమలా హారిస్ వడివడిగా దూసుకెళ్తున్నారు.

- అమెరికా చరిత్రలో ఉపాధ్యక్షులుగా ఉంటూ నేరుగా అధ్యక్ష ఎన్నికల బరిలో దిగి గెలిచిన నేతలు నలుగురు. వారు జాన్ ఆడమ్స్, థామస్ జెఫర్సన్, మార్టిన్ వాన్ బురెన్, జార్జ్ హెచ్.డబ్ల్యు.బుష్.
- ఎనిమిది మంది ఉపాధ్యక్షులు అప్పటి అధ్యక్షుల మృతి కారణంగా ఆ పదవిని చేపట్టారు. వారు జాన్ టైలర్, మిలార్డ్ ఫిల్మోర్, ఆండ్రూ జాన్సన్, చెస్టర్ ఆర్థర్, థియోడర్ రూజ్ వెల్ట్, కాల్విన్ కూలిడ్జ్, హారీ ట్రూమాన్, లిండన్ జాన్సన్.
- గెరాల్డ్ ఫోర్డ్ మాత్రం ఉపాధ్యక్షునిగా ఉంటూ, నాటి అధ్యక్షుడు రాజీనామా చేయడంతో ఆ పదవి చేపట్టారు.
- ఇద్దరు ఉపాధ్యక్షులు మాజీలయ్యాక, అంటే పదవీకాలం ముగిసిన కొన్నాళ్ల తర్వాత అధ్యక్ష ఎన్నికల బరిలో దిగి విజయం సాధించారు. వారిలో ఒకరు రిచర్డ్ నిక్సన్ కాగా రెండో వారు ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్.
- హారీ ట్రూమన్, చెస్టర్ ఆర్థర్ ఉపాధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోపే అధ్యక్షులయ్యారు!
- థామస్ హెండ్రిక్స్, విలియం కింగ్ ఉపాధ్యక్షులు అయిన ఏడాదిలోపే మరణించారు.
- జార్జ్ క్లింటన్, జాన్ కాల్హన్ వరుసగా రెండుసార్లు ఉపాధ్యక్షులుగా వేర్వేరు అధ్యక్షుల హయాంలో పని చేశారు.



మంత్రి రవ్‌నీత్ సింగ్



చరణ్‌జీత్ సింగ్

మాటల యుద్ధం

- లోక్‌సభలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదాలు
- పలుమార్లు వాయిదా పడిన సభ
- బియాంత్‌సింగ్ హత్యను ప్రస్తావించిన కాంగ్రెస్ ఎంపీ చన్నీ
- అభ్యంతరం వ్యక్తం చేసిన బీజేపీ సభ్యుడు బిట్టూ

న్యూఢిల్లీ: అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదాలు, నినాదాలతో లోక్‌సభ గురువారం దద్దరిల్లింది. పలుమార్లు వాయిదా పడింది. కేంద్ర బడ్జెట్‌పై ప్రారంభమైన చర్చ పూర్తిగా పక్కదారి పట్టింది. తొలుత కాంగ్రెస్ ఎంపీ, పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ మాట్లాడుతూ బీజేపీ ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి రవనీత్‌సింగ్ బిట్టూ తాత, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్‌సింగ్ హత్య ఘటనను ప్రస్తావించారు. దీనిపై బిట్టూ అభ్యంతరం వ్యక్తం చేశారు. చన్నీ, బిట్టూ మధ్య మాటల యుద్ధం జరిగింది. కాంగ్రెస్ నేత సోనియా గాంధీతోపాటు చన్నీపై బిట్టూ వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు. దీంతో విపక్ష ఎంపీలు ఒక్కసారిగా ఆయనపై విరుచుకుపడ్డారు. బిట్టూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సభ్యుడు అమరీందర్‌సింగ్ రాజా వెల్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. రాహుల్ గాంధీ ఆయనను ఆపేశారు. బిట్టూతోపాటు పలువురు బీజేపీ ఎంపీలు వెల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా స్పీకర్ స్థానంలో ఉన్న సంధ్యా రే సభను వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమైన తర్వాత కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. సభ సజావుగా జరిగేలా చూడాలని స్పీకర్ ఓం బిర్లాను కోరారు. సభ్యులంతా సభ గౌరవాన్ని కాపాడాలని స్పీకర్ అన్నారు. నిబంధనలు అతిక్రమించకూడదని చెప్పారు. తర్వాత చన్నీ తన ప్రసంగం కొనసాగించారు. రైతులకు ఇచ్చిన హామీలను మోదీ ప్రభుత్వం నిటబెట్టుకోలేదని విమర్శించారు. రైతులను ఖలిస్తానీలు చిత్రీకరించారని బీజేపీ నేతలపై మండిపడ్డారు. సభను చన్నీ తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆరోపించారు. చన్నీ మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ చన్నీ వ్యాఖ్యలను తప్పుపట్టారు. ఆయనపై సభా హక్కుల తీర్మానం ప్రవేశపెట్టాలని అన్నారు. ఈ సందర్భంగా అధికార, విపక్ష సభ్యుల మధ్య మళ్లీ వాగ్వాదం కొనసాగింది. తర్వాత సభ రెండుసార్లు వాయిదా పడింది. పార్లమెంట్ బయట బిట్టూ మీడియాతో మాట్లాడారు. చన్నీ జాతి వ్యతిరేక శక్తిగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇండియా నుంచి పంజాబ్‌ను విడదీయాలన్నదే ఆయన ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు.

దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ: చన్నీ

దేశంలో నరేంద్ర మోదీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందని చరణ్‌జిత్ సింగ్ చన్నీ మండిపడ్డారు. 20 లక్షల మంది ప్రజలు ఎన్నుకున్న ఎంపీని(అమృత్‌పాల్ సింగ్) జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ) కింద నిర్బంధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లు వేసిన ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించే అవకాశం ఆయనకు ఇవ్వడం లేదని, ఇది ఎమర్జెన్సీ కాక మరేమిటని ప్రశ్నించారు. చన్నీ లోక్‌సభలో ఈ అంశాన్ని లేవనెత్తారు. అయితే, అమృత్‌పాల్ పేరును నేరుగా ప్రస్తావించలేదు. లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లోని ఖదూర్‌సాహిబ్ నియోజకవర్గం నుంచి వివాదాస్పద సిక్కు మత బోధకుడు, ఖలిస్తాన్ సానుభూతిపరుడు అమృత్‌పాల్ సింగ్ స్వతంత్ర అభ్యర్థిగా 2 లక్షల మెజార్టీతో గెలిచిన సంగతి తెలిసిందే.

ఆంధ్రా-బిహార్ బడ్జెట్: సౌగతా రాయ్

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగతా రాయ్ లోక్‌సభలో విమర్శలు గుప్పించారు. అది ఆంధ్రా–బిహార్ బడ్జెట్ అని ఆక్షేపించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శిక్షణ పొందిన ఆర్థికవేత్త కాదని అన్నారు. ప్రజల ఆకాంక్షలు పట్టించుకోకుండా కేవలం ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన సూచనల ఆధారంగా బడ్జెట్ రూపొందించారని విమర్శించారు. గతంలో ఆర్థిక మంత్రులుగా పని చేసిన మన్మోహన్ సింగ్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో, పి.చిదంబరం హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నారని, నిర్మలా సీతారామన్ మాత్రం జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో చదువుకున్నారని సౌగతా రాయ్ వ్యాఖ్యానించారు.

'రాయల్టీ' రాష్ట్రాలదే

సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు

- రాయల్టీ అంటే పన్ను కాదని స్పష్టీకరణ
- రాయల్టీ విధించకుండా రాష్ట్రాలపై ఎలాంటి నియంత్రణ లేదని వెల్లడి

న్యూఢిల్లీ: ఖనిజాలపై రాయల్టీ విధించే అధికారం రాష్ట్రాలకు మాత్రమే ఉందని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఖనిజాలపై చెల్లించే రాయల్టీ పన్ను కాదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం 8:1 మెజారిటీతో కీలక తీర్పు వెలువరించింది. కేంద్ర ప్రభుత్వానికి ఇది ఎదురుదెబ్బే. గనుల, ఖనిజాల అభివృద్ధిపై కేంద్రం నియంత్రణకు వీలు కల్పిస్తున్న రాజ్యాంగంలోని జాబితా–1లో పేర్కొన్న ఎంట్రీ 54 ప్రకారం.. ఖనిజ హక్కులపై పన్నులు విధించే అధికారం పార్లమెంటుకు లేదని తేల్చిచెప్పింది. అయితే ఖనిజ హక్కులపై రాయల్టీ విధించే రాష్ట్రాల అధికారాన్ని ఏ స్థాయికైనా పరిమితం చేసే అధికారం పార్లమెంటుకు ఉందని స్పష్టం చేసింది. గనులు, ఖనిజాలు అధికంగా ఉన్న జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలకు ఈ తీర్పుతో లబ్ధి చేకూరనుంది. తమ ప్రాంతంలో ఉన్న గనులు, ఖనిజాలపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటిదాకా వసూలు చేసిన రూ.వేల కోట్ల పన్నులను తిరిగి తమకు ఇప్పించాలని ఆయా రాష్ట్రాలు విజ్ఞప్తి చేశాయి. తీర్పును అమల్లోకి తీసుకురావాలని కోరాయి. రాష్ట్రాల విజ్ఞప్తిని కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ వ్యతిరేకించారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఈ అంశంపై లిఖితపూర్వకంగా స్పందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. పన్నులను రాష్ట్రాలకు తిరిగి ఇచ్చే విషయంలో ఈ నెల 31న తమ నిర్ణయం ప్రకటిస్తామని వెల్లడించింది.

1989 నాటి తీర్పును తోసిపుచ్చిన ధర్మాసనం

గనులు, ఖనిజాలపై రాయల్టీ విధించే హక్కు రాష్ట్రాలకే ఉందంటూ తమ తీర్పును జస్టిస్ డి.వై.చంద్రచూడ్ స్వయంగా చదివి వినిపించారు. ధర్మాసనంలోని 8 మంది సభ్యులు రాష్ట్రాల హక్కును సమర్థిస్తూ తీర్పు ఇచ్చారు. జస్టిస్ నాగరత్న ఒక్కరే వ్యతిరేకిస్తూ భిన్నమైన తీర్పు వెలువరించారు. రాజ్యాంగంలో జాబితా–2లోని ఎంట్రీ 50 కింద గనులు, ఖనిజాలపై పన్నులు విధించే అధికారం పార్లమెంట్‌కు లేదని జస్టిస్ చంద్రచూడ్ తమ తీర్పులో చెప్పారు. రాయల్టీ అంటే పన్ను అని తేల్చేస్తూ 1989లో సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు సరైంది కాదని పేర్కొన్నారు. ఆ తీర్పును తోసిపుచ్చారు.

రాష్ట్రాల అధికారాన్ని పార్లమెంటు పరిమితం చేయవచ్చు

ఖనిజాలపై రాయల్టీ వసూలు చేసుకునే అధికారం రాష్ట్రాలకే ఉన్నప్పటికీ.. దేశంలో ఖనిజాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రాల అధికారాన్ని పరిమితం చేసే హక్కు మాత్రం పార్లమెంటుకు ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. 'ఖనిజాభివృద్ధి ఆటంకం కలగకుండా ఉండటానికి రాష్ట్రాల రాయల్టీ అధికారాన్ని పార్లమెంటు పరిమితం చేయగలదు. ఆ మేరకు పార్లమెంటు ఏదైనా చట్టాన్ని చేస్తే రాష్ట్రాలు దానికి కట్టుబడి ఉండాలి' అని స్పష్టం చేసింది.

'మహా'వృష్టి

జలమయమైన పుణె, ముంబై, థానె, పాల్ఘర్

ముంబై: మహారాష్ట్రలోని పలు జిల్లాలపై వరుణుడు తన ప్రతాపం చూపించాడు. ముంబై మహానగరంసహా థానె, పుణె, పాల్ఘర్, రాయ్‌గఢ్ జిల్లాల్లో కుంభవృష్టి కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయందాకా ఎడతెగని వానలతో పలు ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. భీకరవర్షాలకు ఆయా ప్రాంతాలు నీట మునిగాయి. జనజీవనం స్తంభించింది. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆరెంజ్, రెడ్ అలర్ట్ ప్రకటించారు. వర్ష సంబంధ ఘటనల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. పుణెలోని దక్కన్ ప్రాంతంలో విద్యుదాఘాతంతో ముగ్గురు, తహమినీ ఘాట్‌లో కొండచరియలు పడి ఒకరు చనిపోయారు. జలదిగ్బంధంలో చిక్కుకున్న వారికి కాపాడేందుకు సైన్యం రంగంలోకి దిగింది. ముంబైలోనూ వానలు ముంచెత్తాయి. సిటీ లోని శాంటాక్రూజ్ ప్రాంతంలో జూలైలోనే అత్యధికంగా 1,500 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నగర చరిత్రలో జూలైలో రెండో అత్యంత భారీ వర్షపాతం ఇదే. ముంబైలో కురుస్తున్న భారీ వర్షాలతో ఎయిర్‌పోర్టులో విమానరాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రన్‌వేపై 300 మీటర్ల దూరం తర్వాత ఏమీ కనిపించట్లేదు. దీంతో 11 విమానాలను రద్దుచేశారు. కొన్నింటిని వేరే నగరాలకు దారి మళ్లించారు.



4 రోజులు.. 160 కి.మీ.లు

ముంబై: కార్గిల్ విజయ్ దివస్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్మీ మాజీ అధికారిణి సాహసోపేతమైన ఫీట్ చేశారు. లెఫ్టినెంట్ కల్నల్ వర్షారాయ్ 4 రోజుల్లో 160 కిలోమీటర్ల పరుగును పూర్తిచేశారు. రన్ జూలై 19న ప్రారంభమై జూలై 22న ముగిసింది. శ్రీనగర్ నుండి ద్రాస్ సెక్టార్‌లోని కార్గిల్ వార్ మెమోరియల్ వరకు ఆమె సగటున రోజుకు 40 కి.మీ. పరుగెత్తారు. పరుగు పూర్తయిన సందర్భంగా కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద అమరవీరులకు నివాళులు అర్పించారు. ఆమెతోపాటు చినార్ వారియర్స్ మారథాన్ జట్టు కూడా ఉంది. లెఫ్టినెంట్ కల్నల్ వర్షా రాయ్ భర్త కశ్మీర్‌లో ఆర్మీ అధికారిగా ఉన్నారు.

వ్యభిచార గృహానికి రక్షణ కల్పించండి

- ఓ న్యాయవాది పిటిషన్
- అవాక్కైన మద్రాస్ హైకోర్టు

చెన్నై: తమిళనాడులోని కన్యాకుమారి జిల్లాలో తాను నడుపుతున్న వ్యభిచార గృహానికి రక్షణ కల్పించాలని కోరుతూ ఓ న్యాయవాది పిటిషన్ వేయడంతో మద్రాస్ హైకోర్టు అవాక్కైంది. వయోజనుల మధ్య పరస్పర సమ్మతితో సెక్స్ సర్వీసులను, కౌన్సెలింగ్‌ను, ఆయిల్ బాత్‌లను తమ సంస్థ అందిస్తుందని న్యాయవాది రాజా మురుగన్ తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. పోలీసు తనపై పెట్టిన కేసును కొట్టి వేయాలని, తన వ్యాపార కార్యకలాపాల జోలికి రాకుండా పోలీసులను కట్టడి చేస్తూ ఆదేశాలివ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. వయోజనుల మధ్య పరస్పర సమ్మతితో జరిగే సెక్స్ నేరం కాదని తన చట్టవిరుద్ధ కార్యకలాపాలను పిటిషనర్ సమర్థించుకోవడాన్ని జస్టిస్ బి.పుగలేంధి తీవ్రంగా ఆక్షేపించారు. పేరున్న లా కాలేజీల నుంచి పట్టభద్రులైన వారిని మాత్రమే న్యాయవాదులుగా నమోదు చేసుకోవాలని బార్ కౌన్సిల్‌కు సూచించారు. మురుగన్‌కు రూ. 10 వేల జరిమానాను విధించడమే కాకుండా.. లా డిగ్రీ సర్టిఫికెట్‌ను, బార్ అసోసియేషన్‌లో నమోదైన పత్రాన్ని సమర్పించాలని ఆదేశించింది.

కాంగ్రెస్ చిల్లర రాజకీయాలకు చెంపపెట్టు

నీట్‌పై సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్ర మంత్రి ప్రధాన్



న్యూఢిల్లీ: నీట్–యూజీ అంశంపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు కాంగ్రెస్ బాధ్యతారాహిత్యానికి, చిల్లర రాజకీయాలకు చెంపపెట్టని కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. సుప్రీం నిర్ణయం విద్యార్థుల ఓటమి కానేకాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి కేంద్రం ప్రభుత్వంపైనే కాదు, సుప్రీంకోర్టుపైనా విశ్వాసం లేదని విమర్శించారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలోనూ పేపర్ లీకేజీలు జరగడం తెలియదా అని ఆ పార్టీ చీఫ్ ఖర్గేను ఆయన ప్రశ్నించారు. అప్పటి ఘటనలపై ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. పేపర్ లీకేజీలకు, అవినీతికి తండ్రి వంటిది కాంగ్రెస్ పార్టీ అని ఎద్దేవా చేశారు. రాజకీయ మనుగడ కోసం ఆ పార్టీ అబద్ధాలు, అరాచకాలనే నమ్ముకుందని మంత్రి మండిపడ్డారు. స్వార్థ ప్రయోజనాలపైనే తప్ప, విద్యార్థుల భవిష్యత్తు గురించి ఖర్గేకు, రాహుల్ గాంధీకిగానీ, కాంగ్రెస్ పార్టీకిగానీ ఏమాత్రం పట్టింపు లేదని ఆరోపించారు.

లూటెన్స్‌లో ఆప్ నూతన కార్యాలయం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని లూటెన్స్ ప్రాంతంలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి కొత్త కార్యాలయాన్ని కేటాయించినట్లు అధికారవర్గాలు గురువారం తెలిపాయి. పండిట్ రవి శంకర్ శుక్లా లేన్‌లోని ఒకటో నంబర్ బంగ్లాను ఆప్‌కు ఇచ్చినట్లు చెప్పాయి. గతంలో రౌజ్ అవెన్యూ ప్రాంతంలో ఆప్ కార్యాలయం ఉండేది. జాతీయ గుర్తింపు కోల్పోవడంతో ఆ కార్యాలయాన్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతేడాది జాతీయ పార్టీగా తిరిగి గుర్తింపు సాధించిన ఆప్‌కు హోదాకు తగ్గట్టుగా మరో చోట కార్యాలయం కేటాయించాలని ఢిల్లీ హైకోర్టు కేంద్రాన్ని కోరింది. ఈ విషయాన్ని జూలై 25వ తేదీలోగా తెల్చాలంటూ ఆదేశించింది. ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తాజాగా ప్రకటించారు.

శ్రీలంక అధ్యక్ష బరిలో మాజీ ఆర్మీ చీఫ్



కొలంబో: శ్రీలంక అధ్యక్ష పదవికి త్వరలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు మాజీ ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ శరత్ ఫొన్సెకా(73) ప్రకటించారు. అధ్యక్షుడైతే అవినీతిని రూపుమాపి, దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు. సెప్టెంబర్ 17–అక్టోబర్ 16 తేదీల మధ్య దేశంలో ఎన్నికలు జరిగే అవకాశముంది. ఎన్నికల సంఘం ఈ నెల 26వ తేదీన షెడ్యూల్ ప్రకటించనుంది. 2009లో అప్పటి ఆర్మీ చీఫ్ శరత్ ఫొన్సె సారథ్యంలో చేపట్టిన సైనిక ఆపరేషన్‌లో ఎల్టీటీఈ చీఫ్ వేలుపిళ్లై ప్రభాకర్ సహా కేడర్ అంతమైంది. కాగా, ప్రధాన ప్రతిపక్ష నేత సజిత్ ప్రేమదాస, మార్క్సిస్ట్ జేవీపీ నేత అనురా కుమార దిస్సనాయకేలు కూడా అధ్యక్ష పదవికి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు.

నీట్-యూజీ రివైజ్డ్ ఫలితాలను విడుదల చేయలేదు: కేంద్రం



న్యూఢిల్లీ: నీట్–యూజీ 2024 రివైజ్డ్ ఫలితాలను గురువారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) విడుదల చేసిందంటూ వచ్చిన వార్తలపై కేంద్రం స్పందించింది. రివైజ్డ్ ఫలితాలను విడుదల చేయలేదని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో షేర్ అవుతున్న లింక్ పాతదేనని స్పష్టం చేసింది. ఫిజిక్స్ పేపర్‌లోని ఓ ప్రశ్నకు రెండు రకాలైన సమాధానాలకు కూడా మార్కులు వేశారు. దీనిపై కొందరు విద్యార్థుల వినతిమేరకు సుప్రీంకోర్టు విచారణ కమిటీని వేయడం, ఆ ప్రశ్నకు ఒక్కటే సరైన సమాధానమని కమిటీ స్పష్టం చేయడం తెల్సిందే. దీంతో, రెండు రోజుల్లోగా రివైజ్డ్ ఫలితాలను ప్రకటిస్తామంటూ విద్యాశాఖ ప్రకటించింది.

నీట్‌ను రద్దు చేయండి

- నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ వద్దు
- కర్ణాటక అసెంబ్లీ కీలక తీర్మానాలు



బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ గురువారం మూడు కీలక తీర్మానాలను ఆమోదించింది. నేషనల్ ఎంట్రన్స్ కమ్ ఎలిజిబిలిటీ టెస్ట్(నీట్)ను రద్దు చేయాలి, ఒకే దేశం–ఒకే ఎన్నిక విధానం, 2026లో చేపట్టే జనగణన ఆధారంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ చేపట్టే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరింది. పునర్వ్యవస్థీకరణను 1971 జనగణన ఆధారంగానే చేపట్టాలని కోరింది. జమిలి ఎన్నికల విధానం అమలుతో దేశ ప్రజాస్వామ్యం, సమాఖ్య విధానం ప్రమాదంలో పడతాయని పేర్కొంది.

కొత్త తరానికి చాన్సివ్వడానికే

అందుకే పోటీ నుంచి తప్పుకున్నా: బైడెన్



వాషింగ్టన్: దేశాన్ని మరింత ఐక్యంగా నిలిపేందుకు, కొత్త తరానికి అవకాశం ఇవ్వాలనే సదుద్దేశంతో దేశాధ్యక్ష రేసు నుంచి తప్పుకున్నానని డెమొక్రటిక్ అభ్యర్థి జో బైడెన్ వ్యాఖ్యానించారు. పోటీ నుంచి నిష్క్రమించినట్లు ప్రకటించాక బైడెన్ జాతినుద్దేశించి ప్రసంగించడం ఇదే తొలిసారి. బుధవారం అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌజ్‌లోని ఓవల్ ఆఫీస్ నుంచి ఆయన 11 నిమిషాలపాటు ప్రసంగించారు. ''గత కొద్దివారాలుగా అమెరికా రాజకీయాలను అందరూ గమనిస్తూనే ఉన్నారు. డెమొక్రటిక్ పార్టీని ఐక్యంగా నిలపాల్సిన బాధ్యత నాపై ఉంది. అందుకే క్లిష్ట సమయాల్లో డెమొక్రటిక్ పార్టీని ఐక్యంగా ఉంచడం కోసం వ్యక్తిగత లక్ష్యాలను త్యాగం చేయడం కూడా ముఖ్యమే' అని తాను రేసు నుంచి తప్పుకోవడాన్ని బైడెన్ సమర్థించుకున్నారు.

రాష్ట్రపతి భవన్‌లో హాళ్లకు కొత్త పేర్లు

- దర్బార్ హాల్ ఇకపై గణతంత్ర మండపం
- అశోకా హాల్ పేరు సైతం అశోక మండపంగా మార్పు



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రపతి భవన్‌లోని రెండు ప్రధానమైన హాళ్లకు కొత్త నామకరణం చేశారు. జాతీయ పురస్కా రాల ప్రదానోత్సవాలకు వేదికగా నిలిచే దర్బార్ హాల్ పేరును గణతంత్ర మండపంగా మారుస్తూ రాష్ట్రప తిభవన్ సచివాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రపతిభవన్‌లోని మరో ప్రాంగణమైన 'అశోకా హాల్' పేరును అశోకా మండపంగా మార్చారు. హాళ్లకు కొత్త నామకరణం చేస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కీలక నిర్ణయం తీసుకున్నారని ఆ ప్రకటన పేర్కొంది. దేశ ప్రజల అమూల్యమైన వారసత్వ సంపద అయిన రాష్ట్రపతి భవన్‌లో భారతీయ సాంస్కృతిక విలువలు, నైతికతను ప్రతిబింబించేలా హాళ్లకు కొత్త పేర్లు పెట్టామని రాష్ట్రపతి భవన్ పేర్కొంది.

శ్రీ వేంకటేశ్వర ఎయిర్‌పోర్ట్‌గా తిరుపతి ఎయిర్‌పోర్ట్ పేరు !

ప్రతిపాదించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ఎయిర్‌పోర్ట్ పేరును శ్రీ వేంకటేశ్వర ఎయిర్‌పోర్ట్‌గా మార్చాలని ఏపీ సర్కార్ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా పౌరవిమానయాన సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ చెప్పారు. ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలోని మరో రెండు ఎయిర్‌పోర్ట్‌ల పేర్ల మార్పునూ ప్రతిపాదించింది. 10 రాష్ట్రాలు 22 ఎయిర్‌పోర్టుల పేర్ల మార్పు కోసం ప్రతిపాదనలు పంపాయని మంత్రి వెల్లడించారు. దర్భంగా ఎయిర్‌పోర్ట్‌ను విద్యాపతి ఎయిర్‌పోర్ట్‌గా మార్చాలని బిహార్ కోరింది. ఉత్తరప్రదేశ్, హరియాణా, కర్ణాటక, మధ్యప్రదేశ్, మణిపూర్, ఉత్తరాఖండ్, పంజాబ్, మహారాష్ట్రలూ ఈ జాబితాలో ఉన్నాయి.




సోషియో ఎకనమిక్ ఔట్‌లుక్

రూ. **14.65** లక్షల కోట్లకు పెరిగిన జీఎస్డీపీ విలువ

తెలంగాణ రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ) విలువ ప్రస్తుత ధరల వద్ద 2022–23లో రూ.13.1 లక్షల కోట్లు ఉండగా, 2023–24లో 11.9 శాతం వృద్ధి రేటుతో రూ.14.64 లక్షల కోట్లకు పెరిగింది. ఇదే కాలంలో దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) విలువ రూ.269.5 లక్షల కోట్ల నుంచి రూ.293.9 లక్షల కోట్లకు పెరిగింది. జాతీయ వృద్ధి రేటు 9.1 శాతం కాగా, రాష్ట్రం దాని కంటే 2.8 శాతం ఎక్కువ వృద్ధి రేటును సాధించి మరోసారి జాతీయ వృద్ధి రేటును అధిగమించిందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జీఎస్డీపీ వృద్ధి రేటులో తమిళనాడు (14.2%), ఉత్తరప్రదేశ్(12.8%) తర్వాత తెలంగాణ మూడో స్థానంలో నిలిచింది. ఇక స్థిర ధరల (2011–12) వద్ద 2023–24లో తెలంగాణ 7.4 శాతం జీఎస్డీపీ వృద్ధి రేటును సాధించి జాతీయ స్థాయిలో ఏడో స్థానంలో నిలిచింది. ఒక నిర్దిష్ట సంవత్సరంలో దేశం/రాష్ట్రంలో ఉత్పత్తి అయిన అన్ని రకాల వస్తువులు, సేవల మొత్తం విలువను జీడీపీ/జీఎస్డీపీగా పరిగణిస్తారు.

2023-24 ముందస్తు అంచనాల ప్రకారం వివిధ రాష్ట్రాల్లో జీఎస్డీపీ వృద్ధిరేటు ఇలా.. (శాతాల్లో)




సోషియో ఎకనమిక్ ఔట్‌లుక్

తలసరి అప్పు రూ. 1.76 లక్షలు

తెలంగాణ ఆవిర్భవించిన నాటికి 2014–15లో రూ.72,658 కోట్లు ఉన్న రాష్ట్ర అప్పులు, 2023–24 నాటికి 824.5 శాతం వృద్ధితో రూ.6,71,757 కోట్లకు పెరిగాయి. ఇదే కాలంలో రాష్ట్ర తలసరి అప్పు సైతం 8.7 రెట్లు పెరిగి రూ.20,251 నుంచి రూ.1,76,360కు చేరింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురువారం శాసనసభలో ప్రవేశపెట్టిన 'తెలంగాణ సోషియో ఎకనమిక్ ఔట్‌లుక్'లో రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయం స్పష్టం చేసింది. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో అప్పులు చేసిన తీరుపై ఈ నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్ర ఆదాయ వృద్ధి రేటుతో పోల్చితే అప్పులు పెరిగిన తీరు చూస్తే.. ఖర్చుల కోసం అప్పులపై తీవ్ర స్థాయిలో ఆధారపడినట్టు స్పష్టం అవుతోంది.

దేశ ఆర్థికాభివృద్ధిలో రాష్ట్ర వాటా పెరుగుదలను ఈ చార్ట్‌లో చూడవచ్చు.



దేశాభివృద్ధిలో తెలంగాణది గణనీయ పాత్ర


భారతదేశ జీడీపీకి రాష్ట్రం అందిస్తున్న చేయూత ఏటేటా పెరుగుతోంది. జీడీపీలో రాష్ట్ర వాటా 2021–22లో 4.8 శాతం ఉండగా, 2022–23లో 4.9 శాతానికి, 2023–24లో 5 శాతానికి చేరింది. రాష్ట్రం ఏటేటా ఆర్థికాభివృద్ధిలో పురోగమిస్తూ దేశాభివృద్ధిలో గణనీయమైన పాత్ర పోషిస్తోందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.



తలసరి ఆదాయంలో దేశం కన్నా మిన్న!

రాష్ట్ర తలసరి ఆదాయం 2022–23లో రూ.3,11,649 ఉండగా, 2023–24లో రూ.3,47,299కు పెరిగింది. అదే సమయంలో జాతీయ తలసరి ఆదాయం రూ.1,69,496 నుంచి 1,83,236కు పెరిగింది. జాతీయ సగటుతో పోల్చితే రాష్ట్ర తలసరి ఆదాయం ఏటా గణనీయంగా వృద్ధి సాధిస్తోంది. జాతీయ తలసరి ఆదాయంతో పోల్చితే 2021–22లో 1.78 రెట్లు, 2022–23లో 1.84 రెట్లు, 2023–24లో 1.9 రెట్లు అధికంగా రాష్ట్ర తలసరి ఆదాయం నమోదైంది. ఆర్థిక రంగంలో ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థికాభివృద్ధి, జనాభాకు సంపద పంపిణీ స్థితిగతులకు సైద్ధాంతిక కొలమానంగా తలసరి ఆదాయాన్ని పరిగణిస్తారు.

2021-22 నుంచి 2023-24 మధ్య రంగాలవారీగా రాష్ట్ర జీఎస్‌వీఏ వృద్ధి రేటు, జాతీయ జీవీఏ వృద్ధి రేటు ఇలా..



ఆర్థికాభివృద్ధికి సేవల రంగం దన్ను

ఆర్థిక వ్యవస్థను వ్యవసాయం–అనుబంధ రంగాలు, పరిశ్రమలు, సేవలు అనే మూడు రంగాలుగా విభజిస్తారు. రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఆర్థిక వ్యవస్థకు సేవల రంగం అత్యధిక చేయూత అందిస్తుండగా, పరిశ్రమలు, వ్యవసాయం–అనుబంధ రంగాలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. రాష్ట్ర స్థూల విలువ జోడింపు (జీఎస్‌వీఏ)కి 2023–24లో సేవల రంగం 65.7% , పరిశ్రమల రంగం 18.5% , వ్యవసాయ–అనుబంధ రంగాలు 15.8% చేయూతనిచ్చాయి. రాష్ట్ర జీఎస్డీపీలో ఈ 3 రంగాల వాటాను ఇది స్పష్టం చేస్తోంది. అయితే వర్షాభావం, కరువు పరిస్థితుల నేపథ్యంలో 2022–23తో పోల్చితే 2023–24లో మూడు రంగాల వృద్ధి రేటు గణనీయంగా తగ్గింది. వ్యవసాయ– అనుబంధ రంగాల వృద్ధి రేటు మరింత క్షీణించింది.



6 గ్యారంటీలకు కోత!

ఓటాన్ అకౌంట్‌లో రూ.53 వేల కోట్లు.. పూర్తి బడ్జెట్‌లో రూ.47 వేల కోట్లే!

- పింఛన్ల పెంపు, యువ వికాసం, మహిళలకు నెలకు రూ.2,500 ఊసే లేదు
- ఇందిరమ్మ ఇళ్లకు రూ.20 వేల కోట్లకు గాను రూ.7 వేల కోట్లే ప్రతిపాదన
- చేయూతకు రూ.23 వేల కోట్లు కావాలి కానీ 14,861 కోట్లతోనే సరి
- ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సరిపడా నిధులు
- 13 అంశాల్లో 8 అంశాలకే కేటాయింపులు

సాక్షి, హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలకు తగినట్టుగా వార్షిక బడ్జెట్ గణాంకాలు కనిపించడం లేదు. ఆరు గ్యారంటీల పేరుతో అమలు చేయాల్సిన 13 అంశాల్లో 8 అంశాలకు బడ్జెట్ కేటాయింపులు చూపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. మరో 5 అంశాల గురించి ప్రస్తావించలేదు. బడ్జెట్ కేటాయింపులు చేసిన 8 అంశాలకు కూడా ఏడాదికి సరిపోయే విధంగా నిధులు చూపెట్టలేదనే చర్చ ఆయా శాఖల్లో జరుగుతోంది. ఆరు గ్యారంటీల్లోని 8 అంశాలకు గాను రూ.47,166 కోట్లు మాత్రమే ప్రతిపాదించింది. దీనికి తోడు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సందర్భంగా ఆరు గ్యారంటీలకు రూ.53 వేల కోట్లను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం, 2024–25 వార్షిక పూర్తి బడ్జెట్ కేటాయింపులకు వచ్చేసరికి రూ.6 వేల కోట్ల కోత విధించింది.

కావాల్సిన దాని కంటే తక్కువగా..

ఆరు గ్యారంటీల్లో భాగంగా రైతుబంధును రైతు భరోసాగా మార్చి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం చేసేందుకు గాను రూ.22,500 కోట్లు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, ఈ ఏడాది రూ.15,075 కోట్లు మాత్రమే కేటాయించారు. చేయూత పథకం కింద రాష్ట్రంలోని 43 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు పింఛన్లు పెంచాలంటే రూ.23 వేల కోట్లు కావాలి. కానీ ఈ పథకం కింద రూ.14,861 కోట్లే చూపెట్టారు. ఇక రాష్ట్రంలో 1.65 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వారిలో దాదాపు 28 లక్షల మంది వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళా, బీడీ కార్మికులుగా పెన్షన్లు పొందుతున్నారు. వీరు కాకుండా మరో 1.3 కోట్ల మంది మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తే రూ.39,900 కోట్లు కావాలి. కానీ ఈ పథకాన్ని ఈసారి బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఈ ఏడాది నిర్మిస్తామని చెప్పిన 4.5 లక్షల ఇళ్లకు (ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున) రూ.22,500 కోట్లు కావాలి. కానీ బడ్జెట్‌లో రూ.7,740 కోట్లే కేటాయించారు. భూమి లేని వ్యవసాయ కార్మికులకు రైతు భరోసా కింద రూ.3,600 కోట్లు కావాల్సి ఉండగా, రూ.1,200 కోట్లు చూపెట్టారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినా గతంలో లాగానే రూ.1,065 కోట్లు కేటాయించారు. వాస్తవంగా దీని అమలుకు రూ.2,500 కోట్లు అవుతుందని అంచనా. మరోవైపు యువ వికాసం లాంటి హామీని కూడా ఈ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. మహాలక్ష్మి కింద అమలవుతున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఎల్పీజీ సిలిండర్లకు సబ్సిడీ, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌కు మాత్రం తగిన మేరకు నిధుల కేటాయింపు చూపెట్టారు.

ఒకే ఏడాది రెండోసారి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత ఒకే సంవత్సరంలో రెండుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డును ఆర్థిక మంత్రి హోదాలో భట్టి సొంతం చేసుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 10న 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టిన భట్టి మళ్లీ గురువారం రెండోసారి అదే సంవత్సరానికి పూర్తి బడ్జెట్ పెట్టారు. ఇక ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు నేతృత్వంలో బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇది 13వ సారి కావడం గమనార్హం. వరుసగా 11 సంవత్సరాలు రెగ్యులర్ బడ్జెట్‌తో పాటు రెండు ఓటాన్ అకౌంట్ బడ్జెట్లు పెట్టిన ఘనత దక్కించుకున్నారు.


ఆరు గ్యారంటీలకు నిధులు (రూ.కోట్లలో) ఇలా..



రైతు భరోసా	చేయూత	ఇందిరమ్మ ఇళ్లు	మహాలక్ష్మి (ఆర్టీసీ)	గృహజ్యోతి	వ్యవసాయ కార్మికులకు రైతు భరోసా
15,075	14,861	7,740	4,084	2,418	1,200

రాజీవ్ ఆరోగ్యశ్రీ	ఎల్పీజీ సబ్సిడీ
1,065	723

మొత్తం రూ. 47,166 కోట్లు




ఈసారి అప్పులు రూ. 62,012 కోట్లు

సాక్షి, హైదరాబాద్: ఈసారి బడ్జెట్‌లో అప్పుల పద్దు అదిరిపోయింది. గత ఏడాది కంటే దాదాపు రూ.10 వేల కోట్లు ఎక్కువగా, మొత్తం రూ.62,012 కోట్లు రుణ సమీకరణ జరగనుంది. గురువారం అసెంబ్లీలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదన గణాంకాలు ఈ మేరకు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది బహిరంగ మార్కెట్‌లో రూ.57,112 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3,900 కోట్లు, ఇతర రుణాల రూపంలో రూ.1,000 కోట్లు సేకరించనున్నట్టు ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఇక గతంలో తీసుకున్న అప్పులకు అసలు, వడ్డీల చెల్లింపు కోసం రూ.30 వేల కోట్లు కేటాయించడం గమనార్హం. ఇందులో రుణం చెల్లింపుల కోసం రూ.13,117.60 కోట్లు, వడ్డీ చెల్లింపులకు రూ.17,729 కోట్లు ప్రతిపాదించారు. మొత్తం రూ.62 వేల కోట్ల రుణ సమీకరణ చేస్తే, అందులో దాదాపు సగం అంటే రూ.30,846 కోట్లు గతంలో తీసుకున్న అప్పులకు గాను అసలు, వడ్డీల చెల్లింపులకే సరిపోతుందని కేటాయింపులు చెబుతున్నాయి. ఇవి పోగా మిగతా రూ.31,166 కోట్ల రుణాలను ఈ ఏడాది వినియోగించుకుంటామని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి.


పెరుగుతున్న అప్పులు, చెల్లింపులు

ఏటేటా అప్పుల చిట్టా పెరిగిపోతుందని గత గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రాబడుల్లో రూ.44,060 కోట్లు రుణాల కింద వస్తే, 2023–24లో రూ.52,576 కోట్లు తీసుకున్నారు. ఈ ఏడాది రూ.62 వేల కోట్లను అప్పుల పద్దు కింద ప్రతిపాదించడం గమనార్హం. అయితే తీసుకునే అప్పుల కంటే చెల్లింపులు ఎక్కువ చేస్తున్నామని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇదే విషయాన్ని వెల్లడించారు. ఈ ఏడాది జూలై 24నాటికి రూ.35,118 కోట్లు అప్పుగా తీసుకుంటే.. గతంలో ఉన్న అప్పులకు అసలు, వడ్డీ చెల్లింపుల కింద రూ.42,892 కోట్లు కట్టామని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతి ఏటా రూ.6,050 కోట్లు అప్పులకు అసలు, వడ్డీ కింద చెల్లించాల్సి ఉండేదని, కానీ ఇప్పుడు నెలకు రూ.5,365 కోట్లు చెల్లిస్తున్నామని వివరించారు.



హైదరాబాద్ అభివృద్ధిపై ప్రభుత్వానిది స్పష్టమైన విజన్

నగర అభివృద్ధికి కేటాయింపులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హర్షం




సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా మార్చేందుకు తెలంగాణ వార్షిక బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించడంతో ప్రభుత్వానికి స్పష్టమైన విజన్ ఉందని పౌరసరఫరాల, నీటిపారుదల శాఖమంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురువారం శాసనసభలో తెలంగాణ బడ్జెట్ 2024–25 ప్రవేశపెట్టిన అనంతరం ఉత్తమ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ బడ్జెట్ హైదరాబాద్ వాసుల జీవన నాణ్యతను పెంపొందించడానికి, ఆర్థిక, సాంస్కృతిక కేంద్రంగా దాని స్థానాన్ని పటిష్టం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తోందని తెలిపారు. 'మెట్రో విస్తరణ ఓల్డ్ సిటీ–శంషాబాద్ విమానాశ్రయంతో సహా కీలక ప్రాంతాలను కలుపుతుంది. నాగోల్, ఎల్బీ నగర్, చాంద్రాయణగుట్ట స్టేషన్‌లను ఇంటర్ చేంజ్‌లుగా అభివృద్ధి చేయాలని, కనెక్టివిటీని మరింత పెంచాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. లండన్‌లోని థేమ్స్ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు తరహాలో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌గా మార్చడానికి రూ.1,500 కోట్లు కేటాయించింది. హైడ్రా ఏర్పాటు దేశానికే ఆదర్శం' అని ఉత్తమ్ తెలిపారు. నీటి పారుదల శాఖకు రూ.22,301 కోట్లు కేటాయించారని, ఈ నిధులతో పెండింగ్‌లో ఉన్న 6 నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తయ్యేలా చూస్తామని వెల్లడించారు.

ఆరు గ్యారంటీలకు హామీపత్రం: రేవంత్



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024–25 వార్షిక బడ్జెట్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలకు హామీపత్రంగా అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేసుకొని బడ్జెట్‌కు రూపకల్పన చేశామన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ గురువారం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'ప్రజల ఆకాంక్షలు, రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమాన్ని సమన్వయం చేసుకొని రూపొందించిన బడ్జెట్ ఇది. ఆరు గ్యారంటీలకు హామీ పత్రం ఈ బడ్జెట్. ఆర్భాటపు అంకెలు కాదు, వాస్తవిక లెక్కల బడ్జెట్ ఇది. కేంద్రం వివక్షం.. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాల మధ్యం తెలంగాణ ఆకాంక్షలు నెరవేర్చేలాం ఈ బడ్జెట్‌ను రూపొందించిన డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖామాత్యులు మల్లు భట్టి విక్రమార్క, ఆయన బృందానికి నా అభినందనలు' అని రేవంత్ పోస్ట్ చేశారు.


సాక్షి, హైదరాబాద్: పేదింటి ఆడబిడ్డ పెళ్లి సాయం కోసం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపులు పెంచింది. 2024–25 వార్షిక సంవత్సరంలో ఈ రెండు పథకాలకు రూ.3,585 కోట్లు కేటాయించింది. గతేడాది ఈ రెండు పథకాలకు రూ.3,210 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ.375 కోట్లు పెరిగింది. కల్యాణలక్ష్మి పథకం కింద అత్యధికంగా బీసీ సంక్షేమ శాఖకు రూ.2,175 కోట్లు కేటాయించింది. తాజా కేటాయింపుల్లో బీసీ సంక్షేమ శాఖకు రూ.175 కోట్లు అదనంగా కేటాయించగా మైనార్టీ సంక్షేమ శాఖకు మాత్రం రూ.200 కోట్లు అధికంగా కేటాయించడం గమనార్హం. మరోవైపు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం లబ్ధిదారులకు ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది. కానీ 2024–25 వార్షిక బడ్జెట్‌లో తులంబంగారం ప్రస్తావన లేకపోవడం గమనార్హం.



కల్యాణలక్ష్మికి కాసుల వరద

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు రూ.3,585 కోట్లు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కేటాయింపులు (రూ.కోట్లలో)



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులలో హోంశాఖకు స్వల్పంగా నిధులు తగ్గాయి. గత బడ్జెట్‌లో రూ.9,599 కోట్లు కేటాయించగా..2024–25 వార్షిక బడ్జెట్‌లో 9,564 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో నిర్వహణ పద్దు కింద రూ.8,659కోట్ల 31 లక్షలు, ప్రగతి పద్దు కింద రూ. 904 కోట్ల 36 లక్షలను కేటాయించారు. తెలంగాణను డ్రగ్స్ రహిత, సైబర్ నేరాల నియంత్రణ రాష్ట్రంగా మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదే పదే స్పష్టం చేస్తున్నందున ఇందుకు అనుగుణంగా ఈ రెండు అంశాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తూ నిధులు కేటాయించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు గత బడ్జెట్‌లో నిధులేమీ కేటాయించకపోగా..ఈ వార్షిక బడ్జెట్‌లో రూ.15 కోట్లు కేటాయించారు. అదేవిధంగా తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు గత బడ్జెట్‌లో రూ.8.50 కోట్లు కేటాయించగా..ఈ బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించారు. అగ్నిమాపకశాఖకు ఈ బడ్జెట్‌లో రూ.26.39 కోట్లు కేటాయించారు. గతేడాది అగ్నిమాపక శాఖకు ప్రగతి పద్దుకింద రూ.17.52 కోట్లు కేటాయించారు. కాగా, ఈసారి జైళ్లశాఖకు నిధులు తగ్గించారు. గత బడ్జెట్‌లో రూ. 35.73 కోట్లు కేటాయించగా..ఈ బడ్జెట్‌లో రూ.16.78 కోట్లు మాత్రమే కేటాయించారు. పోలీస్ అకాడమీకి కూడా ఈసారి నిధులు బాగా తగ్గించారు. గత బడ్జెట్‌లో రూ.6.30 కోట్లు కేటాయింగా, ఈసారి అది రూ.2.84 కోట్లకు తగ్గింది. కౌంటర్ ఇంటెలిజెన్స్, ఆక్టోపస్‌కు రూ.4.94 కోట్లు కేటాయించారు. హోంగార్డుల ఐజీ పద్దు కింద గతంలో కేవలం రూ.10 లక్షలు నిధులు ఉండగా..ఈ సారి బడ్జెట్‌లో అది రూ.50 లక్షలకు పెంచారు.



హోంశాఖకు రూ.9,564 కోట్లు కేటాయింపు

స్వల్పంగా నిధులు తగ్గించిన సర్కార్


సాక్షి, హైదరాబాద్: వస్తుసేవల పన్ను (జీఎస్టీ) రూపంలో రూ.58,594 కోట్లు సమకూరుతాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. రాష్ట్ర జీఎస్టీ (ఎస్జీఎస్టీ) కింద రూ. 50,762 కోట్లు, కేంద్ర జీఎస్టీ (సీజీఎస్టీ) కింద రూ. 7,832 కోట్లు సమకూరుతాయని బడ్జెట్ గణాంకాల్లో పేర్కొంది. గత ఏడాది కేంద్ర జీఎస్టీ కింద రూ.7,205 కోట్లు, రాష్ట్ర జీఎస్టీ కింద రూ.39,295 కోట్లు కలిపి మొత్తం రూ.46,500 కోట్లు సమకూరగా, ఈ సారి అంతకంటే రూ.12 వేల కోట్లు ఎక్కువగా.. మొత్తంగా రూ. 58 వేల కోట్ల పైచిలుకు జీఎస్టీ ఆదాయం వస్తుందని అంచనా వేసింది. కార్పొరేషన్ పన్ను కింద రూ.7,872 కోట్లు, ఆదాయపు పన్ను కింద రూ.9,066 కోట్లు, కస్టమ్స్ కింద రూ.1,157 కోట్లు వస్తాయని కూడా ప్రభుత్వం బడ్జెట్ అంచనాల్లో పేర్కొంది.



జీఎస్టీ కింద రూ. 58 వేల కోట్లు

గత ఏడాది కంటే రూ.12 వేల కోట్లు ఎక్కువ


సాక్షి, హైదరాబాద్: 'ఈ సంవత్సరం 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తాం. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయిస్తాం' అని బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ, ఆ రెండు పనులను ఎలా పూర్తి చేస్తారో మాత్రం స్పష్టతనివ్వలేదు. ఇందిరమ్మ ఇళ్లకు రూ.7,740 కోట్లను ప్రతిపాదించింది. నిజానికి ప్రతిపాదిత సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేయాలంటే రూ.22,500 కోట్ల కంటే ఎక్కువ అవసరం. బడ్జెట్‌లో ప్రతిపాదించిన మొత్తం సమకూర్చగా, తక్కువ పడే మిగతా మొత్తాన్ని అప్పు తెచ్చుకోవాల్సి ఉంటుందని స్పష్టమవుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరు చేసే నిధులను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంటుంది. అయితే ఆ మొత్తం ఎంత వస్తుందో ఇంకా స్పష్టత లేదు. దీంతో కేంద్రం నుంచి కొంత, అప్పుగా భారీ మొత్తం తెస్తేగానీ ఆ ఇళ్లు పూర్తి కావు. మరి మిగిలిపోయిన డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేయాలంటే రూ.4,500 కోట్లు కావాలి. ఈ బడ్జెట్‌లో దాని ఊసే లేదు. ఇక ఔటర్ రింగ్ రోడ్డు అవల హౌసింగ్ బోర్డు కాలనీలను నిర్మిస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈ బడ్జెట్‌లో దాని గురించి ప్రస్తావించలేదు. నిధులు కేటాయించలేదు. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ప్రతిపాదించిన నిధులనే పూర్తిస్థాయి బడ్జెట్‌లో కూడా చూపటం గమనార్హం.




ఇందిరమ్మ ఇళ్లకు అప్పు తేవాల్సిందే

బడ్జెట్‌లో రూ.7,740 కోట్లు కేటాయింపు

తెలంగాణ బడ్జెట్ 2024





సోషియో ఎకనమిక్ ఔట్‌లుక్



వ్యవసాయం జీవనాధారం

రాష్ట్రంలో అత్యధికంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నట్లు సామాజిక ఆర్థిక సర్వే వెల్లడించింది. దేశ సగటుతో పోల్చి చూసినా రాష్ట్రంలో వ్యవసాయంపైనే ఎక్కువగా ఆధారపడినట్లు స్పష్టమవుతోంది. దేశ జనాభాలో సగటున 45.8 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉండగా, అది తెలంగాణలో 47.3 శాతంగా ఉంది. ఇక పరిశ్రమల్లో ఉద్యోగాలు చేస్తూ జీవిస్తున్న వారు దేశ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో ఆరు శాతం మేరకు తక్కువగా ఉండటం గమనార్హం. దేశంలో 25.3 శాతం మంది పరిశ్రమల్లో పనిచేస్తుంటే.. రాష్ట్రంలో 19.7 శాతం మంది పరిశ్రమల్లో చేస్తున్నారు. ఇక సేవల రంగంలో దేశ సగటు 28.9 శాతం అయితే.. రాష్ట్రంలో అది 33 శాతంగా ఉంది. క్రమం తప్పకుండా వేతనం తీసుకునే వేతన జీవులు 2021–22లో 45.1 శాతం ఉంటే.. అది 59.2 శాతానికి పెరిగినట్లు పేర్కొంది. తెలంగాణ దేశంలోని పలు రాష్ట్రాల కంటే ఆర్థిక సూచికల్లో మెరుగ్గా ఉంది.



తప్పనిసరి వ్యయంతో..

తెలంగాణ రాష్ట్ర ద్రవ్య నిర్వహణ ఆందోళనకరంగా ఉన్నట్లు సామాజిక ఆర్థిక సర్వే వెల్లడించింది. 2021–22 సంవత్సరానికి సంబంధించి రెవెన్యూ రశీదులు రూ.1,27,469 కోట్లు కాగా..తప్పనిసరి వ్యయం రూ. 60168 కోట్లుగా ఉంది. ఇది దాదాపు 47 శాతం అని వెల్లడించింది. అత్యధిక ద్రవ్య ఒత్తిడిలో ఉన్న కర్ణాటక (47 శాతం), గుజరాత్ (48 శాతం) సరసన ఉన్నట్లు వివరించింది. తెలంగాణ రెవెన్యూలో సగం నిధులు వేతనాలు, పెన్షన్లు, వడ్డీల చెల్లింపులకు వెళ్తున్నట్లు వివరించింది. తద్వారా ఆర్థిక వెసులుబాటు లేకుండా పోయిందని, అత్యవసర అభివృద్ధి పనులకు వ్యయం చేసే అవకాశం లేకుండా పోయిందని పేర్కొంది.




ఆందోళనకరంగా నిరుద్యోగం

పనిచేసే వయస్సు (15–59) జనాభాలో నిరుద్యోగిత రేటు జాతీయ సగటు కంటే రాష్ట్రంలో అధికంగా ఉంది. జాతీయస్థాయి కన్నా రాష్ట్రంలోని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో సైతం నిరుద్యోగిత రేటు అధికంగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. 2022–23 గణాంకాల ప్రకారం జాతీయ స్థాయిలో నిరుద్యోగిత రేటు 3.4 శాతం ఉండగా, తెలంగాణలో మాత్రం 4.6 శాతంగా నమోదైంది. జాతీయ స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో 2.7 శాతం ఉండగా, తెలంగాణలో 3 శాతంగా నమోదైంది. పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు జాతీయ స్థాయిలో 5.7శాతం ఉండగా, తెలంగాణలో 8 శాతంగా ఉంది.

రుణమాఫీకి భారీ కోత!

రూ.31 వేల కోట్లు అని చెప్పి. రూ.26 వేల కోట్లే కేటాయింపు

- రూ.5 వేల కోట్లు కోత విధించడంతో తదుపరి విడతల రుణమాఫీపై అనుమానాలు
- ఎంతమందికి మాఫీ లబ్ధి అందకుండా పోతుందోనన్న చర్చ
- మొదటి విడతలో రూ.లక్ష లోపు మాఫీ వర్తించకపోవడంపై వెల్లువెత్తిన ఫిర్యాదులు
- రైతు భరోసాలోనూ భారీగా కత్తెర!
- కేవలం రూ.15 వేల కోట్లే కేటాయింపు



సాక్షి, హైదరాబాద్: రుణమాఫీ భారాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందనే విమర్శలు నిజమేనని బడ్జెట్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీకి గాను రూ.31 వేల కోట్లు ఖర్చు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పగా, గురువారం నాటి రాష్ట్ర బడ్జెట్లో రూ.26 వేల కోట్లే కేటాయించడం గమనార్హం. ఏకంగా రూ.5 వేల కోట్లు కోత విధించడంతో.. ఈ మేరకు మాఫీ లబ్ధిదారుల్లో కోత ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మొదటి విడతలో లక్షలాది మందికి జరగని మాఫీ

మొదటి విడత లక్ష రూపాయల రుణమాఫీ సందర్భంగానే అర్హులైన లక్షలాది మంది రైతుల అప్పులు మాఫీ కాలేదనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రేషన్‌కార్డు లేనివారిని అనర్హుల్ని చేయడం, పీఎం కిసాన్ నిబంధనలను కఠినంగా అమలు చేయడం వల్లే రుణమాఫీ జరగలేదనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. తాజాగా ముఖ్యమంత్రి చెప్పిన మొత్తాని కంటే భారీగా నిధులు తగ్గించడం చూస్తే నిబంధనలను ఎంత కఠినంగా అమలు చేస్తున్నారో అర్థమవుతోందని అంటున్నారు. మొదటి విడత రుణమాఫీ కింద లక్ష రూపాయల వరకు రుణాలున్న 11.32 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.6,014 వేల కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇక లక్ష నుంచి రెండు లక్షల రూపాయల వరకున్న రైతులకు రుణమాఫీ జరగాల్సి ఉంది. మొత్తం 39 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్లు మాఫీ చేస్తామని ప్రభుత్వం మొన్నటివరకు చెబుతూ వచ్చింది. కానీ బడ్జెట్‌లో రూ.26 వేల కోట్ల మేరకే కేటాయింపులు జరపడంతో.. తదుపరి విడతల్లో ఎంతమందికి రుణమాఫీ జరుగుతుందో, ఎంత మందికి పథకంతో లాభం లేకుండా పోతుందోనన్న చర్చ జరుగుతోంది. తొలి విడతలో రుణమాఫీ కాని అర్హులైన రైతులు లక్షలాది మంది ఇప్పటికీ ప్రభుత్వానికి ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు.

కౌలు రైతుల ఊసే లేదు

కౌలు రైతుల ఊసే బడ్జెట్లో లేదు. భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ. 1,200 కోట్లు కేటాయించింది. ఈ సొమ్ము కేవలం 10 లక్షల కూలీలకే సరిపోతుందని అంటున్నారు. కాగా రాష్ట్రంలో 25 లక్షల నుంచి 30 లక్షల వరకు రైతు కూలీలు ఉంటారని అంచనా.

రైతు భరోసాకు గతంలో కేటాయించినంతే..

రైతు భరోసాకు కూడా ప్రభుత్వం సరిపడా నిధులు ప్రతిపాదించలేదు. గత ప్రభుత్వం రైతుబంధు కింద ఒక్కో ఎకరానికి ఏడాదికి రూ.10 వేలు ఇచ్చింది. అయితే కాంగ్రెస్ రైతుభరోసా (రైతుబంధు) కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే బడ్జెట్లో ఆ మేరకు నిధులు పెరగకపోవడం గమనార్హం. 2023–24 వానాకాలం సీజన్‌కు అప్పటి ప్రభుత్వం రూ.7,625 కోట్లు ఇచ్చింది. యాసంగి సీజన్ నాటికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అంతే సొమ్ము ఇస్తామని ప్రకటించి అమలు చేసింది. అంటే ఆ సంవత్సరం రైతుబంధు కింద రూ.15,250 కోట్లు రైతులకు అందజేసినట్లు వ్యవసాయ శాఖ అధికారుల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. కాగా రైతు భరోసాకు ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పినా, బడ్జెట్లో మాత్రం రూ. 15,075 కోట్లు మాత్రమే కేటాయించింది. దీనిని బట్టి చూస్తే రైతు భరోసాలోనూ భారీగా కోతలు ఉంటాయనే విషయం అర్థమవుతోందని అంటున్నారు. గతంలో కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములకూ రైతుబంధు వర్తింపజేశారని.. అలాంటి వాటిని గుర్తించి తీసేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పంటల బీమా కవరేజీకి కోత!

ఈ సీజన్ నుంచి రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. రైతులు చెల్లించాల్సిన ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించారు. ఇందుకోసం రూ.3 వేల కోట్లు అవసరం అని అంచనా వేశారు. కానీ బడ్జెట్లో పంటల బీమాకు రూ.1,300 కోట్లే కేటాయించారు. దీనిని బట్టి చూస్తే పంటల బీమా కవరేజీ చాలా తక్కువ ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక రైతు బీమాకు రూ.1,589 కోట్లు, పంటల బోనస్‌కు రూ.1,800 కోట్లు కేటాయించారు. రూ.500 చొప్పున బోనస్ సొమ్ము ఏమేరకు సరిపోతుందో అనుమానమేనని అంటున్నారు. వ్యవసాయానికి మొత్తం రూ.72,659 కోట్లు కేటాయించామన్న ప్రభుత్వం.. అందులో విద్యుత్ సబ్సిడీకి రూ.11,500 కోట్లు, నీటిపారుదల శాఖ రూ.10,829 కోట్లు, ఇతర పథకాలకు రూ.3,366 కోట్లు కలిపింది. ఆయిల్ పామ్ సాగును లక్ష ఎకరాలకు పెంచాలని నిర్ణయించారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ కింద రూ.1,358 కోట్లు కేటాయించారు. రైతు వేదికలకు రూ.43 కోట్లు, రైతులకు విత్తనాల సరఫరాకు రూ.106 కోట్లు ప్రతిపాదించారు.

ఆరోగ్యానికి తగ్గిన 'శ్రీ'

గత బడ్జెట్‌లో రూ.1,101కోట్లు.. ఇప్పుడు రూ.1,065 కోట్లు



సాక్షి, హైదరాబాద్: రెండ్రోజుల క్రితమే ఆరోగ్యశ్రీ చికిత్సల ప్యాకేజీని పెంచారు. కొత్తగా మరికొన్ని వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చారు. అలాగే ఆరోగ్యశ్రీ కింద కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారు. కానీ ఈ బడ్జెట్లో మాత్రం ఆరోగ్యశ్రీకి నిధులను తగ్గించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతఏడాది బడ్జెట్లో ఆరోగ్యశ్రీకి రూ.1,101 కోట్లు కేటాయించగా, ఇప్పుడు రూ.1,065 కోట్లకు పరిమితం చేశారు. వాస్తవంగా చికిత్సల ప్యాకేజీ, కవరేజీ పెంపుతో అధికంగా నిధులు కేటాయించాల్సి ఉందన్న చర్చ జరుగుతోంది. ఇక మొత్తంగా వైద్య, ఆరోగ్యశాఖ బడ్జెట్ కేటాయింపులు కూడా తగ్గాయి. ఈ బడ్జెట్‌లో వైద్యరంగానికి ప్రభుత్వం రూ.11,468 కోట్లు కేటాయించింది. గత ఏడాది బీఆర్ఎస్ సర్కారు వైద్య, ఆరోగ్య శాఖకు బడ్జెట్లో రూ.12,161 కోట్లు కేటాయించింది. గతేడాది బడ్జెట్‌తో పోలిస్తే ఈ శాఖ కేటాయింపులు రూ.693 కోట్లు తగ్గాయి. కాగా బడ్జెట్‌లో నర్సింగ్ కాలేజీల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ కాలేజీల నిర్మాణం కోసం రూ.200 కోట్లు కేటాయించారు.

మెడికల్ కాలేజీలకు రూ.542 కోట్లు..

మెడికల్ కాలేజీల నిర్మాణం కోసం రూ.542 కోట్లు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు రూ.260 కోట్లు, బోధనాస్పత్రుల్లో డయాగ్నస్టిక్స్, పరికరాల కోసం రూ.360 కోట్లు కేటాయించారు. వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల అప్‌గ్రేడింగ్ కోసం రూ.249 కోట్లు, ఆయా ఆస్పత్రుల్లో వైద్య పరికరాల కొనుగోలుకు రూ.115 కోట్లు కేటాయించారు. అలాగే ఈ ఆస్పత్రుల్లో శానిటరీ, రోగుల సేవలకు మరో రూ.114 కోట్లు కేటాయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతం కోసం రూ. 51 కోట్లు, అమ్మఒడి కోసం రూ. 141 కోట్లు, 102 వాహనాల కోసం రూ. 17.62 కోట్లు, 108 కోసం రూ.19.53 కోట్లు, 104కు రూ.21 కోట్లు ఇచ్చారు. నిమ్స్‌లో అత్యవసర వైద్య పరికరాల కోసం రూ.49 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడికి ఆరోగ్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కలిగిన డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డును జారీ చేసే విధానాన్ని త్వరలోనే ప్రవేశ పెడుతున్నామని ప్రభుత్వం ప్రకటించింది. దీనికోసం ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించింది. అలాగే ప్రగతి పద్దులో వైద్యవిద్య సంచాలకులకు రూ.2,656 కోట్లు, ప్రజారోగ్య సంచాలకులకు రూ.558 కోట్లు, వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమానికి రూ.1,762 కోట్లు, ఆయుష్‌కు రూ.117 కోట్లు, ఔషధాల కొనుగోళ్ల కోసం రూ. 377 కోట్లు, మాతాశిశు సంరక్షణ కిట్ (ఎంసీహెచ్– గతంలో కేసీఆర్ కిట్)కు రూ. 200 కోట్లు కేటాయించారు.

ప్రతిపక్ష నేతగా తొలిసారి అసెంబ్లీకి



సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్షనేత హోదాలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తొలిసారిగా శాసనసభలో అడుగుపెట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రవేశపెడుతున్న సమయంలో కేసీఆర్ బంజారాహిల్స్‌లోని నందినగర్ నివాసం నుంచి అసెంబ్లీకి వచ్చారు. సాధారణ ఎమ్మెల్యేలు వచ్చే రెండో నంబర్ గేట్ నుంచి అసెంబ్లీకి వచ్చిన ఆయన పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి నేరుగా తనకు కేటాయించిన చాంబర్‌లోకి వెళ్లారు. శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. శాసనసభలోకి వెళ్లిన కేసీఆర్ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు అభివాదం చేసి ప్రధాన ప్రతిపక్ష నాయకుడికి కేటాయించిన సీటులో కూర్చొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వచ్చి కేసీఆర్‌ను కలిశారు. సభలో అప్పటికే భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం సాగుతుండగా, కేసీఆర్ ఆసక్తిగా వింటూ పాయింట్స్ నోట్ చేసుకున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ అంశంపై బడ్జెట్ ప్రసంగం సాగుతున్న సమయంలో ఎమ్మెల్యే హరీశ్‌రావును పిలిచి చర్చించడం కనిపించింది. భట్టి బడ్జెట్ ప్రసంగం పూర్తికాకముందే కేసీఆర్ ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీ హాలు నుంచి బయటకు వచ్చారు. మీడియాపాయింట్ ఎక్కడ అని ఎమ్మెల్యేలను అడిగారు. నేరుగా మీడియా పాయింట్‌కు చేరుకొని ఎమ్మెల్యేలతో కలిసి బడ్జెట్‌పై తన అభిప్రాయం తెలియజేశారు. కాగా 20ఏళ్ల తర్వాత కేసీఆర్ మీడియా పాయింట్ నుంచి మాట్లాడడం ఇదే తొలిసారి అని సీనియర్ పాత్రికేయులు వ్యాఖ్యానించారు. 2001లో టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిన తర్వాత సిద్దిపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన అప్పట్లో కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లో చేరిన రేగులపాటి పాపారావుతో కలిసి మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడిన విషయాలను వారు గుర్తు చేశారు.

చదువుకు పెరిగిన పద్దు



విద్యారంగానికి రూ. 21,292 కోట్లు

గతేడాదికన్నా రూ. 2,199 కోట్లు అదనం

సాక్షి, హైదరాబాద్: విద్యారంగానికి 2024–25 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ. 21,292 కోట్లు కేటాయించింది. 2023–24లో కేటాయించిన రూ. 19,093 కోట్లతో పోలిస్తే ఈసారి రూ. 2,199 కోట్లు ఎక్కువ కేటాయింపులు చేయడం విశేషం. మొత్తం బడ్జెట్‌లో గతేడాది విద్యారంగం కేటాయింపులు 6.57 శాతం మేర ఉండగా తాజాగా అవి 7.31 శాతానికి పెరిగాయి. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న అంతర్జాతీయ పాఠశాలల ఏర్పాటుకు ఈ బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించారు. విశ్వవిద్యాలయాలకు గతంలో మాదిరిగానే రూ. 500 కోట్లు కేటాయించారు. విద్య పరిశోధన, శిక్షణ వ్యవహారాల రాష్ట్ర మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) నిధులు రూ. 425.54 కోట్ల నుంచి రూ. 705 కోట్లకు పెంచారు. సెకండరీ పాఠశాలలకు కేటాయింపులు రూ. 390 కోట్ల నుంచి రూ. 925 కోట్లకు పెంచారు. గురుకుల విద్యకు 2023లో రూ. 662 కోట్లు కేటాయించగా ఈసారి రూ. 694 కోట్లు కేటాయించారు. మధ్యాహ్న భోజనం వంటి కేంద్ర పథకాలకు కేటాయింపులు దాదాపు రూ. 300 కోట్ల వరకూ పెరిగాయి. కళాశాల విద్యకు స్వల్పంగా రూ. 60 కోట్లు పెంచారు. అయితే పెరిగిన బడ్జెట్‌లో 90 శాతం వేతనాలకే సరిపోతుందని విద్యావేత్తలు అంటున్నారు.

ఈ నిధులు ఏ మూలకు?

విద్యకు 15 శాతం నిధులిస్తామని మేనిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అందులో సగం కూడా కేటాయించలేదు. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నా నిర్మాణాలకు నిధులు ఇవ్వలేదు. 3వ తరగతి వరకు అంగన్‌వాడీల్లో కలపాలన్న ప్రతిపాదన సమర్థనీయం కాదు.

– చావా రవి (యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

విభాగాల వారీగా కేటాయింపులు (రూ. కోట్లలో)

విభాగం	2022-23	2024-25
ఉన్నత విద్య	3,001	3,350
పాఠశాల విద్య	16,092	17,942

రాష్ట్రావతరణ జరిగిన తొలి ఏడాదికి, తాజాగా విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు (రూ. కోట్లలో)

సంవత్సరం	మొత్తం బడ్జెట్	విద్యా రంగానికి	శాతం
2014-15	1,00,637	10,963	10.89
2024-25	2,91,159	21,292	7.31

అంకెల గారడీ, ఆర్భాటం తప్ప ఏమీ లేదు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: అభూతకల్పన, అంకెల గారడీ, ఆర్భాటం తప్ప రాష్ట్ర బడ్జెట్‌లో ఏమీ లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్.. రెండు పార్టీలూ దొందు దొందే అని నిరూపితమైందన్నారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నిటినీ తుంగలో తొక్కింది. ప్రతీ ఏడాది రైతులకు సీజన్‌ముందు ఇవ్వాల్సిన పంటపెట్టుబడి (రైతు బంధు/రైతు భరోసా) సాయానికి బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. కానీ బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తలేదు' అని గురువారం ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. దళిత సంక్షేమానికి కేటాయించాల్సిన బడ్జెట్ రూ.21,072 కోట్ల నుంచి రూ.7,638 కోట్లకు, ఎస్టీలకు కేటాయించాల్సిన బడ్జెట్ రూ. 4,365 కోట్ల నుంచి రూ.3,969 కోట్లకు తగ్గిపోయిందన్నారు.

6 గ్యారంటీలను గంగలో కలిపే కోతల బడ్జెట్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను గంగలో కలిపే కోతలు, ఎగవేతల బడ్జెట్ అని గురువారం 'ఎక్స్'వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 'ఆకాంక్షలను పట్టించుకోని ఆంక్షల పద్దు. వాగ్దానాలను గాలికొదిలేసే వంచనల బడ్జెట్. డిక్లరేషన్లను బుట్టదాఖలు చేసిన దోకేబాజ్ బడ్జెట్. విధానం లేదు.. విషయం లేదు.. విజన్ లేదు. పేర్ల మార్పులతో ఏమార్చిన డొల్ల బడ్జెట్. అన్నదాతలకు సున్నం. ఆడబిడ్డలకు అన్యాయం. మహాలక్ష్మిలకు మహా మోసం. అవ్వాతాతలకు, దివ్యాంగులకు, నిరుపేదలకు, నిస్సహాయులకు మొండిచేయి చూపే బడ్జెట్. పెన్షన్ల పెంపు మాటెత్తలేదు. దళితులకు దగా. గిరిజనులకు మోసం బడ్జెట్. అంబేడ్కర్ అభయహస్తం ఊ సులేదు. బడుగు, బలహీన వర్గాలకు భరోసా లేదు. వృత్తి కులాలపై కత్తికట్టారు. నిరుద్యోగులకు రూ.4 వేల భృతి పత్తా లేదు. విద్యార్థులపై కూడా వివక్షే. రూ.5 లక్షల భరోసా కార్డు ముచ్చట లేదు. హైదరాబాద్ అభివృద్ధిపై శ్రద్ధ లేదు. మహానగర మౌలిక వసతులకు నిధుల్లేవ్. నేతన్నకు చేయూత లేదు. ఆత్మహత్యపాలైన కుటుంబాలను ఆదుకోవాలన్న మానవీయ కోణమేలేదు. మొత్తంగా పస దిశలేని బడ్జెట్' అని కేటీఆర్ పోస్ట్ చేశారు.

ఆత్మస్తుతి.. పరనింద

రాష్ట్రాన్ని తిరోగమనంలో నడిపే బడ్జెట్ : హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్ ఆత్మస్తుతి, పరనింద మాదిరిగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు విమర్శించారు. అరకొర కేటాయింపుల ద్వారా ప్రజల ఆశలను వమ్ము చేశారని, హామీలకు కేటాయింపులు లేవని ధ్వజమెత్తారు. గురువారం బడ్జెట్ ప్రకటన అనంతరం ఆయన బీఆర్ఎస్ఎల్పీలో మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీలకు కేటాయింపులు లేవని, అభివృద్ధి అగమ్యగోచరమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని తిరోగమనంలో నడిపే బడ్జెట్ ఇదన్నారు. ఎన్నికల్లో గ్యారంటీల గారడీ చేసిన వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీలకు కేటాయింపులు లేవని, ఈ ప్రభుత్వ మొదటి బడ్జెట్లో ఎలాంటి దశాదిశాలేదని అన్నారు. తమని అప్పులు తెచ్చామని నిందించిన మంత్రి భట్టి విక్రమార్క రూ.57 వేల కోట్లు అప్పు తెస్తామన్నారని, తమ ప్రభుత్వం తెచ్చిన దానికంటే రూ.17 వేల కోట్లు ఎక్కువ తెస్తామన్నారని దుయ్యబట్టారు.


మహా నిరాశ: ఆరు గ్యారంటీలను ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయిందని, మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 గురించి ప్రస్తావించలేదని హరీశ్‌రావు చెప్పారు. మహాలక్ష్మి పథకంపై బడ్జెట్ మహా నిరాశ కలిగించిందన్నారు. 4 వేల పింఛన్ గురించి బడ్జెట్‌లో ప్రస్తావన లేదని, పేదలైన అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగుల ఆశలను ప్రభుత్వం నీరుగార్చిందని విమర్శించారు. విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, కొత్త రేషన్ కార్డులు, జాబ్ కేలండర్, నిరుద్యోగ భృతి వంటి వాటి ప్రస్తావన లేదన్నారు. గొల్లకుర్మలకు మోసం చేశారని, గతేడాది 50 కోట్ల బడ్జెట్ పెడితే ఇప్పుడు సున్నా కేటాయించారన్నారు. ఆగస్టు 15 కల్లా రూ.31 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేస్తామని చెప్పారని, కానీ బడ్జెట్లో రూ.15,470 కోట్లు మాత్రమే కేటాయించారని ధ్వజమెత్తారు. ఇరిగేషన్‌కు గత ఏడాది తాము రూ.26, 825 కోట్లు కేటాయిస్తే ఇప్పుడు రూ. 22,300 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. దళితబంధు, గిరిజన బంధు ఊసులేదన్నారు. గత బడ్జెట్లో ఎక్సైజ్ ఆదాయం రూ.18,470 కోట్లు అయితే ఈసారి రూ.25,617 కోట్లు ప్రతిపాదించారని, అంటే అదనంగా రూ. 7 వేల కోట్ల కోసం గల్లీకో వైన్ షాప్ పెడతారా? అని ప్రశ్నించారు.

ఇది అప్పుల బడ్జెట్, బడాయి బడ్జెట్: ఏలేటి



సాక్షి, హైదరాబాద్: 'ఇది అప్పుల బడ్జెట్, బడాయి బడ్జెట్, గొప్పల బడ్జెట్' అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి ఎద్దేవా చేశారు. 'అరకొరగా ప్రణాళిక వ్యయం – కేవలం రూ.33 వేల కోట్లు.. ఇక అభివృద్ధి ఎలా సాధ్యం? ప్రగతి పట్టని, హామీల అమలుపై చిత్తశుద్ధి లేని, రాష్ట్రాన్ని దివాళా తీయించే బడ్జెట్ 'అని మండిపడ్డారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, డా.పాల్వాయి హరీశ్‌బాబు, ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తాలతో కలిసి ఆయన మాట్లాడుతూ, 'బడ్జెట్ నిండా అప్పులే కనిపించాయి. రాష్ట్ర అప్పులను మరింత పెంచే బడ్జెట్ ఇది. 'రూ.62 వేల కోట్ల అప్పులు చేస్తున్నట్టు గొప్పగా చెప్పుకున్నారు. ఇంత భారీగా అప్పు చేస్తున్న ప్రభుత్వం అభివృద్ధికి ఖర్చు చేస్తున్నది కేవలం రూ.33 వేల కోట్లే. మరి దీన్ని అప్పుల బడ్జెటు అనకుండా అభివృద్ధి బడ్జెట్ అంటారా'అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఇరిగేషన్ కోసం చేసిన అప్పులకు చెల్లించాల్సిన కిస్తీలకే ఈ నిధులు సరిపోతాయేమోనని ఏలేటి ఎద్దేవా చేశారు.








పౌరసరఫరాల శాఖకు రూ.3,836 కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పౌరసరఫరాల శాఖకు రూ.3,836 కోట్లు కేటాయించారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈసారి కేటాయింపులు స్వల్పంగా పెరిగాయి. 2022–23లో ఈ శాఖకు రూ.2,213 కోట్లు కేటాయించగా.. 2023–24లో రూ.3,001 కోట్లు కేటాయించారు. ఈ సారి గత సంవత్సరం కన్నా రూ.835 కోట్లు అదనంగా కేటాయించడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద ఎల్పీజీ సబ్సిడీ కోసం రూ.723 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలోని 39.33 లక్షల కుటుంబాలకు ప్రతి గ్యాస్ సిలిండర్‌పై రూ.500 చొప్పున సబ్సిడీగా ఇస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సంవత్సరానికి 3 సిలిండర్లకు రూ.500 చొప్పున సబ్సిడీ ఇస్తే రూ.590 కోట్లు ఖర్చవుతాయి. అదే 4 సిలిండర్లు ఇస్తే రూ.786 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది.



అటవీశాఖకు రూ.1,063 కోట్లు

హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖకు సంబంధించి రూ.1,063.87 కోట్లు ప్రతిపాదించారు. ఇందులో అటవీ, పర్యావరణ శాఖలోని వివిధ అంశాలకు చేసిన కేటాయింపులు ఇలా ఉన్నాయి. పీసీసీఎఫ్, హెచ్‌వోడీకి శాఖాపరంగా పలు విధుల నిర్వహణకు సంబంధించి రూ.876 కోట్లు (రూ.162.13 కోట్లు సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్స్ కలిపి) ప్రతిపాదించారు. ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు రూ.102.99 కోట్లు, జూపార్కులకు రూ.12 కోట్లు, అఫారెస్టేషన్ ఫండ్ రూ.5 కోట్లు, ప్రాజెక్ట్ టైగర్‌కు రూ.5.21 కోట్లు ప్రతిపాదించారు.



ఇంధన శాఖకు రూ.16,410 కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంధన శాఖకు బడ్జెట్ కేటాయింపులు గణనీయంగా పెరిగాయి. 2023–24లో శాఖకు రూ.12,727 కోట్లను కేటాయించగా, 2024–25 బడ్జెట్‌లో రూ.16,410 కోట్లకు కేటాయింపులను ప్రభుత్వం పెంచింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఇతర కేటగిరీలకు రాయితీపై విద్యుత్ సరఫరాకు గతేడాది తరహాలోనే ఈ ఏడాదీ రూ.8,260 కోట్లను కేటాయించింది. ఉదయ్ పథకం కింద రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల రుణాలను ప్రభుత్వం టేకోవర్ చేసుకోవడానికి గతేడాది రూ.500 కోట్లను కేటాయించగా, ఈసారి రూ.250 కోట్లకు తగ్గించింది. ప్రతి నెలా పేదల గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు అమల్లోకి తెచ్చిన గృహ జ్యోతి పథకానికి మరో రూ.2418 కోట్లను కేటాయించింది. ట్రాన్స్‌కో, డిస్కంలకు ఆర్థిక సహాయం కింద రూ.1509.40 కోట్లను కేటాయించింది. గత ఐదు నెలల్లో గృహ జ్యోతి పథకం అమలుకు రూ.640 కోట్లను ప్రభుత్వం ఇప్పటికే డిస్కంలకు చెల్లించింది. ఈ పథకం కింద 46,19,236 కనెక్షన్లకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇస్తోంది.

కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలపై వివక్ష: దాసు సురేశ్

సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌లో బీసీలకు సబ్‌ప్లాన్ లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లో వివక్ష కొనసాగిందని బీసీ రాజ్యాధి కార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ ఆవేదన వ్యక్తంచేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎన్నడూ ప్రకటించని విధంగా కాంగ్రెస్ బీసీలకు ప్రస్తుత బడ్జెట్‌లో రూ.9,200 కోట్లను ప్రకటించినప్పటికీ బీసీ జనాభాకు ఈ బడ్జెట్ అనుగుణంగా లేకపోవడం విమర్శలకు తావిస్తుందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 5 ఏళ్లలో బీసీలకు లక్షకోట్లు ప్రకటిస్తామని, బీసీ నిధులకు సబ్‌ప్లాన్ అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రముఖులు చెప్పడంతో బీసీ ప్రజలు గంపెడు ఆశతో ఎదురుచూశామని సురేశ్ తెలిపారు.

పల్లెకు.. తగ్గిన ప్రాధాన్యం


పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు	ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఈ శాఖకు
రూ. 29,816 కోట్లు	రూ. 40,080 కోట్లు

దానితో పోలిస్తే దాదాపు రూ. 10 వేల కోట్ల మేర తగ్గిన కేటాయింపులు

పెన్షన్ల కోసం రూ. 14,628.91 కోట్లు ప్రతిపాదన.. పెంచిన పెన్షన్ల అమలుపై అస్పష్టత

→ వార్షిక బడ్జెట్‌లో 'పల్లె'కు కాస్త ప్రాధాన్యం తగ్గినట్లు కనిపిస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరంగా 2024–25 బడ్జెట్‌లో రూ. 29,816 కోట్లు కేటాయించారు. అందులో పంచాయతీరాజ్ శాఖకు రూ. 9,341.56 కోట్లు, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ. 1,317.95 కోట్లను ప్రతిపాదించగా ఇతర పథకాల కింద వచ్చే గ్రాంట్లు, ఇతర నిధులను కలిపి మొత్తంగా రూ. 29,816 కోట్లు ప్రతిపాదించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఈ శాఖకు ఏకంగా రూ. 40,080 కోట్లు కేటాయించగా ఈసారి కేటాయింపులు సుమారు రూ. 10 వేల కోట్లు తగ్గడం గమనార్హం.

- సాక్షి, హైదరాబాద్



➤ ఈ శాఖ పరిధిలోకి వచ్చిన కేటాయింపుల విషయానికొస్తే 2024–25 బడ్జెట్‌లో చేయూత (ఆసరా పింఛన్లు) పెన్షన్ల కోసం రూ. 14,628.91 కోట్లు ప్రతిపాదించారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు సహా వివిధ కేటగిరీల పెన్షన్లను రూ. 2,016 నుంచి రూ.4 వేలకు, దివ్యాంగులకు రూ. 4 వేల నుంచి రూ. 6 వేలకు పెంపు అమలును ఎప్పటి నుంచి ప్రారంభిస్తారనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటివరకు ఉన్న పరిస్థితిని బట్టి చూస్తే మాత్రం ప్రభుత్వానికి ఉన్న ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా పెంచిన పెన్షన్ల అమలు ఇప్పుడప్పుడే ఉండకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పెంచిన పెన్షన్ల అమలు లేనట్టేనా?

ప్రస్తుతం దివ్యాంగులకు నెలకు రూ. 4 వేల చొప్పున, వివిధ కేటగిరీల వారికి రూ. 2,016 చొప్పున చెల్లించేందుకు నెలకు రూ. 950 కోట్ల చొప్పున ఏడాదికి రూ.11,400 కోట్లు ఖర్చవుతోంది. ఇప్పుడు బడ్జెట్‌లో చేయూత పెన్షన్ల కోసం రూ. 14,628.91 కోట్లను ప్రతిపాదించడాన్నిబట్టి రూ. 3,228.91 కోట్లు అధికంగా కేటాయించారు. పెంచిన పెన్షన్ల అమలుకు రూ. 23 వేల కోట్ల దాకా (నెలకు రూ. 1,910 కోట్లు) అవసరమవుతాయి. అయితే ఈ బడ్జెట్‌ను పెంచిన పెన్షన్లకు అనుగుణంగా ఖర్చు చేస్తారా లేక బడ్జెట్ కేటాయింపులకే పరిమితమవుతారా అన్నది వేచిచూడాల్సి ఉందంటున్నారు. పెంచిన చేయూత పెన్షన్లను ఆగస్టు 15 నుంచి అమలు చేసేందుకు ప్రభుత్వపరంగా సిద్ధమవుతున్నట్లు పంచాయతీరాజ్ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

ఇతర కేటాయింపులు..

➤ గ్రామీణాభివృద్ధిశాఖకు (కమిషనర్ కార్యాలయం) రూ. 12,820 కోట్లు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) రూ. 295 కోట్లు, సీ డీ అండ్ పంచాయతీలు రూ. 3,117 కోట్లు, గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం గ్రాంట్ల కింద రూ. 1,142 కోట్లు ప్రతిపాదించారు. దీంతోపాటు డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాల కోసం రూ. 750 కోట్ల మేర కేటాయింపులు చేశారు. అలాగే మహిళా సంఘాల సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే 'ఇందిరా మహిళాశక్తి పథకం'కోసం రూ. 50.41 కోట్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 10 లక్షల జీవితబీమా కోసం 'ఇందిరా జీవిత బీమా'కు రూ. 96.53 కోట్లు ప్రతిపాదించారు. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణకు రూ. 120 కోట్లు కేటాయించారు. గ్రామీణ తాగునీటి సరఫరా (మిషన్ భగీరథ) కోసం రూ. 3046.26 కోట్లు, గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ. 72 కోట్లు, రోడ్లు, బ్రిడ్జీల నిర్మాణానికి రూ. 20 కోట్లు కేటాయించారు.

ప్రస్తుతం వివిధ కేటగిరీలవారీగా 'భరోసా'పెంఛన్లు పొందుతున్న వారి సంఖ్య

(వృద్ధులు, ఇతర కేటగిరీలవారికి నెలకు రూ. 2,016 చొప్పున, దివ్యాంగులకు రూ. 4 వేల చొప్పున)



వృద్ధులు	15,81,630
వితంతువులు	15,54,525
దివ్యాంగులు	5,05,836
బీడీ కార్మికులు	4,24,292
ఒంటరి మహిళలు	1,42,252
గీత కార్మికులు	65,196
నేత కార్మికులు	37,051
ఎయిడ్స్ రోగులు	35,670
బోదకాలు బాధితులు	17,995
డయాలిసిస్ రోగులు	4,337
మొత్తం	43,70,751

ప్రత్యేక అభివృద్ధికి భారీ నిధి..

ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద కేటాయింపు	ఎస్సీఎస్డీఎఫ్ కింద
రూ.50,180.13 కోట్లు	రూ.33,124.04 కోట్లు
2023-24 బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే.. తగ్గుదల	ఎస్టీఎస్డీఎఫ్ కింద
రూ.1,803 కోట్లు	రూ.17,056.09 కోట్లు

దళితబంధుకు చెక్... కొత్తగా అంబేడ్కర్ అభయహస్తం

సాక్షి, హైదరాబాద్: దళిత, గిరిజన ప్రత్యేక అభివృద్ధి నిధికి కేటాయింపులు భారీగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.50,180.13 కోట్లు కేటాయించింది. గతేడాది చేపట్టిన కేటాయింపులతో పోలిస్తే కాస్త తగ్గినట్లు కనిపించినప్పటికీ... కార్యక్రమాల వారీగా పరిశీలిస్తే భారీ కేటాయింపులే జరిగినట్లు కనిపిస్తోంది. ప్రత్యేక అభివృద్ధి నిధి కేటాయింపులు 2023-2024 బడ్జెట్ కంటే రూ.1803 కోట్లు తగ్గాయి. 2024–25 బడ్జెట్‌లో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్సీఎస్డీఎఫ్) కింద రూ.33124.04 కోట్లు కేటాయించగా... ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్టీఎస్డీఎఫ్) కింద రూ. 17056.09 కోట్లు కేటాయించారు. 2023–24లో ఎస్సీఎస్డీఎఫ్‌లో దళితబంధు కింద రూ.17700 కోట్లు కేటాయించగా... వాటిలో పైసా ఖర్చు చేయలేదు. తాజాగా దళితబంధు పథకాన్ని అటకెక్కించిన ప్రభుత్వం... ఆ స్థానంలో అంబేడ్కర్ అభయ హస్తం పేరిట కొత్త పథకాన్ని తీసుకొస్తోంది. ఈ పథకం కింద ప్రస్తుత వార్షిక సంవత్సరానికి రూ.2 వేల కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద ఒక్కో దళిత కుటుంబానికి గరిష్ఠంగా రూ.12 లక్షలు ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. అయితే ఈ పథకానికి సంబంధించి ఇప్పటివరకు విధివిధానాలు ఖరారు కాలేదు.



గత కేటాయింపుల్లో ఖర్చు 48 శాతమే...

2023–24 బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద ప్రభుత్వం రూ.51983.09 కోట్లు కేటాయించింది. కానీ ఇందులో ఖర్చు చేసింది రూ.25048కోట్లు మాత్రమే. గతబడ్జెట్‌లో ఎస్సీ నిధి కింద రూ.36750.48 కోట్లు కేటాయించగా... రూ.14649 కోట్లు ఖర్చు చేశారు. అదేవిధంగా ఎస్టీ నిధి కింద రూ.15232.61 కోట్లు కేటాయించగా.. రూ.10399 కోట్లు ఖర్చు చేశారు. గత బడ్జెట్‌లో కేటాయించిన మొత్తంలో కేవలం 48 శాతం మాత్రమే ఖర్చు చేయడం గమనార్హం.

కేటగిరీ	2018-19	2019-20	2020-21	2021-22	2022-23	2023-24	2024-25
ఎస్సీ ఎస్డీఎఫ్	16,452.79	12,400.22	16,534.97	21,306.84	33937.75	36750.48	33124.04
ఎస్టీ ఎస్డీఎఫ్	9,693.11	7,184.86	9,771.28	12,304.22	13412.62	15232.61	17056.09

పురపాలకశాఖకు.. రూ. 15,594 కోట్లు

అందులో హైదరాబాద్‌కే రూ.10వేల కోట్లు

ఔటర్ రింగ్‌రోడ్డు లోపల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

2023-24లో పురపాలక శాఖకు రూ. 11,372 కోట్లు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో పురపాలక శాఖకు భారీగా నిధులు దక్కాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.15,594 కోట్లు కేటాయించారు. 2023–24 బడ్జెట్‌లో కేటాయించింది రూ.11,372 కోట్లే. కాగా ఈసారి బడ్జెట్ కేటాయింపుల్లో హైదరాబాద్‌లో చేపట్టే అభివృద్ధి పనులకే అత్యధికంగా రూ. 10వేల కోట్లు ప్రకటించడం గమనార్హం. రానున్న మునిసిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ గ్రేటర్ హైదరాబాద్‌కు భారీగా నిధులు కేటాయించారన్న వాదన ఉంది.

హైదరాబాద్ అభివృద్ధిపై సీఎం స్పెషల్ ఫోకస్

ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు ఇప్పటికే పలు ప్రతిపాదనలు చేశారు. ఓఆర్‌ఆర్ లోపల ఉన్న జీహెచ్‌ఎంసీ, ఇతర కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీలను కలిపి జీహెచ్‌ఎంసీ పరిధిలోకి తేవాలని సీఎం ఆలోచన. ఈ పరిధిలోనే రాబోయే పదేళ్లలో రూ.1.50లక్షల కోట్లు వెచ్చించి అభివృద్ధి చేయాలని ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం ప్రతిపాదించారు. ఇందులో మూసీ రివర్ ఫ్రంట్, నాలాల అభివృద్ధి, మెరుగైన నీటిసరఫరా, మెట్రో విస్తరణ, ఓఆర్‌ఆర్‌కు ఇరువైపులా అభివృద్ధి, హైడ్రా ప్రాజెక్టుతో పాటు రీజినల్ రింగ్‌రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) వంటివి ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అయినా ఈ అభివృద్ధి పనులు కొనసాగించాలని నిర్ణయించినట్టు రెండురోజుల క్రితం తన నివాసంలో జరిగిన మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే ఈ 2024–25 బడ్జెట్‌లో కేవలం హైదరాబాద్ అభివృద్ధికే రూ. 10వేల కోట్లు కేటాయించారు. వచ్చే జనవరినాటికి హైదరాబాద్ శివారు కార్పొరేషన్లు, మునిసిపాలిటీల పాలకమండళ్ల పదవీకాలం ముగియనుంది. ఏడాదిన్నరలో జీహెచ్‌ఎంసీ పదవీకాలం కూడా ముగియనున్న నేపథ్యంలో ఓఆర్‌ఆర్ లోపల ఉన్న అన్ని పాలకమండళ్ల పరిధి నిర్వహణకు ఎలాంటి ప్రణాళికలు చేయాలనే అంశంపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. ఇందులో భాగంగానే ఓఆర్‌ఆర్ లోపల అభివృద్ధికి రూ.10వేల కోట్లు ఈ ఏడాదిలో వెచ్చించనున్నట్టు స్పష్టమవుతోంది.



ఇతర జిల్లాల్లోని పురపాలికలకు...

హైదరాబాద్, రంగారెడ్డి పాత ఉమ్మడి జిల్లాలు మినహా మిగతా 8 ఉమ్మడి జిల్లాల్లోని పురపాలక సంస్థల్లో రూ. 5,594 కోట్లు వెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో ప్రధానమైన 100 మునిసిపాలి టీలతో పాటు పాత కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, రామగుండం కార్పొరేషన్లపై ఫోకస్ పెట్టనున్నట్టు సమాచారం.

సాగునీటికి కటకటే

గతేడాదితో పోల్చితే తగ్గిన నిధుల ప్రవాహం
నీటిపారుదల శాఖకు రూ.22,301 కోట్ల కేటాయింపులు
సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.10,829 కోట్ల కేటాయింపులు

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖకు నిధుల కేటాయింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం కోత పెట్టింది. 2023–24 బడ్జెట్‌లో రూ.26,885 కోట్లు ఇవ్వగా, 2024–25 బడ్జెట్‌లో రూ.22,301 కోట్లే కేటాయించారు. కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టుల నిర్మాణానికి చేసిన రుణాల తిరిగి చెల్లింపులకు కేటాయింపులను ప్రభుత్వం గణనీయంగా తగ్గించింది. మరోవైపు నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి రూ.10,829 కోట్లు కేటాయించింది. గతేడాది వీటికి రూ.9381 కోట్లు మాత్రమే ఇచ్చారు.



ప్రాథమ్యాలకు నిధుల కరువే..

రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమ్యాలకు అనుగుణంగా వచ్చే మూడేళ్లలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులపై 2024–25లో రూ.19,287 కోట్లు ఖర్చు చేయాలని నీటిపారుదల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసుకోగా, బడ్జెట్‌లో మాత్రం ప్రభుత్వం ఆశించిన మేరకు కేటాయింపులు జరపలేదు. నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులకు రూ.10,829 కోట్లు కేటాయించగా, మిగిలిన నిధులు కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి తదితర ప్రాజెక్టుల నిర్మాణం కోసం చేసిన రుణాల చెల్లింపులు, ఉద్యోగుల జీతభత్యాలకు వెళ్లనున్నాయి.

రుణాల చెల్లింపులకు నిధుల కోత..

కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, ఇతర ప్రాజెక్టుల నిర్మాణం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తెలంగాణ రాష్ట్ర జల వనరుల సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ డబ్ల్యూఆర్‌ఐడీసీ)తో పాటు ఇతర మార్గాల ద్వారా రుణాలను సమీకరించింది. ఈ రుణాలను తిరిగి చెల్లించడానికి 2023–24 బడ్జెట్‌లో రూ.15,773 కోట్లు ప్రతి పాదించగా, తాజా బడ్జెట్‌లో రూ.9951 కోట్లకు కేటాయింపులను ప్రభుత్వం తగ్గించింది. కాళేశ్వరం కార్పొరేషన్‌కు రూ.12,500 కోట్లు కేటాయించగా, తాజాగా రూ.6914.54 కోట్లకు కేటాయింపులు తగ్గాయి. ఇక టీఎస్ డబ్ల్యూఆర్ ఐడీసీకి కేటాయింపులు రూ.3200కోట్ల నుంచి రూ.2962.47 కోట్లకు తగ్గాయి. ఈ రుణాల తిరిగి చెల్లింపుల గడువును పొడిగించి వాటి కిస్తీల సంఖ్యను సైతం పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రుణాల తిరిగి చెల్లింపులకు కేటాయింపులను కోత పెట్టింది.

కేటగిరీల వారీగా ప్రాజెక్టులకు కేటాయింపులు ఇలా ఉన్నాయి..

భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు	రూ.8476.48 కోట్లు
మధ్య తరహా ప్రాజెక్టులకు	రూ.953.21
మైనర్ ఇరిగేషన్‌కు	రూ.857.73
వరదల నియంత్రణ, డ్రైనేజీ	రూ.282.24

ప్రాజెక్టు	2024-25 బడ్జెట్ కేటాయింపులు(రూ.కోట్లలో)
ఎస్సారెస్పీ ప్రాజెక్టు దశ-1	140
ఎస్ఎల్‌బీసీ	800
నెట్టెంపాడు	105
కల్వకుర్తి	715
ఫ్లడ్ ఫ్లో కెనాల్	265.21
ఎల్లంపల్లి	349.66
దేవాదుల	245
ప్రాణహిత-చేవెళ్ల	248.99
మంచిర్యాలకు వరద రక్షణ గోడలు	100
చిన్న కాళేశ్వరం	200
దిగువ పెన్‌గంగా	133.83
పాలమూరు-రంగారెడ్డి	1285
కాళేశ్వరం	1676.46
సీతారామ	687
సీతారామ ఏపీపీ పనులు	111.62
నాగార్జునసాగర్ లిఫ్టు	500
డిండి లిఫ్టు	300
కుప్టి	234
కోయిల్‌సాగర్	429.86
సంగంబండ	188.07
మొడికుంటవాగు	86.68
మిషన్ కాకతీయ	273.45
చెరువుల నిర్మాణం, పునరుద్ధరణ	207.87
రాజీవ్ బీమా	13.94

తెలంగాణ బడ్జెట్ 2024



సోషియో ఎకనమిక్ ఔట్‌లుక్

తలసరి ఆదాయంలో రంగారెడ్డి జిల్లా టాప్‌లో నిలిచింది. 2022-23లో రంగారెడ్డి జిల్లా రూ.9,46,862 తలసరి ఆదాయంతో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవగా, రూ.4,94,033తో హైదరాబాద్ రెండో స్థానంలో, రూ.3,22,394తో సంగారెడ్డి జిల్లా మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోనే అత్యల్పంగా వికారాబాద్ జిల్లా రూ.1,80,241 తలసరి ఆదాయాన్ని కలిగి ఉంది.

జిల్లా	తలసరి ఆదాయం
రంగారెడ్డి	9,46,862
హైదరాబాద్	4,94,033
సంగారెడ్డి	3,22,394
మేడ్చల్-మల్కాజ్‌గిరి	2,95,514
జయశంకర్ భూపాలపల్లి	2,71,555
యాదాద్రి భువనగిరి	2,67,605
భద్రాద్రి కొత్తగూడెం	2,64,408
నల్లగొండ	2,62,330
మహబూబ్‌నగర్	2,61,346
మెదక్	2,55,263



రాహుల్ మాటిచ్చినట్టే బడ్జెట్

రాహుల్ గాంధీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకొనే విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉంది. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.72,659 వేల కోట్లు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కరే.

– తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ మంత్రి



వాస్తవానికి దగ్గరగా..

ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ వాస్తవానికి దగ్గరగా ఉంది. ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేశాం. భవిష్యత్తులో కూడా వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తాం. కేసీఆర్‌కు దమ్ముంటే బడ్జెట్ మీద చర్చకు రావాలి. కేసీఆర్ తిన్నదంతా కక్కిస్తాం.

– టి.రామ్మోహన్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే



వ్యవసాయానికి ప్రాధాన్యం

ఇది ప్రజా సంక్షేమ, రైతు బడ్జెట్. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యా, వైద్యం, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చింది. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది.

– మదన్‌మోహన్‌రావు, ఎమ్మెల్యే



బీఆర్‌ఎస్‌ది అంకెల గారడే

కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల పాటు ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం కాగితాలకే పరిమితమైంది. మా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చింది. గతంలో వైద్యం, విద్యను సర్వనాశనం చేశారు. ఈ సారి వైద్యం, విద్య కోసం పెద్ద పీట వేశారు.

– కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే

మహాలక్ష్మికే సరి!



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీని బలోపేతం చేస్తామని ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్న మాటలకు, బడ్జెట్‌లో చూపిన లెక్కలకు పొంతన కుదరటం లేదు. గురువారం శాసనసభకు సమర్పించిన బడ్జెట్ ప్రతిపాదనల్లో ఆర్టీసీకి రూ.4,084.43 కోట్లను ప్రకటించారు. ఈ మొత్తాన్ని మహాలక్ష్మి పథకానికి కేటాయిస్తున్నట్టుగానే చూపారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహిళల ఉచిత ప్రయాణ పథకానికి ఊతం ఇవ్వటానికే బడ్జెట్ కేటాయింపులు పరిమితమైనట్టు కనిపిస్తోంది. కేటాయింపుల్లో నేరుగా మహాలక్ష్మి పథకానికి కేటాయింపులుగా రూ.3,082.53 కోట్లను చూపారు. ఇక ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.631.04 కోట్లు, ఎస్టీ సబ్ ప్లాన్ కింద రూ.370.86 కోట్లు చూపారు. వీటిని కూడా మహాలక్ష్మికి కేటాయింపులుగానే పేర్కొన్నారు. దీంతో బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం ఆ పథకానికే ఖర్చు చేస్తారన్నట్టుగా ఉంది.

కొత్త బస్సులు, బకాయిలకు నిధులు ఎలా?

ఆర్టీసీకి బడ్జెట్‌లో రూ.4,084 కోట్లు

పెదవి విరుస్తున్న కార్మిక నేతలు

బకాయిలకు ఏం చేస్తారు?

ఆర్టీసీ ప్రస్తుతం భవిష్యనిధి సంస్థకు, ఆర్టీసీ సహకార పరపతి సంఘానికి దాదాపు రూ.1,800 కోట్ల వరకు బకాయి పడింది. ఆ బకాయిలు చెల్లించటం లేదన్న ఆగ్రహంతో ఇటీవల భవిష్యనిధి సంస్థ ఆర్టీసీ ప్రధాన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసిన విషయం తెలిసిందే. ఆర్టీసీ హైకోర్టును ఆశ్రయించి ఫ్రీజ్‌పై స్టే పొందింది. ఆ స్టే గడువు తీరితే సమస్య మళ్లీ మొదటికొచ్చే ప్రమాదం పొంచి ఉంది. బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు వెసులుబాటు కల్పించటంతో మహిళా ప్రయాణికుల సంఖ్య రెట్టింపైన విషయం తెలిసిందే. దీంతో బస్సులు సరిపోక కొత్తవి కొనాల్సి వస్తోంది. అవసరమైనన్ని కొత్త బస్సులు సమకూరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ వీటన్నింటికి చాలినన్ని నిధులు మాత్రం బడ్జెట్‌లో ప్రతిపాదించకపోవడంతో కార్మిక నేతలు పెదవి విరుస్తున్నారు. రాయితీ పాస్‌లకు సంబంధించి రూ.950 కోట్లు, ఇతరత్రా అవసరాలకు కావాల్సిన వాటితో కలుపుకొని రూ.1,782 కోట్లపై స్పష్టత లేకపోవటం ఆందోళకరమని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీకి రూ.1,500 కోట్లు ప్రతిపాదించింది. ఆ మొత్తానికి సంబంధించి రూ.వేయి కోట్ల వరకు బకాయిలు ఉండిపోయినట్టు సమాచారం. వాటిని ఎలా సర్దుబాటు చేస్తారని కార్మిక సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

రోడ్లు బాగుపడేదెలా?

కొన్నేళ్లుగా రాష్ట్రంలో రోడ్ల నిర్వహణ గాడి తప్పింది. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్లు, జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు నాలుగు వరసల రోడ్ల నిర్మాణ ప్రణాళికలో భాగంగా కొన్ని చోట్ల పనులు జరగటంతో కొత్త రోడ్లు అందుబాటులోకి వచ్చాయి. కానీ, ప్రతి ఏడెనిమిదేళ్లకోసారి చేపట్టాల్సిన రెన్యువల్స్‌ను గాలికొదిలేశారు. ఈ తరుణంలో తాజా బడ్జెట్‌లో పెద్దమొత్తంలో నిధులు కేటాయిస్తారన్న అంచనా ఏర్పడింది. కానీ దానిని తలకిందులు చేస్తూ రోడ్లకు అత్తెసరు నిధులే కేటాయించారు. రోడ్లు భవనాల శాఖ పరిధిలోని రోడ్ల నిర్వహణకు రూ.888 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. కొత్త రోడ్ల నిర్మాణానికి రూ.606 కోట్లు కేటాయించారు. ఇవి రోడ్లను బాగు చే యటం, అవసరమైన ప్రాంతాల్లో కొత్త రోడ్ల నిర్మాణానికి ఎలా సరిపోతాయో ప్రభుత్వానికే తెలియాలని అంటున్నారు. ఇక రీజినల్ రింగ్ రోడ్డుకు రూ.1,525 కోట్లు కేటాయించారు. ఇవి భూసేకరణ పద్దు కిందకే ఖర్చు కానున్నాయి.

వెనుకబడిన వర్గాలకు చేయూత!

సాక్షి, హైదరాబాద్:

రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చింది. నిధుల కేటాయింపును గణనీయంగా పెంచింది. బీసీ సంక్షేమ శాఖకు గత బడ్జెట్‌లో రూ.6,229 కోట్లు ఇవ్వగా.. ఈసారి సుమారు రూ.3 వేల కోట్లు అదనంగా రూ.9,200.32 కోట్లను కేటాయించింది. వాస్తవానికి కొన్నేళ్లుగా బీసీ కార్పొరేషన్‌తోపాటు ఎంబీసీ కార్పొరేషన్, బీసీ ఫెడరేషన్లకు బడ్జెట్ కేటాయింపులు ఆశాజనకంగా లేవని.. ఈసారి ఊరట కలిగించేలా కేటాయింపులు ఉన్నాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- వడ్డెర, కృష్ణబలిజ పూసల, వాల్మీకి బోయ, భట్రాజ, కుమ్మరి, శాలివాహన, సగర కో-ఆపరేటివ్ ఫెడరేషన్లకు, మేదర కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, విశ్వబ్రాహ్మణ కో-ఆపరేటివ్ కార్పొరేషన్లకు రూ.50కోట్ల చొప్పున మొత్తం రూ.450 కోట్లు కేటాయించారు.
- తెలంగాణ తాడీ టాపర్స్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్‌కు రూ.68 కోట్లు.
- ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.400 కోట్లు, చేనేతకారుల సహాయానికి రూ.450 కోట్ల గ్రాంటు..
- నాయీబ్రాహ్మణ కో-ఆపరేటివ్ ఫెడరేషన్‌కు రూ.100 కోట్లు, వాషర్‌మెన్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్‌కు రూ.150 కోట్లు..
- ముదిరాజ్, యాదవ, కుర్మ, మున్నూరు కాపు, పద్మశాలి, పెరిక, లింగాయత్, మేర, గంగపుత్ర, ఈబీసీ వెల్ఫేర్ బోర్డులకు రూ.50 కోట్ల చొప్పున కేటాయించారు.
- నీరా పాలసీకి రూ.25 కోట్ల గ్రాంటు ఇచ్చారు.
- మైనారిటీ సంక్షేమ శాఖకు కూడా కేటాయింపులు పెరిగాయి. గత బడ్జెట్‌లో మైనారిటీ సంక్షేమ శాఖకు రూ.2,200 కోట్లు ఇవ్వగా.. ఈసారి రూ.798 కోట్లు అదనంగా రూ.3,002.60 కోట్లు కేటాయించారు.
- మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు ఈసారి రూ.2,736 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో ఇచ్చిన రూ.2,131 కోట్లతో పోలిస్తే ఇది రూ.605 కోట్లు అదనం.
- ఇక ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాల కోసం అన్ని సంక్షేమశాఖలకు కలిపి రూ.2,600 కోట్లు కేటాయించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.200 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ పథకాల కింద బీసీ సంక్షేమ శాఖకు అధికంగా రూ.1,650 కోట్లు కేటాయించారు.

బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి రూ.9,200 కోట్ల కేటాయింపు

గత ఏడాదితో పోలిస్తే సుమారు రూ.3 వేల కోట్లు పెంపు

మైనార్టీ సంక్షేమానికి రూ.802 కోట్లు పెంచి.. రూ.3,003 కోట్ల కేటాయింపు

కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు కూడా గణనీయంగా నిధులు



సంక్షేమ శాఖలకు కేటాయింపులివీ..

శాఖ	నిధులు (రూ.కోట్లలో)
ఎస్సీ సంక్షేమం	28,724.53
గిరిజన సంక్షేమం	15,123.91
బీసీ సంక్షేమం	9,200.32
మైనారిటీ సంక్షేమం	3,002.60
మహిళా, శిశు సంక్షేమం	2,736.00
కార్మిక సంక్షేమం	881.86

కాంగ్రెస్ + 6 గ్యారంటీలు + రాష్ట్ర బడ్జెట్ = గాడిద గుడ్డేనా?: బండి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ + 6 గ్యారంటీలు + రాష్ట్ర బడ్జెట్ = గాడిద గుడ్డేనా? అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. గాడిద గుడ్డు పెట్టడం ఎంత నిజమో.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడం అంతే నిజమనడానికి ఈ బడ్జెట్ నిదర్శనమని ఎద్దేవాచేశారు. 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులకు.. మీరిచ్చిన అలవి కాని హామీలకు మధ్య ఉన్న అంతరాన్ని గ్రహించండి. కాంగ్రెస్ హామీలను అమలు చేయడం అసాధ్యమని బడ్జెట్‌లోనే తేలింది'అని అన్నారు. కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ పేరు రాలేదని.. రాష్ట్రానికి ఘోర అన్యాయం జరిగిందని ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్ నేతలు.. రాష్ట్ర బడ్జెట్‌లో ఏ ఒక్క జిల్లా, నియోజకవర్గం ప్రస్తావన చేయలేదు కదా, దీనికేం సమాధానం చెబుతారు? అని ప్రశ్నించారు. 'ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క.. మీరు చదివింది బడ్జెట్టా లేక అప్పుల పత్రమా..?'అని బండి సంజయ్ గురువారం ఒక ప్రకటనలో నిలదీశారు. 'అప్పులున్నందున హామీలను అమలు చేయలేమని చేతులెత్తేస్తున్నారా? మీరిచ్చిన 6 గ్యారంటీలకు బడ్జెట్‌లో నిధులెందుకు కేటాయించలేదు?'అని ప్రశ్నించారు. బడ్జెట్ కేటాయింపులకు సరిపడా ఆదాయం ఎక్కడి నుంచి సమకూర్చుకుంటారో లెక్కా పత్రం చూపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జాతీయవృద్ధి రేటు కంటే తెలంగాణ వృద్ధిరేటు తక్కువగా నమోదు కావడమే పదేళ్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనకు అద్దం పడుతోందన్నారు. 'మంత్రుల మధ్యే సఖ్యత లేదు.. తెలంగాణలో సమసమాజం స్థాపిస్తామనడం శతాబ్దం జోక్'అన్నారు.

బీజేపీ మెప్పు కోసమే బడ్జెట్‌పై కేసీఆర్ విమర్శలు

మాజీ సీఎంకు మంత్రి సీతక్క కౌంటర్



సాక్షి, హైదరాబాద్: బీజేపీతో ఒప్పందంలో భాగంగానే అసెంబ్లీకి వచ్చిన మొదటి రోజే రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ సీఎం కేసీఆర్ టార్గెట్ చేస్తున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. బీజేపీ మెప్పుకోసమే కేసీఆర్ రాష్ట్ర బడ్జెట్‌ను విమర్శిస్తున్నారన్నారు. గురువారం అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో ఆమె ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ, ఆరు నెలల తర్వాత కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు రావడమే అందుకు నిదర్శనమన్నారు. కేంద్ర బడ్జెట్‌పై స్పందించని కేసీఆర్, రాష్ట్ర బడ్జెట్ మీద మాట్లాడటం విడ్డూరంగా వుందని ఆమె ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగినా స్పందించని కేసీఆర్... రాష్ట్ర బడ్జెట్‌ను విమర్శించడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. తెలంగాణకు ద్రోహం చేసిన కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ అసెంబ్లీ తీర్మానం చేస్తే కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి చర్చలో ఎందుకు పాల్గొనలేదని సీతక్క ప్రశ్నించారు.

చీల్చి చెండాడుతా అంటే.. చూస్తూ ఊరుకుంటామా?

మాజీ సీఎం కేసీఆర్‌పై మంత్రి పొన్నం ఫైర్



సాక్షి, హైదరాబాద్: 'ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతా అని మాజీ సీఎం కేసీఆర్ అంటే.. మేము చూస్తూ ఊరుకుంటామా' అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం సచివాలయ మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బడ్జెట్ సందర్భంగా అసెంబ్లీలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. ఏడు నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేసీఆర్ విమర్శిస్తున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై ఆయన చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు లోయర్, మిడ్‌మానేరు డ్యామ్ పరిశీలనకు వెళ్తున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి కరీంనగర్ జిల్లాకు ఎన్ని టీఎంసీల నీరు ఇచ్చారో, ముంపు గ్రామాల సమస్య ఎందుకు పరిష్కరించలేదో వివరణ ఇచ్చిన తర్వాతే వారు పర్యటనకు వెళ్లాలని హితవుపలికారు. రెండు టీఎంసీల కోసం తీసుకున్న ప్రణాళిక అమలు కాకముందే.. రెండు వేల కోట్లతో మూడో టీఎంసీ అంటే అది ఎవరి లబ్ధి కోసమో చెప్పాలని నిలదీశారు. ధరణి పేరుతో రైతులను నరకయాతన పెట్టింది మరిచావా కేసీఆర్ అని ప్రభాకర్ ప్రశ్నించారు.

తగ్గిన మూలధన వ్యయం

గత ఏడాది కంటే రూ.4 వేల కోట్లు తక్కువగా ప్రతిపాదన

ద్రవ్యలోటు రూ.49,255 కోట్లు


సాక్షి, హైదరాబాద్: ఈసారి బడ్జెట్‌లో మూలధన వ్యయం తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే రూ.4 వేల కోట్లు తక్కువగా రూ.33,486.50 కోట్లను 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే 2023–24లో మూలధన వ్యయం కింద రూ.37,524.70 కోట్లు కేటాయించగా, అంతకంటే ఎక్కువగా రూ.44,252.68 కోట్లు ఖర్చయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ మొత్తంతో పోలిస్తే మూలధన వ్యయ ప్రతిపాదన రూ.9 వేల కోట్ల వరకు తగ్గింది. ఇక ఈసారి కూడా ద్రవ్యలోటు భారీగానే నమోదవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. రూ.49,255.41 కోట్ల ద్రవ్యలోటు చూపెట్టింది. గత ఏడాది రూ.49,372.84 కోట్ల ద్రవ్యలోటు నమోదు కాగా.. ఈసారి గత ఏడాది కంటే కొంచెం తక్కువగా ద్రవ్యలోటును అంచనా వేయడం గమనార్హం. రెవెన్యూ మిగులు విషయానికి వస్తే ఖర్చులన్నీ పోను రూ.297.42 కోట్లు మిగులుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. గత ఏడాది రూ.4,881 కోట్ల రెవెన్యూ మిగులు ఉంటుందని అంచనా వేసినా, సవరించిన అంచనాల్లో అది రూ.1,704.89 కోట్లకు తగ్గింది. దీంతో ఈసారి కూడా మిగులు తగ్గవచ్చనే అంచనా మేరకు రూ.300 కోట్లలోపు చూపెట్టడం గమనార్హం.

'పన్ను'లపైనే గంపెడాశలు!


బడ్జెట్ రాబడుల్లో 50 శాతానికిపైగా పన్నుల ఆదాయం నుంచే చూపిన ప్రభుత్వం

గత ఏడాది సవరించిన అంచనాలు రూ.1.35 లక్షల కోట్లు.. ఈసారి ప్రతిపాదన రూ.1.64 లక్షల కోట్లు

ఏకంగా రూ.29 వేల కోట్లు అదనంగా రాబట్టుకోవడంపై దృష్టి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వివిధ పన్నుల ఆదాయంపైనే గంపెడాశలు పెట్టుకుంది. ప్రజల నుంచి వసూలు చేసే పన్నుల ద్వారా ఆదాయం రాబట్టుకోవడంపై కాంగ్రెస్ సర్కారు దృష్టిపెట్టినట్టు బడ్జెట్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం రూ.2.91లక్షల కోట్లతో బడ్జెట్ పెట్టిన ప్రభుత్వం.. అందులో ఏకంగా రూ.1.64 లక్షల కోట్లను (50 శాతానికిపైగా) పన్నుల రూపంలోనే సమీకరించుకుంటామని పేర్కొంది. ఇది గత ఏడాది సవరించిన అంచనాలతో పోలిస్తే.. రూ.29 వేల కోట్లు (20 శాతం) అదనం కావడం గమనార్హం. ఇందులో కేంద్ర పన్నుల్లో వాటా కింద వచ్చే రూ.26,216 కోట్లు పోను మిగతా రూ.1.38 లక్షల కోట్లను అమ్మకపు పన్ను, ఎక్సైజ్, ఇతర పన్నుల రూపంలో సమకూర్చుకుంటామని ప్రభుత్వం వెల్లడించింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా గత ఏడాది రూ.14,295.56 కోట్లురాగా.. ఈసారి రూ.18,228.82 కోట్లు వస్తాయని అంచనా వేశారు. దీన్ని బట్టి ఈ ఏడాదిలోనే భూముల విలువల సవరణ చేసే అవకాశం ఉంది. ఇక ఎక్సైజ్ ఆదాయాన్ని గత ఏడాది సవరించిన అంచనాల్లో రూ.20.298 కోట్లుగా చూపగా.. ఈసారి రూ.5వేల కోట్లు అదనంగా రూ.25,617 కోట్లు వస్తుందని ప్రతిపాదించారు. ఎక్సైజ్ ఆదాయ లక్ష్యం పెంపు నేపథ్యంలో.. ఈసారి మద్యం ధరలు పెరగొచ్చన్న చర్చ జరుగుతోంది. మొత్తమ్మీద అమ్మకపు పన్ను ద్వారా గత ఏడాది రూ.57,394.46 కోట్లురాగా, ఈసారి 18శాతం అదనంగా రూ.68,273.73 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. జీఎస్టీ, ఎక్సైజ్, అమ్మకపు పన్ను, వాహనాలు, సరుకులు, ప్రయాణికుల రవాణా, ఇతర పన్నుల రూపంలో ఈ మొత్తం సమకూరనుంది.



(నోట్: పన్నుల ఆదాయంతోపాటు పన్నేతర ఆదాయం, గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లను కలిపి మొత్తం రాబడుల కింద పరిగణిస్తారు. తాజా బడ్జెట్‌లో రూ.2,21,242.23 కోట్లు రాబడులు వస్తాయని ప్రతిపాదించారు. ఇది 2023-24లో రూ.1,69,089.59 కోట్లు, 2022-23లో రూ.1,27,468.63 కోట్లు మాత్రమే)

భూముల అమ్మకంపై చర్చ!

ఈసారి పన్నేతర ఆదాయం ఏకంగా రూ.35,208.44 కోట్ల మేర వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొంది. గత ఏడాది ఇది రూ.23,819.50 కోట్లుకాగా.. ఈసారి 50శాతం అదనంగా ప్రతిపాదించారు. అంతకుముందు 2022–23 ఆర్థిక సంవత్సరంలో పన్నేతర ఆదాయం రూ.8,857.42 కోట్లు మాత్రమే. అప్పుడు పన్నేతర ఆదాయం పెంచిన తరహాలోనే ఇప్పుడూ పెంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వ భూముల అమ్మకాలకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమవుతోందనే చర్చ జరుగుతోంది. దీనిపై ఆర్థిక మంత్రి భట్టిని ప్రశ్నించగా.. భూములు అమ్ముతామని తాము ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఆదాయం పెంపు కోసం తమకు అనేక మార్గాలున్నాయని, అవన్నీ ఇప్పుడు వెల్లడించలేమని పేర్కొన్నారు.

ఆశల పల్లకి దిగని 'గ్రాంట్లు'

కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులపైనా రాష్ట్ర ప్రభుత్వం భారీగానే ఆశలు పెట్టుకున్నట్టు బడ్జెట్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గ్రాంట్ల కింద ఈసారి రూ.21,636 కోట్లు వస్తాయని చూపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఏడెనిమిదేళ్లుగా గ్రాంట్ ఇన్ ఎయిడ్ నిధులను ఆశించడం, కేంద్రం మొండిచేయి చూపడం రివాజుగా మారింది. గత ఏడాది కేంద్రం రూ.13,179.21 కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద ఇస్తుందని బడ్జెట్‌లో అంచనా వేయగా.. రూ.9,729.91 కోట్లు మాత్రమే వచ్చాయి. అంతకు ముందు ఏడాది రూ,.8,619.26 కోట్లు మాత్రమే అందాయి. అయినా ఈసారి భారీగా అంచనా వేయడం గమనార్హం.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 26 । జూలై । 2024

కమిషనరేట్లకు కాస్త ఊరట

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్లకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.308.84 కోట్లు కేటాయించింది. వీటిలో హైదరాబాద్‌కు రూ.276.44 కోట్లు, సైబరాబాద్, రాచకొండలకు రూ.20 కోట్లు, రూ.9.4 కోట్లు చొప్పున దక్కాయి. మేడిపల్లిలో నిర్మాణంలో ఉన్న రాచకొండ పోలీసు కమిషనరేట్ భవనానికి ఈసారీ నిరాశే ఎదురైంది. దీని నిర్మాణం గరిష్ఠంగా 12 నెలల్లో పూర్తి చేయాలని ఉన్నతాధికారులు భావిస్తుండగా ప్రభుత్వం మాత్రం నామమాత్రంగా కేవలం రూ.లక్ష కేటాయించి చేతులు దులుపుకొంది. పునర్విభజన తర్వాత మూడు కమిషనరేట్లలో అనేక పోలీసుస్టేషన్లు, ఏసీపీ కార్యాలయాలు తాత్కాలిక ప్రాతిపదికన కొన్ని భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి తోడు అనేక క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్నాయి. ఈ బడ్జెట్లోనూ ప్రభుత్వం వీటికి సరైన కేటాయింపులు చేయలేదు.



సలాం.. గ్రేటర్

జీ హుజూర్.. దస్ హజార్ కరోడ్

గ్రేటర్ హైదరాబాద్‌కు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం పెద్దపీట వేసింది. కోటి జనాభా దాటిన నగరానికి ఆర్థికశాఖ నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తగిన కేటాయింపులు చేశారు. మహానగరంలో విస్తరిస్తున్న జనాభా అవసరాలకనుగుణంగా రవాణా, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, రహదారులు, ఫ్లై ఓవర్లు, నాలాలతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు, విపత్తుల నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, తదితర పనులకు ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. మూసీపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నందున దానికి తగిన నిధులు కేటాయించింది. మహానగరంలో ప్రజలకు వివిధ సేవలందించే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్‌బోర్డు, మెట్రోరైలు తదితర సంస్థలకు తగిన విధంగా నిధులు కేటాయించింది. మున్సిపల్ పరిపాలన విభాగానికి కేటాయించింది రూ.15,594 కోట్లయితే అందులో రూ.10వేల కోట్లు నగరానికే కావడం విశేషం. గత సంవత్సరాలతో పోలిస్తే.. ఈ బడ్జెట్ బాగుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే.. ఇవి కాగితాల్లో అంకెలుగా మాత్రమే కాకుండా నిజంగా నిధులు విడుదల చేసి పనులు చేయాలనే డిమాండ్లు సైతం వ్యక్తమవుతున్నాయి. –సాక్షి, సిటీబ్యూరో

మహా నగరానికి మహా నిధులు..

- ఔటర్‌రింగ్‌రోడ్ వరకూ మహా నగరంగా పరిగణిస్తున్న ప్రభుత్వం వివిధ కార్యక్రమాల కోసం వివిధ సంస్థలకు కేటాయించిన నిధులిలా ఉన్నాయి.
- జీహెచ్ఎంసీలో రహదారులు, ఫ్లై ఓవర్లు, నాలాల వంటి భారీ పనుల కోసం గతంలో ఎస్సార్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ తదితర పేర్లతో పనులు చేయగా, నగరాభివృద్ధికి సంబంధించిన పనులన్నింటినీ 'హై సిటీ' (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పథకంలో చేర్చారు.
- ఓఆర్ఆర్ పరిధి వరకు తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్(టీసీయూఆర్)గా పేర్కొంటూ ప్రభుత్వం అక్కడి వరకు విపత్తు నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, తదితర పనుల కోసం ప్రత్యేకంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)ను ఏర్పాటు చేయడం తెలిసిందే. దీనికి అవసరమైన నిధులు ఏ సంస్థ ఇవ్వాలనే సమస్యకు చెక్ పెడుతూ, దానిని ప్రత్యేక సంస్థగా ప్రత్యేకాధికారాలతో ఏర్పాటు చేయడంతో పాటు దాని కోసం బడ్జెట్‌లో రూ. 200 కోట్లు కేటాయించింది.
- వివిధ రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో పారిశుద్ధ్యం, మురుగునీరు, ట్రాఫిక్ వంటి సమస్యల పరిష్కారంతో పాటు పెరుగుతున్న జనాభా కనుగుణంగా శివార్లలో టౌన్‌షిప్‌లు, మధ్య తరగతివారికి అనుకూలంగా నివాస గృహాల నిర్మాణం పార్కులు, పాఠశాలలు, ప్రణాళికలు రూపొందిస్తున్నామని భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు.

ఎవరికి?	ఎన్ని కోట్లు (రూ.లు)
వాటర్‌బోర్డుకు ఉచిత నీటి సరఫరా పథకాలు, తదితరాలు	3,385
మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి	1,500
'హై సిటీ ' పనుల కోసం జీహెచ్ఎంసీకి	2654
హెచ్ఎండీఏ అభివృద్ధి పనుల కోసం	500
హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్ట్	500
మిలియన్ ప్లస్ నగరాలకు ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు	411
ఔటర్ రింగ్ రోడ్ ప్రాజెక్ట్	200
ఓల్డ్‌సిటీకి మెట్రో అనుసంధానం	500
హైడ్రా	200
ఎయిర్‌పోర్ట్ మెట్రో అనుసంధానం	100
ఎంఎంటీఎస్	50
మొత్తం	10,000

మూసీ అభివృద్ధికి అడుగులు



గండిపేట్ నుంచి ఘట్కేసర్ వరకు సుమారు 55 కిలోమీటర్‌ల మేరకు విస్తరించి ఉన్న మూసీనదిని లండన్ థేమ్స్ నది తరహాలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.1500 కోట్లు కేటాయించింది. దీంతో మూసీ అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. ప్రస్తుతం నదికి రెండు వైపులా 50 మీటర్‌ల పరిధిలో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, తదితర విభాగాల సమన్వయంతో ఏర్పడిన 33 బృందాలు ఈ మార్గంలో సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహిస్తున్నాయి. రెండు నెలల్లో ఈ సర్వే పూర్తి కానుంది. నదిలో కలిసే మురుగు నీటి శుద్ధికి ఎస్‌టీపీల ఏర్పాటు, నదికి ఇరువైపులా రహదారులు, మెట్రో రైలు వంటి సదుపాయాలను కల్పించాల్సి ఉంది. ఇప్పటికే ఉన్న వారసత్వకట్టడాల పరిరక్షణతో పాటు కొత్తగా రిక్రియేషన్ పార్కులు, వాక్ వేలు, ఎంటర్‌టైన్‌మెంట్ కేంద్రాలు వంటివి ఏర్పాటు చేయాలనేది ఈ ప్రాజెక్టు లక్ష్యం. మూసీ అభివృద్ధికి గత సర్కారు మూసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినప్పటికీ నిధులు కేటాయించలేదు.

వాటర్ బోర్డుకు నిధుల వరద

రాష్ట్ర బడ్జెట్‌లో జలమండలికి నిధులు వరద పారింది. ప్రభుత్వం రూ. 3385 కోట్లు కేటాయించింది. గతేడాది కంటే ఈసారి నిధులు పెరిగాయి. ఈసారి బడ్జెట్‌లో మురుగునీటి పైపులైన్ పనులు, మురుగు శుద్ధి నిర్మాణాలు, తాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం లభించింది. ఉచిత నీటి సరఫరా, విద్యుత్ బిల్లులు, హడ్కో రుణాల చెల్లింపునకు సైతం పెద్దపీట వేసింది. మరోవైపు మొత్తం రూ.3866.41 కోట్ల అంచనా వ్యయంతో మూడు ప్యాకేజీల్లో 31 కొత్త మురుగు నీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీ) నిర్మిస్తోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం కింద మంజూరైన 39 ఎస్టీపీల నిర్మాణ పనులు చేపట్టనుంది. ఇందుకు మొత్తం రూ.3,842 కోట్లు అవసరం కాగా.. ఇందులో కేంద్రం 25 శాతం వాటా సమకూర్చనుంది. బడ్జెట్ కేటాయింపులో కొత్త ఎస్టీపీలకు కూడా ప్రాధాన్యం లభించినట్లయింది. మరోవైపు నాగార్జున సాగర్ సమీపంలో రూ. 2,214కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సుంకిశాల ఇన్‌టేక్ ప్రాజెక్టు నిర్మాణానికి సైతం బడ్జెట్‌లో ప్రాధాన్యం లభించింది.

ఎంఎంటీఎస్ రెండో దశకు కదలిక..



నగర శివార్లను అనుసంధానం చేస్తూ వివిధ మార్గాల్లో నిర్మించిన ఎంఎంటీఎస్ రెండో దశ కోసం రూ.50 కోట్లు కేటాయించారు. రైల్వే, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును సుమారు రూ.850 కోట్ల అంచనాలతో 2012లో ప్రారంభించారు. కానీ.. పనులు ప్రారంభమయ్యే నాటికి రూ.1050 కోట్ల వరకు చేరింది. ఒప్పందం మేరకు మూడొంతుల నిధులను రాష్ట్రం ఇవ్వాల్సి ఉండగా, గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. దీంతో దక్షిణ మధ్య రైల్వే ఈ ప్రాజెక్టును చాలా వరకు సొంత నిధులతోనే పూర్తి చేసింది. ప్రస్తుతం రూ.50 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన దృష్ట్యా కొత్త రైళ్లను కొనుగోలు చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.

మెట్రో రెండో దశకు దిశ

మెట్రో రైలు రెండో దశ విస్తరణపైనా ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. ఈ బడ్జెట్‌లో రూ.1,100 కోట్లు కేటాయించింది. రెండో దశలో భాగంగా వివిధ మార్గాల్లో 78.4 కి.మీ మేర విస్తరణకు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ.24.042 వేల కోట్లు వ్యయం కానున్నట్లు ప్రాథమిక అంచనా. నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ వరకు అక్కడి నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు రెండో దశలో చేపట్టనున్నారు. ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్, మియాపూర్ నుంచి బీహెచ్ఈఎల్ వరకు, రాయదుర్గం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు రెండో దశలో భాగంగా నిర్మిస్తారు. ఎయిర్‌పోర్ట్ రూట్‌లోనే మైలార్‌దేవ్‌పల్లి నుంచి హైకోర్టు వరకు మరో లైన్‌ను నిర్మించనున్నారు. రూ.1100 కోట్లలో ఎంజీబీఎస్ టు ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీల మార్గంలో పనులు ప్రారంభించేందుకు రూ.500 కోట్లు వెచ్చించారు. ఈ రూట్‌లో ఇప్పటికే డీపీఆర్ సిద్ధం కావడంతో ఆక్రమణల తొలగింపు, పరిహారాల చెల్లింపు, రహదారుల విస్తరణ, అలైన్‌మెంట్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మరో రూ,100 కోట్లతో ఎయిర్‌పోర్ట్ కారిడార్‌లో పనులు ప్రారంభించనున్నారు.

గృహజ్యోతికి రూ.400 కోట్లు

గృహజ్యోతి పథకానికి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.2,418 కోట్లు కేటాయించింది. గృహజ్యోతి అమలుతో గ్రేటర్‌లో 7.4 లక్షల మంది విద్యుత్ వినియోగదారులకు లబ్ధి చేకూరుతుంది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జోన్లలో ప్రతి నెలా రూ.29 నుంచి రూ.30 కోట్లు జీరో బిల్లులు నమోదవుతున్నట్లు డిస్కం లెక్కిస్తోంది. ఈ లెక్కన ఏడాదికి రూ.390 నుంచి రూ.400 కోట్లు గృహజ్యోతి జీరో బిల్లుల కింద డిస్కంకు ప్రభుత్వం చెల్లించనుంది. హైదరాబాద్ మెట్రోజోన్‌లో 2,28,069, రంగారెడ్డిజోన్‌లో 2,83,877, మేడ్చల్ జోన్‌లో 2,28,566 మంది వినియోగదారుల చొప్పున గ్రేటర్ వ్యాప్తంగా మొత్తం 7,40,512 మంది వినియోగదారులు ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారు.

బల్దియాకు బలం రూ.3065 కోట్లు



ఓవైపు వివిధ ప్రాజెక్టుల కోసం చేసిన భారీ అప్పులు.. వాటికి వడ్డీలతో సహ చెల్లింపులు, మరోవైపు నిర్వహణ పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేక సతమతమవుతూ నెల నెలా సిబ్బంది జీతభత్యాలకు నానా అవస్థలు పడుతున్న జీహెచ్ఎంసీకి గొప్ప ఉపశమనం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో జీహెచ్ఎంసీకి రూ.3065 కోట్లు కేటాయించడంతో ఎంతో ఊరట కలిగింది. కొత్త ఆశలు చిగురించాయి.

అన్ని పనులూ 'హైసిటీ'గానే !

ఇకపై చేపట్టబోయే అభివృద్ధి పనులన్నింటినీ హైసిటీ పథకం కిందే చేపట్టనున్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో ఫ్లై ఓవర్లకు ఎస్సార్‌డీపీ, నాలాలకు ఎస్ఎన్‌డీపీ, రోడ్ల నిర్వహణకు సీఆర్ఎంపీ వంటి పేర్లుండగా, అన్నీ ఒకే గొడుగు కింద హైసిటీ ప్రాజెక్ట్ ద్వారానే చేయనున్నారు. అందుకే ప్రభుత్వం కేటాయింపులు సైతం అలాగే చేసింది. ఈ నిధులతో కొత్త పనులతోపాటు ఎస్సార్‌డీపీ, ఎస్ఎన్‌డీపీలో పురోగతిలో ఉన్న పనుల్ని పూర్తిచేస్తారు. ఎస్సార్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ రెండో దశ పనులు చేపట్టేందుకూ అవకాశం ఉంది. వీటితోపాటు ప్రతిపాదిత సొరంగ మార్గాలు, ఇతరత్రా అభివృద్ధి పనులు చేయనున్నారు.


జీహెచ్ఎంసీకి బడ్జెట్‌లో కేటాయింపులు (రూ.కోట్లలో)

- హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) 2654
- మిలియన్ ప్లస్ నగరాలకు ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు 411

(ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు రూ.411 కోట్లు బడ్జెట్ అంకెల్లో పేర్కొన్నప్పటికీ, జీహెచ్ఎంసీకి రూ.369 కోట్లు వస్తాయని ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.)

దశాబ్దిలో అధికం

గడచిన దశాబ్దకాలంలో జీహెచ్ఎంసీకి ఏనాడు కూడా ఇంత మొత్తంలో బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. జీహెచ్ఎంసీ ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ అధికారులు ప్రాజెక్టుల పనుల కోసం రూ. 5వేల కోట్లు కోరగా, రూ.3065 కోట్లు కేటాయించడంతో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



- భట్టి బడ్జెట్ కేటాయింపుల్లో గ్రేటర్‌కు పెద్దపీట
- మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులకు మొత్తం రూ.10వేల కోట్లు
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్‌బోర్డు, హైడ్రా తదితర సంస్థలకు కేటాయింపులు
- జీహెచ్ఎంసీకి రూ.3065 కోట్లు
- జలమండలికి రూ.3,385 కోట్లు
- మూసీ ప్రక్షాళనకు రూ.1500 కోట్లు
- మెట్రో రైలుకు రూ.1100 కోట్లు
- హెచ్ఎండీఏకు రూ.500 కోట్లు
- ఎంఎంటీఎస్ రెండో దశకు రూ.50 కోట్లు
- 3 కమిషనరేట్లకు రూ.308 కోట్లు
- సిటీ పోలీసు విభాగానికి మొత్తం రూ.276 కోట్లు
- సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ బడ్జెట్ రూ.20 కోట్లు
- రాచకొండ కమిషనరేట్‌కు రూ.9.4 కోట్లు కేటాయింపు

నలువైపులా నగరాభివృద్ధి

సాక్షి, సిటీబ్యూరో: మూసీ సుందరీకరణ, మెట్రో విస్తరణతో ప్రధాన నగరం, రీజినల్ రింగ్ రోడ్డు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిటీ, తయారీ హబ్‌లతో శివార్ల అభివృద్ధి ప్రభుత్వం నడుం బిగించింది. ఇప్పటికే వృద్ధి పథంలో దూసుకుపోతున్న భాగ్యనగరానికి తాజా బడ్జెట్ మరింత జవసత్వాలను అందించింది. నగరాభివృద్ధిని ఔటర్ నుంచి ట్రిపుల్ ఆర్ వరకూ పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం పలు బృహత్తర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర సామాజిక ఆర్థిక సర్వే-2024 వెల్లడించింది.

పర్యాటక మూసీ..

మూసీ నదికి పునరుజ్జీవం చేయడంతో పాటు సుందరీకరణ చేయాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. మూసీ నది వెంట ఉన్న ఆర్థిక, సాంస్కృతిక సామర్థ్యానికి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు, నది వెంట 55కి.మీ. మేర అభివృద్ధి పనులకు ప్రణాళికలు చేస్తోంది. వినోద కేంద్రాలు, ఉద్యానాలు, వాటర్ స్పోర్ట్స్, జలపాతాలు, స్ట్రీట్ వెండింగ్ జోన్‌లు, వ్యాపార ప్రాంతాలు, షాపింగ్ మాళ్లతో అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందిస్తోంది. చార్మినార్, కుతుబ్ షాహీ టూంబ్స్‌లను సంధానం చేసిఅభివృద్ధి పర్చాలని నిర్ణయించింది..

మెట్రో పరుగులు..

ఇప్పటికే 69 కిలోమీటర్ల మేర పరుగులు పెడుతున్న మెట్రో రైలును కొత్త ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం సంకల్పించింది. సెకండ్ ఫేజ్‌లో శంషాబాద్ విమానాశ్రయానికి మెట్రో అనుసంధానంతో పాటు కొత్తగా ఐదు కారిడార్లలో మెట్రోను విస్తరించి, అదనంగా 73 కి.మీ. విస్తరించాలని నిర్ణయించారు. దీంతో నగరం నలువైపులా సమాంతర అభివృద్ధికి ఆస్కారం ఉంటడంతో పాటు ప్రజా రవాణా మరింత మెరుగవుతుంది. సంగారెడ్డి, తూప్రాన్, చౌటుప్పల్, ఆమన్‌గల్, శంకర్‌పల్లిలను కలుపుతూ 17 జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు నాలుగు లేన్ల నియంత్రణ రహదారిని 340 కి.మీ. ట్రిపుల్ ఆర్‌ను నిర్మించనున్నారు.

తలసరి ఆదాయంలో రంగారెడ్డి టాప్..

2022-23లో రాష్ట్రంలో అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రంగారెడ్డి జిల్లా.. తలసరి ఆదాయం రూ.9,46,862గా ఉంది. ఇది జాతీయ తలసరి ఆదాయం కంటే ఐదు రెట్లు ఎక్కువ. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, వ్యవసాయ ఉత్పాదకత, మౌలిక సదుపాయాల అభివృద్ధి కారణంగా అత్యధిక తలసరి జిల్లాలు ప్రధాన ఆర్థిక కేంద్రంగా నిలుస్తున్నాయి. నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు, సుదూర ప్రయాణికులకు సేవలను అందించేందుకు టీజీఆర్టీసీ గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) కింద 500 సిటీ ఈ-బస్సులు, 550 ఇంటర్‌సిటీ ఈ-బస్సులకు ఒప్పందం చేసుకుంది. 500 ఇంటర్ సిటీ ఈ-బస్సుల విస్తరణ ఈ ఏడాది అక్టోబర్ నాటికి పూర్తవుతుంది.

వన మహోత్సవం..

అర్బన్ ఫారెస్ట్రీ కాలుష్యం నుంచి నగరవాసులను రక్షించేందుకు పార్కులను నిర్మిండచం, ఫ్లై ఓవర్ల కింద, అవెన్యూల వెంబడి, సరస్సుల చుట్టూ ఉద్యానాలను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. వన మహోత్సవం కార్యక్రమం కింద 2024-25 సంవత్సరంలో 20.02 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2023-24లో హైదరాబాద్‌లో 6 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా.. వీటిలో 3.22 కోట్ల మొక్కలు నాటగా.. 72.50 లక్షల మొక్కలను పంపిణీ చేశారు.

ఐటీ ఎగుమతులు జూమ్..

హైదరాబాద్ దేశీయ సాఫ్ట్‌వేర్ పరిశ్రమకు ప్రధాన ఎగుమతి కేంద్రంగా నిలుస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఐటీ ఎగుమతులు రూ.2,41,275 కోట్లు. జాతీయ వృద్ధి రేటుతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల. తెలంగాణ ఐటీ ఎగుమతులు 31.44 శాతం వృద్ధి చెందాయి. జాతీయ సగటు 9.36 శాతం కంటే ఇది చాలా రెట్లు ఎక్కువ. రాష్ట్ర ఐటీ రంగంలో ఉపాధి 2021-22లో 7,78,121 నుంచి 2022-23 నాటికి 9,05,715కు పెరిగాయి. హైదరాబాద్ గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా ఎదిగింది. 2030 నాటికి 10 లక్షల ఉద్యోగాలు, 2032 నాటికి 15 లక్షల ఉద్యోగాలను సృష్టించేందుకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను రూపొందిస్తోంది.

'మహా' మౌలిక సదుపాయాలు..

రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించింది. హెచ్ఎండీఏ పరిధిలో రహదారుల అభివృద్ధి, ఔటర్ నుంచి వివిధ మార్గాల్లో రేడియల్ రోడ్లు, అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటు తదితర సదుపాయాల కోసం ఈ నిధులను వినియోగించనున్నారు. మహానగర విస్తరణలో భాగంగా శాటిలైట్ టౌన్‌షిప్‌లకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్న దృష్ట్యా శివారులో రహదారులు, లింకురోడ్లు, విద్యుత్ సదుపాయం వంటి మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో కొత్తగా 15 అర్బన్ ఫారెస్ట్ పార్కులను ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు ఔటర్ నిర్మాణం కోసం ప్రభుత్వం జైకా వంటి సంస్థల నుంచి తెచ్చిన నిధుల చెల్లింపు కోసం మరో రూ.200 కోట్లు కేటాయించింది.



పారిస్‌కు మన లేడీస్..


శ్రీజ ఆకుల

నేటి నుంచే పారిస్ ఒలింపిక్స్

- నగరం నుంచి నలుగురు అమ్మాయిలు ఒలింపిక్స్‌కు..
- పీవీ సింధు, ఇషా, నిఖత్‌లపై భారీగా అంచనాలు
- ఇటీవల కాలంలో రాణిస్తున్న శ్రీజ ఆకుల
- క్రీడాకారులకు పెద్దఎత్తున అభినందనల వెల్లువ


ఇషా సింగ్


పీవీ సింధు


నిఖత్ జరీన్

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్టాత్మక పారిస్ ఒలింపిక్స్ వేదికపై మరోసారి హైదరాబాదీ అమ్మాయిలు దేశఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయనున్నారు. పారిస్‌లో జరగనున్న 2024 ఒలింపిక్ పోటీలు శుక్రవారం నుంచే ప్రారంభం కానున్నాయి. ఈసారి ఒలింపిక్స్‌లో మొత్తంగా 117 మంది భారతీయ అథ్లెట్లు పాల్గొంటున్నారు. ఈ భారత క్రీడాకారుల బృందంలో 47 మంది మహిళా అథ్లెట్లు ఉండగా.. అందులో నలుగురు హైదరాబాదీలే ఉండటం గమనార్హం. ముఖ్యంగా ఒలింపిక్స్‌లో భారత్ ఇప్పటి వరకు టేబుల్ టెన్నిస్‌లో పతకం సాధించలేదు. అయితే ఈసారి హైదరాబాద్ నుంచి ఒలింపిక్స్ వెళ్లిన టేబుల్ టెన్నిస్ క్రీడాకారిని శ్రీజ ఆకులపై అంచనాలు పెరిగాయి. 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో శ్రీజ ఆకుల, శరత్ కమల్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం 2016, 2020 ఒలింపిక్స్‌లో దేశానికి పతకాలను సాధించిపెట్టి భారత ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన పీవీ సింధు కచ్చితంగా పతకంతోనే తిరిగొస్తుందని దేశమంతా దీమాగా ఉంది. రెండుసార్లు వరల్డ్ చాంపియన్‌షిప్ నెగ్గిన మరో అథ్లెట్ నిఖత్ జరీన్ భారతీయ బృందంలో స్టార్ ప్లేయర్‌గా పారిస్ వెళ్లింది. 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో కూడా ఆమె బంగారు పతకాన్ని సాధించింది. ఇదే ఏడాది ఏషియన్ గేమ్స్‌లోనూ కాంస్యం సాధించింది. 13 ఏళ్ల వయస్సులో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ కేటగిరిలో నేషనల్ చాంపియన్‌గా నిలిచిన హైదరాబాదీ షూటర్ ఇషా సింగ్‌పై కూడా భారత్ ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఏషియన్‌గేమ్స్‌లో రజత పతకంతో రాణించిన ఇషా ఒలింపిక్స్‌లో దేశానికి పతకాన్ని ఖాయం చేస్తుందని క్రీడా ప్రముఖులు అభిలాషిస్తున్నారు. ఈసారి పారిస్ ఒలింపిక్స్‌లో మాజీ ఒలింపిక్స్ పతక విజేత, హైదరాబాదీ పీవీ సింధూనే ఫ్లాగ్ బేరర్స్‌గా ఇండియన్ ఒలింపిక్ కమిటీ ప్రకటించడం విశేషం. పారిస్ ఒలింపిక్స్ నేపథ్యంలో మన క్రీడాకారులకు సోషల్ మీడియా వేదికగా అభిమానులు, ప్రముఖులు, సెలబ్రిటీల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

బోనాలు, ఊరేగింపు ఏర్పాట్లపై ఆరా



చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా కొనసాగుతున్న ఏర్పాట్ల విషయమై జిల్లా కలెక్టర్, దేవాదాయ శాఖ, పోలీసు అధికారులు గురువారం సమీక్షించారు. నగర అదనపు పోలీస్ కమిషనర్ (శాంతి భద్రతలు) విక్రంసింగ్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా, ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు తదితరులు ఆలయాన్ని సందర్శించి ఆది, సోమవారాల్లో జరగనున్న బోనాలు, ఊరేగింపు ఏర్పాట్ల విషయమై అడిగి తెలుసుకున్నారు. అన్ని సదుపాయాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి బంగారు బోనం


బంగారు బోనంతో నృత్యం చేస్తున్న జోగిని నిషాక్రాంతి

చార్మినార్: లాల్‌దర్వాజాలోని సింహవాహిని అమ్మవారికి గురువారం భక్తిశ్రద్ధలతో భక్తులు బంగారు బోనంతో పాటు పట్టువస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతరాజు విన్యాసాలతో జోగిని నిషాక్రాంతి బంగారు బోనంతో నృత్యాలు చేస్తూ ముందుకు నడుస్తుంటే మహిళా భక్తులు సాక పోసి సామూహిక ఊరేగింపునకు స్వాగతం పలికారు. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో సప్త మాతృకల సప్త బంగారు బోనంలో భాగంగా గురువారం లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి సమర్పించిన బంగారు బోనంతో ఈసారి సప్త మాతృకల సప్త బంగారు బోనాల జాతర పూజా కార్యక్రమాలు ముగిశాయి.

కార్గిల్ విజయానికి 25 ఏళ్లు

నేడు కార్గిల్ విజయ్ దివస్


అమరుడైన మేజర్ పద్మపాణి ఆచార్య


అమరుడైన లాన్స్ నాయక్ రాంచందర్


కార్గిల్‌పై జాతీయ పతాకంతో మన సైనికులు(ఫైల్)

రసూల్‌పురా: సరిగ్గా 25 ఏళ్ల క్రితం భారత భూభాగంలోని జమ్మూ కశ్మీర్‌లోని కార్గిల్, ద్రాస్, లేహ్, సెక్టార్లతో పాటు టోలోలింగ్ పర్వతాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించిన పాకిస్తాన్ ముష్కరులపై భారత సైన్యం, వాయుసేన సహకారంతో దాడులు జరిపి శత్రుమూకలను తరిమికొట్టిన రోజు.. కార్గిల్‌పై మన జాతీయ పతాకం రెపరెపలాడించిన రోజు.. 18 వేల అడుగుల ఎత్తయిన కొండలపై అనుకూలించని వాతావరణంలో పాక్ సైనికులు గుళ్ల వర్షం కురిపిస్తున్నా చెక్కుచెదరని ధైర్యం, ఆత్మవిశ్వాసంతో మన దేశ సైనికులు పాక్ ముష్కరులను అంతమొందించి మన దేశ భూభాగాన్ని స్వాధీనం చేసుకున్న రోజు.. ఆపరేషన్ విజయ్ పేరుతో 1999 మే 3న ప్రారంభమైన ఈ భీకర యుద్ధం జూలై 26 ముగిసింది. ఈ యుద్ధంలో మన దేశ సైనికులు ఎందరో అమరులయ్యారు. మరి కొందరు క్షతగాత్రులయ్యారు. జూలై 26న కార్గిల్ సెక్టార్‌పై మన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. యుద్ధంలో పాల్గొన్న మన నగరానికి చెందిన వారి జ్ఞాపకాలతో నేడు కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

మేజర్ పద్మపాణి ఆచార్య వీరోచిత పోరాటం

కార్గిల్ యుద్ధంలో ఎత్తయిన టోలోలింగ్ పర్వతంపై పాకిస్తాన్ సైనికులు బంకర్లను ఏర్పాటు చేసుకుని పర్వతం పైనుంచి లేహ్– శ్రీనగర్ హైవేను ధ్వంసం చేస్తున్నారు. మన సైన్యానికి ఆయుధాలతో పాటు అవసరమైన సామాగ్రి తరలించేందుకు ఈ హైవేనే ప్రధానమైంది కావడంతో హైవే ధ్వంసం కాకుండా చూడాల్సిన బాధ్యతను పద్మపాణి తీసుకున్నారు. రాజ్‌పుతానా రైఫిల్స్‌కు నేతృత్వం వహించి పైనుంచి పాక్ సైనికులు కురిపిస్తున్న బుల్లెట్ల వర్షానికి భయపడకుండా భీకరంగా యుద్ధం చేస్తూ ధైర్యంతో ముందుకు సాగిన మేజర్ పద్మపాణి ఆచార్య శరీరంలోకి తూటాలు దూసుకుపోయాయి. అయినా భయపడకుండా టోలోలింగ్ పర్వతాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో దేశం కోసం ప్రాణాలర్పించారు.

పెళ్లయిన మూడు నెలలకే..

కంటోన్మెంట్ ఏరియాలో తిరుగుతున్న సైనికులను చూసి ఆకర్షితుడైన బొల్లారం ప్రాంతానికి చెందిన ఎంవై.రాంచందర్ 1994 అక్టోబర్ 20న సైన్యంలో చేరాడు. 8 మద్రాస్ రెజిమెంట్‌లో లాన్స్ నాయక్‌గా విధులు నిర్వర్తిస్తూ తన మేనమామ కూతురు దివ్యను పెళ్లి చేసుకునేందుకు 1999 ఏప్రిల్‌లో నగరానికి వచ్చాడు. పెళ్లయిన కొద్ది రోజులకే యుద్ధం మొదలైంది. దీంతో వెంటనే విధుల్లో చేరాలని ఉన్నతాధికారుల నుంచి పిలుపు వచ్చింది. జూన్ 22న యుద్ధభూమికి వెళ్లిన ఆయన జూలై 7న పాక్ ముష్కరుల దాడిలో అమరుడయ్యారు. రాంచందర్ జ్ఞాపకార్థం బొల్లారంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం కార్గిల్ దివస్ రోజు కుటుంబసభ్యులతో పాటు స్థానికులు, సైనికులు నివాళులర్పిస్తారు.

తూటాల వర్షానికి బెదరలేదు..



యుద్ధంలో పాల్గొనేందుకు లడఖ్‌లోని మేరినాగ్ 21 మెకనైజ్డ్ ఇన్‌ఫాంట్రి రెజిమెంట్ తరపున 11 మంది సైనికులం లడక్‌లోని సఫా గల్లీ బూపూర్ నుంచి రెండున్నర రోజులు ప్రయాణించి ఎత్తయిన మేరినాగ్ పరిసరాలకు చేరుకున్నాం. ఎత్తయిన కొండలు దాటుకుంటూ పాక్‌సైనికుల తూటాల వర్షానికి బెదరకుండా ముందుకు వెళ్లాం. ముష్కరులను మట్టుబెట్టేందుకు ప్లాన్‌లో భాగంగా ఇద్దరు సైనికులతో కింది నుంచి గాల్లోకి ఫైరింగ్ చేయించాం. మిగిలిన 9 మంది ఏడు కిలోమీటర్లు ప్రయాణించి వెనుక వైపు నుంచి దాడులు చేశాం. ఐదు రోజుల పాటు పోరాటం చేసి 21 మంది పాక్ సైనికులను మట్టుబెట్టాం. వారి ఆధీనంలో ఉన్న మేరినాగ్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాం. మా బృందంలోని 8 మంది అమరులయ్యారు. ముగ్గురం మాత్రమే మిగిలి ఉన్నాం. విజయవీరుడిగా తిరిగి వచ్చినందుకు గర్వంగా ఉంది. **– లాన్స్ హవాల్దార్ కామేశ్వర్‌రావు(రిటైర్డ్) చింతల్.**

పాక్ సైనికులకు అంత్యక్రియలు చేశాం

నార్తన్ కమాండ్ ఉదంపూర్ నుంచి కార్గిల్ హెడ్‌క్వార్టర్స్ నుంచి మొత్తం కార్గిల్ విజయ్ యుద్ధం ఆపరేషన్ చీఫ్‌గా నేను వ్యవహరించాను. మన సైనికుల చేతిలో ఓడిన తర్వాత వారు వెనక్కి వెళ్లిపోయారు. యుద్ధంలో మృతి చెందిన పాక్ సైనికుల మృతదేహాలను తీసుకుని వెళ్లేందుకు ఆ దేశం నిరాకరించింది. సైనికులతో పాటు వారి ర్యాంక్ ఫొటోలు తీసుకుని హైదరాబాద్, లక్నో నుంచి ముల్లాలను రప్పించి ఇస్లాం మత ఆచారం ప్రకారం వారి అంత్యక్రియలు నిర్వహించాం. అప్పటి రాష్ట్రపతి కేఆర్.నారాయణన్ చేతుల మీదుగా పరమ విశిష్ట సేవా పతకం అందుకున్నాను. **– ఏఆర్‌కే.రెడ్డి, లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్), కంటోన్మెంట్**



చిత్రం.. సందేశాత్మకం..



మాదాపూర్: కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని మాజీ స్పీకర్ ఎస్.మధుసూదనాచారి తెలిపారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో గురువారం యూనిసన్ పేరిట జాతీయ గ్రూప్ ఆర్ట్ షోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు వేసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. 30 మంది కళాకారులు వేసిన 55 చిత్రాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన 27వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు యం.వి.రమణారెడ్డి, రచయిత జయంత్‌రెడ్డి, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్ట్‌షోను తిలకిస్తున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

నగరంలో నేడు

- బృందావనం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో సాయంత్రం 4.30గంటలకు వేటూరి గీతామృతం పుస్తకావిష్కరణ మహోత్సవం జరుగుతుంది. అనంతరం వేటూరి సినీ గీతాలతో సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.
- రాగరాగిణి సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని శ్రీత్యాగరాయ గానసభలో సాయంత్రం 4 గంటలకు డాక్టర్ సి.నారాయణ రెడ్డి జయంతి సందర్భంగా డాక్టర్ సి. మృణాళినికి ఆత్మీయ సత్కారం ఉంటుంది.
- రంగారెడ్డి జిల్లా వట్టినాగుల పల్లిలోని తెలంగాణ ఫైర్ సర్వీసెస్ అండ్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉదయం 9.30గంటలకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ఫైర్‌మెన్ 4వ బ్యాచ్ పాసింగ్ అవుట్ పెరెడ్ కార్యక్రమం జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో వాయిస్ ఆఫ్ ది వేవ్స్ పేరిట ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు చిత్ర ప్రదర్శన కొనసాగుతుంది.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

ఇద్దరు యువకుల మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


కారు ప్రమాదంలో మృతిచెందిన యువకులు

చైతన్యపురి: నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో అదుపు తప్పిన కారు ఎలక్ట్రిక్ పోల్‌ను ఢీకొట్టిన ఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి చంపాపేటలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన ఎండీ అద్నన్(19) ఇటీవల పాత ఇన్నోవా కారు కొనుగోలు చేశాడు. అదే కాలనీకి చెందిన సయ్యద్ సోఫియన్(20), ఎండీ యాసిర్(20), అబ్దుల్ మావియా(19)తో కలిసి స్నేహితుడిని కలిసేందుకు ఐఎస్ సదన్ వెళ్తున్నాడు. కారును అబ్దుల్ మావియా నడుపుతున్నాడు. బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో చంపాపేట సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఎలక్ట్రిక్ సిమెంట్ స్తంభాన్ని వేగంగా ఢీకొంది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడ్డ నలుగురిని సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఎండీ.అద్నన్, సయ్యద్ సోఫియన్ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఎండి.యాసిర్, అబ్దుల్ మావియా తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో తల్లి ఆత్మహత్య

ఆమె మృతిని తట్టుకోలేక కుమారుడి ఆత్మహత్య

- చైతన్యపురి పరిధిలో ఘటన


గంజి పద్మ (ఫైల్)


గంజి వంశీ(ఫైల్)

చైతన్యపురి: భర్త అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబ భారం మోస్తూ ఇద్దరు కొడుకులను చదివిస్తున్న ఓ తల్లి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడగా తల్లి మరణాన్ని తట్టుకోలేకపోయిన పెద్ద కుమారుడు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. ఒంగోలుకు చెందిన గంజి శివ, పద్మ దంపతులు ఇద్దరు కుమారులతో కలిసి బతుకుదెరువు కోసం కొన్నాళ్ల క్రితం నగరానికి వచ్చి కొత్తపేట ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలో నివాసం ఉంటున్నారు. కొన్ని నెలల క్రితం శివ అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి పద్మ కుటుంబ భారాన్ని మోస్తూ తన ఇద్దరు కుమారులను చదివిస్తోంది. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. బుధవారం రాత్రి చిన్న కుమారుడు బంధువుల ఇంటికి వెళ్లగా పెద్ద కుమారుడు వంశీ(18) బయటకు వెళ్లాడు. దీంతో ఆ సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఇంటికి వచ్చిన వంశీ తల్లి ఆత్మహత్య చేసుకున్న ఘటన చూసి షాక్‌కు గురయ్యాడు. దీంతో అతడూ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం తల్లీ, కుమారుడి మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వారి ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులేనా.. మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో విచారిస్తున్నారు.

నెలాఖరులోపు ఐటీఆర్ ఫైల్ చేయండి

ఆదాయ పన్నుశాఖ జాయింట్ కమిషనర్ ఆశిష్ కుమార్ శుక్లా

లక్డీకాపూల్: పన్ను చెల్లింపుదారులు నిబంధనల మేరకు ఐటీఆర్ (ఇన్‌కం టాక్స్ రిటర్న్స్) ఫైల్ చేయాలని ఆదాయ పన్నుశాఖ జాయింట్ కమిషనర్ ఆశిష్ కుమార్ శుక్లా సూచించారు. తప్పుడు క్లెయిమ్స్ చేయకూడదన్నారు. ఆదాయ పన్ను శాఖ అధికారులు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీహెచ్‌ఎంసీలోని వివిధ విభాగాల అధికారులకు పలు అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆశిష్ కుమార్ శుక్లా మాట్లాడుతూ.. ఆదాయ పన్ను నమోదులో అన్ని రకాల ఆదాయ వివరాలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఐటీఆర్ నమోదు చేసేటప్పుడు సరిచూసుకోవాలని సూచించారు. కొత్త/పాత రీజిమ్‌లో ఆదాయ పన్ను రిటర్న్ దాఖలు చేసుకోవచ్చన్నారు. ఐటీఆర్‌ను ఈ నెల 31వ తేదీలోపు సమర్పించాలని, పత్రాలన్నీ పక్కాగా ఉండాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే బషీర్‌బాగ్‌లోని ప్రధాన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, గీతా రాధిక, చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, ఆదాయపన్ను శాఖ అధికారులు వేణుగోపాల్, వందన తదితరులు పాల్గొన్నారు.

జీఎంఆర్ ఏరోసిటీలో అద్దెకు వర్క్‌స్పేస్

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో జీఎంఆర్ ఏరోసిటీ బిజినెస్ పార్కులో రీగస్ సంస్థ సౌకర్యవంతమైన వర్క్‌స్పేస్ భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. వివిధ వాణిజ్య సంస్థలకు లీజుకు ఇచ్చే కార్యాలయాలతో పాటు ఒకరోజు, ఒక గంట సమయానికి సమావేశమయ్యేందుకు కావాల్సిన గదులు ఇందులో అందుబాటులో ఉన్నాయి. జీఎంఆర్ ఎయిర్‌పోర్టు ల్యాండ్ డెవలప్‌మెంట్ సీఈఓ అమన్ కపూర్ దీన్ని గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో వివిధ ప్రాంతాల వాణిజ్య రంగాలను అనుసంధానం చేయడానికి ఈ స్పేస్ ఎంతో ఉపయోగకరంగా మారుతుందన్నారు. ఆతిథ్యం, ఆరోగ్య సంరక్షణ, వినోదం, విద్య, పారిశ్రామిక పార్కులతో సమీకృతంగా ఏరో సిటీ అభివృద్ధి చెందుతుందన్నారు. వాణిజ్య రంగాభివృద్ధిలో హైదరాబాద్ విస్తరణకు ఏరోసిటీ ఎంతో ఉపయోగకరంగా మారుతుందని ఐడబ్ల్యూజీ కంట్రి మేనేజర్ శ్రీహర్ష లాంబా అన్నారు.

ఎస్‌బీఎం ప్రోగ్రాం ఆఫీసర్ తొలగింపు

సాక్షి, సిటీబ్యూరో: ప్రేమ పేరుతో మహిళా ఉద్యోగిని వేధింపులకు గురిచేసిన విషయం వెలుగులోకి రావడంతో జీహెచ్‌ఎంసీ స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎం) విభాగంలో ఔట్ సోర్సింగ్‌పై ప్రోగ్రాం ఆఫీసర్‌గా పనిచేస్తున్న సోమభరత్‌ను విధుల నుంచి తొలగించారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దాదాపు రెండు వారాల క్రితమే సదరు ఉద్యోగిని ఫిర్యాదుతో పోలీసులు సోమభరత్‌ను అరెస్టు చేశారు. అప్పటి నుంచి రిమాండ్‌లో ఉన్న ఆయనను కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాల మేరకు మూడు రోజుల క్రితం విధుల నుంచి తొలగించినట్లు సమాచారం. స్వచ్ఛ భారత్ మిషన్ విభాగంలో పనిచేస్తున్న దాదాపు 30 మంది ఉద్యోగినులు కూడా ఈయన పోకడ వల్ల ఉద్యోగాలు కోల్పోయినట్లు తెలిసింది.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పంజగుట్ట: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని, చుట్టు పక్కల వారికి అవగాహన కల్పించి దోమలు నివారణకు కృషి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి అన్నారు. గురువారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో దోమకాటు వల్ల వచ్చే వ్యాధులపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సర్కిల్ 17 డిప్యూటీ కమిషనర్ ప్రావీణ్య, ఏఎమ్ఓహెచ్, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ భాస్కర్, కాలేజీ ప్రిన్సిపాల్ రాజేందర్ కుమార్, ఈఎఫ్ఏ సుమన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్వతారోహణలో సత్తా చాటిన ప్రవీణ్



బంజారాహిల్స్: హిమాలయ పర్వతారోహణలో సైఫాబాద్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ ప్రవీణ్ బంగారు పతకం సాధించారు. ఈ నెల 13 నుంచి 23 వరకు ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశీలో జరిగిన ఎన్‌సీసీ క్యాడెట్ల పర్వతారోహణ శిబిరంలో సైఫాబాద్ కళాశాల క్యాడెట్ ప్రవీణ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్‌కు సంబంధించిన తెలంగాణ మూడో బెటాలియన్, హైదరాబాద్ గ్రూప్ తరుపున ప్రవీణ్ ఒక్కడే పాల్గొని పతకం సాధించడం పట్ల హైదరాబాద్ గ్రూప్ కమాండర్ కల్నల్ అనిల్‌కుమార్, తెలంగాణ మూడో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ శరత్, సైఫాబాద్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ పల్నాటి నరేష్ తదితరులు అభినందించారు. గత మే నెలలో హిమాలయాలను 16,400 ఫీట్ల ఎత్తును సిద్దార్థ అధిరోహించారని గుర్తు చేశారు. తాజాగా ప్రవీణ్ సత్తా చాటారని ఈ సందర్భంగా వారు అభినందనలు తెలిపారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి


మేయర్‌తో కాజా సూర్యనారాయణ...

ఫిలింనగర్: ఫిలింనగర్ సొసైటీలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు విపరీతంగా పెరిగిపోయాయని సంబంధిత అధికారులు, పోలీసులకు ఎన్నిమార్లు ఫిర్యాదులు చేసినా సమస్యల్లో మార్పు ఉండటం లేదని ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. చాలా మంది వ్యాపారులు అక్రమంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారని అన్నారు. తమ సొసైటీ తరఫున జీహెచ్ఎంసీకి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని సొసైటీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలంటూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి కోటి బాబు, కమిటీ సభ్యులు భాస్కర్, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టండి

ఫిలింనగర్: బోనాలు సమీపించిన దృష్ట్యా రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అధికారులను కోరారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ వినాయకనగర్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైన కారణంగా వెంటనే నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ ఆ బస్తీవాసులు గురువారం కార్పొరేటర్‌ను కలసి పరిస్థితిని వివరించారు. దీంతో స్పందించిన కార్పొరేటర్ వెంటనే అధికారులతో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన కాంక్రీట్‌ను తన ప్లాంట్ నుంచి అందిస్తానని, వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని, బోనాల పండుగ నేపథ్యంలో స్థానికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను కోరారు.

మూడు రోజులుపాటు ఇంటర్నేషనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్

అపోలో హాస్పిటల్స్ కార్డియాలజీ, క్లినికల్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ కుమార్

బంజారాహిల్స్: గుండె సమస్యలపై అవగాహన కోసం భారతదేశపు ప్రీమియర్ ఇంటర్నేషనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్ ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అపోలో హాస్పిటల్స్ కార్డియాలజీ, క్లినికల్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అపోలో హాస్పిటల్స్, కార్డియోవాస్కులర్ రీసెర్చ్ ఫౌండేషన్, (సీఆర్ఎఫ్) యూఎస్ఏతో కలసి ఫ్యాక్స్ ఫౌండేషన్ ఈ మూడు రోజులు 'టీసీటీ ఇండియా 2024' భారతదేశపు ప్రీమియర్ ఇంటర్నేషనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్‌ను నగరంలోని హెచ్ఐసీసీలో నిర్వహించనుందని చెప్పారు. దేశ, విదేశాల నుంచి కార్డియాలజిస్టులు, కార్డియోథెరాసిక్ సర్జన్లతో కూడిన 1200 మంది ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. భారతదేశం నుంచి 100 మంది, విదేశాల నుంచి 30 మంది అధ్యాపకులు ఇంటర్నేషనల్ కార్డియాలజీలో తాజా పురోగతులు ప్రతినిధులకు తెలియజేయనున్నారని తెలిపారు. ఇది అతిపెద్ద ఇంటర్నేషనల్ కార్డియాలజిస్టుల సదస్సు అన్నారు. దీనికి దేశ, విదేశాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

బాలికలకు నాణ్యమైన విద్యే 'బీబీజీ' లక్ష్యం

బంజారాహిల్స్: బాలికలకు నాణ్యమైన విద్యే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ (బీబీజీ) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎంపీ మల్లికార్జునరెడ్డి తెలిపారు. బీబీజీ టాలెంట్ ఫ్యాక్టరీ అవార్డుల వేడుకను ఘనంగా నిర్వహించిన అనంతరం బంజారాహిల్స్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ నటి రాశిసింగ్ చేతుల మీదుగా ఈ అవార్డులను అందజేసినట్లు తెలిపారు. బీబీజీ అసోసియేట్స్ నుంచి రూ. 10 లక్షలు, మేనేజ్‌మెంట్ నుంచి రూ. 20 లక్షల చెక్కును బీబీజీ ఫౌండేషన్‌కు రాశిసింగ్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఈ విరాళంతో 2040 నాటికి 20 లక్షల మంది బాలికలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వ్యాపారంలో వచ్చే లాభంలో కొంతభాగాన్ని బాలికలకు స్కాలర్‌షిప్‌లు, రివార్డులు, ఉన్నత విద్య కోసం వెచ్చిస్తున్నామని తెలిపారు.

ప్రైవేటు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

రహమత్‌నగర్: ప్రైవేటు కారు డ్రైవర్లకు కనీస వేతనం రూ. 25 వేలు చెల్లించాలని జూబ్లీహిల్స్ జోన్ ప్రైవేటు కారు డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు అమనగంటి కృష్ణ డిమాండ్ చేశారు. రహమత్‌నగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరలు, ఇతర ఖర్చులు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ప్రతి డ్రైవర్ల కనీసం వేతనం నెలకు రూ. 25 వేలు చెల్లించాలని కారు యజమానులను కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రైవేటు కారు డ్రైవర్ల సమస్యలను ప్రస్తావించడం హర్షణీయమన్నారు. ప్రభుత్వం డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారికి బీమా, ఉచిత విద్యా, వైద్యం సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. తమ సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలసి వినతి పత్రం సమర్పించనున్నట్లు కృష్ణ తెలిపారు.

మెదడువాపు నివారణకు స్పెషల్ డ్రైవ్

వచ్చే నెల 15 వరకు పాఠశాలల్లో విద్యార్థులకు జేఈ వ్యాక్సిన్

వ్యాక్సిన్ వేయించే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదే

సర్కార్ బడుల్లో 15 సంవత్సరాల విద్యార్థులకు వరకు తప్పనిసరి

క్యులెక్స్ దోమకాటుతోనే మెదడువ్యాపు : వైద్యాధికారి డాక్టర్ నాగ కార్తీక్


గతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జేఈ వ్యాక్సిన్ ఇస్తున్న వైద్యాధికారి డాక్టర్ నాగ కార్తీక్

బంజారాహిల్స్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు చుట్టుముడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వీటి నివారణపై దృష్టి పెట్టింది. డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా తదితర వ్యాధులకు ఒక వైపు నియంత్రణ చర్యలు చేపడుతున్న వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రాణాంతకమైన మెదడువాపు వ్యాధిపై దృష్టి పెట్టారు. జపనీస్ ఎన్‌కేఫలైటిస్ (జేఈ వ్యాక్సిన్) స్పెషల్ డ్రైవ్ గురువారం ప్రారంభమైంది. జులై 25 నుంచి ఆగస్టు 15 వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 15 సంవత్సరాల వయస్సు వరకు విద్యార్థులకు ఈ వ్యాక్సిన్ వేయనున్నారు. ఈ వ్యాక్సిన్ వల్ల మెదడువాపు వ్యాధి నివారణతో పాటు ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని బంజారాహిల్స్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగ కార్తీక్ తెలిపారు. తమ పరిధిలోని అన్ని సర్కార్ బడుల్లో గుర్తించిన 2774 మంది విద్యార్థులకు ఈ వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. ఖైరతా బాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని 10 ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 15 వరకు ఈ రెండు నియోజకవర్గాల పరిధిలోని 47 ప్రభుత్వ ప్రాథమిక, 17 ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న 29,676 మంది అర్హులైన విద్యార్థులకు ఈ టీకా వేయనున్నారు. క్యులెక్స్ దోమ కుడితే మెదడువాపు వ్యాధి వ స్తుందని, ఈ దోమ కాటు ఎంతో ప్రమాదకరమని, నివారణ ఒక్కటే మార్గమని వైద్యులు పేర్కొంటున్నారు. మొదటి 15 రోజులు క్యాంపెయిన్ లాగా టీకా ఇచ్చి మామూలు రోజుల్లో 9 నెలల నుంచి 15 సంవత్సరాల వయస్సు పిల్లలకు తొమ్మిది నెలలకు ఒకటి, 16 నెలలకు ఒకటి చొప్పున ఇవ్వడం జరుగుతుందని వైద్యులు తెలిపారు. క్యులెక్స్ దోమ పందులను కుడితే ఆ దోమ తిరిగి మనుషులను కుట్టడం ద్వారా మెదడువాపు వ్యా.ది సంక్రమిస్తుందని, వ్యాక్సిన్‌తో దీనిని పూర్తిగా నివారించవచ్చని వైద్యులు తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఈ వ్యాక్సిన్ తప్పకుండా వేయించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో అవగాహన కూడా కల్పించామని తెలిపారు.

జవ్వాది అనిల్‌కుమార్‌కు వీర తెలంగాణ అవార్డు


జవ్వాది అనిల్‌ను సత్కరిస్తున్న ఎస్‌బీఐ లైఫ్ జోనల్ డైరెక్టర్ శ్రీవాత్సవ

బంజారాహిల్స్: బీమా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం అభినందనీయమని ఎస్‌బీఐ లైఫ్ జోనల్ డైరెక్టర్ శ్రీ వాత్సవ అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో ఉత్తమ సేవలతో పాటు మంచి ప్రతిభ కనబరిచిన ఎస్‌బీఐ అడ్వయిజర్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వినియోగదారుల స్థితిగతులకు తగినట్లు అడ్వయిజర్లు వారికి సరిపోయే విధంగా బీమా కల్పించడంతో పాటు ఏదైనా అనుకోని ఘటనలు చోటుచేసుకున్నప్పుడు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ టాపర్‌గా నిలిచిన ఎస్‌బీఐ సీనియర్ అడ్వయిజర్ జవ్వాది అనిల్‌కుమార్‌ను ఆయన వీర తెలంగాణ అవార్డుతో సత్కరించారు. అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని భవిష్యత్‌లో వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ లైఫ్ తెలంగాణ రీజినల్ డైరెక్టర్ అభిషేక్ ముజేందర్, రీజినల్ మేనేజర్ వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మిద్దెతోటల ఏర్పాటుపై అవగాహన సదస్సు

లక్డీకాపూల్: నగరంలో మిద్దెతోటల ఏర్పాటు నిర్వహణపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఖైరతాబాద్‌లోని దక్షిణ భారత హిందీ ప్రచారణ సభలో ఈ నెల 28న టెర్రస్ గార్డెనింగ్, బాల్కనీ గార్డెనింగ్, కిచెన్ గార్డెనింగ్‌లో సేంద్రియ పద్ధతిలో కూరగాయల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో మిద్దె తోటల నిర్మాణం, మట్టి, విత్తనాలు, ఎరువుల ఎంపిక, వినియోగం, చీడపీడల నివారణకు ఉపయోగించే కషాయాలు, ద్రావణాలు, సేంద్రియ విధానంలో మొక్కలకు పోషణ అందించే పద్ధతులు, కూరగాయ పంటల్లో అధిక దిగుబడికి సూచనలు ఇవ్వనున్నామన్నారు. కర్షక్ సేవా కేంద్రం నిర్వహణలో ఔత్సాహికులకు, కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. యాంత్రిక జీవనానికి కొంత వెసులుబాటు పొందేందుకు నగర ప్రజలు ఈ దిశగా ఆలోచిస్తున్నారని వెంకటేశ్వరరావు తెలిపారు.

బ్లాక్‌మెయిల్ చేసి కోట్లు దండుకున్నాడు!

- భర్తకు సహకరించిన భార్య
- పోలీసులు ఆశ్రయించిన బాధితురాలు


నిందితుడు సాహిల్ ఖాన్

బంజారాహిల్స్: యువతిని వలలో వేసుకోవడం ద్వారా పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించొచ్చని భార్య ప్రోత్సహించడంతో ఓ వ్యక్తి ఓ యువతిని బ్లాక్‌మెయిల్ చేసి ఆమె వద్ద ఆడికారుతో పాటు పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలు, ఐఫోన్ ఖరీదైన వస్తువులను కొనుగోలు ఘటనలో నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... మెహిదీపట్నం గ్రాస్ రోడ్డులోని సకీనా కాంప్లెక్స్‌లో నివసించే సాహిల్ ఖాన్ అలియాస్ మహ్మద్ అఫ్సారుద్దీన్ (40) అనే వ్యాపారికి 2018లో ఓ యువతితో పరిచయం అయింది. ఇద్దరూ కలసి ఉన్నప్పుడు ఆమెకు తెలియకుండా సాహిల్‌ఖాన్ ఆమె వ్యక్తి గత ఫొటోలు, వీడియోలు తీశాడు. ఈ వీడియోలతో యువతిని బ్లాక్ మెయిల్ చేస్తూ ఆమె నుంచి ఆడికారుతోపాటు బంగారు నగలు కూడా కొనిపించాడు. అంతేకాకుండా ఆయన భార్యకు బాధితురాలు రూ. 4 లక్షలు కూడా ఇచ్చింది. ఈ క్రమంలోనే స్టార్ హోటళ్ళు, జల్సాలకు అలవాటు పడి ఆమె నుంచి కోట్ల విలువైన వస్తువులను బ్లాక్‌మెయిల్ చేసి లాక్కున్నాడు. నిందితుడికి ఆయన భార్య సాహర్‌ఖాన్ కూడా ప్రోత్సహించింది. దీంతో విసిగిపోయిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి ఖరీదైన ర్యాడో వాచ్, ఆడికారు, ఐఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ చీటింగ్‌లో పాల్పంచుకున్న మాజీద్, ఆబు, సాహర్‌ఖాన్‌లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బంజారాహిల్స్ సీఐ రాఘవేంద్ర కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బోగస్ రెగ్యులరైజేషన్ పత్రాలు సృష్టించిన ఇద్దరికి రిమాండ్


కొత్త సుహాస్


దినేష్

బంజారాహిల్స్: ప్రభుత్వ స్థలానికి నకిలీ రెగ్యులరైజేషన్ పత్రాలను సృష్టించి లక్షలాది రూపాయలు వసూలు చేసిన సీసీఎల్‌ఏ ఉద్యోగితో పాటు మరొకరిని బంజారాహిల్స్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వివరాల్లోకి వెళ్తే... బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి పక్కన ప్రభుత్వానికి చెందిన 300 గజాల స్థలం ఉంది. ఈ ప్లాట్‌ను కె. సురేష్ కుమార్ అనే వ్యక్తి మహ్మద్ ఖాజాకు విక్రయించాడు. అయితే ఈ ప్లాట్ రెగ్యులరైజేషన్ కోసం సీసీఎల్‌ఏలో పని చేస్తున్న ఉద్యోగి కొత్త సుహాస్‌ను మహ్మద్ ఖాజా సంప్రదించాడు. రూ. 66 లక్షలు వసూలు చేసి సుహాస్‌తో పాటు ఆయన అనుచరుడు దినేష్, ఈ ప్లాట్‌పై నకిలీ రెగ్యులరైజేషన్ పత్రాలు సృష్టించారు. ఈ పత్రాలతో ఖాజా ప్లాట్ చుట్టూ బ్లూ షీట్లు వేస్తుండగా షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి అడ్డుకొని వాటిని స్వాధీనం చేసుకున్నారు. అయితే తన వద్ద క్రమబద్ధీకరణ పత్రాలు ఉన్నాయని ఖాజా చూపించగా వాటిని విచారణ చేసిన తహసీల్దార్‌కు దిమ్మతిరిగే షాక్ తగిలింది. ఆ పత్రాలు పూర్తిగా నకిలీవని తేలడంతో తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కొత్త సుహాస్, పి.దినేష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ చూపి నిందితులను అరెస్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన బంజారాహిల్స్ సీఐ రాఘవేంద్ర, ఎస్ఐ కె. వెంకటేష్‌లను ఏసీపీ వెంకట్‌రెడ్డి అభినందించారు.

పదవిని కాపాడుకునేలా మోదీ బడ్జెట్


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట: కేంద్ర బడ్జెట్ చూస్తుంటే ప్రధాని మోదీ ఆయన పదవిని కాపాడుకునేలా ఉందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సెక్యులర్ డెమోక్రాటిక్ ఫోరం (ఎస్‌డీఎఫ్) ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ కేటాయింపులు తెలంగాణకు జరిగిన అన్యాయం – కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో పాటు బీజేపీ ఎంపీలు రాజీనామా చెయ్యాలి అనే డిమాండ్‌తో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ తెలంగాణకు జరిగిన అన్యాయానికి బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టేముందు ఫైనాన్స్ కమీషన్ ఏర్పాటు చేయడంతోపాటు అన్ని రాష్ట్రాల అవసరాలు తెలుసుకుని బడ్జెట్ పెట్టాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర బడ్జెట్‌పై బీజేపీ ఎంపీలు తెలంగాణకు జరిగిన అన్యాయంపై స్పందించాలని ఆయన కోరారు. ఎస్‌డీఎఫ్ నాయకులు కోలా జనార్ధన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పవన్ మల్లాది, సైనాల గోవర్ధన్, ఓట్ నీడ్ గ్యారెంటీ అధ్యక్షురాలు సోగరాబేగం, మన్నారం నాగరాజు, ఇంద్రవెల్లి రమేష్, జలేంద్ర చారి, సూర్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాంక్ ఉద్యోగుల ధర్నా

హిమాయత్‌నగర్: ఇండియన్ బ్యాంక్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని శాఖలలో అవసరమైన మేరకు సిబ్బందిని, అధికారులను నియమంచాలని డిమాండ్ చేస్తూ ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు గురువారం సాయంత్రం లిబర్టీలోని ఇండియన్ బ్యాంక్ రీజినల్ కార్యాలయంలో ముందు ధర్నా నిర్వహించారు. బ్యాంకుల శాఖలలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యాజమాన్యానికి సామూహికంగా వినతి పత్రాలు సమర్పించాలని యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యోగులు ధర్నాను నిర్వహించారు. ఈ ధర్నాకు యూనియన్ అధ్యక్షుడు ఎం.ఎస్.కుమార్ అధ్యక్షత వహించగా బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బి.ఎస్. రాంబాబు, ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.వి.కృష్ణారావు, సంయుక్త ప్రధాన కార్యదర్శి జి.నల్లప్పరెడ్డి ఆధ్వర్యంలో ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం ఫీల్డ్ జనరల్ మేనేజర్, జోనల్ మేనేజర్‌కు వినతి పత్రాలను అందజేశారు.

పార్కింగ్ చేసిన ఆటో ధ్వంసం

వెంగళరావునగర్: పార్కింగ్ చేసిన ఆటోను ధ్వంసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జవహర్‌నగర్‌లో నివాసం ఉండే షేక్ హాజీ ఆటో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈనెల 20వ తేదీ రాత్రి తన ఆటోను గాంధీబొమ్మ వద్ద పార్క్ చేసి ఇంటికి వెళ్ళి 21న వచ్చి చూడగా ఆటోకు చెందిన కొన్ని పార్ట్‌లు ధ్వంసమై ఉన్నాయి. చుట్టు పక్కల వారిని విచారించినప్పటికీ ఆగంతకుని జాడ తెలియలేదు. గురువారం బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటే చంపేస్తాం..

ఇరువురు యువకులపై కేసు నమోదు

వెంగళరావునగర్: పెళ్లిచేసుకుంటే చంపేస్తామని అమ్మాయితో నిశ్చితార్థం చేసుకున్న యువకుడిని బెదిరించిన ఇరువురు యువకులపై కేసు నమోదు చేసిన సంఘటన చోటుచేసుకుంది. జీహెచ్ఎంసీలో విధులు నిర్వహించే ఉద్యోగి గత 20 ఏళ్ళ కిందట బతుకుదెరువు కోసం వరంగల్ నుంచి జవహర్‌నగర్‌కు వచ్చాడు. అతనికి 15 ఏళ్ళ కుమారుడు, 19 ఏళ్ళ కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో సదరు ఉద్యోగి తన కుమార్తెకు ఇటీవల నల్లగొండకు చెందిన యువకుడితో నిశ్చితార్థం కుదుర్చుకున్నాడు. కాగా 16న పక్కింటి అబ్బాయి తన స్నేహితునితో కలసి అమ్మాయిని వివాహం చేసుకుంటే మిమ్మల్ని చంపేస్తాం అంటూ నిశ్చితార్థం చేసుకున్న యువకుడిని బెదిరించారు. దీంతో యువకుడి తల్లిదండ్రులు యువతి తండ్రికి ఫోన్ చేసి విషయం తెలియజేశారు. తన కుమార్తె వివాహం చెడగొట్టడానికి ప్రయత్నించిన ఇరువురు యువకులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ షాపుల సీజ్

వెంగళరావునగర్: ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ మెడికల్ షాపులు నిర్వహిస్తున్న మూడు మందుల షాపులను డ్రగ్స్ కంట్రోల్ అధికారులు మూసివేశారు. ఈనెల మొదటి, రెండో వారంలో డ్రగ్స్ కంట్రోల్ శాఖ అధికారులు సికింద్రాబాద్, హైదరాబాద్ జోన్లలో ఉన్న మందుల షాపులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిబంధనలు ఉల్లంఘించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని మూడు షాపులను మూసివేశారు. నగర వ్యాప్తంగా మొత్తం 20 మెడికల్ షాపుల లైసెన్స్‌లు సస్పెండ్ చేయగా, మరో షాపునకు సంబంధించిన లైసెన్స్‌ను రద్దు చేసినట్లు డ్రగ్స్ అధికారులు తెలియజేశారు.

అవగాహనతోనే వ్యాధులు దరిచేరవు

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- వలంటీర్లకు జీహెచ్ఎంసీ అధికారుల ప్రత్యేక శిక్షణ


దోమల నియంత్రణ అవగాహన కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: ప్రతీ ఒక్కరు దోమల నియంత్రణపై అవగాహన పెంచుకుంటే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు నుంచి దూరంగా ఉండవచ్చునని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న డెంగీ కేసుల నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులను జీహెచ్ఎంసీ అధికారులు వలంటీర్లుగా నియమించారు. ఈ సందర్భంగా వారికి గురువారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వ లేకుండా ప్రతీ ఒక్కరు జాగ్రత్త పడాలని సూచించారు. విద్యార్థులు మంచి అవగాహన పెంచుకొని మిగిలిన వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, ఎస్ఈ రజిని, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు అవగాహన కల్పించాలి

మలేరియా, డెంగీ వ్యాధులతో పాటు దోమల నివారణకు ముందుకొచ్చిన వివిధ కళాశాలల, పాఠశాలల విద్యార్థులు ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని డీఎంసీ జగన్ కోరారు. దోమల నివారణపై వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని చింతల్‌బస్తీ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయారెడ్డి, ఏఎంహెచ్‌వో ప్రవీణ, ఎంటమాలజీ ఏఈ భాస్కర్ పాల్గొన్నారు.

వినూత్నంగా ఆలోచిస్తేనే మంచి భవిష్యత్


ఎంవోయు పత్రాలు మార్చుకుంటున్న ముఫకంజా కాలేజీ, సంస్థల ప్రతినిధులు

మ్యూటిక్ ఇంజినీరింగ్ ఎండీ మహ్మద్ ముస్తాక్ అహ్మద్

బంజారాహిల్స్: ప్రస్తుత నిర్మాణ రంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని భిన్న రకాల డిజైన్లతో పాటు విభిన్నమైన నిర్మాణ శైలిని అర్థం చేసుకునే విద్యార్థులకు నిర్మాణ రంగంలో మంచి భవిష్యత్ ఉంటుందని మ్యూటిక్ ఇంజినీరింగ్ సంస్థ ఎండి మహ్మద్ ముస్తాక్ అహ్మద్ అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీలో సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌తో మ్యూటిక్ ఇంజినీరింగ్ అండ్ కన్సల్టెంట్ సంస్థ, ఎంఎస్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ సంస్థలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా మ్యూటిక్ సంస్థ ఎండీ ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నిర్మాణ రంగానికి మంచి భవిష్యత్ ఉందని సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్న విద్యార్థులు చదువుకునే దశ నుంచే నిర్మాణ రంగంలో వస్తున్న మార్పులను నిశితంగా గమనించాలని సూచించారు. ఎప్పటికప్పుడు నిర్మాణ రంగంలో టెక్నాలజీతో పాటు భిన్న రకాల పద్ధతుల్లో అప్‌డేట్ కావాలని అప్పుడే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఈ ఎంవోయూ వల్ల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ మహ్మద్ అబ్దుల్, ఎంజేసెట్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహిపాల్ సింగ్ రావత్, రిజిస్ట్రార్ కేవీ. నర్సింహారావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కమర్ సుల్తానా, హెచ్‌వోడీ డాక్టర్ మహ్మద్ అమ్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర బడ్జెట్ గాడిద గుడ్డు లాంటిది'

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ఓ పెద్ద గాడిద గుడ్డు లాంటిదని బీజేపీ జాతీయ మహిళా మోర్చా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ డాక్టర్ పద్మ వీరపనేని ఆరోపించారు. గురువారం శ్రీనగర్‌కాలనీలోని ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మహిళలకు మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి రాగానే బడ్జెట్‌లో ఊసేలేకుండా చేశారని మండిపడ్డారు. మహిళలకు ప్రతి నెలా రూ. 2500, 18 సంవత్సరాలు నిండిన అమ్మాయిలకు స్కూటీలు, 5 లక్షల విద్యా భరోసా, రూ. 4వేల పింఛన్‌కు నిధులెందుకు కేటాయించలేదని ఆరోపించారు. అధికారమే పరమావధిగా ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలకు గాడిదగుడ్డును చూపించారని దుయ్యబట్టారు.

ఘనంగా నోవా ఐవీఎఫ్ వార్షికోత్సవం

నేడు ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం


వార్షికోత్సవ వేడుకలలో డాక్టర్ లక్ష్మీ చిరుమామిళ్ల, హిమదీప్తి తదితరులు

లక్డీకాపూల్: మహిళల్లో ఎగ్ ఫ్రీ జింగ్ పట్ల ఆసక్తి పెరుగుతుందని ఫెర్టిలిటీ నిపుణురాలు డాక్టర్ లక్ష్మీ చిరుమామిళ్ల తెలి పారు. పిల్లలు తర్వాత కావాలనుకుంటే, తమ అండాలు, వీర్యం, లేదా పిండాలను కూడా ఫ్రీజ్ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. గురువారం బంజారాహిల్స్ లోని నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీ పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుక చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ పిల్లలు పుట్టని జంటలకు కొత్త ఆశ, మెరుగైన ఫలితాలు వస్తున్నాయన్నారు.క్రియో ప్రిజర్వేషన్ వల్ల ఇప్పుడు అండాలు, వీర్యం, పిండాలను కూడా సమర్థంగా నిల్వ చేయగలుగుతున్నామన్నారు. దీనివల్ల ఎవరైనా కొంత వ యస్సు తర్వాత పిల్లలు కావాలనుకున్నా అది సాధ్యమవుతుందన్నారు. వాస్తవానికి ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం, మారుతున్న జీవనశైలి లాంటివి సంతానలేమి పెరగడానికి కారణమన్నారు.ఫెర్టిలిటీ నిపుణురాలు డాక్టర్ హిమదీప్తి పాల్గొన్నారు.

మోసాలు చేస్తున్న ఇద్దరు నిందితుల అరెస్టు

పంజగుట్ట: తక్కువ ధరకే బంగారం ఇస్తామంటూ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు నేరస్తులను పంజగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. కరీంనగర్‌కు చెందిన ఆకుల వినయ్ (25), బేగంపేట, రసూల్‌పూరకు చెందిన ఎస్.విశాల్‌రాజ్ (29), అఖిల్ ముగ్గురూ స్నేహితులు. వీరు తమకు డబ్బులు ఇస్తే ఇచ్చిన 30 నుంచి 45 రోజుల్లో తక్కువ ధరకే బంగారం ఇస్తామని నమ్మబలుకుతారు. మొదట వారిని నమ్మించేందుకు తక్కువ మొత్తంలో బంగారం ఇస్తారు. వారు నమ్మిన తర్వాత పెద్దమొత్తంలో నగదు తీసుకుని బంగారం ఇవ్వకుండా నేడు, రేపు అంటూ మోసానికి పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే సూర్యాపేటకు చెందిన ఉపేందర్ వీరిని నమ్మి తక్కువ ధరకే బంగారం వస్తుందని రూ. 8.25లక్షలు ఇచ్చాడు. బంగారం ఇవ్వకుండా నేడు రేపు అని చెబుతుండటంతో బాధితుడు పంజగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆకుల వినయ్, విశాల్ రాజ్‌లను అదుపులోకి తీసుకున్నారు. అఖిల్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను గురువారం రిమాండ్‌కు తరలించారు.

పసునూరి రచనలు..

లడాయి (దీర్ఘ కవిత), అవుటాఫ్ కవరేజ్ ఏరియా (తెలంగాణ దళిత కథా సంపుటి), తెలంగాణ ఉద్యమ పాట–ప్రాదేశిక విమర్శ(పరిశోధన గ్రంథం), ఇమ్మతి (సాహిత్య విమర్శ వ్యాసాలు), గ్లోబలైజేషన్ సాహిత్య విమర్శ(పరిశోధన గ్రంథం), ఒంటరి యుద్ధ భూమి (కవిత్వం), పాటెత్తిన పాట (పాటకవులపై వ్యాసాలు), కండీషన్స్ అప్లయ్ (కథా సంపుటి).



పదునైన రచయిత పసునూరి

కేంద్ర సాహిత్య అకాడమీ యువ తొలి పురస్కార గ్రహీత

- బాల కళాకారునిగా మొదలై రచయితగా..
- సినిమా రంగంలోనూ అడుగుపెట్టి
- వరించిన పలు అవార్డులు, పురస్కారాలు

కొంతమందికి అవార్డుల ద్వారా పేరొస్తుంది. మరికొందరి వల్ల అవార్డులకే పేరొస్తుంది.. ఈ రెండో కోవకి చెందిన వారే యువ రచయిత డాక్టర్ పసునూరి రవీందర్. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకున్న తొలి తెలంగాణ రచయిత. అప్పటి వరకూ ఇలాంటి ఓ అవార్డు ఉందన్న విషయం సాహితీలోకంలో చాలా మందికి పెద్దగా తెలియదు. కవిగా, రచయితగా, విమర్శకునిగా, వాగ్గేయకారునిగా, వక్తగా, సామాజిక ఉద్యమకారునిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా కృషి అతడి సొంతం. గడిచిన రెండున్నర దశాబ్దాలుగా సాహిత్యానికి అంకితమై సాగుతున్న పసునూరి రవీందర్ స్ఫూర్తి కథనం 'సాక్షి' పాఠకుల కోసం...

– సుందరయ్య విజ్ఞాన కేంద్రం

భాగ్యనగరంలో స్థిరపడిన పసునూరి రవీందర్, ఉద్యమాల పురిటి గడ్డ వరంగల్ జిల్లాలో కూలి పనులు చేసుకొని బతికే వరమ్మ, వీరస్వామి దంపతుల మొదటి సంతానం. చిన్ననాటి నుంచి చదువే లోకంగా ఎదిగి, విద్యార్థి సంఘాల్లో నాయకునిగా, గాయకునిగా పేరు తెచ్చుకున్నారు. కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ తెలుగులో గోల్డ్ మెడల్ సాధించాడు. అనంతరం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఆచార్య పిల్లలమర్రి రాములు పర్యవేక్షణలో ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు సాహిత్య విమర్శ అన్న అంశంపై ఎంఫిల్, తెలంగాణ ఉద్యమపాట–ప్రాదేశిక విమర్శ అన్న అంశంపై పీహెచ్‌డీ, అలాగే పీహెచ్‌డీ అనంతరం పరిశోధనలో భాగంగా అస్తిత్వ ఉద్యమాల సాహిత్య విమర్శపై పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ చేశారు. డాక్టరేట్ పట్టాను అందుకున్న పసునూరి సాహిత్య కృషి కూడా ఎంతో స్ఫూర్తివంతమైంది.

బాల కళాకారునిగా..

మొదట బాల కళాకారునిగా పాటతో మొదలైన తన పయనం, అనతికాలంలోనే కవిత్వం మీదికి మళ్లింది. ఆ తరువాత కథల్లోకి చేరింది. అలా తాను రాసిన కథలను అవుటాఫ్ కవరేజ్ ఏరియా పేరుతో పుస్తకంగా ప్రచురించాడు. ఈ పుస్తకానికే కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. తాను తెలంగాణ పాటపై చేసిన పరిశోధనకు తెలంగాణ ఎన్ఆర్ఐ అసోసియేషన్ వారితో సురవరం ప్రతాపరెడ్డి పురస్కారం లభించింది. ఇక సాహిత్య విమర్శపై మక్కువతో తాను రాసిన వ్యాసాలను కలిపి ఇమ్మతి, గ్లోబలైజేషన్ సాహిత్య విమర్శ, పాటెత్తిన పాట వంటి పుస్తకాలను ప్రచురించారు.

సినిమా రంగంలోనూ..

ఇటీవల సినిమా రంగంలోనూ అడుగుపెట్టిన పసునూరి ప్రముఖ నిర్మాత రాఘవేందర్‌రావు సారథ్యంలో వచ్చిన సర్కార్ నౌకరోడు సినిమాలో చక్కని పాట రాశాడు. అలాగే అక్షర కుమార్ డైరెక్షన్‌లో వచ్చిన షరత్తులు వర్తిస్థాయి సినిమాలోనూ మరో పాటను అందించాడు.



అవార్డులు, పురస్కారాలు


- కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం (2015).
- సురవరం ప్రతాపరెడ్డి అవార్డు (2015).
- తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం (2020)
- తెలంగాణ సారస్వత పరిషత్ ఉత్తమ గ్రంథ అవార్డు (2024).
- భారతీయ దళిత సాహిత్య అకాడమీ సాహిత్య రత్న (2018).
- గూడ అంజయ్య స్మారక పురస్కారం (2019).
- సుద్దాల హన్మంతు పురస్కారం (2019).
- నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా పురస్కారం (2015).
- గిడుగు పురస్కారం (2017).
- కాళోజీ జాతీయ పురస్కారం (2020)లతో పాటు సుమారు 25పైగా అవార్డులు, పురస్కారాలు పొందారు.



ప్రపంచాన్ని మన గుప్పిట్లోకి అదే మరో చేత్తో మనల్ని తన గుప్పిట్లోకి తెచ్చేసింది స్మార్ట్‌ఫోన్. అయితే సరికొత్త ధైర్యాలతో పాటు భయాలను కూడా మనకు చేరువ చేస్తోంది. సరదాలను తీర్చడంతో పాటు సమస్యలనూ పేర్చేస్తోంది. రోజంతా ఫోన్‌తోనే గడిపే స్మార్ట్ ఫోన్ ప్రియుల్లో నోమో ఫోబియా అనే సరికొత్త అభద్రతా భావం పెరుగుతోందని ఒప్పో కౌంటర్‌పాయింట్ చేసిన అధ్యయనం వెల్లడించింది. ఈ ఫోబియా తీవ్రతను సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల్లోని 1,500 మంది స్మార్ట్‌ఫోన్ వినియోగదారులపై ఈ అధ్యయనం జరిగింది. అదే విధంగా నోమోఫోబియా అంటే నో మొబైల్ ఫోన్ ఫోబియా అంటే... మొబైల్ ఫోన్ నుంచి దూరం అవుతానేమో అనే భయంతో పుట్టే మానసిక స్థితి అని జర్నల్ ఆఫ్ ఫ్యామిలీ మెడిసిన్ అండ్ ప్రైమరీ కేర్‌లో ప్రచురించబడిన అధ్యయనం పేర్కొంది. మొబైల్ ఫోన్‌ల మితిమీరిన వినియోగం వల్ల సంభవించే మానసిక రుగ్మతల్లో ఇది ఒకటిగా తేల్చింది.

– సాక్షి, సిటీబ్యూరో






ఆరోగ్యంపై దుష్ప్రభావం..

నోమోఫోబియాతో ఆందోళన, శ్వాసకోశ మార్పులు, వణుకు, చెమట, ఆందోళన, అయోమయ స్థితి వగైరాలు కలుగుతున్నాయి. అలాగే నిద్రలేమి, ఏకాగ్రత లేమి, నిర్లక్ష్యాన్ని ప్రేరేపించి వ్యక్తిగత సంబంధాలను విస్మరించేలా చేస్తుంది. కారణం ఏదైనా సరే.. స్మార్ట్‌ఫోన్‌లపై అతిగా ఆధారపడటం వల్ల ముఖ్యమైన అప్‌డేట్‌లు, సందేశాలు లేదా సమాచారాన్ని కోల్పోతారనే భయంతో వ్యక్తులు ఈ ఫోబియాకు గురవుతున్నారు.

నోమోఫోబియా..

నగరవాసుల్లో పెరుగుతున్న మానసిక రుగ్మత


అప్పటిదాకా చేతిలోనే ఉన్న ఫోన్ కాసేపు కనబడకపోతే లేదా దూరంగా ఉంటే చాలు.. నా ఫోన్ ఏది? ఎక్కడ ఉంది? ఇప్పటిదాకా ఇక్కడే ఉండాలిగా... అంటూ ఆందోళనగా, అసహనంగా, గాభరాపడిపోవడం అలాగే ఫోన్ ఛార్జింగ్ అయిపోతే ఆగిపోతుందేమో అనే కంగారుపడేవాళ్లని చాలా మందినే మనం చూస్తున్నాం. అయితే వారిలో ఇది చూడడానికి సాధారణ సమస్యగా కనిపిస్తున్నా.. అది సాధారణం కానే కాదని, ఆ సమయంలో కలిగే భయాందోళనలు తీవ్రమైన మానసిక ఆరోగ్య సమస్యగా మారే ప్రమాదం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కారణం ఏదైనా సరే.. మన ఫోన్‌కు కొద్దిసేపైనా సరే దూరంగా ఉండాలనే ఆలోచన ఎవరికైతే ఆందోళన కలిగిస్తుందో.. తరచుగా తమ ఫోన్‌ను తరచి చూసుకోవడం వంటి లక్షణాలతో నోమో ఫోబియా బాధితులుగా మారే అవకాశం ఉందంటున్నారు. ప్రస్తుతం ఇది ప్రతీ నలుగురు స్మార్ట్ ఫోన్ ప్రియుల్లో ముగ్గురిని ప్రభావితం చేస్తోందని, నగరాలు/గ్రామాలు తేడా లేకుండా ఇది దాదాపు 75 శాతం జనాభాపై దాడి చేస్తోందని అధ్యయన నిర్వాహకులు అంటున్నారు.



మితమే హితం..

డిజిటల్ అక్షరాస్యత అందరికీ అలవడాలి. బాధ్యతాయుతమైన స్మార్ట్‌ఫోన్ వినియోగాన్ని ప్రోత్సహించడం అవసరం. సమస్య ముదిరితే అంతర్లీన ఆందోళన లేదా డిపెండెన్సీ సమస్యలను పరిష్కరించడానికి కాగ్నిటివ్–బిహేవియరల్ థెరపీ, కౌన్సెలింగ్ అవసరం కావచ్చు. స్మార్ట్‌ఫోన్ వినియోగంపై పరిమితులను సెట్ చేయాలి. అంటే 'టెక్–ఫ్రీ' సమయాలు లేదా ప్రాంతాలు వంటివి. శారీరక శ్రమ మానసికోల్లాసం కలిగించే ఆఫ్‌లైన్ కార్యకలాపాలు వంటి హాబీల్లో పాల్గొనడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

"సాంకేతికత రోజువారీ జీవితంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నందున, నోమోఫోబియా, దాని అనుబంధ సవాళ్లను పరిష్కరించడం ఒక క్లిష్టమైన అంశం కాబోతోంది. ఆరోగ్యకరమైన సాంకేతికత అలవాట్లను పెంపొందించడం స్మార్ట్‌ఫోన్‌లతో కాకుండా వ్యక్తుల మధ్య సంబంధాలను శక్తివంతం చేయడం వంటివి నోమోఫోబియా ప్రతికూల ప్రభావాన్ని తగ్గిస్తాయి."



అధ్యయన విశేషాలివీ..

- నో మొబైల్ ఫోబియానే షార్ట్ కట్‌లో 'నోమో ఫోబియా'గా పేర్కొంటున్నారు. ఇది వర్కింగ్ కండిషన్‌లో ఉన్న మొబైల్ ఫోన్ దగ్గర లేకపోవడం వల్ల కలిగే భయం లేదా ఆందోళనను సూచిస్తుంది.
- అధ్యయనంలో పాల్గొన్న స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల్లో 65 శాతం మంది తమ బ్యాటరీ ఛార్జింగ్ అయిపోతున్నప్పుడు రకరకాల మానసిక అసౌకర్యాలకి గురవుతున్నారని అధ్యయనం తేల్చింది. ఆ సమయంలో వీరిలో ఆందోళన, ఆత్రుత, డిస్‌కనెక్ట్, నిస్సహాయత, అభద్రత భావాలు ఏకకాలంలో ముప్పిరిగొంటున్నాయని వెల్లడించింది. అంతేకాకుండా బ్యాటరీ పనితీరు సరిగా లేదనే ఏకైక కారణంతో 60 శాతం మంది తమ స్మార్ట్ ఫోన్‌లను రీప్లేస్ చేయబోతున్నారని అధ్యయనం వెల్లడించింది.
- ఈ విషయంలో మహిళా వినియోగదారుల (74 శాతం మంది)తో పోలిస్తే పురుష వినియోగదారులు (82 శాతం మంది) ఎక్కువ సంఖ్యలో ఆందోళన చెందుతున్నారని అధ్యయనంలో తేలింది.
- ఫోన్ ఆగకూడదనే ఆలోచనతో 92.5 శాతం మంది పవర్–సేవింగ్ మోడ్‌ను ఉపయోగిస్తున్నారని, 87 శాతం మంది తమ ఫోన్లను ఛార్జింగ్ చేస్తున్నప్పుడు సైతం ఉపయోగిస్తున్నారని తేల్చింది.
- 'ముఖ్యంగా 31 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వారిలో బ్యాటరీ గురించిన ఆందోళన ఎక్కువగా ఉంది. తర్వాత స్థానంలో 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల వారు ఉన్నారు' అని రీసెర్చ్ డైరెక్టర్, తరుణ్ పాఠక్ చెప్పారు.



చిరుధాన్యాలతో చిత్రాలు..

ముప్పిడి విఠల్ కొత్త ఒరవడి
రాంనగర్‌లో ఆర్ట్ గ్యాలరీ

ముప్పిడి విఠల్ ఓ ల్యాండ్ స్కేప్ ఆర్టిస్ట్. కొన్ని సంవత్సరాలుగా రాంనగర్‌లో ఓ ఆర్ట్ గ్యాలరీని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఓ కార్పొరేట్ విత్తన సంస్థ విఠల్‌ను సంప్రదించింది. సంస్థకు చెందిన కీలక వ్యక్తి ఉద్యోగ విరమణ పొందుతున్నారు. అతడికి గతంలో ఎవరూ ఇవ్వని ప్రత్యేకమైన జ్ఞాపికను ఇవ్వాలనుకుంటున్నాము చేసి పెట్టగలరా అని అడిగారు. దీనికి మీ సంస్థ నేచర్ ఆఫ్ వర్క్ ఏమిటి? అని అడిగాడు విఠల్. దీనికి బదులుగా విత్తనాలు అమ్మే సంస్థ అని చెప్పారు. వెంటనే చేసి పెడతాను అతడి ఫోటో ఒకటి నాకు ఇవ్వండి అని చెప్పారు. అలా స్కెచ్ ఆర్టిస్ట్ నుంచి చిరుధాన్యాల ఆర్టిస్ట్‌గా మారాడు విఠల్.. ఆ వివరాలు తెలుసుకుందాం..


– ముషీరాబాద్

స్వతహాగా రైతు కుటుంబం నుంచి రావడం, సంస్థ కూడా విత్తనాలు అమ్మేది కావడం, విఠల్ కూడా గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే ఆర్టిస్ట్ కావడంతో వారు చెప్పగానే వెంటనే కనెక్ట్ అయ్యాడు. విత్తనాలతోనే అతడి బొమ్మను గీసి ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. వడ్లు, పెసర్లు, మినుములు, కందులు, జొన్నలు వంటి చిరుధాన్యాలే వస్తువులుగా వాడి సుమారు 15 రోజుల పాటు కష్టపడి అందమైన ఫొటోను తయారు చేసి ఇచ్చాడు. దీంతో ఈ ఫొటో వారిని అమితంగా ఆకట్టుకుంది. దీంతో ఆ సంస్థకు ఆస్థాన ఆర్టిస్టుగా మారిపోయాడు.



మలుపుతిప్పిన హర్షాబోగ్లే పెయింటింగ్

ఆ తరువాత సంస్థ ప్రముఖ క్రికెట్ కామెంటేటర్ హర్షాబోగ్లే సన్మాన కార్యక్రమంలో ఆయనకు కూడా ఇటువంటి వర్క్‌తో ఫొటో చేయించారు. దానికి ముఖ్య అతిథిగా హాజరైన సెంట్రల్ డైరెక్టర్ జనరల్, హర్ష బోగ్లేలు ఈ ఫొటోను చూసి ఎంతో ముగ్ధులయ్యారు. ఆ తరువాత కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్‌సింగ్‌కు ఇదే తరహా ఫొటోను ప్రజెంట్ చేయడంతో ఆయన కూడా ముగ్ధుడై ఇదే తరహాలో ప్రధాని నరేంద్రమోదీకి కూడా వేయాలని విఠల్‌ను కోరారు. యూపీలోని గోరఖ్‌పూర్‌లో కిసాన్ సమాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మోడీకి అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్‌సింగ్ ముప్పిడి విఠల్ పెయింటింగ్‌నే జ్ఞాపికగా అందజేయడం దానికి మోడీ ముగ్ధుడవ్వడం గమనార్హం. ఆ తరువాత ఎలాగైనా మోడీని కలవాలనుకున్న విఠల్ మరో బొమ్మను వేసి ఇటీవల ఎల్‌బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో స్వయానా అందజేశారు. అలాగే రైతు బంధు స్కీమ్ ప్రకటించిన సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కూ ఈ పెయింటింగ్ స్వయంగా అందజేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెయింటింగ్‌ను తయారు చేస్తున్నారు.



ఇదీ నేపథ్యం..

మెదక్ జిల్లాకు చెందిన ముప్పిడి విఠల్ తెలుగు యూనివర్సిటీలో బీఎఫ్ఏలో పట్టాపొందారు. ల్యాండ్ స్కేప్ పెయింటింగ్స్ వేయడంలో దిట్ట. రైతు కుటుంబంలో పుట్టి పెరిగిన విఠల్ ఆ వాతావరణం తోనే స్ఫూర్తి పొందారు. 30 సంవత్సరాల నుంచి ఇదే రంగంలో ఉంటూ గ్రామీణ వాతావరణాన్ని పల్లెల్లో మనకు కనపడే దృశ్యాలను కనులకు కట్టినట్లు తన పెయింటింగ్స్ ద్వారా చూయించడం అతడి గొప్పతనం. ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్‌తో పాటు పలు జాతీయ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లలో తన ల్యాండ్ స్కేప్స్‌ను ప్రదర్శనకు పెట్టి అందరి మన్ననలూ పొందారు. పలు జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులను అందుకున్నారు.

ఎలా వేస్తారు?

మొదటగా పెన్సిల్‌తో చిత్రం ఔట్ లైన్ గీసుకుని వాటిపై ఫెవికాల్ రాస్తు ఒక్కొ వడ్ల గింజను పేర్చుతాడు. శరీర రంగును బట్టి ఏ విత్తనమైతే అక్కడ సరిపోతుందో దాన్ని పేర్చుకుంటూ సైజు చూసుకుంటూ పెయింటింగ్ వేస్తాడు. అప్పుడే చిత్రం ఎలా ఉంటుందో అలా రూపుదిద్దుకుంటుంది. ఒక్కో పెయింటింగ్ వేయడానికి 15–20 రోజుల సమయం పడుతుంది. అభిమానంతో మోడీ, కేసీఆర్‌లకు మాత్రమే ఉచితంగా పెయింటింగ్ వేసి ఇచ్చారు. ఇవి ప్రస్తుతం 30–40 వేల వరకూ విక్రయిస్తున్నారు.



చిరుధాన్యాల చిత్రాలు నా గుర్తింపు..

సహజంగా నేను ల్యాండ్ స్కేప్ ఆర్టిస్ట్‌ని. ఇదే నా జీవితం. కానీ చిరుధాన్యాలతో వేసిన చిత్రాలే గుర్తింపు తెచ్చాయి. నగరంలో ఎంతో మంది పేరుమోసిన ఆర్టిస్టులు తమ చిత్రాల ద్వారా లక్షలు, కోట్లల్లో సంపాదించిన వారు ఉన్నారు. కానీ నా చిత్రం ద్వారా ప్రధానమంత్రి వరకూ వెళ్లగలిగిన వారిలో నేను ఒక్కడినే. ఈ చిత్రాలే నాకు గుర్తింపు తెచ్చాయి. చిత్రాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తాను.

– ముప్పిడి విఠల్, ల్యాండ్ స్కేప్ ఆర్టిస్ట్

ఆయేషా.. వారెవ్వా..!

కడు పేదరికం నుంచి.. బ్రిక్స్ వేదిక దాకా..

- రష్యాలో జరుగుతున్న బ్రిక్స్ యూత్ సదస్సు
- భారత్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయేషా
- సదస్సుకు హాజరైన ఏకైక తెలుగమ్మాయి
- హెచ్‌సీయూలో ఆర్గానిక్ సింథసిస్‌లో పీహెచ్‌డీ


ఆయేషా

సాక్షి, హైదరాబాద్: రష్యాలోని ఉలియనోస్క్ సిటీలో జరుగుతున్న బ్రిక్స్ దేశాల యూత్ మినిస్టర్స్ సదస్సులో భారత్‌తోపాటు వివిధదేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ అంతర్జాతీయ వేదికపై పలువురు తమ ఆలోచనలు పంచుకుంటున్నారు. అప్పుడే ఒకమ్మాయి లేచి నిల్చుంది. తన మదిలో మెదులుతున్న భావనలను వేదికపై నిలబడి సగర్వంగా చాటిచెప్పింది. ఆమె చెప్పిన మాటలకు అక్కడున్న వారంతా చప్పట్లు కొట్టి ప్రశంసలతో ముంచెత్తారు. ఆమె పేరే షేక్‌ఆయేషా. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న ఆయేషా దేశం తరపున బ్రిక్స్ సదస్సులో ప్రతినిధిగా పాల్గొన్న ఏకైక తెలుగమ్మాయి కావడం విశేషం.

పెందుర్తి టు సెంట్రల్ యూనివర్సిటీ

ఏపీలోని గాజువాక జిల్లా పెందుర్తికి చెందిన మదీనాబీబీ– వెంకటరమణ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వారిలో చిన్నకూతురు ఆయేషా. చిన్నప్పటి నుంచి చదువుతోపాటు సామాజిక చైతన్యంలో ఆయేషా ముందుండేది. డిగ్రీ వరకు విశాఖపట్నంలో చదవగా, విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేసింది. మూడేళ్ల క్రితం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సింథటిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీలో చేరింది.

సామాజిక సమస్యలపై పోరాటం

చదువుతోపాటు సామాజిక స్పృహ కూడా ఆయేషాకు ఎక్కువే. ఎప్పుడూ తన తోటి విద్యార్థులతో కలిసి హక్కుల కోసం గొంతుక వినిపించేది. ఇటీవల హెచ్‌సీయూలో జరిగిన స్టూడెంట్ ప్రెసిడెంట్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయింది. గెలుపోటములు పక్కన పెడితే విద్యార్థుల కోసం తాను ఉన్నానంటూ తెలియజెప్పడమే తన ధ్యేయమని ఆయేషా చెబుతోంది.

ఐదు రోజుల సదస్సు

ఈ నెల 22న రష్యాలో ప్రారంభమైన బ్రిక్స్ యూత్ సదస్సు శుక్రవారంతో ముగియనుంది. ఈ సదస్సులో సామాజిక సేవ విషయంలో బ్రిక్స్ దేశాల మధ్య ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్ ఉంటే బాగుంటుందని ఆయేషా ప్రతిపాదించింది. సంస్కృతి, యువతనాయకత్వం, కమ్యూనిటీ సర్వీస్ విషయంలో వలంటీర్ వర్క్ ఎలా జరుగుతుందనే విషయాలను బ్రిక్స్ దేశాల యువత పరస్పరం పంచుకోవాలని చెప్పింది. దీనిపై సదస్సులో చర్చ జరిగిందని, బ్రిక్స్ దేశాలు మద్దతు ఇచ్చాయని ఆయేషా వెల్లడించింది. కేంద్ర యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ సహాయమంత్రి రక్ష నిఖిల్ ఖడ్సే కూడా తనపై ప్రశంసలు కురిపించారని ఆమె పేర్కొంది.

29న శివశంకరికి 'సినారే' పురస్కారం



గన్‌ఫౌండ్రీ: జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత పద్మభూషణ్ డాక్టర్ సి.నారాయణరెడ్డి 93వ జయంతిని పురస్కరించుకుని ప్రముఖ తమిళ రచయిత్రి శివశంకరికి ఈ నెల 29న విశ్వంభర సినారే జాతీయ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ విషయాన్ని సుశీల నారాయణరెడ్డి ట్రస్టు ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, శాంతా బయోటిక్ ఎండి డాక్టర్ కేఐ వరప్రసాద్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి రచించిన పుస్తకావిష్కరణ, నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

క్లుప్తంగా...

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

- ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రికి రాసిన లేఖలో కాంగ్రెస్ ఎంపీలు
- విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మండిపడ్డారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, సురేశ్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్.రఘురామరాజు, గడ్డం వంశీ, కడియం కావ్య గురువారం ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. తెలంగాణలో ఐటీఐఆర్, ఐఐఎం, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, 9 జిల్లాలకు వెనుకబడిన జిల్లాల నిధులు కేటాయిస్తామని విభజన చట్టంలో కేంద్రం హామీ ఇచ్చిందని లేఖలో గుర్తుచేశారు. ఆ హామీలను అమలు చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇప్పటికే పలుమార్లు ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రితోపాటు సంబంధిత కేంద్ర మంత్రులను కలిశారన్నారు. అయినా కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులేవీ చేయలేదని విమర్శించారు. ఏపీకి ఇచ్చినట్లుగానే విభజన చట్టంలోని హామీలను తెలంగాణకూ అమలు చేయాలని ఎంపీలు డిమాండ్ చేశారు. అనంతరం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ఎంపీలు విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌ను ఏపీ, బిహార్ కోసమే పెట్టినట్లుందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌ను చీకటి బడ్జెట్‌గా అభివర్ణించారు. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై ఇప్పటికే పార్లమెంటులో తాము నిరసన వ్యక్తం చేశామని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు త్వరలో ఢిల్లీలో ధర్నా చేస్తామని చెప్పారు. ధర్నాకు ఆహ్వానిస్తే బీఆర్‌ఎస్ నేతలు ముందుకు రావట్లేదని కాంగ్రెస్ ఎంపీలు మండిపడ్డారు.

తాండూరులో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను ఆపండి

- లోక్‌సభలో చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని తాండూర్, బషీరాబాద్ రైల్వే స్టేషన్లలో మరిన్ని రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. లోక్‌సభలో గురువారం జీరో అవర్‌లో విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ స్టేషన్లలో హుబ్లీ ఎక్స్‌ప్రెస్ (17319) సహా మరిన్ని రైళ్లను ఆపాలని అయిదేళ్లుగా కోరుతున్నామని గుర్తు చేశారు. కాగా మూడు రోజులుగా ఈ స్టేషన్లలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ కూడా ఆగడం లేదని, దీనిపై కేంద్ర రైల్వేశాఖ దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తెల్లాపూర్ నుంచి సిద్దిపేట వరకు రైల్వే లైన్ మంజూరు చేయండి

- లోక్‌సభలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ: మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని తెల్లాపూర్ నుంచి సిద్దిపేట వరకు సర్వే పూర్తయ్యి పనులు మొదలు కాని రైల్వే లైన్‌ను మంజూరు చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో రఘునందన్‌రావు మాట్లాడారు. 1980లో ఇందిరాగాంధీ మెదక్ నుంచి పోటీ చేసినప్పుడు హామీ ఇవ్వడంతో సర్వే కూడా పూర్తయ్యిందన్నారు. అయితే ఈ రైల్వే లైన్‌కు సంబంధించి ఇప్పటివరకు 44 ఏళ్లు అయినప్పటికీ ప్రాజెక్ట్ పనులు మొదలు పెట్టలేదని పార్లమెంట్‌లో రఘునందన్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఇందిరాగాంధీ, కేసీఆర్ ప్రాతినిధ్యం వహించినా రైల్వే లైన్ పూర్తి కాలేదని ఎంపీ రఘునందన్‌రావు గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం 225 కిలోమీటర్ల రైల్వే లైన్ వెంటనే నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నిండుగా కృష్ణమ్మ ప్రవాహం

- శ్రీశైలం ప్రాజెక్టుకు 2.54 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల
- ఇలాగే వరద కొనసాగితే వారం రోజుల్లో ప్రాజెక్టు నిండే అవకాశం

సాక్షి,హైదరాబాద్/నాగర్‌కర్నూల్/ధరూర్: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా నదికి వరద ప్రవాహం పెరుగుతోంది. గురువారం జూరాల ప్రాజెక్టుతోపాటు తుంగభద్ర నుంచి కలిపి 2.54 లక్షల క్యూసెక్కుల నీరు శ్రీశైలం ప్రాజెక్టులో వచ్చి చేరింది. జూరాలలో విద్యుదుత్పత్తితోపాటు ప్రాజెక్టు 46 క్రస్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువన ఆల్మట్టి నుంచి 2,75,000 క్యూసెక్కులు, నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 2,50,120 క్యూసెక్కుల నీరు దిగువకు వస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం 885 అడుగులు కాగా, వరదనీటితో 855.20 అడుగులకు చేరింది. కృష్ణానదిలో వరద ఉధృతి ఇలాగే కొనసాగితే మరో వారంరోజుల్లో శ్రీశైలం డ్యాం పూర్తిస్థాయిలో నిండుతుంది.2021లో జూలై నెలలోనే శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయగా, రెండేళ్లుగా నీటి ప్రవాహం లేక ప్రాజెక్టు నిండలేదు.

సాగర్ ఎడమకాల్వకు నీటి నిలిపివేత

నాగార్జునసాగర్: సాగర్ ఎడమకాల్వకు గురువారం ఉదయం నీటిని నిలిపి వేశారు. ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ పరిధిలోని గ్రామాలకు తాగునీటిని అందించడం కోసం వా రం రోజుల పాటు 1.5 టీఎంసీల నీటిని విడుదల చేశారు.



వరద ఉధృతితో శ్రీశైలం జలాశయంలో పెరిగిన నీటిమట్టం



మళ్లీ పెరుగుతున్న గోదావరి

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి నదికి వరద ఉధృతి మళ్లీ పెరిగింది. రెండు రోజుల క్రితం 51.2 అడుగుల నీటిమట్టం ఉండగా, క్రమంగా తగ్గుతూ బుధవారం రాత్రి 45 అడుగులకు చేరుకుంది. అయితే మళ్లీ గురువారం ఉదయం నుంచి వరద పెరుగుతూ ఒంటిగంటకు 48 అడుగులకు చేరడంతో కలెక్టర్ జితేష్.వి.పాటిల్ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

పంట పొలాలు ఎండబెట్టారు

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రోజూ లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోతోంది.. కాళేశ్వరాన్ని విఫల ప్రాజెక్టుగా చూపే ప్రయత్నం చేస్తున్నారు
- పార్టీ నేతలతో కలసి ఎల్‌ఎండీ సందర్శన



గురువారం కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యామ్‌లో నీటి సామర్థ్యంపై ఎస్సారెస్పీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం

తిమ్మాపూర్(మానకొండూర్): ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం అని, ఈ ప్రాజెక్టుతో తెలంగాణను ధాన్యాగారంగా మార్చామని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం ఆయన లోయర్ మానేరు (ఎల్‌ఎండీ) జలాశయాన్ని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ రాష్ట్ర నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జలాశయం వద్ద విలేకరులతో మాట్లాడారు. 8 నెలలుగా కాళేశ్వరం నుంచి నీరు ఎత్తిపోయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పంట పొలాలను ఎండబెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. కాళేశ్వరంలో ఏర్పడిన చిన్న లోపాన్ని సాకుగా చూపి, ఒక విఫల ప్రాజెక్టుగా చూపే ప్రయత్నం చేశారన్నారు. కాళేశ్వరం నుంచి రోజూ లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వృథాగా పోతున్నా లిఫ్ట్ చేయడం లేదన్నారు. ఈ ఏడాది కేవలం 45 శాతం వర్షపాతం మాత్రమే నమోదయిందని అధికారులు చెబుతున్నారని, అందుకే లోయర్ మానేరు డ్యాం, మిడ్ మానేరు సహా ఎండిపోయిన ప్రాజెక్టులను పరిశీలించేందుకే తాము పర్యటిస్తున్నట్లు తెలిపారు. 10 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకొని మేడిగడ్డ ఠీవిగా నిలబడి ఉందని వివరించారు. లక్షలాది మంది రైతుల ప్రయోజనాలను రేవంత్‌రెడ్డి పణంగా పెట్టి, పంట పొలాలను ఎండబెడుతున్నారని ఆరోపించారు. ఎల్‌ఎండీ, అన్నపూర్ణ రిజర్వాయర్, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ నింపితే రైతుల్లో భరోసా ఏర్పడుతుందని పేర్కొన్నారు. నీరు ఉన్నప్పుడు కాళేశ్వరం ద్వారా ప్రాజెక్టులు నింపకుండా, రేపు వర్షం పడలేదనే సాకు చూపెడతారని అన్నారు. 40 వేల క్యూసెక్కుల ప్రవాహం దాటితే కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేసుకోవచ్చన్నారు. ఇప్పుడు అక్కడ పది లక్షల క్యూసెక్కుల నీరు కిందకు వెళుతోందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ద్వారా ప్రాజెక్టులు నింపాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలు రాకపోవడం వల్లే నీరు లిఫ్ట్ చేయడం లేదని అధికారులు చెబుతున్నారని, కన్నెపల్లి దగ్గర పంపు ఆన్ చేస్తే రిజర్వాయర్లు అన్నీ నిండుతాయని అన్నారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నింపితే రైతుల అవసరాలతో పాటు హైదరాబాద్ సహా ఇతర జిల్లాల తాగునీటి అవసరాలు తీరుతాయని వెల్లడించారు. కేసీఆర్‌ను బద్నాం చేయాలని ఎనిమిది నెలలుగా కాంగ్రెస్ చేసిన కుట్రలు ప్రజలు గమనిస్తున్నారన్నారు.

మేడిగడ్డపై తప్పుడు ప్రచారం

మేడిగడ్డ మేడిపండు అని ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ఎండుతున్న ప్రాజెక్టులు, రైతుల బాధలను శాసనసభలో ప్రస్తావిస్తామని తెలిపారు. కేసీఆర్ ఆదేశాలతో, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సూచనతో ప్రాజెక్టుల సందర్శనకు వచ్చామని వివరించారు. ఎన్నికలు ముగిసినందున రాజకీయాలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. కాగా, కేటీఆర్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాత్రి రామగుండంలోనే బస చేశారు. శుక్రవారం కన్నెపల్లి, మేడిగడ్డను సందర్శిస్తామని తెలిపారు.

మల్లారెడ్డిపై సెటైర్లు

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిపై కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సరదాగా సెటైర్లు వేశారు. ఎల్‌ఎండీ గేట్ల సమీపంలోని గెస్ట్ హౌస్ వద్ద మీడియాతో మాట్లాడుతుండగా సోషల్ మీడియా స్టార్ ఉండగా తాము మాట్లాడలేమంటూ కేటీఆర్ చమత్కరించారు. మాజీ మంత్రులు సబిత, నిరంజన్‌రెడ్డి సైతం తామందరికన్నా మల్లారెడ్డి స్టేట్ ఫిగర్ అంటూ సెటైర్లు వేశారు.

గుండాల అడవుల్లో ఎన్‌కౌంటర్

మావోయిస్టు అశోక్ అలియాస్ విజేందర్ మృతి

గుండాల/కొత్తగూడెంటౌన్/గణపురం: భద్రాద్రికొత్తగూడెం జిల్లా గుండాల మండలం దామరతోగు, ములుగు జిల్లా తాడ్వాయి మండలం బల్లేపల్లి సరిహద్దుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. ఎస్పీ రోహిత్‌రాజు ఒక ప్రకటనలో వెల్లడించిన వివరాల ప్రకారం.. నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన భద్రు, లచ్చన్నలతోపాటు 15 మంది ఆయుధాలతో సంచరిస్తున్నట్టు సమాచారం అందింది. దీంతో గురువారం పోలీసులు కూంబింగ్ చేపట్టారు. ఉదయం 10 గంటల సమయంలో దామరతోగు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు పోలీసులకు తారసపడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు జరగ్గా, ఓ మావోయిస్టు చనిపోయాడు. మృతదేహం వద్ద 303, ఎస్‌ఎల్‌ఆర్ వంటి ఆయుధాలతో పాటు మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం పోలీసులకు లభించింది.

ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే: ఆజాద్

మృతుడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్ధారం గ్రామానికి చెందిన అశోక్ (34) అలియాస్ విజేందర్‌గా పార్టీ ప్రకటించింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరిట లేఖ విడుదలైంది. ఈ ఎన్‌కౌంటర్‌కు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు పూర్తి బాధ్యత వహించాలని, ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని, ఇకనైనా పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఎన్‌కౌంటర్లు నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.



నల్లమారి అశోక్

తండ్రి సంవత్సరీకం రోజే...

నల్లమారి వీరస్వామి-రాజక్కల మూడవ సంతానమే అశోక్. యాదవకులానికి చెందిన అశోక్ డీసీఎం వ్యాన్ డ్రైవర్‌గా పనిచేశాడు. 2013లో ఓ వివాహ వేడుకకు పెళ్లివారిని తీసుకెళుతున్న క్రమంలో వ్యాన్ బోల్తా పడింది ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. దీంతో భయాందోళనకు గురైన అశోక్ జనశక్తి పార్టీలో చేరాడు. తల్లి రాజక్క 20ఏళ్ల క్రితమే చనిపోయింది. తండ్రి వీరస్వామి గత ఏడాది మృతి చెందాడు. వీరస్వామి సంవత్సరీకం గురువారం జరిగింది. తండ్రి సంవత్సరీకం రోజునే కుమారుడు అశోక్ ఎన్‌కౌంటర్‌లో చనిపోవడంతో బుద్ధారంలో విషాదచాయలు అలుముకున్నాయి.అశోక్‌కు సోదరుడు, సోదరి ఉన్నారు. తమ తమ్ముడు మృతదేహం ఇస్తే అంత్యక్రియలు చేస్తామన్నారు.

మంజీరా నదిలో చిక్కుకున్న పశువుల కాపరులు

- ముగ్గురిని రక్షించిన పోలీసులు

బోధన్ రూరల్: నిజామాబాద్ జిల్లా సాలూర మండలం మందర్న గ్రామ శివారులోని మంజీరా నదిలో గురువారం సాయంత్రం ముగ్గురు పశువుల కాపరులు చిక్కుకోగా పోలీసులు సకాలంలో స్పందించి వారిని రక్షించారు. మందర్న గ్రామానికి చెందిన పశువుల కాపరులు శివరాజ్, చంద్రకాంత్, ప్రకాశ్ పశువులను మేపేందుకు మంజీర నది వైపు తీసుకెళ్లారు. పశువులు మేత మేస్తూ నదిలోకి దిగగా, వాటిని బయటకు తోలేందుకు కాపరులు సైతం నదిలోకి దిగారు. పశువులను ఒడ్డుకు తరలించే క్రమంలో నదిలో వరద ఉధృతి పెరిగి కాపరులు నడుము లోతు నీటి ప్రవాహంలో చిక్కుపోయారు. వారిలో ప్రకాశ్‌కు ఈతరాదు. మిగతా ఇద్దరు వెంటనే గ్రామస్తులకు ఫోన్ చేసి తాము నదిలో చిక్కుకున్న విషయాన్ని తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు బోధన్ రూరల్ సీఐ నరేశ్, ఎస్ఐ నాగనాథ్ సిబ్బందితో నది వద్దకు చేరుకున్నారు. గజ ఈతగాళ్లను పిలిపించి తెప్పల సాయంతో ముగ్గురినీ ఒడ్డుకు చేర్చారు. బాధిత కుటుంబీకులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

'సుప్రీం' ప్రాంతీయ బెంచ్ ఏర్పాటు ప్రతిపాదన లేదు

- కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్
- ప్రసాద్ పథకంలోకి ఏపీలోని అన్నవరం, వేదగిరి దేవాలయాలు



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో సుప్రీంకోర్టు ప్రాంతీయ బెంచ్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ తెలిపారు. గురువారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో మంత్రి ఈ మేరకు స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని మంత్రి వెల్లడించారు.

హైదరాబాద్‌లో మెరుగుపడిన వాయు నాణ్యత

హైదరాబాద్‌లో వాయు నాణ్యత మెరుగుపడిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2017- 18 ఆర్థిక సంవత్సరం స్థాయిలతో పోలిస్తే 2023-24లో హైదరాబాద్‌లో పీఎం10 సాంద్రత 26.4% తగ్గిందని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్‌సింగ్ పేర్కొన్నారు. అలాగే దేశంలోని 18 నగరాలు నేషనల్ యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్స్‌కి అనుగుణంగా ఉన్నాయని, మొత్తం 9 నగరాలు వాయు నాణ్యతలో మెరుగుదల చూపించాయని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

ఏకలవ్య మోడల్ బోర్డింగ్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రతిపాదన రాలేదు

తెలంగాణ ప్రభుత్వం నుంచి ఏకలవ్య మోడల్ బోర్డింగ్ స్కూళ్ల ఏర్పాటుకు ఎటువంటి ప్రతిపాదన రాలేదని.. ప్రస్తుతం తెలంగాణకు మంజూరైన పాఠశాలలన్నీ రెసిడెన్షియల్ స్కూళ్లేనని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ స్పష్టత ఇచ్చారు. రాష్ట్రంలో మొత్తం 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లు ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

ప్రసాద్ పథకంలోకి బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం

హైదరాబాద్ బల్కంపేటలోని ఎల్లమ్మ దేవాలయాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రసాద్ పథకంలో చేర్చేందుకు గుర్తించినట్లు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. అంతేగాక ఆంధ్రప్రదేశ్‌లోని అన్నవరం సత్యనారాయణస్వామి దేవాలయం, నెల్లూరు జిల్లాలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాలను కూడా ప్రసాద్ పథకం అమలు కోసం గుర్తించామన్నారు. గురువారం రాజ్యసభలో బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ఈ వివరాలు తెలిపారు.

మాదాపూర్‌లో రేవ్ పార్టీ

- ఎస్టీఎఫ్ అధికారుల దాడి.. ఐదుగురు అరెస్ట్
- రూ. 1.5 లక్షల విలువ చేసే మత్తు పదార్థాలు, విదేశీ మద్యం స్వాధీనం

హఫీజ్‌పేట్: మాదాపూర్‌లో రేవ్ పార్టీపై స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) అధికారులు దాడి చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ కె.వై.ఖురేషీ, ఎస్టీఎఫ్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు గురువారం శేరిలింగంపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. బేగంపేటకు చెందిన నాగరాజు యాదవ్ (31) ఆధ్వర్యంలో మాదాపూర్ సైబర్ టవర్స్ వెనక ఉన్న క్లౌడ్ 9 హోమ్స్ సర్వీస్ అపార్ట్‌మెంట్స్‌లో జన్మదిన వేడుకల్లో రేవ్ పార్టీ ఏర్పాటు చేశారు. ఈ నెల 12న నాగరాజు గోవా నుంచి 3 గ్రాముల కొకైన్‌ను తెప్పించి మోకిలకు చెందిన నితిన్ (24)కు అందించాడు. బేగంపేటకు చెందిన సాయికుమార్ యాదవ్ (27) విదేశాల నుంచి మద్యం తీసుకురాగా, బంజారాహిల్స్‌కు చెందిన సీహెచ్ కిషోర్ (28) రేవ్‌పార్టీకి కోసం సర్వీస్ అపార్ట్‌మెంట్ బుక్ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం అర్ధరాత్రి ఎస్ఐలు బాల్‌రాజ్, సంధ్యల బృందం రేవ్‌పార్టీపై దాడి చేసి 14 మంది యువకులు, 6 మంది యువతులను అదుపులోకి తీసుకుంది. వారి నుంచి సుమారు రూ.1.50 లక్షల విలువ చేసే కొకైన్ (1 గ్రాము), ఎండీఎంఏ (2 గ్రాములు), ఓజీ కుష్(1 గ్రాము)తోపాటు 12 విదేశీ మద్యం సీసాలు, 36 బీర్ సీసాలు, ఒక ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. పార్టీ నిర్వహించిన నాగరాజుతోపాటు మత్తుపదార్థాలు సరఫరా చేసిన సాయికుమార్ యాదవ్, ఇమాన్యుల్, సీహెచ్ కిషోర్, నితిన్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. మిగతా 15 మందిని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. రేవ్‌పార్టీలో పట్టుబడ్డ ఐదుగురు యువకులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎబాన్ యూరిన్ టెస్ట్ అనే నూతన పరికరంతో పరీక్షలు చేశారు. ఈ పరీక్షతో కేవలం 5 నిమిషాల్లోనే సదరు వ్యక్తి డ్రగ్స్ తీసుకున్నాడో లేదో తెలుసుకోవచ్చు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కె.వై.ఖురేషీ, ఎస్టీఎఫ్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు

పాలక్... పన్నీరు

మనసున్న పాట

పాలక్ ముచ్చల్ అనే పేరు వినిపించగానే తీయటి పాట ఒకటి గుర్తొస్తుంది సింగర్‌గా మంచి పేరు తెచ్చుకున్న పాలక్ సామాజిక సేవలోనూ తన వంతుగా కృషి చేస్తోంది. ఫండింగ్ ద్వారా ఇప్పటి వరకు మూడు వేల మంది పేద పిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయించింది.



బాలీవుడ్ సినిమా 'ఎంఎస్ దోని–ది అన్ టోల్డ్ స్టోరీ'లోని 'కౌన్ తుఝే' పాటతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది పాలక్. ఇండోర్‌కు చెందిన పాలక్‌కు కాలేజీ రోజుల నుంచి పాటతో పాటు సేవా బాటలో పయనించడం అంటే కూడా ఇష్టం.

పాలక్ తొలి ఫండ్ రైజింగ్ ప్రాజెక్ట్ కార్గిల్ వీర సైనికుల కోసం చేసింది. ప్రతి షాప్ ముందుకు వెళ్లి దేశభక్తి గీతాలు పాడి 'కార్గిల్ వీర సైనికులకు మీ వంతుగా సహాయం చేయండి' అని అడిగేది.

కళ, సామాజిక సేవను పాలక్ వేరు చేసి చూడదు. మూడు వేల మంది పేద పిల్లలకు గుండె ఆపరేషన్‌లు చేయించడానికి తనలోని కళ బలమైన మాధ్యమంగా ఉపయోగపడుతుందని చెబుతుంది పాలక్.

సినిమాల్లో అవకాశాలు దొరకని రోజుల్లో కూడా ఎన్నో ప్రోగ్రామ్స్ చేసి పేద పిల్లల కోసం విరాళాలు సేకరించేది.

పాలక్ ఒక మ్యూజిక్ ప్రోగ్రామ్ చేసిందంటే పది మంది పేద పిల్లల వైద్యానికి అవసరమైన డబ్బును సేకరించినట్లే. బాలీవుడ్‌లో సింగర్‌గా పాలక్‌కు మంచి పేరు రావడమే కాదు ఆ పేరు విరాళాల సేకరణకు బాగా ఉపయోగపడింది.

'మీ పాట అద్భుతం' అనే ప్రశంస కంటే, పేదింటి తల్లిదండ్రుల గొంతు నుంచి వినిపించే...

'మీ వల్ల మా బిడ్డ బతికింది' అనే మాట పాలక్‌కు ఎక్కువ సంతృప్తి ఇస్తుంది. ఇప్పుడు పాలక్ వెయిటింగ్ లిస్ట్‌లో 413 మంది పిల్లలు ఉన్నారు. వారికి హార్ట్ సర్జరీలు చేయించాల్సిన బాధ్యతను భుజాలకెత్తుకుంది.

'మనస్ఫూర్తిగా కోరుకుంటే అంతా మంచే జరుగుతుంది. పేదపిల్లలకు అండగా నిలవడానికి ఇది దేవుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తాను' అంటుంది పాలక్ ముచ్చల్.

ఫ్యాషన్








గ్రామీణ మహిళా కళాకారులను ప్రోత్సహించడానికి, వారి వారసత్వ కళను, ఫ్యాబ్రిక్ క్రాఫ్ట్‌ను భారతదేశం అంతటా పరిచయం చేయడానికి ది వోవెన్ ల్యాబ్ పేరుతో కృషి చేస్తున్నారు భూపాల్ వాసి నిఖితా కౌశిక్. ముంబైలోని నిఫ్ట్ పూర్వవిద్యార్థి అయిన నిఖిత జీరోవేస్ట్ పాలసీతో పాతికమంది గ్రామీణ మహిళల చేత పట్టణ మహిళల కోసం ఆధునికంగా డ్రెస్‌లను డిజైన్ చేయించి, వారికి ఉపాధి కల్పిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'స్టైల్ తత్త్వ' ఎగ్జిబిషన్‌లో క్రాఫ్ట్స్, హ్యాండ్లూమ్ క్లస్టర్స్‌కి వారధిగా ఉంటూ చేస్తున్న కృషిని వివరించారు.

సిటీకి పల్లె కళ

''ఈ రోజు మనం భారతీయులమని చెప్పుకోవడానికి గర్విస్తున్నామంటే మన దేశంలోని విభిన్న సంస్కృతులూ, సంప్రదాయాలూ కారణం. వేటికవి సొంత మార్గాలలో ప్రత్యేకమైనవి. ఫలితంగా మన జీవితంలో దుస్తులు ముఖ్యమైన అంశంగా మారాయి. మన గ్రామీణ మహిళా కళాకారుల హస్తకళ శిల్ప నైపుణ్యాన్ని చేతితో నేసిన వస్త్రాలను మరింత మెరుగుపరచడంలో మా పని కీలకంగా ఉంటుంది. చిట్ట చివరగా ఉపయోగించే చిన్న ఫ్యాబ్రిక్ పీస్‌తో కూడా 'కళ'ద్వారా అందంగా డిజైన్ చేస్తాం. ఇందుకోసం నిరంతరం పరిశోధన జరుగుతూనే ఉంటుంది. అందుకే, మా బ్రాండ్‌కు 'ది వోవెన్ ల్యాబ్' అని పేరు పెట్టాం.



నిఖితా కౌశిక్

జీరో వేస్ట్ పాలసీ

రాజస్థాన్, గుజరాత్ భోపాల్.. ప్రాంతాల్లోని గ్రామీణ, గిరిజన మహిళల చేతుల్లో రూపుదిద్దుకున్న మా దుస్తుల డిజైన్స్ బయట షాపుల్లో లభించవు. ఎగ్జిబిషన్లు, ఆన్‌లైన్ ద్వారా అమ్మకం చేస్తుంటాం. మన దేశీ కాలా పత్తితో పాటు టెన్సెల్, రీసైకిల్ ఫ్యాబ్రిక్స్, పర్యావరణ అనుకూలమైన క్లాత్‌తోనే డిజైన్ చేస్తున్నాం. అరుదైన కాటన్ ఫ్యాబ్రిక్, ప్రాచీన కళా వైభవం గల మోడర్న్ డిజైనరీ డ్రెస్సులు కాబట్టే వీటి ఖర్చు ఎక్కువే. కానీ, ఎక్కడ ఉన్నా ప్రత్యేకతను చాటుతుంటాయి.

మహిళా సాధికారత

మా సంస్థకు ఉన్న బలమైన స్తంభాలలో ఒకటి మహిళా సాధికారత. ఇప్పటికి పాతిక మంది గ్రామీణ మహిళలు ఈ డిజైన్స్ కోసం కృషి చేస్తున్నారు. కళ పట్ల ఆసక్తి ఉన్న గ్రామీణ బాలికలను ఎంపిక చేసుకొని, శిక్షణ ఇవ్వడమే కాకుండా, వారి ప్రాథమిక విద్య కూడా సవ్యంగా జరిగేలా చూస్తున్నాం. ఒక డ్రెస్ కొనుగోలు చేస్తే ఆ మొత్తంతో ఆ కళాకారుల ఇల్లు నెలంతా ఏ ఇబ్బంది లేకుండా గడిచిపోతుంది. భవిష్యత్తు తరాలు ఆ కళావైభవాన్ని సొంతం చేసుకోవాలన్నదే నా కల. చాలావరకు సేకరించే కాటన్ ఫ్యాబ్రిక్ ఐవరీ, గ్రే కలర్ వే ఎంచుకుంటాం. కొన్నింటికి మాత్రం నేచురల్ రంగులతో డైయింగ్ ప్రక్రియ ఉంటుంది. వ్యర్థాలను నివారిస్తూ, పర్యావరణ అనుకూలమైన ఉత్పత్తులను వెలుగులోకి తీసుకురావాలన్నదే మా ప్రయత్నం తప్ప ఫాస్ట్ ఫ్యాషన్ పోటీ పరుగులో చేరం.

రాబోయే తరాలకు మన కళ

ప్రాచీన హ్యాండ్ వర్క్స్‌ని వదిలేస్తే అవి అంతే సులువుగా మరుగున పడిపోతాయి. క్రాఫ్ట్స్ క్లస్టర్స్ ఆఫ్ ఇండియాతో అనుబంధంగా వర్క్ చేస్తున్నాను కాబట్టి దేశంలోని హ్యాండ్లూమ్ క్లస్టర్స్‌తోనూ, ఈ మార్గంలో వచ్చే అంతరాలను పూడ్చేందుకు నిఫ్ట్‌లోని వివిధ కేంద్రాలతో అనుబంధంగా వర్క్ చేస్తున్నాను.

ఫ్యాబ్రిక్ సేకరణ, డిజైన్స్ సృష్టి, వ్యర్థాలు మిగలకుండా జాగ్రత్తపడటం అనేది ఓ సవాల్‌గా ఉంటుంది. కానీ, పర్యావరణ హితంగా, మనసుకు నచ్చిన పని చేస్తుండటం ఎప్పుడూ ఉత్సాహాన్ని ఇస్తుంది. అంతేకాదు, ఈ డిజైన్స్‌ని ఇష్టపడి కొనుగోలు చేసేవారి ద్వారా ప్రాణం పెట్టే కళాకారులకు ఉపాధి పొందేలా చేయడం మరింత సంతృప్తిని ఇస్తుంది'' అని వివరించారు ఈ డిజైనర్.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వంటిల్లు

ఇది పకోడీ కాలం

ఇది వర్షాకాలం. వాన చినుకులు పడుతుంటే... వేడి వేడి పకోడీలు తింటూ గరం గరం చాయ్ తాగుతూ ఉంటే ఎలా ఉంటుంది? ఏడాదంతా వర్షాకాలమే ఉంటే బావుణ్ణనిపిస్తుంది. ఇది వర్షాకాలం కాదు పకోడీల కాలం అనాలనిపిస్తుంది.



పోహా పకోడీ

కావలసినవి: అటుకులు– ఒకటిన్నర కప్పులు; బంగాళాదుంప– అర కప్పు (ఉడికించి చిదిమినది); కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; పచ్చిమిర్చి తరుగు– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; చక్కెర – అర టీ స్పూన్; నిమ్మరసం – అర టీ స్పూన్; జీలకర్ర– అర టీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె– వేయించడానికి తగినంత.

తయారీ: ● అటుకులను ఒక పాత్రలో వేసి (అటుకులు తేలేటట్లు) నిండుగా నీటిని పోసి కడిగి వడపోత గిన్నెలో వేయాలి ● నీరంతా కారిపోయిన తర్వాత తీసి వెడల్పు పాత్రలో వేసుకోవాలి. అందులో ఉడికించి చిదిమిన బంగాళాదుంప, కొత్తిమీర, పచ్చిమిర్చి, మిరప్పొడి, చక్కెర, జీలకర్ర, నిమ్మరసం, ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం అంతటినీ చిన్న నిమ్మకాయంత గోళీలుగా చేసుకోవాలి ● బాణలిలో నూనె వేడి చేసి, మరుగుతున్న నూనెలో ఒక్కో గోళీని మెల్లగా వేయాలి. మంటను మీడియంలో పెట్టి దోరగా వేగనివ్వాలి. అన్నివైపులా ఎర్రగా వేగిన తర్వాత చిల్లుల గరిటతో తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే పోహా పకోడీ రెడీ. వీటికి పుదీన చట్నీ లేదా టొమాటో కెచప్ మంచి కాంబినేషన్.



కార్న్ పకోడీ



కావలసినవి: స్వీట్ కార్న్ గింజలు– 2 కప్పులు; అల్లం వెల్లుల్లి పేస్ట్ – 2 టీ స్పూన్‌లు; జీలకర్ర– అర టీ స్పూన్; శనగపిండి– 3 టేబుల్ స్పూన్‌లు; బియ్యప్పిండి– 3 టేబుల్ స్పూన్‌లు; గరం మసాలా – అర టీ స్పూన్; ఉల్లిపాయ – ఒకటి (తరగాలి); పచ్చిమిర్చి – 2 (తరగాలి); కరివేపాకు – 2 రెమ్మలు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పసుపు – పావు టీ స్పూన్; మిరప్పొడి– అర టీ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● మొక్కజొన్న గింజలను కడిగి చిల్లుల పాత్రలో వేసి నీరు పోయే వరకు ఉంచాలి ● ఈ లోపు ఒక పాత్రలో నూనె మినహా పైన తీసుకున్న వన్నీ వేసి కలపాలి ● మొక్కజొన్న గింజల్లో గుప్పెడు గింజలను తీసి పక్కన పెట్టి మిగిలిన గింజలను మిక్సీలో కచ్చపచ్చాగా గ్రైండ్ చేయాలి. ఇప్పుడు పక్కన పెట్టిన గింజలను కూడా శనగపిండి మిశ్రమంలో వేసి కలపాలి ● బాణలిలో నూనె మరిగించి పకోడీ మిశ్రమాన్ని చేతిలోకి తీసుకుని వేళ్లతో కొద్దికొద్దిగా నూనెలో వేయాలి. దోరగా వేగిన తర్వాత తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే వేడి వేడి కార్న్ పకోడీలు తినడానికి రెడీ. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి.

సినిమా

మహేశ్‌బాబు గోల్డ్?



హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లోని సినిమా అంతర్జాతీయ స్థాయిలో రూపొందనున్న సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమా ప్రతి అప్‌డేట్ ప్రపంచవ్యాప్త సినీ ప్రేమికులకు ఆసక్తికరంగా అనిపిస్తోంది. తాజాగా ఈ సినిమాకు 'గోల్డ్' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో బలంగా వినిపిస్తోంది. గతంలో 'మహారాజా', 'మహారాజ్' వంటి పేర్లు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. లేటెస్ట్‌గా 'గోల్డ్' టైటిల్ వినిపిస్తోంది. ఆఫ్రికన్ ఫారెస్ట్ అడ్వెంచరస్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమా ప్రధాన కథాంశం ఓ నిధి వేట అనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇప్పుడు ఈ సినిమాకు 'గోల్డ్' అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నారనే వార్త రావడంతో నిధి నేపథ్యం కాబట్టి ఈ టైటిల్‌నే ఖరారు చేస్తారనే చర్చ జరుగుతోంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌ను రచయిత విజయేంద్ర ప్రసాద్ పూర్తి చేశారని, హైదరాబాద్‌లో సెట్ వర్క్ జరుగుతోందని, జర్మనీలో కొంత చిత్రీకరణను ప్లాన్ చేశారని తెలుస్తోంది. షూటింగ్‌ను ఈ ఏడాదిలోనే ప్రారంభించాలనుకుంటున్నారు మేకర్స్.

పాఠాలు నేర్పినవారందరికీ ధన్యవాదాలు



● శ్రుతీహాసన్

హీరోయిన్‌గా పదిహేనేళ్ల విజయవంతమైన కెరీర్‌ని పూర్తి చేసుకుంటూ, ఇంకా అగ్ర శ్రేణి హీరోయిన్ల జాబితాలో ఒకరిగా రాణిస్తుండటం అంటే అంత సులభమైన విషయం కాదు. ఈ లిస్ట్‌లో చాలా తక్కువమంది హీరోయిన్లు ఉంటారు. తాజాగా శ్రుతీహాసన్ పేరు ఈ లిస్ట్‌లో చేరింది. తండ్రి కమల్‌హాసన్ నటించిన ద్విభాషా (తమిళం, హిందీ) చిత్రం 'హే రామ్' (2000)లో చైల్డ్ ఆర్టిస్టుగా తొలిసారి స్క్రీన్‌పై కనిపించారు శ్రుతీహాసన్. చైల్డ్ ఆర్టిస్టుగా మరో సినిమా చేయలేదు కానీ.. 'హే రామ్' రిలీజైన తొమ్మిదేళ్లకు హిందీ చిత్రం 'లక్' (2009)తో కథానాయికగా కెరీర్‌ను ఆరంభించారు శ్రుతి. ఆ తర్వాత సూర్య 'సెవెన్త్ సెన్స్', ధనుష్ 'త్రీ', రామ్ చరణ్ 'ఎవడు', అల్లు అర్జున్ 'రేసుగుర్రం' రవితేజ 'క్రాక్' .. ఇటీవల చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', ప్రభాస్ 'సలార్: సీజ్‌ఫైర్' వంటి చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించారు శ్రుతి. నటిగా–గాయనిగా–సంగీత దర్శకురాలిగా... ఇలా మల్టీ టాలెంట్‌తో దూసుకెళుతున్నారు శ్రుతీహాసన్. కథానాయికగా పదిహేనేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రుతీహాసన్ స్పందిస్తూ – ''అప్పుడే పదిహేనేళ్లు పూర్తయ్యాయంటే నమ్మశక్యంగా లేదు. నేను పెరిగిన మ్యూజికల్ ఇండస్ట్రీలోనే ఇంతకాలం నేను ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. నా మిగతా జీవితాన్ని కూడా ఇండస్ట్రీతోనే ముడివేస్తాను. ఇండస్ట్రీలో నాకు అందమైన పాఠాలు నేర్పినవారందరికీ ధన్యవాదాలు. అలాగే నన్ను ఆదరించిన ప్రేక్షకులు, నా అభిమానులకు థ్యాంక్స్. వీళ్లే లేకపోతే నేను ఇలా ఉండేదాన్ని కాదు'' అన్నారు. రజనీకాంత్ 'కూలీ', ప్రభాస్ 'సలార్: శౌర్యంగాపర్వం', అడవి శేష్ 'డెకాయిట్' చిత్రాల్లో నటిస్తున్నారు శ్రుతీహాసన్.

తనికెళ్ల భరణికి డాక్టరేట్



ప్రముఖ నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణికి వరంగల్ ఎస్ఆర్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. తనికెళ్ల భరణి దాదాపు 800లకు పైగా సినిమాల్లో నటించి ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 52 సినిమాలకు మాటలు అందించారాయన. 'సముద్రం' సినిమాకి ఉత్తమ విలన్‌గా, 'నువ్వు నేను' చిత్రానికి ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్టుగా, 'గ్రహణం' చిత్రంతో ఉత్తమ నటునిగా, 'మిథునం' సినిమాకిగాను ఉత్తమ రచయిత–ఉత్తమ దర్శకునిగా నంది అవార్డులు అందుకున్నారాయన. ఇక ఆగస్ట్ 3న వరంగల్‌లో జరిగే యూనివర్సిటీ స్నాతకోత్సవంలో తనికెళ్ల భరణికి డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు.

మళ్లీ తల్లి కాబోతున్నాను



'ఏం పిల్లో ఏం పిల్లడో', 'బావ', 'పాండవులు పాండవులు తుమ్మెద, రభస, బ్రహ్మోత్సవం' వంటి సినిమాల్లో నటించిన ప్రణీత తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. ఇక వ్యక్తిగత విషయానికి వస్తే... 2021 మే 30న వ్యాపారవేత్త నితిన్ రాజుతో ప్రణీత వివాహం జరిగింది. 2022 జూన్‌లో ప్రణీత ఓ పాపకు జన్మనిచ్చారు. కొన్ని నెలలు సినిమాలకు విరామం తీసుకున్నాక ఆమె కన్నడలో చేసిన ఒక సినిమా, మలయాళంలో చేసిన ఒక సినిమా ఈ ఏడాది విడుదలయ్యాయి. కాగా తాను రెండోసారి తల్లి కాబోతున్నట్లు పేర్కొన్నారు. 'రౌండ్ 2.. ఇప్పటి వరకూ నేను వాడిన పాంట్స్ ఇక నాకు ఫిట్ కావు'' అంటూ బేబీ బంప్ ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు ప్రణీత.

● ప్రణీత

హారర్... థ్రిల్



● ప్రియా భవానీ శంకర్

అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వం వహించారు. విజయ సుబ్రహ్మణ్యన్, ఆర్.సి.రాజ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టులో విడుదల కానుంది. రాజ్ వర్మ ఎంటర్‌టైన్‌మెంట్– శ్రీ బాలాజీ ఫిలింస్ తెలుగులో విడుదల చేస్తున్నాయి. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు రామ్ గోపాల్ వర్మ రిలీజ్ చేసి, 'ట్రైలర్ ఆసక్తిగా ఉంది. సినిమా హిట్టవ్వాలి' అన్నారు. కాగా అజయ్ ఆర్. జ్ఞానముత్తు దర్శకత్వంలో వచ్చిన 'డీమాంటీ కాలనీ'కి సీక్వెల్‌గా 'డీమాంటీ కాలనీ 2' రూపొందింది. ''హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ఇది. డీమాంటీ ఇంట్లో అనూహ్యమైన ఘటనలు జరుగుతుంటాయి. ఆ ఇంట్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు వెళ్లిన వారు చనిపోతుంటారు. ఇంతకీ ఆ ఇంట్లో ఉన్న ఆ శక్తి ఏంటి? చివరగా వెళ్లినవారు ఎలా ప్రాణాలు కాపాడుకున్నారు?' అనేది 'డీమాంటీ కాలనీ 2'లో ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు మేకర్స్.



● రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా

తెగబడవేమీ...

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా ఏఎస్ రవి కుమార్ చౌదరి దర్శకత్వం వహించిన చిత్రం 'తిరగబడరసామీ'. మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 2న రిలీజ్ కానుంది. తాజాగా ఈ చిత్రం టైటిల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. 'కత్తులు దిగని నెత్తురుతోని తడపర భూమి తెగబడవేమీ...' అంటూ సాగే ఈ పాటకి జేబీ సంగీతం అందించారు. సుద్దాల అశోక్ తేజ సాహిత్యం అందించిన ఈ పాటని సాయి చరణ్, లోకేశ్వర్ ఈదర, చైతు సత్సంగి పాడారు. ''యూత్‌ని ఆకట్టుకునే రొమాన్స్‌తో పాటు ఫ్యామిలీని ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ని అలరించే హై ఓల్టేజ్ యాక్షన్ అంశాలతో 'తిరగబడర సామీ' రూపొందింది. టీజర్, ట్రైలర్, పాటలు సినిమాపై క్యూరియాసిటీని పెంచాయి'' అని చిత్రబృందం పేర్కొంది.

రక్షించండి!



● 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబ' పోస్టర్

తాప్సీ నటించిన రొమాంటిక్ థ్రిల్లర్ మూవీ 'హసీన్ దిల్‌రుబ' (2021) హిట్టయిన విషయం తెలిసిందే. విక్రాంత్ మెస్సీ మరో లీడ్ రోల్‌లో నటించిన ఈ సినిమాకు వినీల్ మాథ్యూ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబ' రూపొందింది. సీక్వెల్‌లోనూ తాప్సీ, విక్రాంత్ మెస్సీ లీడ్ రోల్స్‌లో నటించగా, వినీల్ మాథ్యూయే దర్శకత్వం వహించారు. ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'నాతో కలిసి నువ్వు సినిమాకు వస్తావా?' 'నన్ను రక్షించండి... నా భర్త నన్ను చంపబోతున్నాడు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రం ఆగస్టు 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

సినిమా బాగుందని అంటారు



● మహేంద్రనాథ్

''సమాజంలోని ఒక అంశానికి వాణిజ్య అంశాలు జోడించి 'విరాజి' తీశాం. ఈ సినిమాలో మంచి కంటెంట్ ఉంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని అంటారనే నమ్మకం ఉంది'' అని నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల అన్నారు. వరుణ్ సందేశ్ హీరోగా నటించిన చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ మాట్లాడుతూ– ''వరలక్ష్మితో 'శబరి' సినిమా తర్వాత మా సంస్థలో నిర్మించిన రెండో చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష చెప్పిన కథని అంతే బాగా తెరకెక్కించారు. వరుణ్ సందేశ్ అమెరికా నేపథ్యం ఉన్న వ్యక్తి. అతని డైలాగ్ డెలివరీ విధానం 'విరాజి'కి కలిసొచ్చింది. మా సినిమాని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ వాళ్లు నైజాంలో రిలీజ్ చేస్తున్నారు'' అన్నారు.

ఏమైందో మనసే...



● పవన్, సాహిబా

'మెరిసే మెరిసే' చిత్ర దర్శకుడు పవన్ కుమార్ కొత్తూరి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహా మాలవ్య, సాహిబా భాసిన్, వివియా సంత్ హీరోయిన్లుగా నటించారు. శ్రీ నీలకంఠ మహదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీపై రూపొందిన ఈ చిత్రం పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఆగస్ట్ 2న విడుదల కానుంది. కాగా 'ఏమైందో మనసే' అంటూ సాగే ఈ చిత్రంలోని రెండో పాటను రిలీజ్ చేశారు. ఈ పాటకు కార్తీక్ బి. కొడకండ్ల సంగీతం అందించారు. కృష్ణవేణి మల్లవజ్జల సాహిత్యం అందించగా, శక్తి శ్రీ గోపాలన్ పాడారు.

‘ఏడు’ దాటి ఎంత వరకు?

‘పారిస్’లో మరిన్ని పతకాలపై భారత్ గురి

● పతాకధారులుగా సింధు, శరత్ కమల్



టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ 7 పతకాలు గెలుచుకుంది. భారత హాకీ జట్టుతోపాటు వ్యక్తిగత విభాగంలో పతకాలు నెగ్గిన నీరజ్ చోప్రా, మీరాబాయి చాను, సింధు, లవ్లీనా పారిస్ ఒలింపిక్స్‌లో కూడా పోటీ పడేందుకు సిద్ధమయ్యారు. గత ఒలింపిక్స్‌లో రజత, కాంస్యాలు నెగ్గిన రెజ్లర్లు రవి దహియా, బజరంగ్ ఈసారి అర్హత సాధించలేదు.

మళ్లీ సత్తా చాటేందుకు...

ఒలింపిక్ స్వర్ణపతకంతో పాటు ప్రస్తుత ప్రపంచ చాంపియన్ కూడా అయిన నీరజ్ చోప్రా జావెలిన్ త్రోలో మళ్లీ పతకం సాధిస్తాడని అభిమానులంతా ఆశలు పెట్టుకున్నారు. టోక్యో తర్వాత ఎక్కడా ఉదాసీనతకు తావు ఇవ్వకుండా ప్రధాన ఈవెంట్లలో నిలకడగా విజయాలు సాధిస్తూ వచ్చి ఎక్కడా వైఫల్యం లేకపోవడం నీరజ్‌పై అంచనాలు పెంచుతోంది. పీవీ సింధు వరుసగా మూడో ఒలింపిక్ పతకమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. నేడు జరిగే ప్రారంభ వేడుకల్లో టేబుల్ టెన్నిస్ స్టార్ ఆచంట శరత్ కమల్‌తో కలిసి సింధు పతాకధారిగా పాల్గొంటుంది. టోక్యో రజతం తర్వాత మీరాబాయి చాను వరుస గాయాలతో ఇబ్బంది పడింది. కోలుకున్న తర్వాత కీలక విజయాలతో క్వాలిఫై అయింది. బాక్సింగ్‌లో వరల్డ్ చాంపియన్‌గా ఉన్న లవ్లీనా గత ఒలింపిక్స్‌కంటే మెరుగైన ప్రదర్శన ఇస్తాననే నమ్మకంతో ఉంది. భారత హాకీ జట్టు కూడా మరో పతకాన్ని సాధించగలమనే నమ్మకాన్ని పెంచుతోంది. అన్ని రకాలుగా టీమ్ సన్నద్ధమై ఉంది.

తొలి పతకం కోసం...

కెరీర్‌లో ఎన్నో ఘనతలు ఉన్నా ఒలింపిక్ పతకం లేని లోటును తీర్చుకునేందుకు మరికొందరు ప్రయత్నిస్తున్నారు. ఈ జాబితాలో రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అగ్ర స్థానంలో ఉంది. ఢిల్లీలో నిరసనల తర్వాత మళ్లీ ఆటపై దృష్టి పెట్టి ఆమె అర్హత సాధించిన తీరు అసమానం. ఇటీవల మంచి ఫామ్‌లో ఉంది. టోక్యోలో కీలక సమయంలో తుపాకీ మొరాయించడంతో పతకం కోల్పోయిన షూటర్ మను భాకర్ నాటి వైఫల్యాన్ని మరచి తనేంటో చూపించాలని పట్టుదలగా ఉంది. వరుసగా నాలుగో ఒలింపిక్స్ ఆడుతున్న ఆర్చర్ దీపికా కుమారి అన్నీ గెలిచినా కీలక సమయాల్లో ఒలింపిక్స్‌లో ఒత్తిడిని తట్టుకోలేకపోయింది. ఈ సారైనా దానిని దాటి తొలి పతకాన్ని గెలుచుకుంటుందా చూడాలి. ఇక బ్యాడ్మింటన్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్‌శెట్టి అద్భుత ఫామ్ వారు కచ్చితంగా పతకం గెలవగలరనే నమ్మకాన్ని పెంచుతోంది.

కొత్త ఆశలతో...

వరల్డ్ చాంపియన్ అయిన తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, ప్రపంచ రికార్డు స్కోరు సాధించిన షూటర్ సిఫ్ట్ కౌర్, ప్రపంచ అండర్-23 చాంపియన్ రెజ్లర్ అమన్ తమ తొలి ఒలింపిక్స్‌లోనే పతకం సాధించాలనే లక్ష్యంతో సిద్ధమయ్యారు.

10,500 మంది... ఒకటే స్వప్నం!



పతకం... పతాకం... ఒక అథ్లెట్‌కు వీటితో విడదీయరాని బంధం... పతకం గెలిచిన వేళ జాతీయ పతాకం ఎగురుతుంటే సగర్వంగా నిలబడి ఆ అనుభూతిని పొందగలగడం ఒక్క క్రీడాకారుడికి మాత్రమే సాధ్యం... అదీ ఒలింపిక్స్‌లాంటి అత్యంత ప్రతిష్టాత్మక వేదికపై అంటే అంతకు మించిన ఆనందం మరొకటి ఉండదు... ఆ భావోద్వేగ క్షణం కోసమే సంవత్సరాల శ్రమ, పోరాటం, పట్టుదల... ప్రణాళికలు, వ్యూహాలు, సన్నాహాలు, శిక్షణ... డైట్, ఫిట్‌నెస్, మెంటల్ స్ట్రెంత్... అన్నీ అన్నీ కలగలిస్తే ఒలింపిక్స్ పతకం... ప్రపంచవ్యాప్తంగా క్రీడాకారుల కల ఒలింపిక్స్‌లో మెడల్ గెలుచుకోవడమే... ఎన్ని చాంపియన్‌షిప్‌లు సాధించినా, ఎన్ని ట్రోఫీలు గెలుచుకున్నా, ఒలింపిక్ పతకం మాత్రమే అథ్లెట్‌ను ఆకాశాన నిలబెడుతుంది. ఆ కంఠాభరణం మెరుపుల ముందు ఎన్ని ఆభరణాలైనా తక్కువే. స్వర్ణం, రజతం, కాంస్యం... పేర్లు వేరు కావచ్చు... కానీ వీటిలో ఏ పతకం సాధించినా ఆయా అథ్లెట్లకు అది బంగారంతో సమానమే. ఒక్క ఒలింపిక్ పతకంతోనే చరిత్రను సృష్టించినవారు కొందరైతే ... మళ్లీ మళ్లీ గెలుస్తూ వాటిని అలవాటుగా మార్చుకున్న దిగ్గజాలు కూడా ఎందరో... ఇప్పుడు మరోసారి ఆ విశ్వ సమరానికి సమయం వచ్చేసింది. పతకం వేటలో సర్వం ఒడ్డేందుకు ఆటగాళ్లు సిద్ధమయ్యారు.

వందేళ్ల తర్వాత ‘ఫ్యాషన్ సిటీ’ పారిస్ మరోసారి మెగా ఈవెంట్ కోసం ముస్తాబైంది. ఇన్నేళ్ల ఒలింపిక్స్‌లలో ఎన్నడూ చూడని పలు విశేషాలతో ఈ సంబరాన్ని జయప్రదం చేసేందుకు నిర్వాహకులు అన్నీ ఏర్పాట్లు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమం మొదలు విజేతలకు అందించే పతకాల్లో చరిత్రను చేర్చడం వరకు అన్నింటా తమ ప్రత్యేకత కనిపించేలా సిద్ధం చేశారు. 124 ఏళ్ల క్రితం పారిస్ ఒలింపిక్స్‌లోనే తొలిసారి మహిళలు అడుగు పెట్టగా... ఇప్పుడు అదే గడ్డపై జరుగుతున్న పోటీల్లో తొలిసారి పురుషులు, మహిళలు సమాన సంఖ్యలో బరిలోకి దిగుతుండటం విశేషం. ఇంట్లో శుభకార్యాన్ని పర్యవేక్షించే పెద్ద మనిషి తరహాలో దాదాపు వేయి అడుగుల ఎత్తులో ఠీవిగా నిలబడిన ఈఫిల్ టవర్ సాక్షిగా రెండు వారాల పాటు ఒలింపిక్ వేడుకలు అంబరాన్నంటనున్నాయి. మూడేళ్ల క్రితం చుట్టూ కోవిడ్ ముసురుకున్న సమయంలో సాగిన టోక్యో ఒలింపిక్స్ అభిమానులకు అర్ధ ఆనందాన్ని మాత్రమే అందించాయి. ఇప్పుడు జరిగే పోటీలు గత గేమ్స్‌కు భిన్నంగా ఫ్యాన్స్‌కు చేరువగా వచ్చి సంబరంలో భాగం చేయనున్నాయి. హోరాహోరీ సమరాల్లో 206 దేశాల నుంచి 10,500 మంది అథ్లెట్లు 32 క్రీడాంశాల్లో పోటీ పడిన తర్వాత ఎవరు పతకధారిగా శిఖరాన నిలుస్తారో, ఎవరు గుండె పగిలి కన్నీళ్లతో తిరిగొస్తారో చూడాలి!

–సాక్షి క్రీడా విభాగం

నేటి నుంచి పారిస్ ఒలింపిక్స్

ఆగస్టు 11 వరకు పోటీలు

- 32 క్రీడాంశాల్లో 329 మెడల్ ఈవెంట్లు
- భారత్ నుంచి 16 క్రీడాంశాల్లో 117 మంది బరిలోకి
- నేటి రాత్రి 11 గంటల నుంచి ప్రారంభోత్సవ కార్యక్రమం
- స్పోర్ట్స్ 18, జియో సినిమాలలో ప్రత్యక్ష ప్రసారం

2024 పారిస్ ఒలింపిక్స్ షెడ్యూల్

క్రీడాంశం	జూలై 26	27	28	29	30	31	ఆగస్టు 1	2	3	4	5	6	7	8	9	10	11
వేడుకలు (ప్రారంభ, ముగింపు)	🔥																🔥
3X3 బాస్కెట్‌బాల్					●	●	●	●	●	●	🏅						
ఆర్చరీ 🇮🇳			🏅	🏅	●	●	●	🏅	🏅	🏅							
ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్		●	●	🏅	🏅	🏅	🏅		🏅	🏅	🏅						
ఆర్టిస్టిక్ స్విమ్మింగ్											●	●	🏅		●	🏅	
అథ్లెటిక్స్ 🇮🇳							🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅
బ్యాడ్మింటన్ 🇮🇳		●	●	●	●	●	●	🏅	🏅	🏅	🏅						
బాస్కెట్‌బాల్		●	●	●	●	●	●	●	●	●		●	●	●	●	🏅	🏅
బీచ్ వాలీబాల్		●	●	●	●	●	●	●	●	●	●	●	●	●	🏅	🏅	
బాక్సింగ్ 🇮🇳		●	●	●	●	●	●	●	🏅	🏅		🏅	🏅	🏅	🏅	🏅	
బ్రేకింగ్															🏅	🏅	
కనోయ్ స్లాలోమ్		●	🏅	🏅	●	🏅	🏅	●	●	●	🏅						
కనోయ్ స్ప్రింట్												●	●	🏅	🏅	🏅	
సైక్లింగ్ బీఎంఎక్స్ ఫ్రీస్టయిల్					●	🏅											
సైక్లింగ్ బీఎంఎక్స్ రేసింగ్							●	🏅									
సైక్లింగ్ మౌంటెయిన్ బైక్			🏅	🏅													
సైక్లింగ్ రోడ్		🏅							🏅	🏅							
సైక్లింగ్ ట్రాక్											🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅
డైవింగ్		🏅		🏅		🏅		🏅			●	🏅	●	🏅	🏅	🏅	
ఈక్వెస్ట్రియన్ 🇮🇳		●	●	🏅	●	●	●	🏅	🏅	🏅	●	🏅					
ఫెన్సింగ్		🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅							
ఫుట్‌బాల్		●	●		●	●		●	●		●	●		🏅	🏅	🏅	
గోల్ఫ్ 🇮🇳							●	●	●	🏅			●	●	●	🏅	
హ్యాండ్‌బాల్		●	●	●	●	●	●	●	●	●		●	●	●	●	🏅	🏅
హాకీ 🇮🇳		●	●	●	●	●	●	●	●	●	●	●	●	🏅	🏅		
జూడో 🇮🇳		🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅								
మారథాన్ స్విమ్మింగ్														🏅	🏅		
మోడర్న్ పెంటాథ్లాన్														●	●	🏅	🏅
రిథమిక్ జిమ్నాస్టిక్స్														●	🏅	🏅	
రోయింగ్ 🇮🇳		●	●	●	●	🏅	🏅	🏅	🏅								
రగ్బీ సెవెన్స్		🏅	●	●	🏅												
సెయిలింగ్ 🇮🇳			●	●	●	●	🏅	🏅	●	●	●	🏅	🏅	🏅			
షూటింగ్ 🇮🇳		🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅						
స్కేట్‌బోర్డింగ్		🏅	🏅									🏅	🏅				
స్పోర్ట్ క్లయింబింగ్											●	●	🏅	🏅	🏅	🏅	
సర్ఫింగ్		●	●	●	●	🏅											
స్విమ్మింగ్ 🇮🇳		🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅	🏅							
టేబుల్ టెన్నిస్ 🇮🇳		●	●	●	🏅	●	●	●	🏅	🏅	●	●	●	●	🏅	🏅	
తైక్వాండో													🏅	🏅	🏅	🏅	
టెన్నిస్ 🇮🇳		●	●	●	●	●	●	🏅	🏅	🏅							
ట్రాంపోలిన్ జిమ్నాస్టిక్స్								🏅									
ట్రయాథ్లాన్					🏅	🏅					🏅						
వాలీబాల్		●	●	●	●	●	●	●	●	●	●	●	●	●	🏅	🏅	🏅
వాటర్‌పోలో		●	●	●	●	●	●	●	●	●	●	●	●	●	●	🏅	🏅
వెయిట్‌లిఫ్టింగ్ 🇮🇳													🏅	🏅	🏅	🏅	🏅
రెజ్లింగ్ 🇮🇳											●	🏅	🏅	🏅	🏅	🏅	🏅

● లీగ్ దశ పోటీలు 🏅 మెడల్ ఈవెంట్‌లు 🇮🇳 భారత్ బరిలో ఉన్న క్రీడాంశాలు

పారిస్ ఒలింపిక్స్‌ను స్పోర్ట్స్ 18 చానెల్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు

తొలిసారి స్టేడియం బయట...


ఒలింపిక్స్ ప్రారంభోత్సవ వేడుకలను ప్రధాన స్టేడియం లోపల పరిమిత ప్రేక్షకుల మధ్య నిర్వహించడం రివాజు. ఇన్నేళ్ల చరిత్రలో ఇది ఎప్పుడూ మారలేదు. కానీ ఈసారి పారిస్ ఒలింపిక్స్ నిర్వాహకులు ఈ వేడుకలను స్టేడియం బయటకు తీసుకొస్తున్నారు. నగరం నడి మధ్యలో సెన్ నది పక్కన పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజల సమక్షంలో ఈ వేడుకలు జరగనున్నాయి. సాధ్యమైనంత ఎక్కువ మంది దీనికి హాజరయ్యేలా సాధారణ పౌరులందరినీ అనుమతిస్తున్నారు. పారిస్ నగరవాసులే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఏ దేశానికి చెందినవారైనా సరే ఈ వేడుకల్లో పాల్గొనవచ్చు. ఎనభై భారీ స్క్రీన్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఒలింపిక్ క్రీడల చరిత్రలోనే వీటిని అతి పెద్ద వేడుకలుగా చెప్పవచ్చు. దాదాపు వంద బోట్‌లలో వివిధ దేశాల క్రీడాకారులు సెన్ నదిపై బోటులో ప్రయాణిస్తూ పరేడ్‌లో పాల్గొంటారు. 10,500 మంది అథ్లెట్లు ఇందులో పాల్గొననుండటం విశేషం. ఆరు కిలోమీటర్ల పొడవున సాగే ఈ పరేడ్ పారిస్ నగరం నడిమధ్యలోంచి వెళ్లి చివరకు ట్రొకాడెరో వద్ద ముగుస్తుంది. ఈ ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యత ఉండటంతో పాటు అందమైన గార్డెన్‌లు, ఫౌంటేన్‌లకు ప్రసిద్ధి. గతంలో ఎన్నడూ లేని విధంగా అథ్లెట్లందరినీ ప్రారంభోత్సవ వేడుకల్లో వేదికపైకి ఆహ్వానించి పరిచయం చేయబోతున్నారు.





భారత కాలమానం ప్రకారం రాత్రి 11 గంటల నుంచి వేడుకలు మొదలవుతాయి. ప్రారంభోత్సవంలో ఎలాంటి కార్యక్రమాలు ఉంటాయి, ఎవరెవరు ఏం చేయబోతున్నారు అనే విషయాలను మాత్రం నిర్వాహకులు గోప్యంగానే ఉంచారు. అసలు రోజు మాత్రమే దానిని ‘సర్‌ప్రైజ్’గా చూపించాలని వారు భావిస్తున్నారు. ఎప్పటిలాగే పరేడ్‌లో అందరికంటే ముందు గ్రీస్ దేశపు ఆటగాళ్లు రానుండగా... ఆ తర్వాత శరణార్థి జట్టు గ్రీస్‌ను అనుసరిస్తుంది. ఆ తర్వాత ఆంగ్ల అక్షర క్రమంలో ఆయా దేశాలు పాల్గొంటాయి. నిర్వాహక దేశం ఫ్రాన్స్ ఈ పరేడ్‌లో చివరగా వస్తుంది. ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా తమ దేశం తరఫున కాకుండా వ్యక్తిగత హోదాలో పోటీల బరిలోకి దిగుతున్న రష్యా, బెలారస్ ఆటగాళ్లు ఎవరూ పరేడ్‌లో పాల్గొనరు. దాదాపు నాలుగు గంటల పాటు ఈ మొత్తం ఈవెంట్ సాగే అవకాశం ఉంది.

- ఒలింపిక్స్ చరిత్రలో తొలిసారి పురుషులు, మహిళలు సమాన సంఖ్యలో బరిలోకి దిగుతున్నారు. ఈ పోటీల్లో 5,250 మంది పురుషులు, 5,250 మంది మహిళలు సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు.
- ఒలింపిక్స్‌లో తొలిసారి ఆర్టిస్టిక్ స్విమ్మింగ్ పోటీల్లో పురుషులు కూడా పోటీ పడనున్నారు.
- లండన్ (1908, 1948, 2012) తర్వాత మూడుసార్లు ఒలింపిక్స్ నిర్వహిస్తున్న రెండో నగరంగా పారిస్ (1900, 1924, 2024) గుర్తింపు పొందింది. 1924 జూలై 27న పారిస్‌లో ముగింపు ఉత్సవం జరగా... ఇప్పుడు 100 ఏళ్ల తర్వాత జూలై 26న ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతోంది.
- మొత్తం క్రీడాంశాలు 32... పతకం గెలుచుకునే అవకాశం ఉన్న ఈవెంట్‌లు 329.
- అత్యధికంగా అక్వాటిక్స్‌లో 49 మెడల్స్ అందుబాటులో ఉండగా... అథ్లెటిక్స్‌లో 48 మెడల్ ఈవెంట్లు ఉన్నాయి.
- పారిస్ నగరం, దాని శివార్లలో కలిపి మొత్తం 35 వేదికల్లో పోటీలు జరుగుతాయి. బీచ్ వాలీబాల్ పోటీలను ఈఫిల్ టవర్ పక్కనే నిర్వహిస్తుండటం విశేషం.
- ఒలింపిక్స్ ఈవెంట్‌లలో ఒకటైన సర్ఫింగ్‌ను ‘తహితి’ దీవుల్లో నిర్వహిస్తున్నారు. ఫ్రాన్స్‌కు దాదాపు 15 వేల కిలో మీటర్ల దూరంలో పసిఫిక్ మహా సముద్రం మధ్యలో ఈ దీవి ఉంది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లకు ఇది దగ్గరగా ఉంటుంది. అయితే ఇది ఫ్రెంచ్ ప్రభుత్వం ఆధీనంలో ఉన్న దీవి కావడంతో ఒలింపిక్స్ వేదికల్లో ఒకదానిని దీనిని కూడా ఎంపిక చేయడం విశేషం.



- క్రీడా గ్రామంలో మొత్తం 14,250 మంది కోసం గదులు సిద్ధం చేశారు. ప్రతీ రోజూ కనీసం 60 వేల భోజనాలు అందిస్తారు. క్రీడల తర్వాత దీనిని ఒక బస్తీగా మారుస్తున్నారు. నిర్వహణలో సహాయకారిగా ఉండేందుకు 40 వేల మంది వలంటీర్లు ఈ గేమ్స్‌లో అందుబాటులో ఉన్నారు.

సాక్షి **బిజినెస్**
శుక్రవారం
26-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
109	7
80,040	24,406

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,449	△ 106
డోజోన్స్	40,224	△ 370
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,186	△ 33
డాక్స్	18,299	▽ 89
షాంఘై	2,887	▽ 15
నికాయ్	37,870	▽ 1,285

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారెట్)	68,227	▽ 924
బంగారం (22 క్యారెట్)	67,954	▽ 920
వెండి (కిలో)	81,474	▽ 3,388

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.31	84.33
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.80	109.38
€	యూరో	ఎస్‌బీఐ	89.71	92.08
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.41	55.62
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.97	55.90
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.04	64.73
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.43	22.98
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.90	23.68
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.70	12.53

మూడోరోజూ తగ్గిన బంగారం

- ఢిల్లీలో రూ.1,000 తగ్గుదల
- కస్టమ్స్ కోతకు అంతర్జాతీయ ధరల పతనం తోడు
- 3 రోజుల్లో రూ 5,000 డౌన్



న్యూఢిల్లీ/న్యూయార్క్: భారత్‌లో 15 శాతం నుంచి 6 శాతానికి కస్టమ్స్ సుంకాల కోతకు తోడు, అంతర్జాతీయ ఫ్యూచర్స్ కమోడిటీ మార్కెట్‌–కామెక్స్‌లో ధరల భారీ పతనం నేపథ్యంలో వరుసగా మూడవరోజూ దేశంలో బంగారం ధరలు భారీగా తగ్గాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో వరుసగా 99.9, 99.5 స్వచ్ఛత ధరలు రూ.1,000 చొప్పున తగ్గి వరుసగా రూ.70,650, రూ.70,300కు దిగివచ్చాయి. ఇక్కడ పసిడి వరుసగా మూడు రోజుల్లో దాదాపు రూ.5,000 తగ్గింది. వెండి ధరలు సైతం ఇక్కడ గురువారం భారీగా తగ్గాయి. కేజీ ధర రూ.3,500 తగ్గి రూ.84,000కు దిగివచ్చింది. అంతర్జాయంగా ఫ్యూచర్స్‌లో ధర ఔన్స్‌కు (31.1గ్రా) 2 శాతం (55 డాలర్లు) పతనమై 2,360 వద్ద ట్రేడవుతోంది. జపాన్ సెంట్రల్ బ్యాంక్ మాత్రం వచ్చేవారం వడ్డీరేట్లు పెంచవచ్చని వచ్చిన వార్తలు, దీనితో డాలర్ ఇండెక్స్ దేశాల కరెన్సీల్లో భాగంగా ఉన్న జపాన్ యన్ భారీ పెరుగుదల అంతర్జాతీయంగా బంగారం తాజా భారీ పతనానికి కారణం. ఇక దేశీ కమోడిటీ ఫ్యూచర్స్–ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల పసిడి ధర క్రితం ముగింపులో పోల్చితే రూ.1,392 (2%పైగా) తగ్గి రూ.67,560 వద్ద ట్రేడవుతోంది.

కెనరా బ్యాంక్ లాభం అప్



ముంబై: ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ నికర లాభం ఈ ఏడాది తొలి త్రైమాసికం (2024–25, క్యూ1)లో 10% పుంజుకుని రూ. 3,905 కోట్లను తాకింది. గతేడాది (2023–24) ఇదే కాలంలో రూ. 3,535 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 29,823 కోట్ల నుంచి రూ. 34,020 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 6% వృద్ధితో రూ. 9,166 కోట్లను తాకింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 5.15% నుంచి 4.14 %కి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు సైతం 1.57 శాతం నుంచి 1.24 శాతానికి దిగివచ్చాయి. అనుబంధ సంస్థలు కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్, కెనరా రొబెకో అసెట్ మేనేజ్‌మెంట్‌లలో లిస్టింగ్ ద్వారా 25 శాతంవరకూ వాటాలు విక్రయించనున్నట్లు బ్యాంక్ ఎండీ కె.సత్యనారాయణ రాజు వెల్లడించారు.

ప్రపంచ మార్కెట్లు పడగొట్టాయ్!

యూఎస్ టెక్ స్టాక్స్ విలవిల



కొన్ని నెలల సూపర్ బుల్ ర్యాలీ తర్వాత ఇటీవల అమ్మకాలతో యూటర్న్ తీసుకున్న యూఎస్ టెక్నాలజీ స్టాక్స్ భారీ పతనదిశగా సాగుతున్నాయి. ప్రధానంగా టెక్ దిగ్గజాల ఫలితాలు నిరాశపరచడం నాస్‌డాక్ డౌన్ ట్రెండ్‌కు తెరతీసినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. క్యూ2లో ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా నికర లాభం 45 శాతం తగ్గడంతో బుధవారం షేరు 12 శాతం కుప్పకూలింది. ఈ ఏడాది 130 శాతం ర్యాలీ చేసిన చిప్ దిగ్గజం ఎన్‌విడియా 7 శాతం పతనమైంది. గూగుల్, యూట్యూబ్ సైతం 5 శాతం చొప్పున క్షీణించాయి. ఈ బాటలో హాట్‌ఫేవరెట్లుగా పేర్కొనే జాబితాలోని మెటా, యాపిల్, మైక్రోసాఫ్ట్ సైతం అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. టెస్లా, అల్ఫాబెట్ ఫలితాల నిరాశతో బుధవారం నాస్‌డాక్ 2022 అక్టోబర్ 7 తదుపరి 3.6% పతనమైంది. పాయింట్ల (654) పరంగా కరోనా కాలం (2020 మార్చి 16) తదుపరి అత్యధికంగా క్షీణించింది.

సూచీలకు అయిదో రోజూ నష్టాలు

ముంబై: వరుసగా అయిదో రోజూ స్టాక్ సూచీలు నష్టాలు చవిచూశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, బడ్జెట్‌లో సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను, స్వల్ప–దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను పెంపు ప్రతిపాదనతో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు పెరిగాయి. ఫలితంగా మెటల్, బ్యాంకులు, ఫైనాన్స్, ఐటీ, రియల్టీ షేర్లలో అమ్మకాలు తలెత్తాయి. సెన్సెక్స్ 109 పాయింట్లు నష్టపోయి 80,040 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఏడు పాయింట్లు కోల్పోయి 24,406 వద్ద నిలిచింది. అమెరికా మార్కెట్ల భారీ పతన ప్రభావంతో ఉదయం సూచీలు భారీ నష్టాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 671 పాయింట్లు క్షీణించి 79,478 పాయింట్లు వద్ద, నిఫ్టీ 202 పాయింట్లు పతనమై 24,219 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి.

మ్యాన్‌కైండ్ ఫార్మా చేతికి భారత్ సీరమ్స్

భారత్ సీరమ్స్ అండ్ వ్యాక్సిన్స్‌లో 100% వాటాలను ఆడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి కొనుగోలు చేసేందుకు మ్యాన్‌కైండ్ ఫార్మా ఒప్పందం కుదుర్చుకుంది. డీల్ విలువ రూ. 13,630 కోట్లుగా అంచనా.

ఐపీవోకు స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్

రూ.600 కోట్లు సమీకరించనున్న కంపెనీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీరింగ్ ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఐపీవోకు వస్తోంది. ఈ మేరకు ప్రాస్పెక్టస్‌ను సెబీకి దాఖలు చేసింది. ఐపీవో ద్వారా కంపెనీ రూ.600 కోట్లు సమీకరించనుంది. ఇందులో ఫ్రెష్ ఇష్యూ రూ.250 కోట్లు. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.350 కోట్ల విలువైన 1.84 కోట్ల షేర్లను జారీ చేస్తారు. ప్రమోటర్లు ఎస్2 ఇంజనీరింగ్, కందుల రామకృష్ణ, కందుల కృష్ణ వేణి, నాగేశ్వర్ రావు కందుల, కాట్రగడ్డ మోహన్ రావు, కాట్రగడ్డ శివప్రసాద్, కుదరవల్లి పున్నారావు ఈ ఆఫర్ ద్వారా తమ వాటాలో కొంత భాగాన్ని విక్రయిస్తారు. స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టర్నోవర్ 2023–24లో రూ.544 కోట్లకు చేరింది. భారత్‌లో ఫార్మా, కెమికల్ రంగాలకు ప్రత్యేక ఇంజనీరింగ్ ఉపకరణాల తయారీలో కంపెనీ టాప్–5లో నిలిచింది. హైదరాబాద్‌తోపాటు యూకేలోనూ ప్లాంటు ఉంది.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..
టెక్ మహీంద్రా లాభం జోరు
గూగుల్ 'మ్యాప్' వార్

స్టార్టప్ పిచ్‌పై ఎక్స్‌ట్రా ఇన్నింగ్స్!

ఎంట్రప్రెన్యూర్లు, ఇన్వెస్టర్లుగా రాణిస్తున్న మెన్ ఇన్ బ్లూ

నవతరానికి కనెక్ట్ అయ్యే స్టార్టప్‌లపైనే దృష్టి

టీ20 ప్రపంచ కప్‌లో దుమ్మురేపి దేశాన్ని మరోసారి జగజ్జేతగా నిలిపింది 'మెన్ ఇన్ బ్లూ' టీమ్. 'హిట్'మ్యాన్ రోహిత్ కెప్టెన్సీ.. కింగ్ కోహ్లీ మెరుపులకు బుమ్రా మ్యాజిక్.. పాండ్యా పంచ్.. మొత్తం టీమిండియా పోరాటపటిమ తోడవ్వడంతో కప్పు మన వశమైంది. బ్యాట్, బాల్‌తో చెలరేగిపోయే మన క్రికెట్ ధీరులు.. వ్యాపారవేత్తలుగా కూడా పవర్‌ఫుల్ ఇన్నింగ్స్‌తో అదరగొడుతున్నారు. ఒక పక్క క్రికెట్‌లో మునిగితేలుతూనే.. స్టార్టప్‌లలోనూ స్మార్ట్‌గా ఇన్వెస్ట్ చేస్తూ పర్ఫెక్ట్ కవర్ డ్రైవ్‌లతో అలరిస్తున్నారు. స్టార్టప్ పిచ్‌పై మార్కెట్ డిమాండ్లు, నవ కల్పనల వంటి దూసుకొచ్చే బంతులను మన ఎంట్రప్రెన్యూర్ బ్యాట్స్‌మెన్ దీటుగా ఎదుర్కొంటున్నారు. క్రికెటర్లు స్టార్టప్స్‌లో ఫైనాన్షియల్ సిక్సర్ కొట్టినా.. కొత్త వెంచర్లను లాంచ్ చేసినా గ్యాలరీలో కూర్చున్న అభిమానులకు ఈ బిజినెస్ గేమ్ కూడా థ్రిల్ అందిస్తోంది. సరైన పార్ట్‌నర్‌షిప్ కుదిరితే స్టార్టప్ కాస్తా 'యూనికార్న్'గా మారి.. అద్భుతమైన విజయం సాకారం కావచ్చు! ఎంట్రప్రెన్యూర్లుగా మారి సత్తా చాటుతున్న క్రికెటర్ల సంగతేంటో చూద్దాం...

– సాక్షి, బిజినెస్ డెస్క్

కోహ్లీ.. ఇన్వెస్ట్‌మెంట్ 'కింగ్'



స్పోర్ట్ కాన్వో: ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడా ప్రేమికులను కనెక్ట్ చేస్తోంది. కోహ్లీ ఇన్వెస్ట్ చేసిన ఈ సంస్థ ఆన్‌లైన్ స్పోర్ట్స్ కమ్యూనిటీ ఏర్పాటుపై దృష్టి సారించింది.

స్టెపాథ్లాన్ లైఫ్‌స్టయిల్స్: పిల్లల ఆరోగ్య సంరక్షణ, ఫిట్‌నెస్‌పై దృష్టి సారించిన సంస్థ ఇది. నవతరానికి ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చేందుకు కోహ్లీ కృషి చేస్తున్నారు.

పెట్టుబడుల్లోనూ 'మిస్టర్ కూల్'..



7ఇంక్‌బ్రూస్: గ్రౌండ్‌లో కూల్ కెప్టెన్‌గా, ప్రత్యర్థులకు సెగలు పుట్టించే ధోనీ.. ఈ ఆహార పానీయాల స్టార్టప్‌తో ఎఫ్‌ఎంసీజీ వ్యాపారంలోకి అడుగుపెట్టారు. మూడు సిక్స్‌లు, ఆరు ఫోర్లతో లాభాల పరుగులు పారిస్తున్నారు.

ఖాతాబుక్: చిన్న మధ్య తరహా సంస్థల (ఎంఎస్‌ఎంఈ)కు అకౌంట్ల నిర్వహణను సులభతరం చేస్తున్న డిజిటల్ లెడ్జర్ యాప్ ఇది. దీనిలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా చిన్న వ్యాపారాలకు దన్నుగా నిలుస్తున్నారు.

క్లియర్‌ట్రిప్: ఈ ట్రావెల్ సంస్థకు ధోనీ బ్రాండ్ అంబాసిడర్. ట్రావెల్ ఆప్షన్లను ప్రమోట్ చేస్తూ, ప్రయాణికుల్లో విశ్వాసం నింపుతున్నారు.

యువరాజ్... 'గేమ్'ఛేంజర్



యువరాజ్ సింగ్ ఫౌండేషన్ (యూవుయ్‌కెన్): హెల్తియాన్స్, ఎడ్యుకార్ట్, కామ్ వంటి ఆరోగ్య, విద్యా సంబంధ స్టార్టప్‌లలో ఇన్వెస్ట్ చేస్తోంది. నవకల్పనలను ప్రోత్సహిస్తున్న యువరాజ్ సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ సత్తా చాటుతున్నారు.

గంభీర్... ఈకామర్స్ చాంపియన్



ఫైండ్ కామర్స్ ప్లాట్‌ఫామ్: డిజిటల్ రిటైల్ సొల్యూషన్లను అందించడం ద్వారా ఆన్‌లైన్ వ్యాపారంలోకి ప్రవేశించే వారికి దన్నుగా నిలుస్తోంది. దీంతో ఆఫ్–ఫీల్డ్‌లోనూ సాటిలేదని గౌతమ్ నిరూపించుకుంటున్నారు.

హార్దిక్.. కొత్త 'అడుగులు'



అరెటో: చిన్న పిల్లలకు వారికి తగిన సైజుల్లో ఫుట్‌వేర్‌ను అందిస్తున్న వినూత్న సంస్థ ఇది. పాండ్యా పెట్టుబడితో పరిశ్రమలో కొత్త అడుగులు పడ్డాయి.

యూ ఫుడ్‌ల్యాబ్స్: రెడీ–టు–ఈట్ మీల్స్‌లో ప్రత్యేకతను చాటుకుంటున్న డీ2సీ (డైరెక్ట్–టు–కస్టమర్) ఫుడ్ స్టార్టప్. ఇన్వెస్టర్‌గా, బ్రాండ్ అంబాసిడర్‌గా హార్దిక్ దన్నుగా నిలుస్తున్నారు.

కేఎల్ రాహుల్.. ఫిట్‌నెస్ స్ట్రోక్



హ్యుగాలైఫ్: ఫిట్‌నెస్ ప్రియుల కోసం ఆన్‌లైన్‌లో అత్యుత్తమ న్యూట్రిషన్ సప్లిమెంట్ ఉత్పత్తులను అందిస్తోంది. బాలీవుడ్ నటి కత్రినా కైఫ్‌తో కలిసి టీమిండియా స్టార్ కేఎల్ రాహుల్ ఈ స్టార్టప్‌ను నెలకొల్పారు.

రహానే.. ఫ్యాన్స్‌తో 'కనెక్ట్'

ఫ్యాన్‌కైండ్: స్వచ్ఛంద సేవల కోసం సెలబ్రిటీలు, ఫ్యాన్స్‌ను కనెక్ట్ చేస్తోంది. దాతృత్వం, ప్రజలతో మమేకం అయ్యేందుకు రహానే ఇందులో పెట్టుబడి పెట్టారు.

సచిన్.. 'మాస్టర్' ఇన్వెస్టర్



స్మాష్: స్పోర్ట్స్, వర్చువల్ రియాలిటీ (వీఆర్), గేమింగ్‌ను కలగలిపి అందిస్తున్న స్టార్టప్ ఇది. సచిన్ పెట్టుబడి ఈ సంస్థను మాస్టర్ బ్లాస్టర్‌గా నిలుపుతోంది.

ముసాఫిర్: పర్యాటకులకు మంచి ట్రావెల్ అనుభూతిని కల్పించడమే లక్ష్యంగా ఇది ఏర్పాటైంది. ట్రావెల్ పరిశ్రమపై టెండూల్కర్ మక్కువను ఈ ఇన్వెస్ట్‌మెంట్ చాటిచెబుతోంది.

సాక్షి **స్పోర్ట్స్**



సుమిత్‌కు క్లిష్టమైన 'డ్రా'

పారిస్: భారత టెన్నిస్ నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు పారిస్ ఒలింపిక్స్‌లో క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. తొలిసారి ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న ప్రపంచ 80వ ర్యాంకర్ సుమిత్ తొలి రౌండ్‌లో ప్రపంచ 68వ ర్యాంకర్ ముటెట్ కొరెన్‌టిన్ (ఫ్రాన్స్)తో తలపడతాడు. ముఖాముఖి రికార్డులో వీరిద్దరు 2–2తో సమంగా ఉన్నారు. ఒకవేళ తొలి రౌండ్‌లో సుమిత్ గెలిస్తే రెండో రౌండ్‌లో ప్రపంచ 6వ ర్యాంకర్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)తో ఆడాల్సి ఉంటుంది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా), స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో గెలిస్తే రెండో రౌండ్‌లో ముఖాముఖిగా తలపడతారు. మరోవైపు పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న–శ్రీరామ్ బాలాజీ (భారత్) జోడీకి కూడా కఠినమైన 'డ్రా'నే ఎదురైంది. తొలి రౌండ్‌లో ఫాబియన్ రెబూల్–రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్)లతో బోపన్న–బాలాజీ తలపడతారు. 44 ఏళ్ల బోపన్న వరుసగా నాలుగోసారి ఒలింపిక్స్‌లో ఆడుతున్నాడు.



మన గురి అదిరింది!

- ర్యాంకింగ్ రౌండ్‌లో మెరిసిన భారత ఆర్చర్లు
- టీమ్ విభాగాల్లో నేరుగా క్వార్టర్ ఫైనల్ చేరిన భారత జట్లు
- అదరగొట్టిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్

పారిస్: శుభారంభం లభిస్తే సగం లక్ష్యం నెరవేరినట్లే...! ఒలింపిక్స్‌లో ఎన్నో ఏళ్లుగా భారత్‌ను ఊరిస్తున్న ఆర్చరీ పతకం అందుకునేందుకు మన ఆర్చర్లు సరైన దిశగా అడుగులు వేశారు. గురువారం జరిగిన రికర్వ్ విభాగం ర్యాంకింగ్ రౌండ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు అదరగొట్టాయి. ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాధవ్‌లతో కూడిన భారత పురుషుల జట్టు 2013 పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఫలితంగా తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడే అవకాశాన్ని సంపాదించింది. కొలంబియా, టర్కీ జట్ల మధ్య మ్యాచ్ విజేతతో క్వార్టర్ ఫైనల్లో భారత్ తలపడుతుంది. క్వార్టర్ ఫైనల్లో నెగ్గితే భారత్ సెమీఫైనల్లో ఫ్రాన్స్, ఇటలీ, కజకిస్తాన్ జట్లలో ఒక జట్టుతో ఆడుతుంది. మరో పార్శ్వంలో దక్షిణ కొరియా, చైనా, జపాన్, మెక్సికో ఉన్నాయి. వ్యక్తిగత విభాగంలో ధీరజ్ 681 పాయింట్లతో నాలుగో స్థానాన్ని పొందగా... 674 పాయింట్లతో తరుణ్‌దీప్ రాయ్ 14వ స్థానంలో, 658 పాయింట్లతో ప్రవీణ్ జాధవ్ 39వ స్థానంలో నిలిచారు.

అంకిత భకత్, దీపిక కుమారి, భజన్ కౌర్‌లతో కూడిన భారత మహిళల జట్టు ర్యాంకింగ్ రౌండ్‌లో 1983 పాయింట్లతో నాలుగో స్థానం దక్కించుకుంది. తద్వారా తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. ఫ్రాన్స్, నెదర్లాండ్స్ జట్ల మధ్య మ్యాచ్ విజేతతో క్వార్టర్ ఫైనల్లో భారత్ ఆడుతుంది. ఈ అడ్డంకిని భారత్ అధిగమిస్తే సెమీఫైనల్లో దక్షిణ కొరియా, అమెరికా, చైనీస్ తైపీ జట్లలో ఒక జట్టుతో తలపడుతుంది. ఆదివారం మహిళల మెడల్ టీమ్ ఈవెంట్, సోమవారం పురుషుల మెడల్ టీమ్ ఈవెంట్ జరుగుతాయి.

ఆర్చరీలో కొత్త ప్రపంచ రికార్డు

694 పాయింట్లతో కొరియా అమ్మాయి లిమ్ సిహైన్ ఘనత



పారిస్ ఒలింపిక్స్ క్రీడలు నేడు అధికారికంగా ప్రారంభమవుతున్నా... గురువారం ఈ క్రీడల్లో తొలి ప్రపంచ రికార్డు నమోదైంది. మహిళల ఆర్చరీ రికర్వ్ వ్యక్తిగత ర్యాంకింగ్ రౌండ్‌లో దక్షిణ కొరియా అమ్మాయి లిమ్ సిహైన్ కొత్త ప్రపంచ రికార్డుతోపాటు ఒలింపిక్ రికార్డును కూడా నెలకొల్పింది. లిమ్ సిహైన్ 694 పాయింట్లు స్కోరు చేసింది. తద్వారా 692 పాయింట్లతో కాంగ్ చాయెంగ్ (దక్షిణ కొరియా; 2019లో) సాధించిన ప్రపంచ రికార్డును లిమ్ బద్దలు కొట్టింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కొరియాకే చెందిన ఆన్ సాన్ 680 పాయింట్లతో నెలకొల్పిన ఒలింపిక్ రికార్డును కూడా లిమ్ సిహైన్ తిరగరాసింది.



పతకాలతో తిరిగి రావాలని...

తెలంగాణ రాష్ట్ర క్రీడాకారిణులు ఆకుల శ్రీజ (టేబుల్ టెన్నిస్), ఇషా సింగ్ (షూటింగ్), నిఖత్ జరీన్ (బాక్సింగ్) తొలిసారి ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో విశ్వ క్రీడల్లో తమ కుమార్తెలు సత్తా చాటాలని, దేశానికి ఖ్యాతి తేవాలని, పతకాలతో తిరిగి రావాలని శ్రీజ తల్లిదండ్రులు ప్రవీణ్, సాయి సుధ... ఇషా సింగ్ తండ్రి సచిన్ సింగ్... నిఖత్ జరీన్ తండ్రి జమీల్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆల్ ద బెస్ట్ చెప్పారు.



నేనేంటో కోర్టులోనే చూస్తారుగా!

పారిస్ ఒలింపిక్స్ సన్నద్ధతపై పీవీ సింధు వ్యాఖ్య

పారిస్: 'హ్యాట్రిక్' ఒలింపిక్ పతకంపై దృష్టి పెట్టిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు తను ఎంతగా కష్టపడింది కోర్టులోనే తెలుస్తుందని చెప్పింది. రియో (2016)లో రజతం, టోక్యో (2020)లో కాంస్యం నెగ్గిన ఈ సీనియర్ షట్లర్ గత కొన్నాళ్లుగా కఠోర ప్రాక్టీసులో నిమగ్నమైంది. ఇప్పుడదే ఆత్మవిశ్వాసంతో 'పారిస్' కలను సాకారం చేసుకునేందుకు వచ్చింది. గతంలో ఏ భారత క్రీడా కారుడు కూడా మూడు ఒలింపిక్ పతకాలు గెలిచిన దాఖలాల్లేవు. ఒకవేళ సింధు గనక పోడియంలో నిలిస్తే అది గొప్ప చరిత్రే అవుతుంది. దీనిపై ఆమె మాట్లాడుతూ 'అవును మరో పతకమే నా లక్ష్యం. నేను ఇప్పటికే రెండు పతకాలు గెలిచాను. కానీ అదేపనిగా ఆలోచించి ఆ ఒత్తిడిని తలకెక్కించుకోను. ఎప్పుడు ఒలింపిక్స్ ఆడినా అదే కొత్తగా అనిపించింది నాకు. అందుకేనేమో పతకం గెలిచా. ఇప్పుడు కూడా అలాగే బరిలోకి దిగుతాను. మూడో పతకంతో 'హ్యాట్రిక్ సాధిస్తా' అని సింధు తెలిపింది. ఇక్క డికి వచ్చేముందు చివరగా ఆమె జర్మనీలోని సార్ బ్రుకెన్‌లో తుది సన్నాహాలు చేసింది. పారిస్‌లాంటి వాతావరణ పరిస్థితులు సార్‌బ్రుకెన్‌లోనూ ఉండటం వల్ల సింధు స్థానిక పరిస్థితుల్ని ఆకలింపు చేసుకునేందుకు వ్యూహాత్మకంగా ప్రాక్టీస్ వేదికను ఎంచుకుంది. ప్రకాశ్ పదుకొనే వద్ద తీసుకున్న శిక్షణలో కచ్చితమైన స్ట్రోక్స్‌ను నేర్చుకున్నానని చెప్పింది. 'ప్రస్తుతం మహిళల సింగిల్స్‌లో సుదీర్ఘ ర్యాలీలు ఎక్కువగా జరుగుతున్నాయి. మ్యాచ్‌లు కూడా చాలా సేపు జరుగుతుండటంతో ఆ దిశగా నేను కసరత్తు చేశాను. ఇప్పుడు ర్యాలీలు ఎంతసేపు సాగినా ఏ ఇబ్బంది లేదు. ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాను' అని 29 ఏళ్ల సింధు వివరించింది.



ఫైనల్ లక్ష్యంగా...

నేడు బంగ్లాదేశ్‌తో భారత్ సెమీఫైనల్ పోరు

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–3లో ప్రత్యక్ష ప్రసారం

దంబుల్లా: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో జైత్రయాత్ర కొనసాగిస్తున్న భారత మహిళల జట్టు ఇప్పుడు ఫైనల్ వేటలో పడేందుకు సిద్ధమైంది. నేడు జరిగే తొలి సెమీఫైనల్లో గ్రూప్ 'ఎ' టాపర్, డిఫెండింగ్ చాంపియన్ భారత్... గ్రూప్ 'బి'లో రెండో స్థానంలో నిలిచిన బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. రాత్రి ఏడు గంటలకు జరిగే రెండో సెమీఫైనల్లో పాకిస్తాన్‌తో ఆతిథ్య శ్రీలంక జట్టు ఆడుతుంది.

అజేయంగా హర్మన్‌సేన

ఈ టోర్నీలో 'హ్యాట్రిక్' విజయాలతో అజేయంగా దూసుకెళ్తున్న భారత్ ఇక నాకౌట్ దశలోనూ ఇదే జోరును కొనసాగించాలనే లక్ష్యంతో ఉంది. ఓపెనర్లలో షఫాలీ వర్మ సూపర్ ఫామ్‌లో ఉండటం జట్టు విజయాలకు దోహదం చేస్తోంది. మరో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన, హేమలతలతో టాపార్డర్ పటిష్టంగా ఉంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్‌లు కూడా రాణిస్తుండటంతో బ్యాటింగ్ ఆర్డర్‌కు ఏ ఢోకా లేదు. లోయర్ ఆర్డర్‌లో దీప్తి శర్మ బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో కీలకంగా మారింది. రేణుకా సింగ్, పూజ వస్త్రకర్ నిలకడగా వికెట్లు తీస్తున్నారు. ముఖ్యంగా ఈ టోర్నీలో గట్టి ప్రత్యర్థి అయిన పాకిస్తాన్‌ను కట్టడి చేయడంలో ఈ ముగ్గురు కీలకపాత్ర పోషించారు. యూఏఈ, నేపాల్‌లపై భారీస్కోర్లు సాధించిన భారత మహిళల జట్టు ఈ నాకౌట్ దశలోనూ బంగ్లాదేశ్‌పై మరో భారీ స్కోరును నమోదు చేస్తే మిగతా పనిని బౌలర్లు సమర్థంగా పూర్తి చేస్తారు.

సర్వశక్తులు ఒడ్డేందుకు...

మరోవైపు బంగ్లాదేశ్ కూడా ఫైనల్ కోసం గట్టి పోరాటానికే సన్నద్ధమైంది. పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న భారత్ మెడకు తమ స్పిన్ ఉచ్చు బిగించాలని చూస్తోంది. లెఫ్టార్మ్ స్పిన్నర్ నహిదా అక్తర్, లెగ్ స్పిన్నర్ రబియా ఖాన్‌లు ఈ టోర్నీలో చక్కగా రాణించారు. సెమీస్ మ్యాచ్‌లో పిచ్ ఏమాత్రం అనుకూలించినా... తమ మాయాజాలంతో భారత బ్యాటర్ల ఆటకట్టించే ఎత్తుగడలతో పాక్ సేన ఉంది. మలేసియాతో ఆడిన చివరి లీగ్ మ్యాచ్‌లో బంగ్లా భారీస్కోరు (191/2) నమోదు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు ముర్షిదా, దిలారా, కెప్టెన్ నిగర్ సుల్తానా ఫామ్‌లోకి రావడం బంగ్లా శిబిరానికి కలిసొచ్చే అంశం.

జట్లు (అంచనా)

భారత మహిళల జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), షఫాలీ, స్మృతి మంధాన, హేమలత, జెమీమా, రిచాఘోష్, దీప్తిశర్మ, అరుంధతి, రాధాయాదవ్, తనూజ, రేణుకా సింగ్.

బంగ్లాదేశ్ మహిళల జట్టు: నిగర్ సుల్తానా (కెప్టెన్), ముర్షిదా, దిలార రుమానా, ఇష్మా తంజిమ్, రీతు మోని, రబియా, షోర్న, నహిదా, సబికున్ జాస్మిన్, జహనారా.

ఏదైనా ఉంటే నాతో తేల్చుకోండి

నన్ను చంపాలనుకుంటే చంపేయండి

ఎన్డీటీవీ ఇంటర్వ్యూలో చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'ఏదైనా ఉంటే నాతో తేల్చుకోవాలి.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు, మీకు ఓట్లు వేయని సామాన్య ప్రజలపై ఎందుకు దాడులు చేస్తున్నారు? ఇది మానవత్వం అనిపించుకుంటుందా?' అని చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. 'కోపం ఉంటే నాపై చూపండి.. నన్ను చంపాలనుకుంటే చంపేయండి.. నాపై ఉన్న కోపాన్ని అమాయకులపై ఎందుకు చూపిస్తారు?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి సాగిస్తున్న నరమేధాన్ని యావత్ దేశానికి చాటి చెప్పేలా బుధవారం ఢిల్లీలో వైఎస్ జగన్ భారీ ఎత్తున ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పలు జాతీయ మీడియా చానల్స్ ప్రతినిధులు వైఎస్ జగన్‌ను ఇంటర్వ్యూ చేశారు. ఎన్డీటీవీ ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ ఇంటర్వ్యూలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఎన్డీటీవీ ప్రతినిధి: రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న దారుణకాండను నిరసిస్తూ మీరు చేస్తున్న ధర్నాకు సంఘీభావం తెలిపేందుకు సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ వచ్చారు. ఆయన ఇండియా కూటమిలో భాగస్వామి. ఆయన మీకు సంఘీభావం తెలపడాన్ని బట్టి చూస్తే రాజకీయ పునరేకీకరణ జరుగుతోందని అనుకోవచ్చా?

వైఎస్ జగన్: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, ఆస్తుల విధ్వంసాలు యథేచ్ఛగా కొనసాగిస్తోంది. సీఎం చంద్రబాబు కుమారుడు లోకేశ్ రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ బుక్ పేరుతో హోర్డింగ్‌లు పెట్టి.. ఆ హోర్డింగ్‌ల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారుల పేర్లు ప్రచురించి.. టీడీపీ శ్రేణులను దాడులకు పురిగొల్పుతున్నారు. ఆ దాడుల పట్ల చూసీ చూడనట్లు వ్యవహరించాలని పోలీసు అధికారులను ఆదేశిస్తున్నారు. దాంతో టీడీపీ శ్రేణులు పెట్రేగిపోయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు, టీడీపీ కూటమికి ఓటు వేయని ప్రజలపై దాడులు చేస్తున్నాయి. హత్యలు చేస్తున్నాయి.. హత్యాయత్నాలకు తెగబడుతున్నాయి..

ఎన్డీటీవీ ప్రతినిధి: టీడీపీ ప్రభుత్వ దమనకాండపై ప్రధాని, హోంమంత్రి, రాష్ట్రపతికి లేఖలు రాశారు కదా? వారు ఏమైనా స్పందించారా?

వైఎస్ జగన్: గత 45-50 రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న అరాచక, ఆటవిక పాలనపై ప్రధాని మోదీ, హోం శాఖ మంత్రి అమిత్‌షా, రాష్ట్రపతికి లేఖలు రాశాను. ఇదే రీతిలో అన్ని పార్టీలనూ ధర్నాకు ఆహ్వానించాను. టీడీపీ ప్రభుత్వ అరాచకాలకు సంబంధించి వీడియో క్లిప్పింగ్‌లు.. ఫొటోలు చూశాక.. ఆ దారుణకాండను ఖండించాలా? వద్దా? అన్నది నిర్ణయించుకోవాలని విజ్ఞప్తి చేశాను. ప్రజాస్వామ్యం అంటే సమన్యాయం. సమన్యాయం లేకపోతే అది ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది? మేం అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి ఘటనలకు ఆస్కారమే ఇవ్వలేదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు, టీడీపీకి ఓటు వేయని ప్రజలపై దాడులు చేస్తూ కొత్త ఒరవడి సృష్టిస్తోంది. ఇలాంటి అరాచకాలను ఖండించకపోతే ప్రజాస్వామ్యం మనుగడ సాధించదు.

వాటికి సంబంధించి వీడియోలు, ఫొటోలు.. తదితర సాక్ష్యాధారాలు ఉన్నప్పటికీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పైగా బాధితులపైనే అక్రమ కేసులు బనాయిస్తున్నారు. నాగరిక సమాజం ఖండించాల్సిన ఈ దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకురావాలనే ఈ ధర్నా నిర్వహిస్తున్నాం. టీడీపీ కూటమి ప్రభుత్వ హత్య, హత్యాయత్నాలు, దాడులకు సంబంధించి వీడియో, ఫొటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశాం. దీన్ని సందర్శించాలని అన్ని రాజకీయ పార్టీలనూ ఆహ్వానించాం. సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌నూ ఆహ్వానించాం.

ఎన్డీటీవీ ప్రతినిధి: మీ ప్రభుత్వ పాలనలో కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తననే జైలు పాలు చేశారని సీఎం చంద్రబాబు అంటున్నారు కదా?

వైఎస్ జగన్: మేం అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి కక్ష సాధింపు చర్యలు చేపట్టలేదు. టీడీపీ సానుభూతిపరులు, సామాన్యులపై దాడులు జరిగిన దాఖలాలే లేవు. అవినీతికి పాల్పడిన చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించింది. కోర్టు రిమాండ్‌పై చంద్రబాబు జైలుకెళ్లారు. ఇదెలా కక్ష సాధింపు అవుతుంది? ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 1000కి పైగా దాడులు చేశారు.. 300 హత్యాయత్నాలు జరిగాయి.. 30కిపైగా హత్యలు చేశారు.

ఎన్డీటీవీ ప్రతినిధి: నిన్న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించారు. పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయడానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. వీటిని ఎలా చూస్తారు?

వైఎస్ జగన్: అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అప్పు ఇవ్వడంలో ఏముంది? విభజన చట్టం ప్రకారం పోలవరాన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే. చంద్రబాబు అరాచక పాలన ఎందుకు సాగిస్తున్నారంటే.. శాంతిభద్రతలను ఎందుకు గాలికొదిలేశారంటే.. ఎన్నికలకు ముందు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తూ అబద్ధపు హామీలు ఇచ్చారు. ఆ హామీలను అమలు చేయలేరు. దీన్నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే అరాచక పాలన సాగిస్తున్నారు.

ఎన్డీటీవీ ప్రతినిధి: అఖిలేశ్ యాదవ్ మీకు సంఘీభావం తెలిపి వెళ్లగానే.. ఇండియా కూటమిలో మరో భాగస్వామి మీకు సంఘీభావం తెలపడానికి వచ్చారు.. దీన్ని బట్టి చూస్తే ఇది రాజకీయ పునరేకీకరణ కాదా?

వైఎస్ జగన్: టీడీపీ అరాచక పాలనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు చూసి.. ప్రజాస్వామ్య పరిరక్షణకు మద్దతు ఇవ్వాలని అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేశాం. మా ఆహ్వానాన్ని అందుకున్న పార్టీలు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మాకు సంఘీభావం తెలపడానికి ముందుకొస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వ అరాచకాలను వివరించడానికి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరాను. ప్రధాని అపాయింట్‌మెంట్ ఇస్తారనే ఆశిస్తున్నాను.



సచివాలయంలో ఘనంగా బోనాల పండుగ

డప్పు విన్యాసాలు, పోతరాజుల ప్రదర్శనల మధ్య డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీఎస్ శాంతి కుమారి సచివాలయంలోని నల్ల పోచమ్మకు పూజలు నిర్వహించి అమ్మవారికి బోనం సమర్పించారు. సచివాలయంలోని నల్ల పోచమ్మ దేవస్థానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండగలో సచివాలయంలోని అధికారుల స్థాయి నుండి అన్ని స్థాయిల సిబ్బంది అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. బోనాల ఊరేగింపులో కళాకారులు, నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మహిళా ఉపాధ్యక్షురాలు ఉమా నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, హైదరాబాద్

రాష్ట్రపతి నిలయానికి ఉచిత బస్సు సర్వీసు

ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

రసూల్‌పురా (హైదరాబాద్): బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పదవీ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా.. రాష్ట్రపతి సచివాలయం, తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో రాష్ట్రపతి వర్చువల్‌గా బేగంపేటలోని యాత్రినివాస్ టూరిజం బుకింగ్ కౌంటర్‌లో ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభించారు. కార్యక్రమానికి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ప్రకాశ్ రెడ్డి, రాష్ట్రపతి నిలయం పరిపాలనాధికారి రజనీప్రియ హాజరయ్యారు. ఈ సందర్భంగా రజనీప్రియ మాట్లాడుతూ షటిల్ బస్సు సౌకర్యం బేగంపేట యాత్రి నివాస్ నుంచి రోజూ ఉదయం 9 నుంచి ప్రారంభమై.. సాయంత్రం 4 గంటల వరకు ప్రతి గంటకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. ఇక రాష్ట్రపతి నిలయం నుంచి బేగంపేట యాత్రి నివాస్ వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రతి గంటకు బస్సు సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డి తదితరులు

సొంత పత్రం.. రోత నాటకం!

నిస్సిగ్గుగా చంద్రబాబు నిరాధార ఆరోపణలు, వక్రీకరణలు

- జగన్ క్యాంపు కార్యాలయం ఫర్నిచర్ ఫైల్‌ను నెల రోజులుగా తొక్కిపెట్టింది బాబే.. తీసుకెళ్లాలని పదేపదే చెబుతున్నా నిర్ణయం తీసుకోకుండా నిర్లజ్జగా నిందలు
- నెలన్నరగా సాగుతున్న దారుణాలు, నరమేధంపై మౌనం
- ఈ అరాచక పాలన చూశాక రాష్ట్రపతి పాలన విధించాలని దేశం మొత్తం డిమాండ్ చేయడం కనపడలేదా?
- వైఎస్సార్‌సీపీ హయాంలో గణనీయంగా తగ్గిన నేరాలు
- ఎన్‌సీఆర్‌బీ నివేదికలే తిరుగులేని నిదర్శనం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

తాడేపల్లికి చేరుకున్న వైఎస్ జగన్

విమానాశ్రయం (గన్నవరం): ఏపీలో టీడీపీ ప్రభుత్వ అరాచక పాలనకు నిరసనగా దేశ రాజధాని న్యూఢిల్లీలో ధర్నా నిర్వహించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. న్యూఢిల్లీ నుంచి ఎయిరిండియా విమానంలో ఆయన ఉదయం 8.25 గంటలకు ఇక్కడికి విచ్చేశారు. ఇదే విమానంలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, మాజీ ఎంపీ మార్గాని భరత్, మాజీ మంత్రులు మేరుగ నాగార్జున, పేర్ని నాని, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు దేవినేని అవినాశ్, పేర్ని కిట్టు తదితరులు వచ్చారు. విమానాశ్రయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డుమార్గం ద్వారా తాడేపల్లి చేరుకున్నారు.



గన్నవరం విమానాశ్రయంలో పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఆగస్టు 1న కేబినెట్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆగస్టు 1న సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనుంది. బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్న సమయంలో అత్యవసరంగా మంత్రివర్గ సమావేశం జరగడం చూస్తుంటే.. ఆగస్టు 2న కీలక బిల్లును సభలో ప్రవేశపెట్టడానికి మంత్రివర్గం ఆమోదం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



గుండెపోటుకు బై బై.. వందేళ్లు హాయ్ హాయ్!

హార్ట్ ఎటాక్‌లను దూరం చేసే సరికొత్త మందు భారత మార్కెట్లోకి

ఇంజెక్షన్ రూపంలో అందుబాటులోకి ఇన్‌క్లిసిరాన్

ఎల్‌డీఎల్ స్థాయిలను గణనీయంగా తగ్గిస్తుందంటున్న వైద్యులు

:సాక్షి, హైదరాబాద్.

గుండెపోటు రాకుండా వందేళ్లు బతకాలనుకుంటున్నారా? హృద్రోగ సమస్యలను దూరం చేసుకోవాలనుకుంటున్నారా? అయితే మీలాంటి వారికోసం సరికొత్త మందు మార్కెట్లోకి వచ్చింది. గుండెపోటు దరిచేరకుండా ఆ మందు మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. దాని పేరే ఇన్‌క్లిసిరాన్.. అపోలో ఆస్పత్రి, నోవార్టిస్ సంయుక్తంగా ఓ మందును మార్కెట్లోకి తీసుకొచ్చాయి. ఈ మందుతో వందేళ్లు గుండెపోటు రాకుండా జీవించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

హార్ట్ ఎటాక్‌లు డబుల్..

గుండెపోటుతో మరణిస్తున్న వారి సంఖ్య భారతదేశంలో భారీగా పెరుగుతోంది. హృద్రోగ సమస్యల కారణంగా ఏటా సంభవిస్తున్న మరణాల్లో 20 శాతం మంది పురుషులు గుండెపోటుతో మరణిస్తుండగా 17 శాతం మంది మహిళలు అదే సమస్యతో చనిపోతున్నారు. గత 30 ఏళ్లలో గుండె సంబంధిత వ్యాధులతో సంభవిస్తున్న మరణాల సంఖ్య దాదాపు రెట్టింపు అయింది. పాశ్చాత్య దేశాలతో పోలిస్తే భారత్‌లో పదేళ్ల ముందే గుండె సంబంధ సమస్యలు ఎదురవుతున్నాయి. యుక్తవయసులోనే గుండెపోటుతో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య ఇటీవల మరింతగా పెరిగింది. గుండెపోటుకు ఎన్నో కారణాలున్నా ప్రధానంగా తక్కువ సాంద్రత గల కొవ్వుల (ఎల్‌డీఎల్) కారణంగా ఎక్కువగా హార్ట్‌ఎటాక్స్ వస్తున్నాయి.

అసలేంటీ మందు..?

ఇన్‌క్లిసిరాన్ అనే మందు శరీరంలోని కొలెస్టరాల్ స్థాయిలను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. సాధారణంగా కొలెస్టరాల్ స్థాయిలను తగ్గించేందుకు స్టాటిన్స్ అనే రకం మందులు ఎన్నో ఏళ్లుగా అందుబాటులో ఉన్నా ఇన్‌క్లిసిరాన్ మాత్రం వాటికన్నా ఎన్నో రెట్లు ప్రభావవంతగా పనిచేస్తుందని అంటున్నారు. ఇంజెక్షన్ రూపంలో ఉండే ఈ మందును ఇన్సులిన్ మాదిరిగా వేసుకోవచ్చు. ఈ ఇంజెక్షన్‌ను ఆరు నెలలకోసారి తీసుకుంటే గుండెపోటు దరి చేరదని పేర్కొంటున్నారు.

ఎలా పనిచేస్తుంది?

సాధారణంగా ఇన్‌క్లిసిరాన్ (సింథటిక్ ఎస్ఐ ఆర్ఎన్ఏ) కొవ్వులు తయారయ్యే ప్రక్రియకు ఆటంకం కలిగిస్తుంది. ప్లాస్మాలోని తక్కువ సాంద్రతగల కొవ్వుల (ఎల్‌డీఎల్)ను నియంత్రించే సెరిన్ ప్రోటీన్ అయిన ప్రోప్రోటీన్ కన్వర్టేజ్ సబ్టిలిసిన్ కెక్సిన్–9 (పీసీఎస్‌కే9)కు వ్యతిరేకంగా పనిచేస్తుంది. పీసీఎస్‌కే9 మెసెంజర్ ఆర్ఎన్ఏకు ఇది అతుక్కొని పీసీఎస్‌కే9 ప్రోటీన్ తయారుకాకుండా అడ్డుకుంటుంది. దీంతో ప్లాస్మాలో ఎల్‌డీఎల్ గణనీయంగా తగ్గి రక్తంలోని ఎల్‌డీఎల్‌ను కాలేయం గ్రహించేలా చేస్తుంది. తద్వారా హృద్రోగ సమస్యలు రాకుండా కాపాడుతుంది. 200 వరకు ఉన్న స్థాయి కూడా 40 వరకు తగ్గేంత ప్రభావవంతంగా ఈ మందు పనిచేస్తుందని డాక్టర్లు చెబుతున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్ కుమార్. చిత్రంలో డాక్టర్ గోకుల్ రెడ్డి, డాక్టర్ పీసీ రథ్, డాక్టర్ రవీంద్ర బాబు

"ఈ మందు తీసుకున్నా కూడా జాగ్రత్తగా ఉండాలి. ఆరోగ్యకమైన జీవన విధానాన్ని పాటించాలి. ఆల్కహాల్, సిగరెట్ వంటి అలవాట్లకు దూరంగా ఉంటే మందు మరింత ప్రభావవంతంగా పనిచేస్తుంది. అయితే ట్రై–గ్లిజరైడ్స్ ఉన్న వారిపై ఈ మందు అంతగా ప్రభావం చూపదు. - శ్రీనివాస్ కుమార్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, అపోలో హాస్పిటల్స్

ఎవరెవరు వాడొచ్చు?

సాధారణంగా హృద్రోగ సమస్యలు అన్ని వయసుల వారికి వస్తున్నాయి. కుటుంబంలో ఎవరికైనా హృద్రోగ సమస్యలు ఉన్న చరిత్ర ఉంటే వారందరూ తక్కువ వయసులోనే ఈ మందు తీసుకుంటే మంచిదని వైద్యులు చెబుతున్నారు. చిన్న వయసులోనే అధిక కొలెస్టరాల్‌తో బాధపడుతున్న వారు, 40 ఏళ్లు దాటిన వారు ఈ మందును తీసుకుంటే హార్ట్‌ఎటాక్ రాకుండా చూసుకోవచ్చని పేర్కొంటున్నారు. గుండెలో స్టెంట్ వేయించుకున్న వారు కూడా ఈ ఇంజెక్షన్ తీసుకుంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు.

అనుమతులు వచ్చాయా?

ఇప్పటికే ఈ మందుకు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ కంట్రోల్ అనుమతులు మంజూరు చేయగా భారత్‌లో 6 నెలల కిందటే డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) కార్యాలయం అనుమతులు ఇచ్చింది. దీంతో తాజాగా ఈ మందును మార్కెట్‌లోకి తీసుకొచ్చారు.

నేటి నుంచి హృద్రోగ సమస్యలపై కాన్ఫరెన్స్

గుండె సమస్యలపై అవగాహన కోసం ఈ నెల 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లో ప్రీమియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ కాన్ఫరెన్స్ జరగనుంది. అపోలో హాస్పిటల్స్, అమెరికాలోని కార్డియోవ్యాస్కులర్ రీసెర్చ్ ఫౌండేషన్‌తో కలిసి ఫ్యాక్స్ ఫౌండేషన్ ఈ సదస్సును నిర్వహించనుంది. గురువారం జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను నిర్వాహకులు వెల్లడించారు. గుండె విఫలమైనప్పుడు ఉపయోగపడే కొత్త పరికరాల పాత్రపై చర్చించనున్నారు. ఈ సదస్సుకు దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టులు హాజరుకానున్నారు.

దక్షిణ మధ్య రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా పద్మజ



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా సీనియర్ ఐఆర్‌టీఎస్ అధికారి కె.పద్మజ గురువారం సికింద్రాబాద్ రైల్‌నిలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్ 1991 బ్యాచ్‌కు చెందిన ఆమె దక్షిణ మధ్య రైల్వేలో ఈ పదవిని స్వీకరించిన తొలి మహిళా అధికారి. ఇంతకుముందు చీఫ్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్లానింగ్ మేనేజర్‌గా పని చేశారు. హైదరాబాద్ డివిజన్‌లో అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్‌గా, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా, డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా పని చేశారు. దక్షిణ మధ్య రైల్వే హ్యాండ్‌బాల్‌కు కార్యదర్శిగానూ, లలిత కళా సమితి సికింద్రాబాద్‌కు ప్రెసిడెంట్‌గా దక్షిణ మధ్య రైల్వే ఆఫీసర్స్ అసోసియేషన్‌కు వైస్ ప్రెసిడెంట్‌గా ఆమె సేవలు అందజేస్తున్నారు.

ఐఐటీలో సీటు.. ఫీజు చెల్లించలేని దుస్థితి

- దాతల కోసం విద్యార్థి ఎదురు చూపు
- సంస్థలో చేరేందుకు నేడే చివరి తేదీ..



విద్యార్థి ఆర్యన్ రోషన్

ముషీరాబాద్ (హైదరాబాద్): దేశంలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థలైన ఐఐటీల్లో సీటు సంపాదించేందుకు ప్రతి సంవత్సరం 12 లక్షల మందికి పైగా పోటీపడుతుంటారు. కానీ 15 వేల మందికి మాత్రమే ఆ సువర్ణ అవకాశం దక్కుతుంది. అందులో ఓ పేదింటి బిడ్డ ఆర్యన్ రోషన్ ఉన్నాడు. ఐఐటీలో సీటు వచ్చినా అందులో చేరేందుకు పేదరికం అడ్డంకిగా మారింది. ఫీజు చెల్లించే స్థోమత లేక దాతల కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నాడు. అయితే శుక్రవారమే చివరి తేదీ కావడంతో సీటు వదులుకోవాల్సి వస్తుందనే భయంతో రోషన్ కన్నీటి పర్యంతం అవుతున్నాడు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నకిరకొమ్ముల గ్రామానికి చెందిన ఆర్యన్ రోషన్‌కు చిన్నతనంలోనే తండ్రి మరణించాడు. తల్లి రోజు వారి కూలీ చేస్తూ జీవనం సాగిస్తోంది. 5వ తరగతిలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చేరిన రోషన్ ఇంటర్ వరకు అక్కడే చదువుకున్నాడు. ఇటీవల జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో రోషన్ ఎస్సీ కేటగిరీలో 2406 ర్యాంకును సాధించాడు. జోసా కౌన్సెలింగ్‌లో మొదటి రౌండ్‌లోనే ఐఐటీ తిరుపతిలో కెమికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో సీటు సాధించాడు. ఈ కోర్సుకు ఏటా లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుండగా, నాలుగు సంవత్సరాల బీటెక్ కోర్సుకు సుమారు రూ.4 లక్షల ఖర్చు అవుతుంది. అయితే ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో రోషన్ దాతల కోసం ఎదురు చూస్తున్నాడు. ప్రభుత్వం స్పందించి తనకు ఆర్థిక సహాయం చేయాలని కోరుతున్నాడు. దాతలు 9866126281 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని రోషన్ వేడుకుంటున్నాడు.

భవిష్యత్ తరాలను కాపాడాలి

చెట్ల పెంపకంపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా చెట్లు పెంచి భవిష్యత్ తరాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని హైకోర్టు గుర్తు చేసింది. ఆ బాధ్యతను మరిచిపోకుండా చర్యలు చేపట్టాలని, ఏం చర్యలు చేపట్టారో నివేదిక అందజేయాలని ఆదేశించింది. అలాగే ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)తో సంబంధం లేదన్న జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎనిమిదేళ్లుగా విచారణ సాగుతున్నా జీహెచ్ఎంసీ ప్రతివాదో.. కాదో.. కూడా తెలియదా అని అసహనం వ్యక్తం చేసింది. ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో ఇలాగేనా వ్యవహరించేది అని ప్రశ్నించింది. తదుపరి విచారణ ఆగస్టు 1కి వాయిదా వేసింది. 'పట్టణాలు, నగరాల్లో పార్కుల అవసరం ఎంతైనా ఉంది. ఉన్నవాటి పరిరక్షణతో పాటు లేని చోట్ల కొత్తగా ఏర్పాటు చేయాలి. చెట్లను కూడా అభివృద్ధి చేయాలి. ఆ మేరకు ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలి'అని కోరుతూ హైదరాబాద్ హిమాయత్‌సాగర్‌కు చెందిన కె.ప్రతాప్‌రెడ్డి హైకోర్టులో 2016లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. అడిషనల్ అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. 2023, ఆగస్టు చివరి నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 749 హెక్టార్లలో 8.37 లక్షల మొక్కలు నాటినట్లు అటవీ శాఖ నివేదిక ఇచ్చిందన్నారు. హైదరాబాద్‌లో పరిస్థితి ఏంటని సీజే ప్రశ్నించగా...నగర అధికారులు ఎవరూ అందుబాటులో లేరని, అయినా ఆ వివరాలు తెలుసుకుని చెబుతామన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ..తదుపరి విచారణలోగా దీనిపై నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

ఆ వాటాల విక్రయమంటే కన్నబిడ్డలను అమ్ముకోవడమే

కేంద్ర బడ్జెట్‌పై ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వరంగ సంస్థల వాటాల విక్రయం (డిజ్ ఇన్వెస్ట్‌మెంట్) ద్వారా ఈ ఏడాది రూ.50 వేల కోట్ల ఆదాయం రాబట్టాలని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రస్తావించడం పట్ల రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వరంగ సంస్థల వాటాల విక్రయమంటే కన్నబిడ్డలను మరొకరికి అమ్ముకోవడమే అని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌పై శ్రీధర్‌బాబు స్పందిస్తూ పీఎస్‌యూలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చాక కొత్త వాటిని స్థాపించకపోగా, లాభాల్లో ఉన్న సంస్థల వాటాలను అమ్మి సొమ్ము చేసుకుంటోందని ఆరోపించారు. బ్యాంకులు కాకుండా పీఎస్‌యూల వార్షిక లాభాలు రూ.2,64,000 కోట్లుగా ఉన్నాయన్నారు. బ్యాంకులను జాతీయం చేసి పేదల దగ్గరికి చేర్చింది స్వర్గీయ ఇందిరాగాంధీ అని, ఇప్పుడు బ్యాంకుల ద్వారా గతేడాది మోదీ ప్రభుత్వానికి రూ.2.11 లక్షల కోట్ల డివిడెంట్ లభించిందని శ్రీధర్‌బాబు తెలిపారు. నష్టాల్లో ఉన్న పీఎస్‌యూలకు అపారమైన ఆస్తులున్నాయని, కానీ అవి దివాలా తీశాయని ప్రధాని చెబుతున్నారని విమర్శించారు. వాటి అప్పుల కన్నా ఆస్తుల విలువ ఎక్కువని పేర్కొన్నారు. 13 మహారత్న, 14 నవరత్న, 72 మినీరత్న పీఎస్‌యూలన్నీ లాభాల్లో ఉన్నాయని, వీటిని నిర్వీర్యం చేసి వాటాలు అమ్ముకుంటే కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని శ్రీధర్‌బాబు హెచ్చరించారు.

రక్షణరంగ ఉత్పత్తుల తయారీపై రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి

ముందుకొచ్చిన వెమ్ టెక్నాలజీస్: మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: రక్షణరంగ పరికరాల ఉత్పత్తి సంస్థ వెమ్ టెక్నాలజీస్ మొదటి దశ ప్రాజెక్టులో భాగంగా రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెడుతోందని ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. జహీరాబాద్ నిమ్జ్‌లో 511 ఎకరాల్లో ఏర్పాటవుతున్న ఈ సమీకృత ఉత్పాదన కేంద్రం వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ట్రయల్ ప్రొడక్షన్‌కు సిద్ధమవుతుందని వెల్లడించారు. మొదటి దశ పూర్తయితే 1,000 మందికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. గురువారం సచివాలయంలో వెమ్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు మంత్రితో సమావేశమయ్యారు. సంస్థకు కేటాయించిన భూమిలో ఇంకా స్వాధీనం చేయాల్సిన 43 ఎకరాలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతికి.. శ్రీధర్‌బాబు సూచించారు. ఉత్పత్తికి 33 కేవీ విద్యుత్ లైన్లను నాలుగు నెలల్లో ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. సమావేశంలో వెమ్ టెక్నాలజీస్ సీఎండీ వెంకటరాజు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.